సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 18 వెల: ₹ 5.50
సంపుటి: 17
సంచిక: 317
శుక్రవారం 7-2-2025
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే
నాకు అసలైన పండుగ రోజు'



యువర్స్

● మ్యూజిక్ వరల్డ్





చుక్కలు పాడిన చక్కటి పాట

బ్రిటిష్ రాక్ బ్యాండ్ 'కోల్డ్ ప్లే' వరల్డ్ టూర్‌తో హల్‌చల్ చేస్తోంది, మన దేశంలోనూ ప్రదర్శన ఇచ్చింది. ఒకప్పటి 'యూనివర్శిటీ కాలేజ్ లండన్' మిత్రులు 'కోల్డ్ ప్లే'గా సంగీత ప్రస్థానాన్ని ప్రారంభించారు.

సేఫ్టీ, యెల్లోలాంటి ఆల్బమ్‌లతో శ్రోతలకు దగ్గరయ్యారు.

లైవ్ పెర్‌ఫార్మెన్స్‌లో తమదైన ప్రత్యేకత చాటుకున్నారు.

ఇటీవల అహ్మదాబాద్‌కు చెందిన ఆటోడ్రైవర్ 'కోల్డ్ ప్లే' హిట్ సాంగ్ 'స్కై ఫుల్ ఆఫ్ స్టార్స్' పాడి నెటిజనుల చేత వారెవా అనిపించుకున్నాడు. కొందరైతే 'కోల్డ్ ప్లే తదుపరి కచేరిలో ప్రత్యేక స్థానానికి ఇతడు అర్హుడు' అని ప్రశంసించారు.'నేను కోల్డ్ ప్లేకు వీరాభిమానిని' అంటున్నాడు ఆటోడ్రైవర్. 'స్కై ఫుల్ ఆఫ్ స్టార్స్' మనం కూడా ఒకసారి పాడుకుందాం....

కాజ్ యూ ఆర్ ఏ స్కై/ కాజ్ యూ ఆర్ ఏ స్కై ఫుల్ ఆఫ్ స్టార్స్
ఐయామ్ గొన్నా గివ్ యూ మై హార్ట్/ కాజ్ యూ లైట్ అప్ ది పాత్/ ఐ డోన్ట్ కేర్
కాజ్ యూ ఆర్ ఏ స్కై

● యంగ్ టాలెంట్

ఆటల్లో ఆణిముత్యం

ఆటకు ప్రతిభ మాత్రమే కాదు సాధన కూడా ముఖ్యమే. తన ప్రతిభకు నిరంతర సాధన జోడించి జంప్ రోప్ నుంచి జోడో వరకు ఎన్నో ఆటల్లో అద్భుత విజయాలు సాధిస్తోంది వనిపెంట శ్రావణి. తాజాగా నేపాల్‌లో నిర్వహించిన ఇండో-నేపాల్ జంప్ రోప్ చాంపియన్‌షిప్ 2025 టోర్నమెంట్‌లో రెండు బంగారు పతకాలు సాధించి సత్తా చాటింది...

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కలిగిరికి చెందిన వనిపెంట శ్రావణి స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతోంది. తల్లిదండ్రులు కలిగిరిలో చిన్న కూరగాయల దుకాణం నిర్వహిస్తూ పిల్లలను చదివించుకుంటున్నారు. రెండో కుమార్తె శ్రావణి చదువుల్లో ముందుంటూనే క్రీడల్లో అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తోంది.



● ఇండో-నేపాల్ జంప్ రోప్ ఛాంపియన్‌షిప్‌లో రెండు బంగారు పతకాలు గెలుచుకున్న శ్రావణి

ఎనిమిదవ తరగతి చదువుతున్నప్పుడు ఆటలపై శ్రావణికి ఉన్న ఆసక్తిని అప్పటి పాఠశాల ఫిజికల్ డైరెక్టర్, ప్రస్తుత నెల్లూరు జిల్లా జంప్ రోప్ సెక్రటరీ జి.మురళి గుర్తించారు. ఎంతో ప్రోత్సహించారు. మురళి సూచనలు, సలహాలతో శ్రావణి జంప్ రోప్ క్రీడతో పాటు షూటింగ్ బాల్, టార్గెట్ బాల్, జూడోలో ప్రావీణ్యం సాధించింది.

శ్రావణి ఏ టోర్నమెంట్‌లో పాల్గొన్నా పతకాలు సాధించడమే లక్ష్యంగా ప్రతిభ చూపేది. ఇప్పటి వరకు జంప్ రోప్‌లో జిల్లా స్థాయిలో 10, జాతీయ స్థాయిలో 5 గోల్డ్, ఒక సిల్వర్, అంతర్జాతీయ స్థాయిలో రెండు బంగారు పతకాలు సాధించింది. 2023లో జరిగిన జాతీయ స్థాయి షూటింగ్ బాల్ టోర్నమెంట్‌లో రన్నర్‌గా నిలిచింది. నేపాల్‌లో నిర్వహించిన ఇండో-నేపాల్ జంప్ రోప్ చాంపియన్‌షిప్ 2025 టోర్నమెంట్‌లో రెండు బంగారు పతకాలు సాధించి సత్తాచాటింది.

– రావుల రాజగోపాల్‌రెడ్డి, సాక్షి, కలిగిరి, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా

ఐపీఎస్ కావడమే లక్ష్యం

ప్రాక్టీస్ చేయడం నుంచి పోటీల్లో పాల్గొనడం వరకు ఆటల్లో ఉండే ఉత్సాహమే వేరు. ఆటలు ఉత్సాహాన్నే కాదు శక్తిని ఇస్తాయి. జీవితంలో లక్ష్యాన్ని ఏర్పర్చుకునేలా చేస్తాయి. ఆటల్లో జాతీయ,అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని పతకాలు గెలుచుకోవాలనుకుంటున్నాను.

బాగా చదివి ఐపీఎస్ సాధించాలని ఉంది. మంచి పోలీస్ అధికారిగా పేరు తెచ్చుకుంటాను. అమ్మ,నాన్న అన్ని విధాలుగా ప్రోత్సాహం అందిస్తుండడంతో బాగా చదవడంతో పాటు క్రీడల్లో రాణించగలుగుతున్నాను.

– శ్రావణి

● టెక్.. టాక్

శాంసంగ్ గెలాక్సీ ఎస్25 అల్ట్రా



డిస్‌ప్లే: 6.90 అంగుళాలు రిఫ్రెష్ రేట్: 120 హెచ్‌జెడ్ రిజల్యూషన్: 1440×3120 పిక్సెల్స్ మెమోరీ: 256జీబి 12 జీబి ర్యామ్/512జీబి 12జీబి ర్యామ్ ఫ్రంట్ కెమెరా: 12ఎంపీ బ్యాటరీ: 5000 ఎంఏహెచ్

షావోమి ప్యాడ్ 7



డిస్‌ప్లే: 11.20 అంగుళాలు రిఫ్రెష్‌రేట్: 144 హెచ్‌జెడ్ రిజల్యూషన్: 2136×3200 పిక్సెల్స్ వోఎస్: ఆండ్రాయిడ్ 15 మెమోరీ: 128జీబి 8జీబి ర్యామ్/256జీబి 8జీబి ర్యామ్/256జీబి 12జీబి ర్యామ్ బ్యాటరీ: 8850 ఎంఏహెచ్

అడోబ్‌లో కొత్త ఫీచర్

తన అక్రోబాట్ ఏఐ అసిస్టెంట్‌కు సంబంధించి అమెరికన్ కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ కంపెనీ 'అడోబ్' కొత్త అప్‌డేట్ గురించి ప్రకటించింది. సంక్లిష్టమైన పదాలను సులభంగా అర్థం చేసుకోవడానికి, మల్టీపుల్ అగ్రిమెంట్స్ మధ్య తేడాలను త్వరగా గుర్తించడానికి ఈ ఫీచర్ ఉపయోగపడుతుంది. కొత్త అక్రోబాట్ ఏఐ అసిస్టెంట్‌ను డెస్క్‌టాప్, వెబ్, మొబైల్‌లో యాక్సెస్ చేయవచ్చు. క్రెడిట్ కార్డ్ వెండర్ అగ్రిమెంట్స్, లాయల్టీ ప్రోగ్రామ్స్, పర్చేజ్ ఆర్డర్‌లకు సంబంధించిన సంక్లిష్టమైన డాక్యుమెంట్‌లను అర్థం చేసుకోవడానికి అప్‌డేటెడ్ అక్రోబాట్ ఏఐ అసిస్టెంట్ యూజర్లకు ఉపయోగపడుతుంది.



త్రీ-ఇన్-1 వైర్‌లెస్ ఛార్జర్




బ్రాండ్: పవర్‌అప్
కనెక్టివిటీ: యూఎస్‌బీ
కనెక్టర్: యూఎస్‌బీ టైప్ సీ
స్పెషల్ ఫీచర్స్: మాగ్నటిక్, ఫాస్ట్ చార్జింగ్
కలర్: బ్లాక్
కంపాటబుల్: ఐ ఫోన్, ఏయిర్‌పాడ్స్ అండ్ యాపిల్ వాచ్

యూఎస్‌బీ కండెన్సర్ మైక్రోఫోన్ కిట్



బ్రాండ్: ఆడియో ఆర్రై కనెక్టివిటీ: యూఎస్‌బీ
● 192 కెహెచ్‌జెడ్/24 బిట్/బూమ్‌ఆర్మ్/ పాప్ ఫిల్టర్/
వీటి కోసం: పాడ్‌కాస్టింగ్, గేమింగ్, సింగింగ్, లైవ్ స్ట్రీమింగ్

యూట్యూబ్ స్టేబుల్ వాల్యూమ్



యూట్యూబ్‌లో 'స్టేబుల్ వాల్యూమ్' అనే ఫీచర్ ఉంది. సడన్ సౌండ్ వేరియేషన్‌లను తగ్గించే ఫీచర్ ఇది. ప్రీమియమ్ సబ్‌స్క్రైబర్‌లు, రెగ్యులర్ యూజర్‌లను దృష్టిలో పెట్టుకొని రూపొందించిన ఫీచర్. వీడియో చూస్తున్నప్పుడు ఆడియో తీవ్రతలో ఆకస్మిక మార్పులు వచ్చే సమయంలో, ముఖ్యంగా పాడ్‌కాస్ట్, ఇంటర్వ్యూలకు సంబంధించిన కంటెంట్‌కు 'స్టేబుల్ ఆడియో' బాగా ఉపయోగపడుతుంది.

యాక్సెస్ కోసం...

● యూట్యూబ్‌లో వీడియో ఓపెన్ చేసిన తరువాత గేర్ ఐకాన్ (సెట్టింగ్స్) క్లిక్ చెయ్యాలి. ● అడిషనల్ సెట్టింగ్స్–ట్యాప్ ● ఇక్కడ స్టేబుల్ ఆడియోను ఎనేబుల్ లేదా డిజేబుల్ చేయవచ్చు.

● న్యూ

కొరిఇండియన్ చానల్



కొరియన్ ఎంటర్‌టైన్‌మెంట్‌కు మన దేశంలో మంచి మార్కెట్ ఉంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని 'చానల్ కె' మొదలైంది. ఇది మన దేశంలోని ఫస్ట్ కొరియన్ చానెల్. ఈ చానెల్‌లో కొరియన్ సినిమాలు, రియాలిటీ షోలు, కె-పాప్, కె-కల్చర్ ఫెస్టివల్స్...ఇలా ఇండియన్ ఆడియెన్స్‌కు నచ్చే అన్ని రకాల కంటెంట్ ఉంటుంది.

మై లవ్లీ సంసూన్(2005), బాయ్స్ ఓవర్ ఫ్లవర్స్(2009)లాంటి కల్ట్ ఫేవరెట్‌ల నుండి ది లేడీ ఆఫ్ లేడీ ఓక్(2024), ఫ్యామిలీ మ్యాటర్స్(2024)లాంటి కొరియన్ బ్లాక్ బస్టర్‌ల వరకు క్లాసిక్, కొరియన్ కంటెంట్ సమాహారమే చానల్ కె.కొరియన్ డ్రామాస్‌ను ఇష్టపడే వారికి కూడా ఇది బెస్ట్ ఛాయిస్‌గా మారనుంది. రాబోయే నెలల్లో చానల్ కె కేటలాగ్‌లో 120 అడిషనల్ టైటిల్స్‌తో కూడిన 1000 గంటల కొత్త ప్రోగ్రామింగ్ చేరనుంది.

● ఇంగ్లీష్ ఇడియమ్స్

ఆల్ సింగింగ్ ఆల్ డ్యాన్సింగ్

అవసరమైన అన్నీ ఉన్నాయి(ఫుల్ ఫీచర్డ్) అని చెప్పడానికి సంబంధించి ఉపయోగించే మాట...ఆల్ సింగింగ్, ఆల్ డ్యాన్సింగ్. దీనికి మూలం 1929లో వచ్చిన మ్యూజికల్ ఫిల్మ్ ది బ్రాడ్‌వే మెలోడీ. ఈ సినిమా పోస్టర్‌పై 'ఆల్ టాకింగ్ ఆల్ సింగింగ్ ఆల్ డ్యాన్సింగ్' అని ఉంటుంది.

ఉదా: ఇట్ విల్ బి యాన్ ఆల్ సింగింగ్, ఆల్ డ్యాన్సింగ్



చానల్ గేట్ క్రాష్

ఆహ్వానం అందినప్పుడు ఫంక్షన్‌లకు హాజరు కావడం అనేది ఒక పద్ధతి. అలా కాకుండా ఎలాంటి ఆహ్వానం లేకుండానే ఫంక్షన్‌కు వెళ్లినప్పుడు వాడే మాట...గేట్ క్రాష్. ఉదా: ది టీనేజర్స్ ప్లాన్‌డ్ టు గేట్‌క్రాష్ ది నైబర్‌హుడ్ పార్టీ ఫర్ సమ్ ఫ్రీ ఫుడ్ అండ్ మ్యూజిక్

సాక్షి సినిమా

ఢిల్లీలో ట్రక్‌లు నడిపేవాణ్ణి

● జైపూర్ లిటరేచర్ ఫెస్టివల్‌లో కైలాష్ ఖేర్ ● తన పుస్తకం 'తేరీ దీవానీ' ఆవిష్కరణ



● పుస్తకావిష్కరణ సభలో వక్తలు

'పద్నాలుగేళ్ల వయసులో ఇంటి నుంచి పారిపోయాను. ఢిల్లీలో ఎన్నో విషాద అనుభవాలు చవిచూశాను. ఎంతగా అంటే నేను యువకుడిగా ఎదిగే వరకూ నవ్వు మర్చిపోయాను. నేనసలు నవ్వేవాణ్ణి కాదు' అని గుర్తు చేసుకున్నాడు గాయకుడు కైలాష్ ఖేర్.

అతను సొంతగా రాసి, బాణీ కట్టి హిట్ చేసిన పాటల వెనుక ఉన్న కథలను వివరిస్తూ, ఏ జీవితానుభవాల నుంచి ఆ పాటలు పుట్టాయో చెప్పిన 'తేరీ దీవానీ' పుస్తకాన్ని జైపూర్ లిటరేచర్ ఫెస్టివల్‌లో ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా కైలాష్ ఖేర్ తన గతాన్ని అభిమానులతో పంచుకున్నాడు.

'నాకు చదువు లేదు. అందరూ గురువుల దగ్గర చదువుకుంటారు. నేను పరిస్థితుల దగ్గర చదువుకున్నాను. ఇంటి నుంచి పారిపోయాక ఢిల్లీలో నానా అగచాట్లు పడ్డాను. నెలకు వంద రూపాయలకు సంగీతం పాఠాలు చెప్పాను. లెటర్ ప్రెస్‌లో అక్షరాలు కూర్చే పని చేశాను. చిన్న పత్రికల్లో పని చేశాను. ఇంకా ఆశ్చర్యం ఏమంటే నాది చిన్న ఆకారం. ఇంత చిన్న ఆకారంతో భారీ ట్రక్కులు నడిపాను. అడుగడుగున రిజెక్షన్స్ ఎదురు చూశాను. అవమానం ఎదురైన ప్రతిసారి... ఇదేం పెద్ద అవమానం... ఇంకా ముందు ముందు పెద్ద అవమానాలను చూస్తాను అనుకుంటూ ముందడుగు వేసేవాణ్ణి' అన్నారు.

'నేను ప్రకృతిని విశ్వసిస్తాను. ప్రకృతిని నడిపే శక్తిని విశ్వసిస్తాను. ఆ శక్తి మనకు ఏదో ఒక అండ చూపిస్తుంది. ముంబై చేరాక నా పరిస్థితి ఏం మారలేదు. పెద్ద పెద్ద ఆడియో సంస్థలకు వెళితే నా గొంతు విని పనికి రాదని పంపించేసేవారు. మన దేశంలో కళను తక్కువగా చూస్తారు. ఎంపిసి, బైపిసి చదివే పిల్లలకు ఉండే గౌరవం పాట నేర్చుకుంటున్నాను, బొమ్మలు గీస్తున్నాను అనే పిల్లలకు ఉండదు. గుర్తింపు వచ్చే వరకు మన దేశంలో కళాకారులకు గౌరవం ఇవ్వరు. ఇది దురదృష్టకరం. నాకు ముందు ఎంత విద్య వచ్చో గుర్తింపు వచ్చాక కూడా అంతే విద్య వచ్చు. కాని గుర్తింపు రావడంతోనే హఠాత్తుగా గౌరవం వచ్చేస్తుంది. ఇదేమిటో అర్థం కాదు' అన్నారాయన.

'అడ్వర్‌టైజ్‌మెంట్లలో మొదటిసారి జింగిల్ పాడటం నా దశను మార్చింది. నక్షత్ర డైమండ్స్ యాడ్‌కు మొదటి జింగిల్ పాడాను. ఐదు వేలు ఇచ్చారు. ఆరు నెలల్లోనే బాగా స్థిరపడ్డాను. ఇంతకు ముందు రిజెక్ట్ చేసిన వారందరూ ఇప్పుడు యాక్సెప్ట్ చేయడానికి ముందుకు వచ్చారు. జీవితం అంటే అదే. రిజెక్షన్స్‌కు వెరవకుండా ముందుకు సాగితే యాక్సెప్టెన్స్ వస్తాయి. 'వైసాఖీ హోతాహై-2' సినిమాలో నా మొదటి పాట 'అల్లాకే బందే' రావడంతో ఇక నేను వెనక్కు తిరిగి చూసుకోవాల్సిన అవసరం లేకుండా పోయింది' అన్నాడు కైలాష్ ఖేర్.

'మీరు ఏ రంగంలో ప్రవేశించాలనుకున్నా ఆ రంగానికి సంబంధించిన మీ నైపుణ్యాల వేర్లను పటిష్టంగా ఉండేలా చూసుకోండి. వేర్లు పటిష్టంగా ఉండే ఏ చెట్టయినా కల్పతరువే' అని ముగించాడాయన.

– సాక్షి ప్రత్యేక ప్రతినిధి

తెలుగు నిర్మాత అంటే తలెత్తి చూస్తున్నారు




– అల్లు అరవింద్

● చందు మొండేటి, నాగచైతన్య, అల్లు అరవింద్, బన్నీ వాసు

"నేను నిర్మించిన 'మగధీర' సమయంలో రూ.40 కోట్లు బడ్జెట్ అంటే... ఈ రోజు ద్రవ్యోల్బణం తీసుకుంటే సుమారు రూ. 350 కోట్లు అవుతుంది. ప్రస్తుతం దాదాపు అందరూ ఇంత బడ్జెట్‌తో సినిమాలు తీస్తున్నారు. ఈ రోజు తెలుగు సినిమా నిర్మాత అంటే తలెత్తి చూస్తున్నారు. దీనికి కారణం అలాంటి సినిమాలు చేయగల హీరోలు, దర్శకులు తెలుగులో ఉన్నారు. ఇది తెలుగు వారి విజయం" అని అల్లు అరవింద్ తెలిపారు. అక్కినేని నాగ చైతన్య, సాయి పల్లవి జంటగా నటించిన చిత్రం 'తండేల్'. చందు మొండేటి దర్శకత్వం వహించారు. అల్లు అరవింద్ సమర్పణలో బన్నీ వాసు నిర్మించిన ఈ చిత్రం నేడు తెలుగు, తమిళ్, హిందీ భాషల్లో విడుదలవుతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో అల్లు అరవింద్ మాట్లాడుతూ– "మా కంట్రోల్‌లో లేని ఏరియాల్లో మా చిత్రాల విడుదలని బయటి వారికి ఇస్తాం తప్పితే మిగతా అంతా మేమే రిలీజ్ చేస్తున్నాం. మేం అనుకున్న దానికంటే 'తండేల్'కి బడ్జెట్ ఎక్కువ అయ్యింది. నా వద్దకు బన్నీ వాసు వచ్చి 'మన సినిమా బయటకి అమ్మేద్దామా?' అన్నాడు. ఏం ఫర్వాలేదు.. మనమే రిలీజ్ చేస్తున్నామని చెప్పాను" అని పేర్కొన్నారు. నాగ చైతన్య మాట్లాడుతూ–"నాన్న(నాగార్జున) గారికి మా సినిమా చాలా నచ్చింది. ఆయన్ని సక్సెస్ మీట్‌కి తీసుకొస్తాం" అని చెప్పారు. చందు మొండేటి మాట్లాడుతూ– "తొమ్మిది నెలలు ఓ మనిషి కోసం ఎదురుచూడటం, ఆ మనిషి తనకోసం వస్తాడనే నమ్మకం.. ఇలా చాలా అందమైన భావోద్వేగాలు ఈ సినిమాలో ఉన్నాయి. ఈ మూవీ చూశాక చైతన్య, సాయి పల్లవిలో ఎవరి నటన బాగుందనే చర్చ పెడతారు. నన్ను అడిగే చైతన్య చేసిన రాజు పాత్ర అని చెబుతాను" అన్నారు. బన్నీ వాసు మాట్లాడుతూ–"ఈ సినిమాలో పాకిస్తాన్ సీక్వెన్స్ కోసం చందూగారు చాలా పరిశోధన చేశారు. నాగేంద్రగారు అద్భుతమైన సెట్ వేశారు" అని చెప్పారు. ఆర్ట్ డైరెక్టర్ నాగేంద్ర, పాటల రచయిత శ్రీమణి మాట్లాడారు.

ఇకపై ఏటా... సినిమా డే, అవార్డులు

● తెలుగు ఫిల్మ్ ఛాంబర్



● అనుపమ్ రెడ్డి, వీర శంకర్, రామసత్యనారాయణ, భరత్ భూషణ్, దామోదర ప్రసాద్, రెంటాల జయదేవ, మురళీమోహన్, బాపిరాజు, పరుచూరి గోపాలకృష్ణ, మాదాల రవి

పది రీళ్ళ తొలి పూర్తి నిడివి తెలుగు టాకీ చిత్రం 'భక్త ప్రహ్లాద' విడుదలైన ఫిబ్రవరి 6న ఇకపై ప్రతి ఏడాది 'తెలుగు సినిమా దినోత్సవం' జరపాలని తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ (టీఎఫ్‌సీసీ) నిర్ణయించింది. 'భక్త ప్రహ్లాద' రిలీజై 93 వసంతాలు నిండిన వేళ హైదరాబాద్‌లోని ఛాంబర్ కార్యాలయంలో గురువారం ప్రత్యేకంగా 'తెలుగు సినిమా డే' నిర్వహించింది. రచయిత పరుచూరి గోపాలకృష్ణ అధ్యక్షతన జరిగిన వేడుకల్లో ఫిల్మ్ ఛాంబర్, నిర్మాతల మండలి, ఫిల్మ్ ఫెడరేషన్‌తో సహా పరిశ్రమకు చెందిన 24 క్రాఫ్టల ముఖ్యులూ పాల్గొన్నారు. తెలుగు ప్రభుత్వాలు ఇచ్చే సినీ అవార్డులతో పాటు ఇకపై ఏటా 'టీఎఫ్‌సీసీ' ఆధ్వర్యంలో నిపుణుల కమిటీ సూచనల మేరకు అవార్డులు ఇవ్వాలని నిర్ణయించింది. జాతీయ అవార్డులందుకున్న వారినీ, ఇండియన్ పనోరమాకు ఎంపికైన చిత్రాల వారినీ 'సినిమా డే' నాడు సత్కరించాలని నిర్ణయించింది. అలాగే, ఏటా ఫిబ్రవరి 6నే అన్ని శాఖల సంఘాలూ తెలుగు సినిమా జెండా ఎగరేయాలని పిలుపునిచ్చింది. జెండా రూపకల్పన బాధ్యతను పరుచూరికి అప్పగించింది. అలాగే ఎంతో పరిశోధన చేసి, 'భక్త ప్రహ్లాద' అసలు రిలీజ్ తేదీ ఫిబ్రవరి 6 అని నిరూపించిన సీనియర్ జర్నలిస్ట్, రచయిత రెంటాల జయదేవను సినీ పరిశ్రమ పక్షాన అభినందించి, సన్మానించారు. సౌతిండియన్ సినిమా చరిత్రపై ఆయన పరిశోధనా గ్రంథం 'మన సినిమా... ఫస్ట్ రీల్'ను పరిశ్రమ పక్షాన ఛాంబర్ ప్రెసిడెంట్ భరత్ భూషణ్ అందుకున్నారు. పరుచూరి మాట్లాడుతూ–"1931 అక్టోబర్ 31న 'కాళిదాస్' రిలీజైంది. 3 లఘు చిత్రాలను కలిపి, ఒకే ప్రదర్శనగా వేసిన ఆ సినిమాను తమిళులు తమ సినిమాగా చెప్పుకుంటున్నా, అందులోని 4 రీళ్ళ 'కాళిదాస్' పూర్తి తెలుగు డైలాగ్స్ చిత్రమని జయదేవ తన పరిశోధనలో అన్ని సాక్ష్యాలతో నిరూపించారు. పుస్తకంలో ప్రచురించారు. అందుకని ఫిబ్రవరి 6తో పాటు అక్టోబర్ 31న కూడా మర్చిపోకుండా పెద్దల్ని స్మరించుకొని, వేడుక చేసుకోవాలి" అన్నారు.

సన్మాన గ్రహీత రెంటాల జయదేవ మాట్లాడుతూ–"1932 ఫిబ్రవరి 6న 'భక్త ప్రహ్లాద' విడుదలైందని 2011లోనే సాక్ష్యాధారాలు సేకరించి, అసలు చరిత్రను బయటపెట్టాను. అప్పట్లో దానికి ప్రభుత్వ నంది అవార్డు దక్కినా, ఇవాళ పరిశ్రమ నన్ను సత్కరించడం మర్చిపోలేను. దీంతో పాటు తెలుగు త్యాగరాయ కీర్తనలతో 'కాళిదాస్' తెలుగు సినిమా అని మనం హక్కుల కోసం క్లెయిమ్ చేసుకోవాలి. ఇలా మరుగునపడిన ఎన్నో అంశాల్ని వెలికి తీసి, మన సినిమా చరిత్రను నిక్షిప్తం చేసి, భావితరాలకు అందించేందుకు ఛాంబర్ ఒక ట్రస్టు కింద నిధిని ఏర్పాటు చేయాలి" అన్నారు.

ఈ వేడుకల్లో ఛాంబర్ కార్యదర్శి – నిర్మాతల మండలి అధ్యక్షుడు కె.ఎల్. దామోదర ప్రసాద్, నిర్మాతల మండలి కార్యదర్శి టి. ప్రసన్న కుమార్, నటుడు మురళీ మోహన్, దర్శకుల సంఘం అధ్యక్షుడు వీర శంకర్, తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ కార్యదర్శి అనుపమ్ రెడ్డి, నిర్మాతలు ఆచంట గోపీనాథ్, టి. రామ సత్యనారాయణ, నటుడు మాదాల రవి తదితరులు పాల్గొన్నారు.

ఓటీటీ ఇది చూడొచ్చు

లెక్క సరిచేశాడు

ఓటీటీలో ఇది చూడొచ్చు అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో హిందీ చిత్రం హిసాబ్ బరాబర్ ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.



ఈ ప్రపంచంలో ఆశ లేని మనిషి ఉండడు. కానీ అత్యాశ మాత్రం అనర్థదాయకం. అందరూ బాగుండాలి... అందులో మనముండాలి అనుకుంటే పర్లేదు. కొంత మంది మాత్రం నేను బాగు పడాలంటే పదిమంది నాశనం కావాలి అని అత్యాశకు లోనవుతుంటారు. అటువంటి వారు తమకు ఎవరూ ఎదురు రారు అనుకుంటూ విర్రవీగుతుంటారు. అలా విర్రవీగేవారికి ఓ సామాన్యుడు ఇచ్చే అనుకోని ఝలక్కే ఈ 'హిసాబ్ బరాబర్' చిత్రం. జీ5 ఓటీటీ వేదికగా తెలుగులోనూ లభ్యమవుతోంది. 'హిసాబ్ బరాబర్' కథ విషయానికొస్తే... ఇది ఓ సామాన్యుడి కథ. రాధేమోహన్ శర్మ ఓ టికెట్ కలెక్టర్. అతనికి ఒక్కడే కొడుకు. భార్య విడిపోతుంది. ఇక రాధేమోహన్‌కు అద్భుతమైన టాలెంట్ ఒకటుంది. అదే అతని లెక్కల చాతుర్యత. ఎటువంటి లెక్కనైనా అవలీలగా చెప్పేస్తాడు. చిన్న పైసా కూడా నష్టపోడు. అటువంటి రాధేమోహన్ బ్యాంకు అకౌంటులో అనూహ్యంగా ఓ 27 రూపాయలు తేడా వచ్చి కనపడకుండా పోతుంది. దాంతో బ్యాంకు అధికారులకు ఈ విషయమై ఫిర్యాదు చేస్తాడు. బ్యాంకు అధికారులు ఈ ఫిర్యాదును తాత్సారం చేస్తున్న విషయం గమనించి అదే బ్యాంకుకు సంబంధించిన ఇతరుల అకౌంట్లో కూడా 27 రూపాయలు కట్ అయినట్టు కనిపెడతాడు. రాధేమోహన్ కథ 27 నుండి మొదలై కొన్ని వేల కోట్ల దాకా వెళుతుంది. దీంతో ఇదో పెద్ద స్కామ్ అని నిర్ధారణకు వచ్చి పై అధికారులకు సమాచారమిస్తాడు. ఈ విషయం సదరు బ్యాంకు అధికారుల నుండి ఆ బ్యాంకు ఓనరుకు తెలుస్తుంది. ఇక ఆ పై బ్యాంకు ఓనరుకు రాధేమోహన్‌కు మధ్య యుద్ధం మొదలవుతుంది. కోట్లకు అధిపతి అయిన బ్యాంకు ఓనరును 27 రూపాయలు పోగొట్టుకున్న రాధేమోహన్ ఎలా ఎదుర్కొన్నాడనేది సినిమాలోనే చూడాలి. రూపాయి అయినా కోటి రూపాయలైనా దేని విలువ దానిదే, కాగితంలో నంబరు విలువను పెంచుతుందే కానీ కాగితమైతే మారదు. పైన చెప్పుకున్నట్టు ఎవరి కష్టం వారిది, ఎవరి ఫలితం వారిది. ఈ రోజు వరించిన విజయానికి ఆనందిస్తే రేపు అపజయాన్ని కూడా ఎదుర్కొనే ధైర్యం ఉండాలి. 'హిసాబ్ బరాబర్' సినిమా ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగుతూ మంచి సందేశంతో ముగుస్తుంది. రాధేమోహన్ పాత్రలో ప్రముఖ నటుడు మాధవన్ జీవించారు. సినిమాలో తన లెక్కే కాదు అందరి లెక్క సరిచేశాడు. వీకెండ్‌కి వాచబుల్ మూవీ.


– ఇంటూరు హరికృష్ణ

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 18 వెల: ₹ 5.50
సంపుటి: 17 సంచిక: 317
శుక్రవారం 7-2-2025
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


'ప్రజల జీవన ప్రమాణాలు ఇంకా మెరుగు పడాలి. అందుకు అధికారులు నిబద్ధత, పారదర్శకత, కార్యదీక్షతో పనిచేయాలి.'


తొలి వన్డే భారత్‌దే
గిల్, శ్రేయస్ రాణించడంతో ఇంగ్లండ్‌పై 4 వికెట్లతో టీమిండియా గెలుపు - 15లో


మార్కెట్‌కు దేశీ ఇంధనం!
విదేశీ ఇన్వెస్టర్లకు దేశీ ఫండ్స్ చెక్.. స్టాక్స్‌లో డీఐఐల పెట్టుబడులు - 15లో


కాంగ్రెస్‌కు కుటుంబమే ఫస్టు
ప్రజల సంక్షేమమే తమ ధ్యేయమని, కాంగ్రెస్ పార్టీ మాత్రం ఓట్ల కోసం బుజ్జగింపు రాజకీయాలు చేస్తోందని ప్రధాని మోదీ పేర్కొన్నారు.
- వివరాలు 6లో▶


మార్చిలో హెచ్-1బీ రిజిస్ట్రేషన్లు
అమెరికాలో ఉద్యోగాలు చేయబోయే వాళ్లకు మంజూరుచేసే హెచ్-1బీ వీసాల దరఖాస్తు ప్రక్రియ మార్చి ఏడో తేదీన మొదలుకానుంది.
- వివరాలు 6లో▶


2027లో చంద్రయాన్-4
చంద్రుడిపై శిలలను భూమిపైకి తెచ్చేందుకు ఉద్దేశించిన చంద్రయాన్-4ను 2027లో చేపట్టనున్నట్లు మంత్రి జితేంద్ర చెప్పారు.
- వివరాలు 6లో▶


సంకెళ్లు వేయడం మామూలే
అక్రమ వలసదార్లకు సంకెళ్లు వేసి, స్వదేశాలకు తరలించడం సాధారణ విషయమని విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ చెప్పారు.
- వివరాలు 6లో▶

గీత దాటితే వేటే..!

ఏదైనా ఉంటే వచ్చి కలవండి.. డిన్నర్ మీటింగ్‌లు వద్దు

సీఎల్పీ సమావేశంలో స్పష్టం చేసిన సీఎం రేవంత్‌రెడ్డి

- జీ-23 సమావేశాలు పెడితే గులాం నబీ ఆజాద్‌నే క్షమించలేదు
- ఏదైనా ఉంటే రాష్ట్ర నాయకత్వాన్ని కలవండి.. లేదనుకుంటే ఖర్గే దగ్గరికి వెళ్లండి
- ఏడాదిలో ఎన్ని చేసినా ప్రజల్లోకి వెళ్లలేకపోయాం
- ఇప్పటికైనా అందరం ఒక లైన్ మీద ఉండి పనిచేయాలి... కులగణన, ఎస్సీ వర్గీకరణను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- సూర్యాపేట, మెదక్‌లలో భారీ బహిరంగ సభలు పెడతామని వెల్లడి
- అందరూ సమన్వయంతో పనిచేయాలి: మున్షీ
- ప్రభుత్వం నిధులు విడుదల చేస్తే నియోజక వర్గాల్లో పనులవుతాయన్న ఎమ్మెల్యేలు


సీఎల్పీ భేటీలో పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

సాక్షి, హైదరాబాద్: ''ఏ స్థాయి నాయకుడైనా పార్టీ లైన్‌లో ఉండాల్సిందే. గీత దాటితే కఠిన చర్యలు తప్పవు. డిన్నర్ మీటింగ్‌ల పేరుతో ఎమ్మెల్యేలు ఎలాంటి ప్రత్యేక సమావేశాలు పెట్టుకోవద్దు. గతంలో గులాం నబీ ఆజాద్ వంటి 23 మంది కీలక నేతలు జీ-23 పేరుతో ప్రత్యేకంగా సమావేశమైతే పార్టీ క్షమించలేదన్న విషయాన్ని మర్చిపోవద్దు..''అని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, నేతలకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి స్పష్టం చేసినట్టు తెలిసింది. ఏదైనా ఉంటే తనను, పార్టీ సీనియర్ నేతలను కలవాలని.. అవసరమైతే పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే దగ్గరికి వెళ్లాలని, డిన్నర్ మీటింగ్‌ల వంటివాటికి కాదని పేర్కొన్నట్టు సమాచారం. గురువారం హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రం (ఎంసీహెచ్‌ఆర్‌డీ)లో కాంగ్రెస్

మిగతా 14వ పేజీలో ▶

హెచ్చరికలు, సూచనల మధ్య..!

సీఎల్పీ సమావేశం సందర్భంగా సీఎం రేవంత్ పలు అంశాలపై దిశానిర్దేశం చేస్తూనే కొందరు మంత్రులు, ఎమ్మెల్యేలకు పరోక్ష హెచ్చరికలు చేసినట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అదే సమయంలో మంత్రులు, ఎమ్మెల్యేలకు మధ్య.. ఎమ్మెల్యేలకు, కార్యకర్తలకు మధ్య సమన్వయం కొరవడిందని పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ వ్యాఖ్యానించినట్టు సమాచారం. అయితే.. ఈ సమావేశంలో ప్రసంగించిన ఐదుగురు ఎమ్మెల్యేలు కూడా పలు అంశాలపై ఘాటుగానే స్పందించినట్టు తెలిసింది.


ఢిల్లీలో కేంద్ర మంత్రి గడ్కరీకి వినతి పత్రం ఇస్తున్న కేటీఆర్. చిత్రంలో సబిత, దామోదర్ రావు, సురేశ్‌రెడ్డి, సంజయ్, వినోద్, వద్దిరాజు

ఉప ఎన్నికలు రావాలి.. ప్రజల కోరిక అదే!

పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అంశంపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

ఆ పది మంది ఎమ్మెల్యేలకు ఇప్పటికే సుప్రీంకోర్టు నోటీసులు
వారిపై అనర్హత వేటు పడే వరకూ న్యాయ పోరాటం చేస్తాం
ఢిల్లీలో పర్యటించిన కేటీఆర్ బృందం.. కేంద్ర మంత్రులతో భేటీ
14లో

- స్కామ్‌ల కోసం సంపద సేల్..

ఆర్థిక విధ్వంసకారుడు చంద్రబాబే



జేబులు నింపుకోవడమే చంద్రబాబు దృష్టిలో సంపద సృష్టి: వైఎస్ జగన్

- మేం సంపద సృష్టిస్తే.. ప్రైవేటుకు చంద్రబాబు అమ్మకాలు.. ఆర్థిక అరాచకాలు
- 4 పోర్టులు.. 10 ఫిషింగ్ హార్బర్లు.. 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీలకు శ్రీకారం చుట్టిన నేను సంపద సృష్టించినట్లా? లేక వాటిని ప్రైవేట్‌కు కట్టబెడుతూ జేబులు నింపుకుంటున్న చంద్రబాబు సంపద సృష్టించినట్లా?
- పారదర్శకంగా ఇసుక, మద్యం విక్రయాలతో ఆదాయం సమకూర్చిన నేను సంపద సృష్టించినట్లా? లేక ఖజానాకు గండి కొడుతున్న బాబు సంపద సృష్టికర్తా?

2లో

న్యూస్‌రీల్

కొత్త కొలువులకు మార్గం సుగమం!


రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగ నియామకాల ప్రక్రియకు సంబంధించిన నోటిఫికేషన్ల విడుదలకు అడ్డంకులు తొలగిపోయాయి. వర్గీకరణ ఉత్తర్వులు వెలువడ్డాక కొత్తగా ఉద్యోగ ప్రకటనలు జారీ చేసేందుకు వీలుంటుంది.
- వివరాలు 2లో▶

ఫోన్ ట్యాపింగ్ కేసు ఎంతవరకు వచ్చింది?


ఫోన్ ట్యాపింగ్‌పై కాంగ్రెస్ నేత చక్రధర్‌గౌడ్ ఫిర్యాదు మేరకు నమోదైన కేసు దర్యాప్తు ఎంత వరకు వచ్చింది, ఎంత మంది వాంగ్మూలాలు రికార్డు చేశారనే వివరాలను సీల్డ్ కవర్‌లో సమర్పించాలని హైకోర్టు ఆదేశించింది.
- వివరాలు 12లో▶

రెండ్రోజుల్లో డెడికేటెడ్ బీసీ కమిషన్ నివేదిక!

- క్షేత్రస్థాయి కసరత్తు, అర్జీలు, ఫిర్యాదుల పరిశీలన పూర్తి
- రేపు లేదా ఎల్లుండి ప్రభుత్వానికి సమర్పించే అవకాశం

2లో

మిగులు విద్యుత్ మోపెడు!

- 2025-26లో రాష్ట్రానికి విద్యుత్ లభ్యత 1,23,631 మిలియన్ యూనిట్లు
- అవసరాలు 98,319 ఎంయూ మాత్రమే.. 25,312 ఎంయూ మేర మిగులు
- ఈ విద్యుత్ విలువ సుమారు రూ.14,022.84 కోట్లు..
- ఒప్పందాల మేరకు కొనకపోయినా ఫిక్స్‌డ్ చార్జీలు చెల్లించాల్సిందే.. ప్రజలపైనే ఆ భారం!
- అవసరాల్లో వినియోగదారులకు చేరేది 87,384 ఎంయూ మాత్రమే
- మిగతా 10,934 యూనిట్లు సాంకేతిక-వాణిజ్య నష్టాలే..
- ఈఆర్సీకి సమర్పించిన ఏఆర్ఆర్ నివేదికలో డిస్కంల వెల్లడి

16లో



చంద్రబాబు ఎన్డీఏ చైర్మన్ కోరికకు మోదీ నో

కూటమిని బాబు నడిపించేందుకు ప్రధాని అంగీకరించలేదు: దేవెగౌడ

- సార్వత్రిక ఎన్నికల తర్వాత చంద్రబాబు ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల కూటమికి చైర్మన్ లేదా వైస్ చైర్మన్ అవ్వాలనుకున్నారంటూ మాజీ ప్రధాని దేవెగౌడ సంచలన వ్యాఖ్యలు చేశారు. అయితే ప్రధాని మోదీ తిరస్కరించారని.. చంద్రబాబు ప్రతిపాదనను అంగీకరించలేదని అన్నారు.

2లో

ఇదండీ సంగతి


ఇక నుంచి ఓడిపోయే ప్రసక్తే లేద్సార్! ఎన్నికల్లో పోటీ చేయకుంటే సరి!

ఆర్థిక విధ్వంసకారుడు చంద్రబాబే..



మేం సంపద సృష్టిస్తే.. బాబు అమ్మకాలు.. ఆర్థిక అరాచకాలు
వైఎస్ జగన్ ధ్వజం

ఆర్థిక క్రమశిక్షణ, కోవిడ్‌లోనూ వృద్ధిని పరుగులు తీయించిన మేం విధ్వంసకారులమా?

తొమ్మిది నెలల్లోనే రూ.1.45 లక్షల కోట్ల అప్పులు చేసిన చంద్రబాబు విధ్వంసకారుడా?

సాక్షి, అమరావతి: నవరత్నాలతో ప్రజలకు మేలు చేయడంతోపాటు ఆర్థిక క్రమశిక్షణతో తమ ప్రభుత్వం పాలన సాగిస్తే.. తొమ్మిది నెలల్లోనే కూటమి సర్కారు ఆర్థిక విధ్వంసం, స్కామ్‌ల కోసం సంపదను తెగనమ్ముతోందని వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విరుచుకుపడ్డారు. చంద్రబాబు దృష్టిలో సంపద సృష్టి అంటే తన ఆస్తులు, తమ వారి ఆస్తులు పెంచుకుని జేబులు నింపుకోవటమేనని మండిపడ్డారు. ఈ ప్రభుత్వంలో జరగని స్కామ్ అంటూ లేదని దుయ్యబట్టారు. తొమ్మిది నెలల పాలనలో రూ.1.45 లక్షల కోట్ల అప్పులతో ఆల్‌టైమ్ రికార్డు సృష్టించిన చంద్రబాబు ఆర్థిక విధ్వంసకారుడా? లేక కోవిడ్‌లోనూ వృద్ధి రేటులో దేశంతో పోటీ పడి ఉత్తమ పని తీరు, మెరుగైన వృద్ధి రేటు, తలసరి ఆదాయంలో పెరుగుదల, సామాజిక సేవలపై వ్యయం, మూలధన వ్యయంలో పెరుగుదల నమోదు చేసిన తాము విధ్వంసం సృష్టించినట్లా? అని ప్రశ్నించారు. పారదర్శకంగా ఇసుక విక్రయాల ద్వారా ఖజానాకు ఏటా రూ.750 కోట్ల ఆదాయం సమకూర్చిన తమ ప్రభుత్వం సంపద సృష్టించినట్లా? లేక ఇసుక నుంచి మద్యం దాకా పచ్చముఠాల దోపిడీకి పచ్చజెండా ఊపిన టీడీపీ సర్కారు సంపద సృష్టించినట్లా? అని నిలదీశారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో 17 కొత్త మెడికల్ కాలేజీలు, నాలుగు పోర్టులు, పది ఫిషింగ్ హార్బర్ల నిర్మాణం చేపట్టిన తాము సంపద సృష్టించినట్లా? లేక వాటికి అడ్డుపడి ప్రైవేట్‌కు అప్పగించి సొమ్ము చేసుకునేందుకు సిద్ధమైన చంద్రబాబు సంపద సృష్టికర్తా? అని ప్రశ్నించారు. మొబిలైజేషన్ అడ్వాన్సుల విధానాన్ని తొలగించి జ్యుడీషియల్ ప్రివ్యూ, రివర్స్ టెండర్లతో పారదర్శక విధానాన్ని ప్రవేశపెట్టిన తాము ఆర్థిక విధ్వంసకారులమా? తిరిగి మొబిలైజేషన్ అడ్వాన్సుల పేరుతో కాంట్రాక్టర్లకు దోచిపెడుతూ కమీషన్లు వసూలు చేసుకుంటున్న చంద్రబాబు ఆర్థిక విధ్వంసకారుడా? అని ప్రశ్నించారు. గురువారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో వైఎస్ జగన్ మీడియాతో మాట్లాడారు. గత తొమ్మిది నెలలుగా టీడీపీ కూటమి సర్కారు అరాచకాలు, హామీల ఎగవేత, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై దుష్ప్రచారాలను కాగ్, కేంద్ర ఆర్థిక సంఘం, కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు శాఖ నివేదికల ఆధారంగా ఎండగట్టి కడిగి పారేశారు.

అప్పుల్లో ఆల్‌టైమ్ రికార్డు

తొమ్మిది నెలల పాలనలో అప్పుల విషయంలో మాత్రం చంద్రబాబు రికార్డులు బద్దలు కొట్టారు. బహుశ ఏ ప్రభుత్వ హయాంలోనూ ఈ స్థాయిలో అప్పులు చేసిన దాఖలాలు లేవు. ఎఫ్‌ఆర్‌బీఎం పరిధిలో బడ్జెట్ అప్పులే ఏకంగా రూ.80,827 కోట్లు ఉన్నాయి. ఇవి కాకుండా అమరావతి పేరు చెప్పి ఇప్పటికే తెచ్చిన అప్పులు, తెచ్చే అప్పులు కలిపి మరో రూ.52 వేలు కోట్లు ఉంటాయి. ప్రపంచ బ్యాంకు నుంచి రూ.15 వేల కోట్లు, జర్మనీకి చెందిన కేఎఫ్‌డబ్ల్యూ నుంచి రూ.5వేల కోట్లు, హడ్కో నుంచి రూ.11 వేల కోట్లు, సీఆర్‌డీఏ ద్వారా చేయాలని నిర్ణయించిన అప్పులు మరో రూ.21 వేల కోట్లు ఉంటాయి. మార్క్‌ఫెడ్, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ ద్వారా మరో రూ.8 వేల కోట్లు, ఏపీఎండీసీ ద్వారా తేనున్న అప్పులు మరో రూ.5 వేల కోట్లు..! తీసుకొచ్చిన అప్పులు, తేనున్న అప్పులు కలిపితే రూ.1.45 లక్షల కోట్ల పైమాటే. ఇదొక రికార్డు. దీన్ని ఎవరూ బద్ధలు కొట్టలేరు.

మా హయాంలో వృద్ధి పథంలో రాష్ట్రం..

ఈ మధ్య నీతి అయోగ్ పేరుతో చంద్రబాబు ఆడిన కొత్త డ్రామాలు మీరు చూసే ఉంటారు. ఏదైనా పోల్చినప్పుడు తన ఐదేళ్ల పాలనను, మన ఐదేళ్ల పాలనతో పోల్చి వాస్తవాలివీ అని చెప్పేలా ఉండాలి. కానీ ఈ పెద్ద మనిషి ఏం చేశాడంటే.. తన పాలనలో బెస్ట్ ఇయర్ (2018–19)లో వచ్చిన ఫలితాలను మన హయాంలో వరస్ట్ ఇయర్ (2022–23)తో కంపేర్ చేస్తూ రాష్ట్రం చాలా అన్యాయమైన పరిస్థితుల్లో ఉన్నట్టు చూపించారు. చంద్రబాబు ఐదేళ్ల డేటా.. మన హయాంలో ఐదేళ్ల డేటాను పరిశీలించి ఎవరు ఆర్థిక విధ్వంసం చేశారో మీరే చూడండి. మా హయాంలో రెండున్నరేళ్లు కోవిడ్ ఉందన్న విషయాన్ని మర్చిపోకండి. కానీ చంద్రబాబు హయాంలో ఎలాంటి కోవిడ్‌లు లేవు.. మహమ్మారులూ లేవు.

- టీడీపీ హయాంలో 2014–19 మధ్య సగటున మూలధన వ్యయం రూ.13,860 కోట్లు ఖర్చు చేస్తే.. మా హయాంలో కోవిడ్ లాంటి విపత్కర పరిస్థితుల్లోనూ మూలధన వ్యయం కింద రూ.15,632 కోట్లు వెచ్చించాం. 2018–19లో సోషల్ సర్వీస్ కింద ఆయన రూ.2,866.11 కోట్లు ఖర్చు చేస్తే.. 2022–23లో రూ.447.78 కోట్లు మాత్రమే వ్యయం చేశారని చెప్పుకొచ్చారు. కానీ 2014–19 మధ్య ఐదేళ్లలో టీడీపీ ప్రభుత్వం రూ.2,437 కోట్లు ఖర్చు చేస్తే.. వైఎస్సార్‌సీపీ హయాంలో దానికి రెట్టింపు.. రూ.5,224 కోట్లు వ్యయం చేశాం. ఇవన్నీ మూలధన వ్యయంలో సోషల్ సర్వీస్ కింద ఖర్చులపై కాగ్ నివేదిక తేల్చిన లెక్కలు. ఒక్క ఏడాదిని మాత్రమే తీసుకుని పోల్చుకోవడం చంద్రబాబు మనస్తత్వానికి, వక్రీకరణలకు నిదర్శనం.
- దేశ జీడీపీలో రాష్ట్ర వాటా 2014–19లో కేవలం 4.47 శాతం కాగా వైఎస్సార్‌సీపీ హయాంలో 2019–24లో ఆ వాటా 4.80 శాతానికి పెరిగింది. ఎవరి హయాంలో వృద్ధి పరుగులు తీసింది? అనేది చెప్పేందుకు ఇదొక నిదర్శనం.
- చంద్రబాబు దిగిపోయే నాటికి 2018–19లో తలసరి ఆదాయంలో మన రాష్ట్రం దేశంలో 18వ స్థానంలో ఉంది. అదే వైఎస్సార్‌సీపీ హయాంలో తలసరి ఆదాయంలో మన రాష్ట్రం 2022–23లో 15వ స్థానానికి ఎగబాకింది.
- దేశ జీడీపీ 2019–24లో 9.34 శాతం కాగా రాష్ట్రం ఏకంగా 10.23 శాతంతో మెరుగైన పనితీరు కనబరిచింది.
- పారిశ్రామిక రంగం జీవీఏ (గ్రాస్ వాల్యూ యాడెడ్) ర్యాంకింగ్ పరిశీలిస్తే చంద్రబాబు దిగిపోయేనాటికి మన రాష్ట్రం 11 స్థానంలో ఉంటే.. 2023–24లో మా ప్రభుత్వం వైదొలిగే నాటికి 9 స్థానానికి ఎగబాకాం. రెండున్నరేళ్లు కోవిడ్ ఉన్నా సరే.. మంచి పనితీరు కనబరిచాం. మరి ఎవరిది ఆర్థిక విధ్వంసం?

బాబు ఆర్థిక అరాచకం..

- 2014–19లో టీడీపీ హయాంలో రాష్ట్రం కట్టాల్సిన వడ్డీల వృద్ధి రేటు 15.43 శాతం ఉంటే.. రాష్ట్ర ప్రభుత్వ జీఎస్‌డీపీ పెరుగుదల 13.46 శాతం. అంటే చంద్రబాబు చెప్పిన సిద్ధాంతం ప్రకారమే డెట్ సస్టెయినబులిటీ ఎక్కువగా ఉంది.
- 2019–24లో దేశం పరిస్థితిని గమనిస్తే వడ్డీలకు సంబంధించి వృద్ధిరేటు సీఏజీఆర్ 12.80 శాతమైతే.. జీడీపీలో సీఏజీఆర్ 9.34 శాతం ఉంది. దేశం జీరో డెట్ సస్టయినబులిటికీ వెళ్లిపోయింది. రాష్ట్రంలో వడ్డీల వృద్ధి రేటు చంద్రబాబు హయాంలో 15.43 శాతం ఉంటే దాన్ని 13.92 శాతానికి తగ్గించగలిగాం. కానీ ఆ విషయాన్ని మాత్రం చెప్పడు. ఇక జీడీపీ వృద్ధి రేటు 9.34 శాతం ఉంటే మా హయాంలో మన రాష్ట్రం దేశం కంటే మెరుగ్గా 10.23 శాతం గ్రోత్ నమోదు చేసింది. అక్కడ కూడా మనం ప్లస్‌లోనే ఉన్నాం. ఇవన్నీ దాచిపెట్టి వడ్డీల పెరుగుదల రేటు 13.92 శాతం.. ఏపీ జీఎస్డీపీ 10.23 శాతం అని చెబుతూ రాష్ట్రం విధ్వంసమైందని చంద్రబాబు చెప్పడం ధర్మమేనా?
- రాష్ట్రం అప్పులు రూ.14 లక్షల కోట్లు అని చంద్రబాబు ఊదరగొట్టారు. రాష్ట్రం శ్రీలంకలా అయిపోతోందని బండలు వేశాడు. ఇప్పుడు గవర్నర్ ప్రసంగానికి వచ్చేసరికి రాష్ట్రం అప్పులు రూ.10 లక్షలు కోట్లు అని చెప్పారు. శ్వేత పత్రాలు విడుదల చేసే సమయంలో రూ.12.93 లక్షల కోట్లన్నారు. బడ్జెట్ ప్రవేశపెడితే అప్పులు చెప్పాల్సి వస్తుందని వాయిదా వేస్తూ వచ్చారు. తప్పనిసరి పరిస్థితుల్లో నవంబర్‌లో బడ్జెట్ ప్రవేశపెట్టిన సందర్భంగా రాష్ట్రం అప్పులు రూ.6,46,531 కోట్లు మాత్రమే అని తనంతట తానే ఒప్పుకోక తప్పలేదు. ఇంత దారుణమైన మనిషి ఈ ప్రపంచంలో ఎక్కడా ఉండడు. ఈ పెద్దమనిషి చంద్రబాబు ఇలాంటి మోసాలు చేస్తా ఉంటారు. వీటిని ప్రజలు గమనించాలి.
- ఎఫ్‌ఆర్‌బీఎం పరిమితులకు లోబడి రాష్ట్ర జీఎస్‌డీపీలో 3 నుంచి 3.5 శాతం అప్పులు చేయవచ్చని కేంద్రం నిర్దేశిస్తోంది. ఆ ప్రకారమే ఎవరైనా తీసుకోగలుగుతారు. అంతకంటే ఎక్కువ చేసే అవకాశం చాలా తక్కువగా ఉంటుంది. చంద్రబాబు పాలనలో 2014–19లో ఎఫ్‌ఆర్‌బీఎం పరిమితి దాటి రూ.31,082 కోట్లు అదనంగా అప్పులు చేశారు. ఆయన తీసుకున్న అదనపు అప్పులతో రూ.17 వేల కోట్లు మా ప్రభుత్వ హయాంలో కోత పెట్టారు.
- చంద్రబాబు హయాంలో రాష్ట్ర ప్రభుత్వ సొంత ఆదాయం కూడా తగ్గింది. 2023–24లో జూన్–డిసెంబర్ వరకు రాష్ట్ర ప్రభుత్వ ఆదాయం రూ.50,804 కోట్లు అయితే.. 2024 జూన్ నుంచి డిసెంబర్‌లో రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చిన ఆదాయం రూ.50,544 కోట్లు మాత్రమే. రాష్ట్ర ప్రభుత్వానికి ఏటా 10 శాతం ఆదాయం పెరగడం సాధారణం. అలాంటిది చంద్రబాబు హయాంలో 0.5 శాతం తగ్గింది. అంటే ప్రభుత్వానికి వచ్చే ఆదాయాలు చంద్రబాబు, వారి మనుషులు జేబుల్లోకి పోతున్నాయి!
- వృద్ధి రేటు తిరోగమనంలో (నెగిటివ్ గ్రోత్) ఉన్నప్పుడు జీఎస్‌డీపీలో పెరుగుదల ఉంటుందా? రెవెన్యూ గ్రోత్ తగ్గినప్పుడు జీఎస్‌డీపీ తగ్గాలి కదా! కానీ చంద్రబాబు తన హయాంలో 13 శాతం పెరిగినట్టు రిపోర్టు ఇచ్చారు. ఆయన ఏ స్థాయిలో అబద్ధాలాడుతున్నారో దీన్నిబట్టి తేటతెల్లమవుతోంది. ఇలాంటి తప్పుడు ప్రచారాలు చంద్రబాబుకు కొత్తేమి కాదు.

సంపద సృష్టించిందెవరు?

- రాష్ట్రం ఆదాయాలు పెరిగేలా వైఎస్సార్‌సీపీ హయాంలో నాలుగు పోర్టుల నిర్మాణాన్ని చేపట్టాం. మూలపేట, మచిలీపట్నం, రామాయపట్నం పోర్టులు ప్రభుత్వ రంగంలో చేపట్టాం. రామాయపట్నం 75–80 శాతం పూర్తయింది. మచిలీపట్నం, మూలపేట పోర్టుల్లో 35–40 శాతం పనులు వేగంగా పూర్తయ్యాయి. 10 ఫిషింగ్ హార్బర్ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. మా హయాంలో కొన్ని ప్రారంభోత్సవం కూడా చేశాం. వీటి ద్వారా కొన్ని లక్షల కోట్ల ప్రభుత్వ సంపద సృష్టించబడుతుంది. రాష్ట్రానికి సొంత రాబడి పెరగాలంటే ఇలాంటి ఆస్తులు ప్రభుత్వం చేతిలో ఉండాలి. ఇవన్నీ ఫైనాన్షియల్ టైఅప్ అయిన ప్రాజెక్టులు ఇవి. వీటి నిర్మాణానికి నిధుల కోసం వెతుక్కోవాల్సిన పని లేదు. డబ్బులొచ్చి మేరిటైం బోర్డు అకౌంట్‌లో ఉన్నాయి. డబ్బులు డ్రా చేస్తూ కంప్లీట్ చేస్తే చాలు. ఈపాటికే రామాయపట్నానికి ప్రారంభోత్సవం చేయవచ్చు. మిగిలినవి ఒకటి రెండేళ్లలో పూర్తి చేయొచ్చు. అలాంటిది వీటిని అడ్డం పెట్టుకొని స్కామ్‌లు చేస్తూ అమ్మకానికి పెట్టారు.
- మా హయాంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో 17 కొత్త మెడికల్ కళాశాలల నిర్మాణానికి శ్రీకారం చుట్టాం. వీటిలో ఐదు కాలేజీలను మా హయాంలోనే ప్రారంభిస్తే ఈ విద్యా సంవత్సరంలో మొదలు కావాల్సిన మరో 5 కొత్త కళాశాలలను అడ్డుకుని తమ వారికి ప్రైవేట్‌కు విక్రయించేందుకు సిద్ధపడుతున్నారు.

వచ్చే ఐదేళ్లలో 75 వేల మెడికల్ సీట్లు ఇస్తామని ఈ ఏడాది బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం చెప్పింది. ఈ ఏడాది 10 వేల సీట్లు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని ప్రకటించింది. ఇలాంటప్పుడు ఎవరైనా సాధ్యమైనన్ని సీట్లు తమ రాష్ట్రానికి రావాలని ఆరాటపడతారు. కానీ మన రాష్ట్రానికి ఇస్తామన్న మెడికల్ సీట్లను సైతం వద్దంటూ కేంద్రానికి లేఖ రాసిన ప్రభుత్వం దేశంలో ఏదైనా ఉందంటే అది ఒక్క టీడీపీ కూటమి ప్రభుత్వం మాత్రమే. ఇలా స్కామ్‌ల కోసం ఉన్న ఆస్తులను అమ్ముతున్నారు.

సంపద సృష్టి అంటే బాబు జేబు నింపుకోవడమా?

చంద్రబాబు దృష్టిలో సంపద సృష్టి అంటే.. తన ఆస్తులు, తమ వారి ఆస్తులు పెంచుకోవడం! ఈ ప్రభుత్వ హయాంలో జరగని స్కామ్ అంటూ లేదు. గతంలో ఇసుక ద్వారా ప్రభుత్వానికి రూ.750 కోట్ల ఆదాయం వచ్చేది. ఈరోజు ఒక్క రూపాయి రావడం లేదు పైగా గతంలో కంటే రెట్టింపు ధర వసూలు చేస్తున్నారు. సంపద సృష్టి చంద్రబాబు జేబులోను జరుగుతోంది! రాష్ట్ర ప్రభుత్వ ఆదాయం ఆవిరవుతోంది.

ఇక లిక్కర్ స్కామ్..

ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే మద్యం షాపులను ప్రైవేటు పరం చేసారు. ఇవే ఆరోపణలపై ఢిల్లీ ముఖ్యమంత్రిగా ఉన్న అరవింద్ కేజ్రీవాల్‌ను జైల్లో పెట్టారు. చంద్రబాబు తమ ప్రభుత్వంలో స్కామ్‌లు చేస్తూ అక్కడకు వెళ్లి అరవింద్ కేజ్రీవాల్‌ను తిట్టి వస్తాడు. మద్యం షాపులను ప్రైవేట్టుపరం చేసాడు. తనవారికి షాపులు ఇప్పించుకునేందుకు తమ ఎమ్మెల్యేలతో ఎలా కిడ్నాప్‌లు చేయించారో చూశాం. తన పార్టీకి సంబంధించిన వాళ్ల మాత్రమే టెండర్లలో పాల్గొనేలా చేశారు. లాటరీలో కూడా తమ వాళ్లకే షాపులు దక్కేలా చేసుకున్నారు. వేరే వాళ్ల పాల్గొనకుండా పోలీసులు సమక్షంలో చేసారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా బెల్టుషాపులకు వేలం పాటలు నిర్వహించారు. ప్రతి గ్రామంలో రూ.2 లక్షలు.. రూ.3 లక్షలకు తమ కార్యకర్తలకు కట్టబెట్టారు. వీటిని పాడుకున్న వారికి పోలీసుల ద్వారా సహకారం అందిస్తున్నారు. ఎమ్మార్పీ కంటే ఎక్కువకు అమ్ముతున్నా పట్టించుకునే వారే లేరు. అదే ప్రభుత్వ రంగంలో షాపులుంటే ఆ ఆదాయం అంతా ప్రభుత్వానికి వచ్చేది. రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చే ఆదాయం తగ్గుతుంటే చంద్రబాబు ఆదాయం మాత్రం పెరుగు తోంది.

- ఇసుక, మద్యం, సిలికా, క్వార్ట్జ్, ఫ్లైయాష్.. ప్రతిదీ మాఫియానే. అన్నీ పెదబాబు, చినబాబు ఆధ్వర్యంలో నడిపిస్తున్నారు. ప్రతీ నియోజకవర్గంలోనూ పేకాట క్లబ్‌లు..! మండల, గ్రామ స్థాయిలో కూడా నడుపుతున్నారు. నియోజకవర్గంలో ఏ పని జరగాలన్నా ఎమ్మెల్యేలకు అడిగినంత ముట్టజెప్పా ల్సిందే! ఎమ్మెల్యేలు దండుకున్న సొమ్ములో పెదబాబు, చినబాబు, దత్తపుత్రుడికి వాటాలు పంపితే అంతా సాఫీగా జరుగుతుంది.
- కాంట్రాక్టర్లకు మొబిలైజేషన్ అడ్వాన్సులు 10 శాతం చెల్లించి 8 శాతం కమీషన్లు వసూలు చేస్తున్నారు. మేం పారదర్శకంగా అమలు చేసిన జ్యుడీషియల్ ప్రివ్యూ, రివర్స్ టెండర్ల విధానాన్ని రద్దు చేశారు. ఫలితంగా సంపద సృష్టి జరగక ప్రభుత్వ ఆదాయం ఆవిరైపోతోంది. తమ అక్రమాలను ఎవరైనా ప్రశ్నిస్తే రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ బెదిరిస్తున్నారు.

చంద్రబాబు దావోస్ వెళ్లినప్పుడు ఒక్క ఎంవోయూ కూడా చేసుకోలేకపోయారంటే ఇప్పుడు రాష్ట్రానికి ఉన్న పలుకుబడి.. చంద్రబాబు పట్ల పారిశ్రామికవేత్తల్లో ఎలాంటి అభిప్రాయం నెలకొందో చెప్పేందుకు నిదర్శనం. పెట్టుబడులు పెట్టేందుకు జిందాల్ లాంటి సంస్థ వస్తే ఎవరైనా రెడ్ కార్పెట్ పరిచి స్వాగతిస్తారు. కానీ చంద్రబాబు ఏం చేశారంటే.. వాళ్లపై కేసులు పెట్టి, వాళ్ల ప్రతిష్టను నాశనం చేసి భయపెట్టి వెళ్లగొట్టాడు. దీంతో అదే దావోస్‌లో వాళ్లు మహారాష్ట్రతో ఒప్పందం చేసుకున్నాడు.

దరఖాస్తుల పేరిట సర్కారు దగా

- కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల పాలిట భస్మాసుర హస్తం: హరీశ్


లేఖ రాస్తున్న హరీశ్

సాక్షి, హైదరాబాద్/చిన్నకోడూరు (సిద్దిపేట): అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని పదేపదే చెప్పిన కాంగ్రెస్ పార్టీ.. ప్రజలను ముప్పు తిప్పలు పెడుతోందని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. దరఖాస్తుల పేరిట దగా చేయడం మినహా కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిలో ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు. అభయ హస్తం అంటూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ప్రజల పాలిట భస్మాసుర హస్తంగా మారిందని దుయ్యబట్టారు. ములుగు జిల్లా బుట్టాయిగూడెంలో కుమ్మరి నాగయ్య అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటనపై హరీశ్‌రావు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. 'లబ్ధిదారుల జాబితాలో తన పేరు లేదనే ఆవేదనతో ములుగు జిల్లా బుట్టాయిగూడెంకు చెందిన కుమ్మరి నాగయ్య గ్రామ సభలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకోవడం బాధాకరం. నాగయ్య ఆత్మహత్యకు ప్రభుత్వమే కారణం. రోడ్డున పడ్డ నాగయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుని రూ.25 లక్షల పరిహారం ఇవ్వాలి' అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. కాగా, సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం చెల్కలపల్లి ప్రజలను భూ నిర్వాసితులుగా గుర్తించి ఆదుకోవాలని నీటిపారుదల మంత్రి ఉత్తమ్‌కు హరీశ్‌రావు గురువారం లేఖ రాశారు.

బడ్జెట్‌లో అన్యాయం: బి.వెంకట్

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర బడ్జెట్‌లో తెలుగు రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరిగిందని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ కార్యదర్శి బి.వెంకట్ ఆరోపించారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మాటల్లో గురజాడను గుర్తుచేసి.. చేతల్లో కార్పొరేట్ల కొమ్ము కాశారని గురువారం ఢిల్లీలో విమర్శించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు గత బడ్జెట్‌లో రూ.8 వేల కోట్లు ఇచ్చి.. ఇప్పుడు రూ.5 వేల కోట్లకు కుదించారని మండిపడ్డారు.

చంద్రబాబు ఎన్డీఏ చైర్మన్ కోరికకు మోదీ నో

- కూటమిని బాబు నడిపించేందుకు ప్రధాని అంగీకరించలేదు
- మాజీ ప్రధాని దేవెగౌడ సంచలన వ్యాఖ్యలు



సాక్షి, న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికల తర్వాత చంద్రబాబు ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల కూటమికి చైర్మన్ లేదా వైస్ చైర్మన్ అవ్వాలనుకున్నారని మాజీ ప్రధాని దేవెగౌడ సంచలన వ్యాఖ్యలు చేశారు. అయితే ప్రధాని నరేంద్ర మోదీ తిరస్కరించారని.. చంద్రబాబు ప్రతిపాదనను అంగీకరించలేదని దేవెగౌడ వెల్లడించారు. గురువారం రాజ్యసభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చలో దేవెగౌడ మాట్లాడుతూ, '2014, 2019 ఎన్నికల్లో మోదీ 300కు పైగా సీట్లు సాధించారు. 2024 ఎన్నికల్లో ఆయనకు 240 సీట్లొచ్చాయి. వివిధ ప్రాంతీయ పార్టీల నేతలు ఆయనకు మద్దతుగా నిలిచారు. ప్రస్తుతం ఆయనకు దాదాపు 305 సీట్లు ఉన్నాయి. ఇది సభా వేదికపై రుజువైంది. విశ్వాస ఓటు కోరే ప్రశ్నే లేదు. ఎన్డీఏ కూటమికి వైస్ చైర్మన్‌ను ప్రధాని నియమించలేదు. యూపీఏ ప్రభుత్వంలో ప్రధానమంత్రి మాత్రమే కాకుండా కూటమికి పవర్ సెంటర్‌గా వైస్‌చైర్మన్ కూడా ఉన్నారు. కూటమి చైర్మన్ పవర్ సెంటర్‌గా ఉంటారు. కానీ.. ప్రధాని మోదీ కూటమిని నడిపించడానికి లేదా ప్రభుత్వంలో జోక్యం చేసుకోవడానికి ఎవరినీ అనుమతించలేదు' అని అన్నారు. 'ఇప్పుడు 2024లో మోదీ 240 సీట్లు సాధించినప్పుడు చంద్రబాబు వంటి ఇతర ప్రాంతీయ పార్టీలు ఆయనకు మద్దతు ఇచ్చాయి. చంద్రబాబు అన్ని ఎన్డీఏ పార్టీలు ఏర్పాటు చేసిన కూటమికి వైస్‌చైర్మన్ లేదా చైర్మన్ కావాలనుకున్నారు. కానీ మోదీ తిరస్కరించారు. ప్రధానిగా, సీఎంగా అనుభవం ఉన్న మోదీ ఈ దేశాన్ని ఊగిసలాట లేకుండా నడపగల మహోన్నత నేత. నేను అబద్ధం చెబితే మీరు నాపై దాడి చేయవచ్చు' అని వ్యాఖ్యానించారు. కాగా, దేవెగౌడ వ్యాఖ్యలను కేంద్ర మంత్రి జేపీ నడ్డా ఖండించారు.

కొత్త కొలువులకు లైన్‌క్లియర్!

- ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ నోటిఫికేషన్ల జారీకి తొలగిన అడ్డంకులు
- ప్రభుత్వానికి అందిన ఎస్సీ వర్గీకరణపై వన్‌మెన్ కమిషన్ సిఫారసులు
- త్వరలో వర్గీకరణకు సంబంధించిన ఉత్తర్వులు జారీ అయ్యే అవకాశం
- అనంతరం ఉద్యోగ ప్రకటనలకు చాన్స్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగ నియామకాల ప్రక్రియకు సంబంధించిన నోటిఫికేషన్ల విడుదలకు అడ్డంకులు తొలగిపోయాయి. ముఖ్యంగా ఎస్సీ వర్గీకరణ ప్రక్రియ పెండింగ్‌లో ఉండడంతో గత కొన్ని నెలలుగా కొత్తగా ఉద్యోగ ప్రకటనలు వెలువడలేదు. సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగా ఎస్సీ వర్గీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నియమించిన జస్టిస్ షమీమ్ అక్తర్ ఏక సభ్య కమిషన్ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించిన సంగతి తెలిసిందే. ఈ నివేదికలోని వివరాలతో కూడిన ప్రకటనను రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టగా.. ఉభయ సభలు ఆమోదం తెలిపాయి. కాగా వర్గీకరణకు సంబంధించిన ఉత్తర్వులు వెలువడిన తర్వాత కొత్తగా ఉద్యోగ ప్రకటనలు జారీ చేసేందుకు వీలుంటుంది.

ఉత్తర్వుల రూపకల్పనపై కసరత్తు

ఎస్సీ వర్గీకరణకు సంబంధించిన ఉత్తర్వుల రూపకల్పనపై ప్రభుత్వ యంత్రాంగం కసరత్తు చేస్తోంది. ఎలాంటి న్యాయ పరమైన చిక్కులు తలెత్తకుండా ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా న్యాయ నిపుణుల సలహాలు తీసుకోవడంతో పాటు ఉన్నతాధికారులతో ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారులు సమీక్షలు నిర్వహిస్తున్నారు. దాదాపు రెండ్రోజులుగా ఈ అంశంపైనే అధికారులు దృష్టి సారించారు. వీలైనంత త్వరగా ప్రతిపాదనలు రూపొందించి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించేలా చర్యలు వేగవంతం చేశారు. జస్టిస్ షమీమ్ అక్తర్ కమిషన్.. 2011 జనగణన ఆధారంగా రాష్ట్రంలోని ఎస్సీ కేటగిరీలోని 59 కులాలను మూడు గ్రూపులుగా వర్గీకరించాలని సూచించింది. గ్రూప్–1లో 15 కులాలు, గ్రూప్–2లో 18 కులాలు, గ్రూప్–3లో 26 కులాలను చేర్చాలని సూచించింది. నాలుగు సిఫారసులు చేయగా.. ఇందులో మూడింటికి ఆమోదం తెలిపిన రాష్ట్ర ప్రభుత్వం, ఒక సిఫారసును మాత్రం తిరస్కరించింది. ఉద్యోగ నియామకాల్లో క్రమపద్ధతిని అనుసరించేందుకు ప్రాధాన్యత నమూనాను కూడా రూపొందించింది. గ్రూప్–1లో నోటిఫై చేసి, భర్తీ చేయని ఖాళీలను తదుపరి ప్రాధాన్యత గ్రూప్‌లో.. అంటే గ్రూప్–2లో భర్తీ చేయాలి. ఇందులో భర్తీ చేయని ఖాళీలను గ్రూప్–3లో భర్తీ చేయాలి. అన్ని గ్రూపుల్లో తగిన అభ్యర్థులు అందుబాటులో లేకుంటే ఆ పోస్టులను క్యారీఫార్వర్డ్ చేయాలని స్పష్టం చేసింది. ఉద్యోగ నియామకాల్లో వారికి కేటాయించిన గ్రూపుల వారీ రిజర్వేషన్లకు రోస్టర్ పాయింట్ల నంబర్లను కూడా కమిషన్ సిఫారసు చేసింది.

మూడు గ్రూపులకు సంబంధించి నిర్దేశించిన రోస్టర్ పాయింట్ల నంబర్లు ఇలా..	గ్రూప్	ప్రతిపాదిత రోస్టర్ పాయింట్ల నంబర్లు
	గ్రూప్–1	7
	గ్రూప్–2	2,16,27,47,52,66,72,87,97
	గ్రూప్–3	22,41,62,77,91

రెండ్రోజుల్లో డెడికేటెడ్ బీసీ కమిషన్ నివేదిక!

- క్షేత్రస్థాయి కసరత్తు, అర్జీలు, ఫిర్యాదుల పరిశీలన పూర్తి
- రేపు లేదా ఎల్లుండి ప్రభుత్వానికి సమర్పించే అవకాశం
- ఈ నివేదిక ఆధారంగానే స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల ఖరారు

సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లకు సంబంధించిన తుది నివేదికపై కసరత్తును డెడికేటెడ్ బీసీ కమిషన్ దాదాపుగా పూర్తి చేసింది. తుది మెరుగులు అనంతరం రెండ్రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించేందుకు సిద్ధమవుతోంది. ఈ నివేదిక ఆధారంగానే రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను ఖరారు చేయనుండడంతో ప్రాధాన్యం సంతరించుకుంది. కోర్టు తీర్పునకు లోబడి రిజర్వేషన్ల సీలింగ్‌లో మార్పు లేకుండా ఈ కమిషన్ సిఫారసు చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. నివేదిక అందిన వెంటనే ప్రభుత్వం స్థానిక రిజర్వేషన్లు ఖరారు చేస్తుందని, ఆ తర్వాత స్థానిక ఎన్నికలకు నగారా మోగే అవకాశం ఉందని తెలుస్తోంది.

మూడు నెలలు కసరత్తు

డెడికేటెడ్ కమిషన్ దాదాపు మూడు నెలలు బీసీ రిజర్వేషన్ల ఖరారుపై కసరత్తు చేసింది. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లకు సంబంధించి క్షేత్రస్థాయిలో పరిశీలన, దానికి అనుగుణంగా ప్రభుత్వానికి సూచనలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం గతేడాది నవంబర్ 4వ తేదీన డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. కమిషన్‌కు చైర్మన్‌గా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి బూసాని వెంకటేశ్వరరావును, సభ్య కార్యదర్శిగా బీసీ గురుకుల విద్యా సంస్థల సొసైటీ కార్యదర్శి బి.సైదులను నియమించింది. నెలరోజుల్లోగా రాష్ట్ర ప్రభుత్వానికి సమగ్ర నివేదిక సమర్పించాలని పేర్కొంది.

ప్రణాళిక శాఖ నుంచి గణాంకాల సేకరణ

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే గణాంకాలను రాష్ట్ర ప్రణాళిక శాఖ ఇటీవల విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా బీసీ జనాభా, ఇతర అంశాలకు సంబంధించిన సమాచారాన్ని ప్రణాళిక శాఖ డెడికేటెడ్ కమిషన్‌కు సమర్పించినట్లు సర్వేకు సంబంధించి ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం చైర్మన్ ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. కాగా ఆ గణాంకాలను నివేదిక రూపకల్పనలో డెడికేటెడ్ కమిషన్ పరిగణనలోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. మరోవైపు స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల కోసం డెడికేటెడ్ కమిషన్ ఉమ్మడి జిల్లాల వారీగా పర్యటనలు, బహిరంగ విచారణలు చేపట్టడంతో పాటు కమిషన్ కార్యాలయంలో పలు దఫాలుగా వినతులు, అర్జీలు, అభ్యంతరాలను స్వీకరించింది. అవన్నీ లోతుగా పరిశీలించింది. అదే విధంగా తెలంగాణ బీసీ కమిషన్ చేపట్టిన అధ్యయనాలకు సంబంధించిన సమాచారాన్ని కూడా సేకరించి విశ్లేషించినట్లు తెలిసింది. అన్ని అంశాలు, గణాంకాలు క్రోడీకరించిన కమిషన్ తుది నివేదికను కొలిక్కి తీసుకు వచ్చినట్లు తెలిసింది.

బీసీలను ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నారు

- ఓబీసీ జాతీయ సెమినార్‌లో బీజేపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య ఆరోపణ
- సమావేశంలో 13 తీర్మానాలకు ఆమోదం



ఓబీసీ జాతీయ సెమినార్‌లో ఆర్.కృష్ణయ్య తదితరులు

సాక్షి, న్యూఢిల్లీ: దేశంలోని అన్ని రాజకీయ పార్టీలు బీసీలను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే వాడుకుంటున్నాయని జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య ఆరోపించారు. 75 ఏళ్లుగా రాజ్యాధికారంలో వాటా ఇవ్వకుండా అన్యాయం చేస్తున్నాయని మండిపడ్డారు. గురువారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో బీసీ సంక్షేమ సంఘం ఏపీ అధ్యక్షుడు బోను దుర్గా నరేశ్, జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ అధ్యక్షతన నిర్వహించిన జాతీయ ఓబీసీ సదస్సుకు కృష్ణయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సమావేశంలో పార్లమెంటులో బీసీ బిల్లు, అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో 50 శాతం రిజర్వేషన్లు, విద్యా ఉద్యోగ రిజర్వేషన్లు 25 నుంచి 50 శాతానికి పెంచడం, త్వరలో జరగబోయే జనాభా లెక్కల్లో కులాల వారీ లెక్కలు తీయడం తదితర మొత్తం 13 తీర్మానాలను ఆమోదించారు. ఈ సదస్సుకు తెలుగు రాష్ట్రాల్లోని వివిధ పార్టీలకు చెందిన 9 మంది ఎంపీలుసహా.. దేశవ్యాప్తంగా 36 కుల సంఘాలు, 28 బీసీ సంఘాలు, 18 ఉద్యోగ సంఘాలు హాజరయ్యాయి.

యూజీసీ ముసాయిదాను వ్యతిరేకిస్తున్నాం

ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

- రాష్ట్రాలకు సంబంధం లేకుండా వీసీల నియామకం సరికాదు
- గ్రేడింగ్‌పై నిబంధనలు కూడా అభ్యంతరకరం
- యూజీసీ డ్రాఫ్ట్ రెగ్యులేషన్స్‌పై బెంగళూరులో ఆరు రాష్ట్రాల విద్యా మంత్రుల భేటీ
- రాష్ట్రం తరపున హాజరైన శ్రీధర్‌బాబు



సదస్సులో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు. చిత్రంలో కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్

సాక్షి, హైదరాబాద్: విశ్వవిద్యాలయాల వైస్ చాన్స్‌లర్ల నియామకంలో రాష్ట్ర ప్రభుత్వాల అధికారాలకు గండికొడుతూ కేంద్ర ప్రభుత్వం రూపొందించిన డ్రాఫ్ట్ యూజీసీ రెగ్యులేషన్స్–2025 ను నిర్ద్వంద్వంగా వ్యతిరేకిస్తున్నట్టు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. బుధవారం బెంగళూరులో జరిగిన ఆరు (బీజేపీయేతర) రాష్ట్రాల విద్యామంత్రుల సమావేశానికి.. తెలంగాణ విద్యాశాఖను నిర్వహిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డికి బదులుగా శ్రీధర్‌బాబు హాజరయ్యారు. కర్ణాటక, తమిళనాడు, కేరళ, తెలంగాణ, జార్ఖండ్, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల విద్యామంత్రులు, ప్రతినిధులు పాల్గొన్న ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ అభిప్రాయాలను ఆయన వెల్లడించారు. 'ఇప్పటి వరకు విశ్వవిద్యాయాల ఉపకులపతుల నియామకాన్ని చీఫ్ సెక్రటరీ సభ్యుడిగా ఉన్న సెర్చ్ కమిటీ చేపట్టేది. అసలు రాష్ట్రాలకు సంబంధమే లేకుండా వీసీల నియామకం చేపట్టేలా డ్రాఫ్ట్ రూపొందించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. ఉన్నత విద్యకు తెలంగాణ ఏటా రూ.4 వేల కోట్లు ఖర్చు చేస్తోంది. అవసరమైన చోట కొత్త విశ్వవిద్యాలయాలను ఏర్పాటు చేస్తోంది'.. అని మంత్రి వెల్లడించారు. అయితే దీనిని ప్రోత్సహించాల్సిందిపోయి ఆటంకాలు కల్పించడమేమిటని శ్రీధర్‌బాబు ప్రశ్నించారు. ఉప కులపతులుగా పరిశ్రమల అధిపతులను, బ్యూరోక్రాట్లను, బయటి వ్యక్తులను నియమించే అవకాశాన్ని కల్పించాలన్న డ్రాఫ్ట్ రెగ్యులేషన్‌లోని ప్రతిపాదనపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. ఉన్నత విద్యా సంస్థల్లో మూడు వేల మంది విద్యార్థులుంటేనే గ్రేడింగ్‌లు ఇస్తామని, ఉన్నత గ్రేడ్లు వస్తేనే కేంద్ర ప్రోత్సాహకాలు అందుతాయన్న ప్రతిపాదనను కూడా శ్రీధర్ బాబు వ్యతిరేకించారు. ఇది ప్రైవేటు యూనివర్సిటీలు, డీమ్డ్ యూనివర్సిటీలకు మేలు కలిగించే చర్య అని ఆరోపించారు.

పేదలను ఉన్నత విద్యకు దూరం చేసే చర్య

బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ లాంటి అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులకు ప్రవేశ పరీక్షల ద్వారా విద్యార్థులను ఎంపిక చేయాలనడం పేదలను ఉన్నత విద్యకు దూరం చేసే ఆలోచనగా మంత్రి శ్రీధర్‌బాబు అభివర్ణించారు. 'దేశ సరాసరి గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో కేవలం 28 శాతం మాత్రమే ఉంది. అంటే ఉన్నత విద్య చదవాల్సిన వయసులో ఉన్న యువతలో నూటికి 28 మంది మాత్రమే కళాశాలల్లో చేరుతున్నారు. విద్యార్థుల సంఖ్యను పెంచాలంటే ఎంట్రన్స్ పెట్టాలనే ఆలోచనలు ఆటంకాలు సృష్టిస్తాయి. ఇప్పటిదాకా వైస్ చాన్స్‌లర్ల పదవీకాలం 3 సంవత్సరాలు ఉండగా యూజీసీ రెగ్యులేషన్స్‌లో 5 సంవత్సరాలకు పెంచాలనే ప్రతిపాదన సరికాదు'.. అని పేర్కొన్నారు. అలాగే ఆన్‌లైన్, కరెస్పాండెన్స్ కోర్సులకు అనుమతులివ్వబోమని చెప్పడం విద్యార్థులకు నష్టం కలిగిస్తుందని శ్రీధర్‌బాబు అభిప్రాయపడ్డారు. డ్రాఫ్ట్ యూజీసీ నిబంధనలు తెలంగాణకు ఆమోదయోగ్యంగా లేవని సీఎం రేవంత్‌రెడ్డి.. కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు ఇప్పటికే అధికారికంగా లేఖ రాయడాన్ని ఆయన గుర్తు చేశారు. విద్యకు సంబంధించిన ఏ ప్రతిపాదనలైనా రాష్ట్రాల అభిప్రాయాలను తీసుకున్న తర్వాతే నిబంధనలు రూపొందించాలని శ్రీధర్‌బాబు డిమాండ్ చేశారు. యూజీసీ రెగ్యులేషన్స్ -2025లోని 15 అంశాలను వ్యతిరేకిస్తూ, అమలును నిలిపివేయాలని రాష్ట్రాల విద్యామంత్రుల సమావేశం ధర్మేంద్ర ప్రధాన్‌ను కోరుతూ తీర్మానం చేసింది. సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం తరపున ఉన్నత విద్యాశాఖ కమిషనర్ ఎ.శ్రీదేవసేన, ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి పాల్గొన్నారు.

మార్చి 12 నుంచి ఎడ్‌సెట్ దరఖాస్తులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీల పరిధిలోని బీఈడీ కళాశాలల్లో ప్రవేశానికి ఉమ్మడి ప్రవేశ పరీక్షను జూన్ 1వ తేదీన నిర్వహించనున్నట్లు ఎడ్‌సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ బి.వెంకట్రామిరెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను గురువారం విడుదల చేశారు. మార్చి 10న నోటిఫికేషన్ విడుదలవుతుందని తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను మార్చి 12 నుంచి స్వీకరిస్తామని వెల్లడించారు.

నేలలోని పోషకాల స్థాయిని గుర్తించే సెన్సర్ల అభివృద్ధి

ఇండో క్లైమేట్ సెన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌తో వ్యవసాయ వర్సిటీ ఒప్పందం

సాక్షి, హైదరాబాద్: నేలలోని పోషకాల స్థాయిని గుర్తించే సెన్సర్లను అభివృద్ధి చేసే అంశంపై ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, హైదరాబాద్‌కు చెందిన ఇండో క్లైమేట్ సెన్స్ ప్రైవేట్ లిమిటెడ్ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. రాజేంద్రనగర్‌లోని పీజేటీయూసీ ఆవరణలోని అగ్రి హబ్ కార్యాలయంలో ఉపకులపతి డాక్టర్ అల్దాస్ జానయ్య సమక్షంలో.. విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ విద్యాసాగర్, ఇండో క్లైమేట్ సెన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధి రామచంద్ర అవగాహన ఒప్పందాలపై సంతకాలు చేశారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం పరిశోధన సంచాలకుడు డాక్టర్ ఎం.బలరాం, సెంటర్ ఫర్ నేచురల్ రిసోర్సెస్ అండ్ ఎన్విరాన్‌మెంట్ సంచాలకులు డాక్టర్ కేపీ వాణి, నేలల ఆరోగ్యం, యాజమాన్యం విభాగాధిపతి డాక్టర్ ఎ.మాధవి పాల్గొన్నారు.

నేను కలెక్టర్‌ను వచ్చాను.. ఎలా చదువుతున్నావు?

- తెల్లవారుజామున టెన్త్ విద్యార్థి ఇంటికి వెళ్లిన భువనగిరి కలెక్టర్
- టెన్త్ విద్యార్థుల కోసం 'తలుపు తట్టే' కార్యక్రమానికి శ్రీకారం


భరత్‌చంద్రాచారికి పుస్తకాలు అందిస్తున్న కలెక్టర్ హనుమంతరావు

సంస్థాన్ నారాయణపురం: యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు పదో తరగతి విద్యార్థుల కోసం గురువారం 'విద్యార్థి ఇంటి తలుపు తట్టే' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. సంస్థాన్ నారాయణపురం మండలం కంకణాలగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని దేశ్యాతండాలో టెన్త్ విద్యార్థి దేవరకొండ భరత్‌చంద్రచారి ఇంటికి గురువారం తెల్లవారుజామున 5.30 గంటలకు వెళ్లి తలుపు తట్టారు. 'నేను జిల్లా కలెక్టర్ హనుమంతరావును వచ్చాను'.. అంటూ విద్యార్థి కుటుంబాన్ని పలకరించారు. సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ వసతి గృహానికి బుధవారం రాత్రి వెళ్లిన కలెక్టర్.. అక్కడ పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి ప్రేరణ కలిగించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసి అక్కడే నిద్రపోయారు. గురువారం తెల్లవారుజామున భరత్‌చంద్ర ఇంటికి వెళ్లారు. ఆ విద్యార్థి పోషకాహార లోపంతో బలహీనంగా ఉండడాన్ని గుర్తించి.. అతని పోషణ కోసం నెలకు రూ.5వేలు తన సొంత డబ్బులు అందిస్తానని ప్రకటించి, అప్పటికప్పుడే డబ్బులు అందజేశారు. విద్యార్థి చదువుకునేందుకు స్టడీ చైర్, నోట్ పుస్తకాలు, పెన్నులు ఇచ్చారు. ఈ విద్యార్థిని దత్తత తీసుకుంటానని.. పదో తరగతిలో ఉత్తమ మార్కులతో పాస్ అయితే మంచి కళాశాలలో చేర్పించి చదివిస్తానని కలెక్టర్ భరోసా ఇచ్చారు. తమకు సొంత ఇల్లు లేదని, గ్యాస్ సిలిండర్ పథకం అందడం లేదని భరత్ తల్లి కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ఇందుకు కలెక్టర్ స్పందించి డబుల్ బెడ్రూం ఇల్లు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. భరత్‌ను పాఠశాలకు తీసుకొచ్చే ఆటోకు కొన్ని నెలలుగా చార్జీలు చెల్లిస్తున్న పాఠశాల ప్రధానోపాధ్యాయిని రమాదేవిని కలెక్టర్ సన్మానించారు. విద్యార్థి కుటుంబానికి సహాయం అందించడానికి గుడిమల్కాపురం మాజీ ఎంపీటీసీ సభ్యులు కవిత విద్యాసాగర్ ముందుకు వచ్చారు. సైకిల్ అందిస్తానని, మూడు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు, రూ.5వేలు అందజేయనున్నట్లు తెలిపారు.

రోజూ వేకప్ కాల్

భువనగిరి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 5,600 మంది పదో తరగతి విద్యార్థులున్నారని, వారిలో 1,200 మంది 'సి'గ్రేడ్‌లో ఉన్నారని కలెక్టర్ చెప్పారు. సి–గ్రేడ్ విద్యార్థులను అధికారులు, ఉపాధ్యాయులు దత్తత తీసుకొని, వారి ఉత్తీర్ణతకు ప్రేరణ కలిగించే కార్యక్రమాలు చేస్తున్నామని వివరించారు. ఈ రోజు తనతో సహా అధికారులు 800 మంది విద్యార్థుల ఇంటి తలుపులను తట్టి వారి కుటుంబ సభ్యులతో మాట్లాడినట్టు తెలిపారు. రోజూ ఉదయం ఐదు గంటలకే విద్యార్థులను ఫోన్ చేసి నిద్ర లేపే కార్యక్రమం రూపొందించామని ఆయన చెప్పారు.

వర్సిటీలపై ఆర్‌ఎస్‌ఎస్ భావజాలాన్ని రుద్దే కుట్ర

- యూజీసీ కొత్త మార్గదర్శకాలు అందులో భాగమే
- వర్సిటీలపై ఆధిపత్యం కోసం కేంద్రం ప్రయత్నాలు
- విద్యా కమిషన్ సదస్సులో మేధావుల విమర్శలు


మాట్లాడుతున్న జస్టిస్ సుదర్శన్‌రెడ్డి. చిత్రంలో శాంతసిన్హా, ఆకునూరి మురళి, హరగోపాల్

సాక్షి, హైదరాబాద్: యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) విడుదల చేసిన నూతన మార్గదర్శకాలు దేశ సమాఖ్య వ్యవస్థను దెబ్బతీసేలా ఉన్నాయని మేధావులు ఆందోళన వ్యక్తంచేశారు. ఆర్‌ఎస్‌ఎస్ భావజాలాన్ని వర్సిటీలపై రుద్దే కుట్రలో భాగంగానే ఈ మార్గదర్శకాలను రూపొందించారని ఆరోపించారు. రాష్ట్ర విద్యా కమిషన్ నేతృత్వంలో 'యూనివర్సిటీ రెగ్యులేషన్స్ – రాష్ట్ర యూనివర్సిటీల్లో జోక్యం' అనే అంశంపై గురువారం హైదరాబాద్‌లో నిర్వహించిన సదస్సులో విద్యాకమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, జస్టిస్ సుదర్శన్‌రెడ్డి, ప్రొఫెసర్లు హరగోపాల్, శాంతాసిన్హా, రాం మెల్కోటే, డి.నర్సింహారెడ్డి, తిరుపతిరావు, మురళీ మనోహర్, ఎస్.సత్యనారాయణ, అమీర్ ఉల్లాఖాన్, కె.లక్ష్మీనారాయణ, పద్మాషా, డాక్టర్ చరకొండ వెంకటేశ్ తదితరులు పాల్గొని తమ అభిప్రాయాలు వెల్లడించారు. యూజీసీ మార్గదర్శకాలను తీవ్రంగా వ్యతిరేకిస్తూ తీర్మానం చేశారు.

ఆర్‌ఎస్‌ఎస్ భావజాల వ్యాప్తికే: మురళి

విశ్వవిద్యాలయాల అధికారాలను తన గుప్పిట్లో పెట్టుకోవడానికే యూజీసీ కొత్త మార్గదర్శకాలను తెచ్చిందని ఆకునూరి మురళి విమర్శించారు. ఇది రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని మండిపడ్డారు. బోధన, బోధనేతర సిబ్బంది నియామకాలన్నీ కేంద్రం తన చేతుల్లోకి తీసుకోవాలని చూస్తోందని ఆరోపించారు. యూనివర్సిటీకి వైస్ చాన్స్‌లర్‌గా నియమించాలంటే పీహెచ్‌డీ చేసి, పదేళ్లు ప్రొఫెసర్‌గా పనిచేసి ఉండాలనే నిబంధనను యూజీసీ ముసాయిదా మార్గదర్శకాల్లో పూర్తిగా మార్చేశారని తెలిపారు. పరిశ్రమలు, అకడమిక్ అడ్మినిస్ట్రేటర్, పబ్లిక్ సెక్టార్‌లో.. ఇలా నచ్చిన వారిని ఎలాంటి నిబంధనలు లేకుండా నియమించుకునే అధికారం కేంద్రం తన చేతుల్లోకి తీసుకునేలా మార్గదర్శకాలు ఉన్నాయని చెప్పారు.

మితిమీరిన జోక్యం: ప్రొఫెసర్ కోదండరాం

విశ్వవిద్యాలయాలపై కేంద్రం మితిమీరిన జోక్యాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్టు ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం తెలిపారు. రాజకీయాలకు అతీతంగా యూనివర్సిటీలు ఉండేలా చూసేందుకు ఏర్పాటుచేసిన యూజీసీనే ఇప్పుడు రాజకీయం చేయడం దారుణమన్నారు. జస్టిస్ సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. వర్సిటీల స్వయం ప్రతిపత్తిని కాపాడేందుకు అన్నివర్గాలు సమైక్యంగా గళమెత్తాలన్నారు. వీసీలను నియమించే అధికారం ఇప్పటికే గవర్నర్ చేతుల్లో ఉందని, ఆ గవర్నర్‌ను కేంద్రమే తన ప్రతినిధిగా నియమిస్తుందని గుర్తుచేశారు. నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీపై కూడా ఈ తరహా చర్చలు ఎందుకు పెట్టడం లేదని ఉస్మానియా యూనివర్సిటీ స్కాలర్స్ అసోసియేషన్ నేత ఆజాద్ సదస్సులో ప్రశ్నించారు.

ఇంటర్ పరీక్షలను అనుక్షణం పరిశీలిస్తాం

- బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య
- ఇంటర్ బోర్డులో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు

సాక్షి, హైదరాబాద్: ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలను బోర్డు కేంద్ర కార్యాలయం నుంచి ఎప్పటికప్పుడు నిశితంగా పరిశీలించే ఏర్పాట్లు చేశామని ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య తెలిపారు. రాష్ట్రంలోని 90 శాతం పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని ఆయన చెప్పారు. పరీక్షల విషయంలో ఎలాంటి అక్రమాలు, అపోహలకు తావు లేకుండా ఇలాంటి జాగ్రత్తలు తీసుకున్నామని వివరించారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన పరీక్షల కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఆయన గురువారం మీడియాకు చూపించారు. ఈ సందర్భంగా కృష్ణ ఆదిత్య మాట్లాడుతూ, ప్రస్తుతం జరుగుతున్న ప్రాక్టికల్స్ మాదిరిగానే, వచ్చే నెలలో జరిగే థియరీ పరీక్షలకు కూడా ఇలాంటి ఏర్పాట్లే చేస్తున్నామన్నారు. ప్రాక్టికల్స్‌కు ఎవరైనా విద్యార్థులు గైర్హాజరైతే, సరైన కారణం చూపించిన వారికి తిరిగి ప్రాక్టికల్స్‌కు అనుమతిస్తామని తెలిపారు. పరీక్షలకు అన్ని కాలేజీలు సహకరిస్తున్నాయని చెప్పారు. థియరీ సమయంలో ప్రశ్నపత్రాలు తెరిచే రూమ్‌లో, పరీక్ష కేంద్రం ప్రధాన ద్వారం, కారిడార్, గ్రౌండ్ ఫ్లోర్‌లోనూ సీసీ కెమెరాలు ఉంటాయని, ఇవన్నీ కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానమై ఉంటాయని వెల్లడించారు. కాగా, కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ఏర్పాటు చేసిన మానిటర్లను పరిశీలించేందుకు పెద్ద ఎత్తున సిబ్బందిని నియమించారు. ఈ కార్యక్రమంలో పరీక్షల విభాగం అధికారి జయప్రదాబాయ్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

అపనిందలు మోపే, చాడీలు చెప్పే ప్రతి ఒక్కడికీ వినాశం తప్పదు.
– ఇస్లాం ధర్మం

సాక్షి
శుక్రవారం, 7 ఫిబ్రవరి 2025

అమెరికా అమానుషత్వం

సహజ వనరులు పుష్కలంగా ఉన్న దేశాలపై కన్నేసి వాటిని నయానో భయానో ఒప్పించి అక్కడి ప్రాంతాలను దురాక్రమించాలని చూస్తున్న అమెరికా... పొట్టకూటి కోసం తనను ఆశ్రయించినవారి పట్ల మాత్రం అమానుషంగా, హేయంగా ప్రవర్తిస్తున్నదని రుజువైంది. సైనిక విమానంలో అమృత్‌సర్ చేరుకున్నవారి కథనాలు వింటుంటే దిగ్భ్రాంతి కలుగుతుంది. చేతులకు సంకెళ్లు వేసి, కాళ్లకు గొలుసులు కట్టి, కూర్చోవటానికి కూడా అసౌకర్యంగా ఉండే సైనిక విమానంలో పశువుల్ని తరలించిన చందాన మనవారిని తీసుకొచ్చారు. ఇందులో 19 మంది మహిళలు, 13 మంది మైనర్లు కూడా ఉన్నారని మీడియా కథనాలు చెబుతున్నాయి. గత నెలలో కొలంబియా, మెక్సికో దేశాలవారిని ఈ పద్ధతిలోనే పంపటానికి ప్రయత్నించినప్పుడు వాటినుంచి నిరసన వ్యక్తమైంది. అమెరికా సైనిక విమానాలకు అనుమతినీయబోమన్నాయి. చివరకు కొలంబియా తలొగ్గినా మెక్సికో మాత్రం తమ విమానాన్ని పంపి వలసదారులను వెనక్కు తెచ్చుకుంది. బ్రెజిల్ సైతం తమవారిపట్ల అమానుషంగా వ్యవహరించటాన్ని ఖండించింది. భారతీయులకు జరిగిన అవమానంపై సహజంగానే పార్లమెంటులో గురువారం ఆగ్రహావేశాలు వెల్లువెత్తాయి. చట్టవిరుద్ధంగా ప్రవేశించిన వారిని గుర్తించి వెనక్కు పంపటం ఏ దేశంలోనైనా జరిగేదే. పార్లమెంటులో విదేశాంగమంత్రి జైశంకర్ చెప్పినట్టు అక్రమ వలసదారులను వెళ్లగొట్టడం కొత్తేమీ కాదు. ఏ దేశమూ అలాంటివారిని సమర్థించదు. అక్రమ వలసల్ని ప్రోత్సహించదు. కానీ వెనక్కు పంపే క్రమం మానవీయంగా, నాగరికంగా ఉండాలి. ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరించాలి. చట్టబద్ధంగానో, చట్టవిరుద్ధంగానో తమ భాష, తమ ప్రాంతం కానివారు ప్రవేశిస్తే సహజంగానే స్థానికుల్లో అనేక సంశయాలు కలుగుతాయి. తెలియని భయాందోళనలుంటాయి. ప్రభుత్వాలకుండే ఇతరేతర అనుమానాలు సరేసరి. అమెరికాలో రిపబ్లికన్‌ల ఏలుబడివున్నా, డెమాక్రాట్ల ప్రభుత్వం నడిచినా అక్రమ వలసదారులను కనికరించింది లేదు. కాకపోతే ప్రస్తుత అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అధ్యక్ష ఎన్నికల్లో దాన్నొక బూచిగా చూపారు. శ్వేతజాతీయులు ఎదుర్కొంటున్న సకల సమస్యలకూ మూలం వలసదారులేనన్న భ్రమ కలగజేయటంలో, వారికి డెమాక్రటిక్ పార్టీ మద్దతునిస్తున్నదని నమ్మించడంలో విజయం సాధించారు. తాను అధికారంలోకొచ్చాక అలాంటి వారందరినీ గుర్తించి పంపేస్తానని పదే పదే చెప్పారు. ఆ ప్రచారం ఆయనకు గణనీయంగా వోట్లు రాల్చింది. కానీ తమది ప్రపంచంలోనే పురాతన ప్రజాస్వామ్య వ్యవస్థ అని స్వోత్కర్షకు పోయే దేశం వలసదారులను పశువులకన్నా హీనంగా పరిగణించటం, వారి కనీస మానవహక్కులను బేఖాతరు చేయటం సబబేనా?

వలసదారులు తిరుగుబాటు చేయడానికి రాలేదు. వారి దగ్గర మారణాయుధాలుండవు. ఏజెంట్లను నమ్మి, వారికి లక్షలకు లక్షలు అర్పించుకుని నిజంగా అమెరికా చాన్సు వచ్చిందేమోనన్న భ్రమలో కొందరు నిర్భాగ్యులు విమానం ఎక్కుతారు. వారిని ఇటలీ, బ్రెజిల్, మెక్సికో, పెరూవంటి దేశాల్లో దించి 'మీ చావు మీరు చావండ'ని గాలికొదిలేస్తారు. తమ దగ్గరున్న కాగితాలు నిజమైనవేనన్న భ్రమలో ఉన్న వలసదారులకు అప్పుడిక ఏం చేయాలో పాలుపోదు. చివరకు దేవుడిపై భారంవేసి ముందుకు పోవటానికే నిర్ణయించుకుని కొండలూ, గుట్టలూ, నదులూ దాటుకుంటూ తిండీతిప్పలూ లేక నీరసించి అమెరికా సరిహద్దులకు చేరుకుంటారు. అదృష్టం ఉంటే అక్కడి భద్రతా బలగాల కళ్లుగప్పి ఆ దేశంలోకి ప్రవేశిస్తారు. లేదా దొరికిపోయి జైళ్లపాలవుతారు. భ్రమలన్నీ అడుగంటి, అక్కడ ఉండలేక, వెనక్కొచ్చే దారి దొరక్క జైళ్లలో మగ్గుతారు. సవ్యంగా పంపితే 'బతుకు జీవుడా' అనుకుంటూ అక్కడినుంచి నిష్క్రమించటానికే అత్యధికులు సిద్ధంగా ఉంటారు. అలాంటివారిపైనా ట్రంప్ ప్రతాపం! అప్పుడెప్పుడో వియత్నాం మొదలుకొని వర్తమానంలో గాజా వరకూ అమెరికా ప్రత్యక్షంగా, పరోక్షంగా వేర్వేరు దేశాల్లో సాగించిన అకృత్యాల మాటేమిటి? వాటికి పడాల్సిన శిక్షేమిటి? ఏనాడైనా ఆత్మసమీక్ష చేసుకుందా? ఎడ్వర్డ్ స్నోడెన్, చెల్సియా మానింగ్ వంటివారు బట్టబయలు చేసిన రహస్య పత్రాలను ఒకసారి అమెరికా చదువుకుంటే మంచిది.

అక్రమ వలసదారులను సమర్థించాలని ఎవరూ చెప్పరు. కానీ అమెరికా వ్యవహరించిన తీరును మన ప్రభుత్వం ఖండించాల్సిన అవసరం లేదా? గతంలో యూపీఏ హయాంలో అమెరికాలో మన దౌత్యవేత్త దేవయాని ఖోబ్రగడేపై వచ్చిన ఆరోపణలు ఆసరా చేసుకుని ఆమెకు సంకెళ్లు వేసి, వివస్త్రను చేసి తనిఖీ చేసినప్పుడు మన ప్రభుత్వం అప్పటి అమెరికా రాయబారి నాన్సీ పావెల్‌ను పిలిపించి తీవ్ర నిరసన వ్యక్తంచేసింది. భారత్‌లో పర్యటిస్తున్న అమెరికన్ కాంగ్రెస్ సభ్యుల్ని కలుసుకునేందుకు మన నాయకులు నిరాకరించారు. అమెరికా దౌత్య కార్యాలయ సిబ్బందికిచ్చే అనేక రాయితీలనూ, సౌకర్యాలనూ ఉపసంహరించారు. దౌత్యరంగంలో రెండు దేశాల మధ్యా విడదీయరాని అనుబంధం ఉండి వుండొచ్చు. అది మనకు మిత్ర దేశమే కావొచ్చు. వలస దారులను సవ్యంగా పంపి వుంటే సమస్యే ఉత్పన్నమయ్యేది కాదు. కానీ జరిగింది అందుకు భిన్నం. ఈ విషయమై పార్లమెంటులో వ్యక్తమైన అభిప్రాయాలు పరిగణనలోకి తీసుకోవాలి. తప్పును తప్పని చెప్పితీరాలి. వలసదారుల విషయంలో ఎలా వ్యవహరించాలో చెప్పే అంతర్జాతీయ ఒడంబడికలున్నాయి. అగ్రరాజ్యమైనంత మాత్రాన వాటిని బేఖాతరు చేస్తానంటే కుదరదు. ముమ్ముందు ఇలాంటి ఉదంతాలు చోటుచేసుకోకూడదనుకుంటే మన నిరసనను తెలియజేయటమే ఉత్తమం.

వాణిజ్య యుద్ధంతో అందరికీ నష్టమే!

విశ్లేషణ



టంకశాల అశోక్

స్వేచ్ఛా వాణిజ్య సిద్ధాంతాన్ని ప్రపంచంపై బలవంతంగా రుద్దిన అమెరికా, దాన్ని తమకు లాభం కలిగినంత కాలం ఉపయోగించుకుని ఇపుడు లాభం లేదనిపించటంతో ఎదురు తిరుగుతున్నది. ఆ విషయం బయటకు ఒప్పుకోకుండా అధ్యక్షుడు ట్రంప్ సాకులు వెతుకుతున్నారు. కెనడా, మెక్సికో, చైనాలపై సుంకాలు పెంచిన ఆయన తన చర్యకు పేర్కొన్న కారణాలను గమనించండి: అక్రమ వలసలు, ఫెంటానిల్ అనే మాదక ద్రవ్యం రవాణా.

అక్రమ వలసలు మెక్సికో నుంచే గాక, ఆ దేశం మీదుగా ఇతర లాటిన్ అమెరికన్ దేశాల నుంచి, చివరకు ఇండియా వంటి సుదూర దేశాల నుంచి కూడా సాగుతున్న మాట నిజం. వాటి నిరోధానికి మెక్సికో సరిహద్దులలో గోడల నిర్మాణం, వేలాది సైన్యాల మోహరింపు ఇప్పటికే మొదలు పెట్టారు. కెనడా, చైనా నుంచి అక్రమ వలసలు అత్యల్పం. మాదక ద్రవ్యాల తయారీ, రవాణాను ఈ మూడు దేశాలలో ఏదీ అధికారికంగా ప్రోత్సహించటం లేదు.

స్వేచ్ఛా వాణిజ్యానికి భంగం

అమెరికా, కెనడా, మెక్సికోల మధ్య వాణిజ్యానికి ఒక ప్రత్యేక ఒప్పందం ఉంది. అది ట్రంప్ మొదటి హయాం (2017–21)లో జరిగిందే. దానిని ట్రంప్ స్వయంగా ఉల్లంఘిస్తున్నారు. అమెరికా పట్టుబట్టి చేయించిన గాట్స్ ఒప్పందానికీ, అందుకు రూపాంతరమైన ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ) నిబంధనలకూ, ఇంకా చెప్పాలంటే అమెరికా పెట్టుబడిదారీ, స్వేచ్ఛా వాణిజ్య సిద్ధాంతాలకూ ఈ చర్యలు విరుద్ధమైనవి. వాస్తవానికి తదనంతర కాలంలో ఇందుకు అనుగుణంగానే పాశ్చాత్య ప్రపంచంతో సహా అనేక దేశాలు పరస్పరమో, లేక ప్రాంతీయ బృందాలు గానో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు చేసుకుంటూ వస్తున్నాయి. ఆ విధంగా ప్రపంచం ఒక కొత్త దశలోకి ప్రవేశించింది. పెట్టుబడులు, వాణిజ్యంలో పరస్పర చర్చల ద్వారా జరిగే ఈ ఒప్పందాలు సాధారణంగా అన్ని పక్షాలకూ ప్రయోజనకరమవుతున్నాయనే భావన ఏర్పడింది కూడా. అటువంటిది, ఈ పరిణామాలన్నింటికీ మాతృదేశమనదగ్గ అమెరికాయే అందుకు భంగం కలిగించే చర్యలకు పాల్పడుతుండటం ఆశ్చర్యకరం.

అనేక దేశాల వలెనే అమెరికాలోనూ మాదక ద్రవ్యాల వినియోగం పెద్ద ఎత్తున ఉంది. ఈ వినియోగం ఎప్పటినుంచి ఎందువల్ల మొదలై కొనసాగుతున్నదనే విషయం ప్రచారంలోకి రావటం లేదు. వియత్నాం యుద్ధంలో అమెరికా 1960ల నుంచి 1970ల వరకు ఉధృతంగా పాల్గొని భయంకరమైన హత్యాకాండ సాగించి ఆఖరుకు ఓటమిపాలైంది. ఆ కాలమంతా వారి యుద్ధ విమానాల రవాణా నైజీరియా మీదుగా జరిగినపుడు, యుద్ధం వల్ల వ్యథకు గురైన సైనికులు దానిని మరిచిపోయేందుకు స్థానికంగా లభించే మాదక ద్రవ్యాలకు అలవాటుపడ్డారు. అది యుద్ధం తర్వాత మాజీలు అయిన సైనికులకు కొనసాగి వారి ద్వారా, ఇతరత్రా వ్యాపించి స్థిరపడింది. ఆ కాలంలో లాటిన్ అమెరికా నుంచి డ్రగ్ కార్టెల్స్ ఎట్లా పని చేశాయన్న చర్చ అప్రస్తుతం. అయితే ఇందుకు సుంకాల హెచ్చింపు ఎట్లా పరిష్కారమవుతుందన్నది ట్రంప్ సైతం వివరించని ప్రశ్న. ఆ పని చేయటానికి బదులు, అంతర్జాతీయ ఆర్థిక అత్యవసరాల చట్టం ఒక దానిని అడ్డు పెట్టుకుని మెక్సికో, కెనడా వంటి అతి సన్నిహిత మిత్ర దేశాలపై 25 శాతం సుంకాలు పెంచారు.



సుంకానికి సుంకం

కెనడా, మెక్సికో దిగుమతులపై 25 శాతం, చైనాపై 10 శాతం అదనపు సుంకాలను ప్రకటించిన ట్రంప్ కాస్త వెనక్కి తగ్గి కెనడా, మెక్సికో సుంకాలను ఒక నెల వాయిదా వేశారు. మరోవైపు చైనా కూడా అమెరికా నుంచి దిగుమతయ్యే బొగ్గు, ద్రవరూప సహజ వాయువు మీద 15 శాతం, చమురు, వ్యవసాయ పరికరాల మీద 10 శాతం సుంకాలను ఫిబ్రవరి 10 నుంచి అమలుచేస్తామని ప్రకటించింది.

కృత్రిమ ఆధిపత్యం

అమెరికా వంటి అగ్రస్థాయి సంపన్న దేశానికి ఇటువంటి చర్యల అగత్యం ఎందుకు ఏర్పడింది? తమ వద్ద ఉత్పత్తుల ఖర్చు పెరుగుతున్నందున, వెనుకబడిన దేశాలలో వేతనాలు, ముడిసరుకులు, మౌలిక సదుపాయాల ఖర్చు తక్కువ గనుక, అక్కడ ఉత్పత్తులు చేయించి, అక్కడి నుంచి చవకగా దిగుమతి చేసుకోవచ్చుననే వ్యూహంలో దీనికంతా మూలాలు ఉన్నాయి. ఇది కొంతకాలం సజావుగా సాగినా, ఆ యా దేశాలు సాంకేతికంగా, పారిశ్రామికంగా బలపడటం, తొలి దశలో అమెరికా నుంచి యూరప్ నుంచి తరలి వెళ్లిన ప్రైవేట్ కంపెనీలు అక్కడి లాభాలకు అలవాటుపడటంతో ఈ పాశ్చాత్య దేశాలకు పలు సమస్యలు మొదలయ్యాయి. అక్కడి పారిశ్రామికత, ఆదాయాలు, ఉపాధి అవకాశాలు తగ్గసాగాయి. మిగులు బడ్జెట్లు లోటు బడ్జెట్లుగా మారాయి. అమెరికా అయితే సుమారు 30 ట్రిలియన్ డాలర్ల లోటు, అప్పుల భారానికి చేరి, బంగారం నిల్వల మద్దతు లేకపోయినా డాలర్లను యథేచ్ఛగా ముద్రించి ప్రపంచం పైకి వదలటం, డాలర్ ఆధిపత్యాన్ని కృత్రిమంగా నిలబెట్టడం వంటి దశకు చేరుకుంది. మామూలుగానైతే ఆర్థికంగా ఇది దివాళా స్థితి అవుతుంది. కానీ ఆ కృత్రిమతను నిలబెట్టేందుకు, ఒకవేళ బ్రిక్స్ కూటమి డాలర్‌ను బలహీనపరిచే చర్యలు తీసుకునే పక్షంలో ఆ కూటమి దేశాలపై 100 శాతం సుంకాలు పెంచగలమంటూ పదేపదే బెదిరించవలసిన బలహీన స్థితిని అమెరికా ఎదుర్కొంటున్నది.

ట్రంప్ చర్యలు అమెరికా పెట్టుబడిదారీ, స్వేచ్ఛా వాణిజ్య సిద్ధాంతాలకు విరుద్ధమైనవి. అమెరికా మార్కెట్లు ఎంత పెద్దవైనా ఈ సుంకాల ఒత్తిడితో ముడి వస్తువులు అమెరికా పరిశ్రమలకు లభించకపోవటం, ఆయా దేశాలు ఇతర మార్కెట్లను వెదుక్కోవటం జరిగితే పరిస్థితి ఏమిటి?

ఇంతకూ ట్రంప్ సుంకాల హెచ్చింపు అమెరికాకు ఎంతవరకు ఉపయోగపడవచ్చునన్నది ప్రశ్న. ఈ తరహా చర్యలు ఆయన తన మొదటి పాలనా కాలంలోనూ తీసుకున్నారు. అపుడు ఆయన వాణిజ్య యుద్ధం కేవలం చైనాపై. అది చైనాకు కొంత నష్టం కలిగించినా అమెరికాకు అంతకన్న ఎక్కువ నష్టం కలిగిందన్నది అమెరికన్ ఆర్థిక వేత్తల దాదాపు ఏకాభిప్రాయం. అందుకు కారణాలను విశ్లేషించుకోవడానికి బదులు, తన వాణిజ్య యుద్ధాన్ని మిత్ర దేశాల పైకి కూడా విస్తరించటం నమ్మశక్యం కాకుండా ఉంది. రానున్న రోజులలో యూరోపియన్ దేశాలపై కూడా సుంకాల పెరుగుదల ఉండగలదని సూచించారు. అమెరికా దిగుమతులలో ఈ మూడు దేశాల ఉత్పత్తులు కలిపి 40 శాతం ఉంటాయని అంచనా. అమెరికాకు ఎగుమతులు చేసే మొదటి 10 దేశాలలో చైనా తప్ప మిగిలినవన్నీ వారి మిత్ర దేశాలే. ఇండియా పదవ స్థానంలో ఉంది. ఇండియా పైనా సుంకాలు పెంచగలమని ట్రంప్ ఇప్పటికే అన్నారు. తమ ఆధునిక మోటార్ వాహనాలపై ఇండియా సుంకాలు తగ్గించాలని మొదటి పాలనా కాలంలో కోరగా అందుకు అంగీకరించని మోదీ ప్రభుత్వం ఇప్పుడు కొత్త బడ్జెట్‌లో అటువంటి ప్రతిపాదనలు చేయటం గమనించదగ్గది. ఆ చర్య ట్రంప్‌ను మెత్తబరచగలదేమో చూడాలి.

ట్రంప్ చర్యకు ప్రతిగా, కెనడా ప్రధాని ట్రూడో కొద్ది గంటలలోనే, అదే 25 శాతం స్థాయిలో ఎదురు సుంకాలు ప్రకటించారు. మెక్సికో అధ్యక్షురాలు క్లాడియా షెన్‌బామ్ కూడా తాము సుంకాలను పెంచి తీరగలమన్నారు. ఈ రెండు దేశాల నుంచి వివిధ వినియోగ వస్తువులపైనే గాక యంత్ర పరికరాలు, చమురు, విద్యుత్ దిగుమతులపై అమెరికా చాలా ఆధారపడి ఉంది. మరొక వైపు చైనా ఈ సుంకాలు వివక్షాపూరితం అంటూ డబ్ల్యూటీవోకు ఫిర్యాదు చేసింది.

వాణిజ్య యుద్ధాలను అమెరికా గతంలోనూ చేసింది. కాకపోతే దౌత్యపరమైన లక్ష్యం కోసం ఇతరులను లొంగదీయటానికి. ట్రంప్ అట్లాగాక ఈ యుద్ధంతో తమ ఆర్థిక వ్యవస్థకు లాభం చేస్తామంటున్నారు. ఇతరులు లొంగి రావటంవల్ల అమెరికా లాభపడగలదనీ, దానితో ప్రజలపై ఆదాయ పన్ను మొత్తంగా రద్దు చేయవచ్చుననీ ఆశపెడుతున్నారు. అమెరికా మార్కెట్లు ఎంత పెద్దవి అయినా ఈ సుంకాల ఒత్తిడితో ఇతరులు కూడా సుంకాలు పెంచటం, వారి ముడి వస్తువులు అమెరికా పరిశ్రమలకు లభించకపోవటం, ఆయా దేశాలు ఇతర మార్కెట్లను వెదుక్కోవటం వంటివి జరిగితే పరిస్థితి ఏమిటి? ఇవిగాక రెండు ముఖ్యమైన ప్రశ్నలున్నాయి. ఇటువంటి యుద్ధాలతో స్వేచ్ఛా వాణిజ్య సిద్ధాంతపు భవిష్యత్తు ఏమిటన్నది ఒకటైతే, ఈ ప్రభావాలు రాజకీయంగా, భౌగోళికంగా ఏ విధంగా ఉండవచ్చుననేది రెండవది.

వ్యాసకర్త సీనియర్ సంపాదకుడు

సోషల్ మీడియా

కనీస గౌరవంతో...



అమెరికాలోకి అక్రమంగా ప్రవేశించిన వారిని వెనక్కి పంపడం సమస్య కాదు. కానీ వారికి సంకెళ్లు వేయడం, కాళ్లకు గొలుసులు కట్టడం, వారు ఆరోపించినట్టుగా వాష్‌రూమ్‌కు వెళ్లడానికి ఇబ్బంది పడటం అన్నీ సమస్యలే! గౌరవంగా వెనక్కి పంపమని ట్రంప్ ప్రభుత్వానికి భారత ప్రభుత్వం చెప్పాలి.
– రాజ్‌దీప్ సర్దేశాయి, జర్నలిస్ట్

ఎదిగిపోయాం!



దశాబ్దాల క్రితం నేను వాహన పరిశ్రమలో నా కెరియర్ ప్రారంభించినప్పుడు, విదేశాల్లో తయారవుతున్న ఆధునిక కార్ల ఫొటోలు తీసుకోవడానికీ, అధ్యయనం చేయడానికీ భారత ప్రతినిధులు అంతర్జాతీయ వాహన ప్రదర్శనలకు వెళ్లేవారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన భారత మొబిలిటీ షోలో జపాన్, కొరియన్ సందర్శకులు మా కొత్త ఎలక్ట్రిక్ ఎస్‌వీయూలను చుట్టుముట్టినప్పుడు నా ఉద్వేగాలు చూడాలి!
– ఆనంద్ మహీంద్రా, పారిశ్రామికవేత్త

దండెత్తలేదు!



వందేళ్ల క్రితం బ్రిటిషర్లు సిద్ధాంతీకరించినట్టుగా, హరప్పా నగరాల మీద ఆర్యన్లు ఎప్పుడూ దండెత్తలేదు. హరప్పా నగరాలు లేకుండాపోయాక పెంపుడు గుర్రాల మీద ఆర్యన్లు ఇండియా, ఇరాన్‌కు వచ్చినట్టు పురాతత్వ, భాషా, జన్యు అధ్యయనాలు సూచిస్తున్నాయి.
– దేవ్‌దత్ పట్నాయక్, రచయిత

ఆత్మహత్యకు ప్రేరణ



ఆత్మహత్మకు ప్రయత్నించేవాళ్లలో 60 శాతం విటమిన్ డి లోపం ఉన్నవారు. నా క్యాన్సర్ ఘటన తర్వాత నేను ఆ మాత్రలు లేకుండా ఎక్కడికీ వెళ్లను. విటమిన్ తగ్గినప్పుడు కొన్ని లక్షణాలు నేను మాత్రలు వేసుకోలేదని గుర్తుచేస్తాయి.
– హెంద్ ఫైజల్ అల్ ఖసీమీ, యూఏఈ యువరాణి

బదిలీ మార్గం



మీకు తెలుసా? రక్తపాతాన్ని ఆపేందుకు 1923లో గ్రీస్, టర్కీ జనాభాను బదిలీ చేసుకున్నాయి. అదే ఇప్పుడు గాజాతో కూడా ఎందుకు చేయకూడదు?
– హారిస్ సుల్తాన్, యూట్యూబర్

ఇన్‌బాక్స్

తెలుగు సాహిత్యం – అంబేడ్కర్

1891 ఏప్రిల్ 14న పుట్టిన అంబేడ్కర్ పాతికేళ్ల వయసుకి కులం పుట్టుకను, వ్యాప్తిని విశ్లేషించటం మొదలుపెట్టాడు. మనుస్మృతి, వేదాలు, పురాణేతిహాసాలు ఆయనకు అధ్యయన విషయాలయ్యాయి. ఈ అధ్యయనం వివక్షలను ఎదిరించి సమానత్వం కోసం పోరాడాలన్న తాత్విక భూమిక మీద సాగింది. అందువల్ల ప్రజాస్వామిక పరిశోధకుడిగా పదును తేలాడు. కుల మత తత్వ విశ్లేషణకు వేదస్మృతి సాహిత్యంతో పాటు భారత రామాయణాది ఇతిహాస పురాణాలను అంత విస్తృతంగానూ ఉపయోగించుకున్నాడు. ఆ రకంగా అంబేడ్కర్ ఎంత సామాజిక ఆర్థిక, రాజకీయవేత్తో అంత సాహిత్య విమర్శకుడు కూడా. సామాజిక, రాజకీయ ఉద్యమకారులను తన నాయకత్వంతో ప్రభావితం చేసినట్లుగానే సామాజిక చలనాలను ఒడిసి పట్టుకునే సాహిత్యకారులను కూడా తన భావజాలంతో ప్రభావితం చేశాడు.

లౌకిక ప్రజాస్వామిక విలువలను– కార్పొరేట్ ఫాసిస్ట్ శక్తులనుంచి కాపాడుకోడానికి కావలసిన నైతిక ధైర్యాన్ని పోగుచేసుకొనటానికి అంబేడ్కర్ ఆలోచనలు ఉపయోగపడతాయన్న నమ్మకంతో 'ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక' (ప్రరవే) అంబేడ్కర్ రచనల అధ్యయనం మొదలుపెట్టింది. డిసెంబర్ 22 నుండి ప్రతి ఆదివారం 'అంబేడ్కర్ ఆలోచనల తాత్వికత'పై రెండు ప్రసంగాలతో అంతర్జాల కార్యక్రమం ప్రారంభించింది. ఇది 2025 జూన్ వరకూ సాగుతుంది. ఈ ప్రయత్నం మరింత సమగ్రం కావడం కోసం ప్రరవే 16వ వార్షిక సదస్సు 'తెలుగు సాహిత్యం – అంబేడ్కర్ ప్రభావం' అన్న అంశాన్ని ఎంచుకుంది. అంబేడ్కర్ ఆలోచనల వెలుగులో తెలుగు సాహిత్యాన్ని విలువకట్టడం అంటే అది ఎంత ప్రజాస్వామికం అయిందో తెలుసుకొనటమే అవుతుంది.

2025 ఫిబ్రవరి 8 – 9 (శని, ఆదివారాలు) తారీఖులలో సిద్దిపేటలో జరగనున్న రెండు రోజుల సదస్సులో ఈ క్రింది అంశాలు చర్చకు రావాలని ప్రరవే ఆశిస్తున్నది. దళిత స్పృహతో– దళితులు, దళితేతరులు రాసిన సాహిత్యాన్ని విశ్లేషించే పద్ధతులు, దళిత సాహిత్యం అంతా అంబేడ్కరిస్టు సాహిత్యం అవుతుందా అన్న చర్చ, అంబేడ్కరిస్టు సాహిత్యాన్ని నిర్వచించటం– గుర్తించటం, 1985కు ముందు తెలుగు సాహిత్యంపై అంబేడ్కర్ ప్రభావం, 1985 తరువాత వచ్చిన గుణాత్మక పరిణామాలు, అంబేడ్కర్‌పై వచ్చిన ఆరాధనా సాహిత్యంలో అంబేడ్కర్ భావజాల ప్రభావం; కుల, మత, మానవ సంబంధాల నేపథ్యంగా అంబేడ్కర్ ప్రభావంతో వచ్చిన సాహిత్యం – ఏ కాలంలో, ఏ ప్రక్రియలో, ఎంత విస్తారంగా వచ్చింది; మహిళా జనహితం కోసం పాటుబడిన అంబేడ్కర్ ఆలోచనాధారను స్త్రీలు ఏ మేరకు అందిపుచ్చుకుని ఏ యే ప్రక్రియలలో ప్రధానంగా కృషి చేశారు, మొత్తంగా అంబేడ్కర్ ప్రభావం తెలుగు సాహిత్యానికి ఇచ్చిన కొత్త విలువలు!

వక్తలచే అంబేడ్కర్ కుల విమర్శ ప్రారంభించిన 1916 నుండి 2024 వరకు వచ్చిన నూట ఎనిమిది సంవత్సరాల తెలుగు సాహిత్య అనుశీలనం జరుగుతుంది. అంబేడ్కర్ ప్రభావంతో తెలుగు సాహిత్య విమర్శను అభివృద్ధి చేసిన బోయి విజయభారతి స్మారకోపన్యాసం ఉంటుంది. 9వ తేదీన కవిసమ్మేళనం జరుగుతుంది. అందరూ ఆహ్వానితులే.

– ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక
(సిద్దిపేటలో ఫిబ్రవరి 8, 9 తేదీల్లో ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక వార్షిక సదస్సు)

నకలు కాదు... సిసలు రాజ్యాంగం

అభిప్రాయం



మాడభూషి శ్రీధర్

భారత స్వాతంత్ర్య సంగ్రామం చివరికి ఉపఖండం భారత్, పాకిస్తాన్‌లుగా విభజితమవ్వడంతో ముగిసింది. బ్రిటిష్ రాణి 1947 జూలైలో 'భారతీయ స్వాతంత్ర్య చట్టం–1947'ను ఆమోదించారు. '3వ జూన్ ప్లాన్' పేరున 'మౌంట్ బాటెన్ ప్రణాళిక' కింద రెండు (భారత్–పాక్) డొమినియన్‌ల సృష్టి జరిగింది. అవి స్వతంత్ర దేశాలని అనుకుంటున్నాం కాని, బ్రిటిష్ రాణి దయవల్లనే వాటికి డొమినియన్ స్థాయిని ఇచ్చారు (ఇది దానం వలె 'ఇచ్చింది' అని అర్థం చేసుకోవాలి).

స్వాతంత్ర్య చట్టం ఆమోదానికి ముందే మన రాజ్యాంగాన్ని రాయడానికి రాజ్యాంగ సభ (1946) ఏర్పడింది. మొత్తం 2 సంవత్సరాల 11 నెలల 18 రోజుల పాటు మన రాజ్యాంగ నిర్మాణం సాగి 1950 జనవరి 26న అమలులోకి వచ్చింది. అయితే మన రాజ్యాంగం కాపీ కొట్టిన రాజ్యాంగం అనే అపప్రథను మూట కట్టుకుంది. ఇప్పటికీ ఆ విమర్శ ఉంది. బ్రిటిష్ వాళ్లు చేసిన 'భారత ప్రభుత్వ చట్టం –1935'ను మక్కికి మక్కీ నకలు చేశారంటారు. అలాగే అనేక ప్రపంచ దేశాల నుంచి నచ్చిన అంశాలను గ్రహించి మన రాజ్యాంగంలో చేర్చారు. మనకు ఉన్న దేశాధ్యక్షుడు (రాష్ట్రపతి), మంత్రి వర్గం, పార్లమెంట్, న్యాయవ్యవస్థ వంటివి ప్రపంచంలో అనేకానేక ప్రజాస్వామ్య దేశాల్లో ఉన్నవే. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇవన్నీ సాధారణ అంశాలు (భాగాలు) కాబట్టి అది నకలు అనడానికి వీల్లేదు. మనం ప్రజాస్వామ్య విధానం పాటిస్తున్నాం కాబట్టి మనకు నచ్చిన అంశాలను స్వీకరించడం తప్పుకాదు కదా. ఇక ఏ ఏ అంశాలను ఎక్కడి నుంచి స్వీకరించామనే విషయానికి వస్తే... బ్రిటన్ నుంచి పార్లమెంటరీ ప్రభుత్వ పరిపాలన, రూల్ ఆఫ్ లా, శాసన ప్రక్రియ, క్యాబినెట్ పద్ధతిలో ప్రజాస్వామ్యం, ప్రభుత్వ నిర్వహణలో న్యాయరంగంలో ఆజ్ఞల పాత్ర (రిట్ గొప్పతనం) వంటివి ఉన్నాయి.



రాజ్యాంగ పరిషత్ సమావేశం

ఐర్లాండ్ నుంచి ఆదేశిక సూత్రాలు, రాష్ట్రపతి ఎన్నికల పద్ధతి, రాష్ట్రపతి రాజ్యసభలో సభ్యులను ఎంపిక చేసే పద్ధతిని స్వీకరించాము. అమెరికా రాజ్యాంగం నుంచి స్వీకరించినవాటిలో అధికారం నుంచి రాష్ట్రపతిని తొలగించడం (మహా అభిశంసనం), రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతులు అధికారాలను నిర్వహించే విధానం, సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తుల తొలగింపు, ప్రాథమిక హక్కులు, న్యాయ సమీక్షాధికారం, న్యాయ స్వతంత్రత, రాజ్యాంగ పీఠిక ఉన్నాయి.


సమాఖ్య తరహా అధికారిక కేంద్రీకరణ... అంటే రాష్ట్రాలతో పోల్చితే బలమైన కేంద్రం, రాష్ట్రాలకు ఇచ్చిన అధికారాలు కాక మిగిలిన అన్ని అధికారాలను కేంద్రానికి అప్పగించడం, కేంద్రానికి రాష్ట్రాల గవర్నర్ (రాజ్‌పాల్) నియామక అధికారం, సుప్రీంకోర్టుకు సలహా ఇచ్చే అధికారం వంటి వాటిని కెనడా రాజ్యాంగం నుంచి గ్రహించాం. ఆస్ట్రేలియా నుంచి కేంద్రం, రాష్ట్రాలు రెండూ చట్టాలు చేయగలిగిన అంశాల జాబితా (ఉమ్మడి జాబితా), లోక్ సభ, రాజ్యసభల ఉమ్మడి సమావేశాన్ని నిర్వహించడం వంటి అంశాలు; సోవియట్ యూనియన్ నుండి ప్రాథమిక విధులు, సామాజిక, ఆర్థిక, రాజకీయ లక్ష్యాలను పీఠికలో చేర్చడం; ఫ్రాన్స్ నుండి గణతంత్ర లక్షణం, స్వేచ్ఛ, సమానత్వ, సౌభ్రాతృత్వాలను పీఠికలో చేర్చడం వంటివాటిని స్వీకరించాం. అలాగే జర్మనీ నుంచి ఎమర్జన్సీలో ప్రాథమిక హక్కులను సస్పెండ్ చేసే (సుషుప్తావస్థలో ఉంచే) విధానాన్ని, దక్షిణ ఆఫ్రికా నుంచి రాజ్యసభ ఎన్నికల విధానం, రాజ్యాంగ సవరణ వంటివి మనం తీసుకున్నాం.

ఈ లక్షణాలన్నీ వివేకంగా ఉపయోగించుకోవచ్చు అని రాజ్యాంగ నిర్ణాయక సభలో నిర్ణయించారు. అంతకుముందు బీఎన్ రావ్ ఒక ముసాయిదా రాశారు. అయితే అది పూర్తిగా మారిపోయింది. పోల్చుకోవడం కూడా సాధ్యం కాని విభిన్నమైన ప్రజాస్వామ్యాల నుంచి అనేక అంశాలు, కీలకమైన కొన్ని విధానాలు చేర్చవలసి ఉందని ఆయనే స్పష్టంగా చెప్పారు. అందుకు తగినట్లే అనేక రాజ్యాంగాల నుంచి తగిన విషయాలను స్వీకరించడం జరిగింది. కానీ ఇప్పటికీ కొందరు పెద్దలు అసలు మొదటి రాజ్యాంగం రాసింది రావ్ గారే తెల్సా అని తెలిసినట్టు మాట్లాడుతూ ఉంటారు. మన తాజా దేశభక్తులు కూడా ఇదే వాదన చేస్తుంటారు. విధిలేక అంబేడ్కర్‌ను ఈ భక్తులు మొక్కుతున్నారు గాని రాజ్యాంగ నిర్ణాయక సభ (లేదా రాజ్యాంగ నిర్మాణ పరిషత్)లోని సప్తరుషులవంటి ఏడుగురు రాజ నీతిజ్ఞుల అవిరళ కృషి, మార్గదర్శకాలతో తొలి డ్రాఫ్ట్ రూపొందింది. తరువాత ఆ ఏడుగురిలో ముసాయిదా కమిటీ అధ్యక్షుడైన అంబేడ్కర్ రాజ్యాంగ నిర్మాణం చేశారని అర్థం చేసుకోవాలి. ప్రతి నియమానికి నానా కష్టాలు పడి, చర్చించి, ఒప్పించి, అందరూ ఏకాభిప్రాయం సాధించిన తరువాత ఈ రాజ్యాంగం ఏర్పడిందని గ్రహించాలి.

వ్యాసకర్త మహేంద్ర యూనివర్సిటీ 'స్కూల్ ఆఫ్ లా' ప్రొఫెసర్

జిజ్ఞాస ముఖ్యం

తమ, తమ సందేహాలను తీర్చుకోవటానికి, ప్రశ్నలకు సమాధానాలను పొందటానికి, సమస్యలకు పరిష్కారాలను కనుగొనటానికి ప్రతిరోజూ ఎందరెందరో గౌతమ బుద్ధుని వద్దకు వచ్చేవారు. ఒకరోజు ఒక వ్యక్తి వచ్చి బుద్ధుని ముందు నిలిచి 'అయ్యా! మిమ్మల్ని నేను అడగ దలచినది అడగటానికి నా వద్ద తగిన భాషలేదు. మీ వద్ద నుంచి దేన్ని పొంద గోరుతున్నానో దాన్ని నాకు ఇవ్వమని అడగ గలిగే నైపుణ్యం లేదు. మీకు అంతా తెలుసు. నాకు ఏమి చెబుతారో, ఏమి ఇస్తారో మీరే నిర్ణయించి అలా చేయండ' న్నాడు. వెంటనే బుద్ధుడు అతన్నే చూస్తూ కొంత సేపు మౌనంగా కూర్చొన్నాడు. చుట్టూ ఉన్నవారు వారిద్దరినీ బాగా గమనిస్తున్నారు. ఇద్దరూ ఒక్క మాట కూడా మాట్లాడక ఒకర్నొకరు చూస్తున్నారు, అంతే.



జ్యోతిర్మయం

కాలం గడుస్తున్న కొద్దీ పరిసర ప్రాంతమంతా ప్రశాంతతతో నిండిపోవటాన్ని అందరూ గమనించారు. ఆ వచ్చిన వ్యక్తి ముఖంలో మార్పులు జరుగుతున్నాయి. కొద్ది సేపటికి అతని రెండు కళ్ళనుండి నీరుకారింది. అతడు రెండు చేతులు జోడించి బుద్ధుని పాదాల వద్ద తన తలను వంచి నమస్కరించి, 'నేను ఎంతో అదృష్టవంతుడిని, నా జన్మ ధన్యమయింది, నేను వచ్చిన పని నెరవేరింది, మీకు నా కృతజ్ఞతలు' అని ఆనందంగా నాట్యం చేస్తూ అక్కడినుంచి వెళ్ళిపోయాడు. బుద్ధుని చుట్టూ ఉన్నవారికి అంతులేని ఆశ్చర్యం కలిగింది. సన్నిహితుడైన ఆనందుడు బుద్ధునితో, 'హే భంతే! భగవాన్! ఏమిటి ఈ వింత! మీతో పాటు ఎన్నో ఏళ్లుగా ఉన్న మాపై ఆ కరుణను మీరు ఎందుకు కురిపించలేదు? మాకు దాన్ని పొందే అర్హత లేదా? అని ఎంతో తీవ్రమైన దుఃఖంతో అడిగాడు. అప్పుడు బుద్ధుడు, 'అతనికి ఉన్న గాఢ జిజ్ఞాసయే అతనికున్న అర్హత' అని ఆనందుని ఓదార్చాడు (పుటలు–23, 24– ఎన్‌లైటెన్‌మెంట్: ది ఓన్లీ రివల్యూషన్– ఓషో).

'శ్రద్ధావాన్ లభతే జ్ఞానం' అని పెద్దలు చెబుతారు. తగిన అర్హతను శ్రద్ధ, జిజ్ఞాస, తీవ్రమైన కాంక్షలు ఇస్తాయి. అవి ఉన్నవాడు పొందలేనిది ఏదీ ఉండదు. వివేకానందుడు, దయానందుడు, విరజానందుడు వంటి మహనీయుల జీవిత చరిత్రలే దానికి సాక్ష్యాలు.

– రాచమడుగు శ్రీనివాసులు

గ్రహం అనుగ్రహం శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, **తిథి:** శు.దశమి రా.11.05 వరకు, తదుపరి ఏకాదశి, **నక్షత్రం:** రోహిణి రా.8.33 వరకు, తదుపరి మృగశిర, **వర్జ్యం:** ప.12.59 నుండి 2.27 వరకు, తదుపరి రా.2.10 నుండి 3.46 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.52 నుండి 9.40 వరకు, తదుపరి ప.12.40 నుండి 1.28 వరకు, **అమృత ఘడియలు:** సా.5.33 నుండి 7.04 వరకు; **రాహుకాలం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **యమగండం:** ప.3.00 నుండి 4.30 వరకు, **సూర్యోదయం:** 6.35, **సూర్యాస్తమయం:** 5.53.

పూర్వగిరిలో బ్రహ్మోత్సవాలు నేటి నుంచి

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహ స్వామి పుణ్యక్షేత్రానికి అనుబంధంగా కొనసాగుతున్న శ్రీపూర్వగిరి లక్ష్మీనరసింహస్వామి దేవాలయ వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందుకోసం ఇప్పటికే ఆలయాన్ని రంగులతో తీర్చిదిద్దారు. శ్రీస్వామి వారు ఊరేగే వాహన సేవలను, ఆలయంలో యాగశాలను సైతం సిద్ధం చేశారు. ఈనెల 7వ తేదీ (శుక్రవారం) నుంచి.. ఈ నెల 13వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్నారు. ఈ ఏడు రోజులు మొక్కు పూజలు రద్దు చేస్తున్నట్లు ఈవో భాస్కర్‌రావు వెల్లడించారు. పూర్వగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఈ నెల 3వ తేదీన ప్రారంభమైన అధ్యయనోత్సవాలు శుక్రవారం ముగిశాయి.



పాతగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయం

ఎలక్ట్రిక్ వాహనాలకు రాయితీలు కొనసాగిస్తాం

- ఫ్లిక్స్ బస్ ప్రారంభోత్సవంలో రవాణా మంత్రి పొన్నం



ఫ్లిక్స్ బస్ సర్వీసుల ప్రారంభోత్సవంలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

సాక్షి, హైదరాబాద్: కాలుష్యరహితమైన, పర్యావరణహితమైన రవాణా సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఎలక్ట్రిక్ వాహనాలకు అందజేసే రాయితీలను కొనసాగిస్తామని, ప్రజారవాణా రంగంలో ఎలక్ట్రిక్ వాహనాలకు అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు తెలిపారు. ఫ్లిక్స్ బస్ ఇండియా హైదరాబాద్ నుంచి విజయవాడకు బస్ సర్వీసులను ప్రారంభించనుంది. ఈ మేరకు గురువారం నగరంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఫ్లిక్స్‌బస్, ఈటీవో మోటర్స్ సంస్థలు కలిసి పర్యావరణహిత బస్సులను ప్రారంభించడాన్ని ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. ఈ–బస్సుల విస్తరణకు ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రోత్సాహాన్ని అందజేస్తుందన్నారు. బస్సుల నిర్వహణ, చార్జింగ్ కేంద్రాల ఏర్పాటుపైన ఫ్లిక్స్‌బస్ ఇండియా–ఈటీవో మోటర్స్ సంస్థలు పరస్పరం ఒప్పందం చేసుకున్నాయి.

నేటి నుంచి కాళేశ్వరంలో మహాకుంభాభిషేకం



కాళేశ్వర దేవస్థానం తూర్పు రాజగోపురం పైకి ఏర్పాటు చేసిన మెట్లమార్గం

కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం దేవస్థానంలో మహాకుంభాభిషేకం సంప్రోక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం నుంచి ఆదివారం వరకు నిర్వహించనున్నారు. మూడు రోజులపాటు ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు జరగనున్నాయి. ఈ మేరకు దేవస్థానంలో దేవాదాయశాఖ అన్ని ఏర్పాట్లు చేసింది. ఆలయం, గోపురాల పైకి ఎక్కి కలశాలకు సంప్రోక్షణ జరిపేందుకు పరంజాలతో మెట్ల మార్గం నిర్మించారు. ప్రధాన ఆలయంతోపాటు గోపురాలకు తుని తపోవనం పీఠాధిపతి సచ్చిదానందసరస్వతితో కుంభాభిషేకం నిర్వహించనున్నారు. మూడు రోజులు భక్తులకు ఉచిత ప్రసాదం, అన్నదానం నిర్వహిస్తారని ఈవో మహేశ్ తెలిపారు.

భార్యతో గొడవ పడి.. ఏఆర్ ఎస్సై ఆత్మహత్య



లక్ష్మీనర్సు

గోవిందరావుపేట: ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం పస్రాలో ఏఆర్ ఎస్సై సూర్ణపాక లక్ష్మీనర్సు (36) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటన గురువారం తెల్లవారుజామున 3 గంటలకు జరిగింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు మండలం మాణిక్యరన్ గ్రామానికి చెందిన సూర్ణపాక లక్ష్మీనర్సు సత్తుపల్లిలో తెలంగాణ స్పెషల్ పోలీస్ 15వ బెటాలియన్ ఆర్ఎస్సైగా పనిచేస్తున్నారు. డ్యూటీలో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఏడూళ్లబయ్యారం పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నారు. భార్య వినోద ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా ములుగు జిల్లాలోని మేడారం పాఠశాలలో పనిచేస్తున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. వీరి కుటుంబం పస్రాలో నివాసం ఉంటోంది. సెలవు రోజుల్లో లక్ష్మీనర్సు పస్రాకు వచ్చిపోతుంటారు. ఇటీవల తరచూ భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో బుధవారం రాత్రి కూడా ఇంట్లో ఇద్దరూ గొడవపడ్డారు. దీంతో మనస్తాపానికి గురైన లక్ష్మీనర్సు గురువారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. సమాచారం అందుకున్న పస్రా ఎస్సై అచ్చ కమలాకర్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించారు.

తెలంగాణ కో-ఆపరేటివ్ రూరల్ ఇరిగేషన్ కార్పొరేషన్ లిమిటెడ్

5-10-193, 1వ అంతస్తు, HACA భవన్, పబ్లిక్ గార్డెన్స్ ఎదురుగా, హైదరాబాద్ -500004

NIT: (2/EE/RR/RIC/SDF/2024-25, తేది: 05-02-2025)

SDF 2023-24 & CDP 2022-23 స్కీమ్ క్రింద రంగారెడ్డి జిల్లాలో 8 నం.లు అభివృద్ధి పనుల కొరకు ఇ-టెండరు కోరబడుచున్నది. బిడ్ డౌన్‌లోడ్ **ప్రారంభ తేది మరియు సమయం: 07-02-2025న ఉ.10.00 గం.** నుండి. **బిడ్ దాఖలు ముగింపు తేది మరియు సమయం: 21-02-2025న మ.2.00** గం.వరకు. టెండరు డాక్యుమెంట్లు https://Telangana e-Procurement portalలో లభిస్తాయి. ఏదైనా తదుపరి స్పష్టీకరణ కోసం సంప్రదించండి: శ్రీ కె.గోపాల రావు. ఫోన్ నం.9948021869.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, TGCRIC Ltd., రంగారెడ్డి డివిజన్

DIPR RO No.10025-PP/CL/Advt/1/2024-25, Dt: 06.02.2025

సూపరింటెండింగ్ ఇంజనీర్ కార్యాలయం

తెలంగాణ రాష్ట్ర విద్యా మరియు సంక్షేమ మౌలికసదుపాయాల అభివృద్ధి సంస్థ : హైదరాబాద్

టెండరు ప్రకటన నం.SE/TGEWIDC/HYD/NIT/552 to 558/2024-25, తేది: 05.02.2025

హైదరాబాద్ జిల్లాలో 1) OU క్యాంపస్ వద్ద తుఫాను నీటి కొరకు డ్రెయిన్ నిర్మాణం, 2 నుండి 5) కమాండ్ కంట్రోల్, హీటింగ్ వాల్ మరియు ఆఫీసర్స్ ఛాంబర్ నిర్మాణం, 6) వాటర్ ప్రూఫింగ్ ట్రీట్‌మెంట్, 7) BIEలో స్ట్రీట్ ఏసి (13.00 నుండి 49.00 లక్షలు) కొరకు అర్హతగల కాంట్రాక్టర్ల అందరి నుండి టెండర్లు కోరబడుచున్నవి. ఆన్‌లైన్‌లో బిడ్ దాఖలుకు మరియు స్వీకరణకు చివరి తేది: 13.02.2025న సా.5.00 గం. వరకు. పూర్తి వివరాల కోసం స్వయంగా సంప్రదించండి: సూపరింటెండింగ్ ఇంజనీర్ కార్యాలయం, TGEWIDC, 3వ బ్లాక్, 4వ అంతస్తు, రాజీవ్ విద్యా మిషన్ బిల్డింగ్, SCERT కాంపౌండ్, E-సేవ ఎదురుగా, ఎల్బీ స్టేడియం, హైదరాబాద్, ఫోన్ నం. 040-29565991.

సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, TGEWIDC, హైదరాబాద్

DIPR RO No.10015-PP/CL/Advt/1/2024-25, Dt: 06.02.2025

దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ

ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన(పత్రికా ప్రకటన)

ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారంపై (a) 33KV, 3x400 Sq.mm హీట్ ష్రింకబుల్ ట్రైయిల్ త్రూ జాయింటింగ్ కిట్స్ (b) 220V DC నాన్ డైరెక్షనల్ న్యూమరికల్ 3 O/C+1 E/F రిలేస్ (c) 11 KV లైటెనింగ్ అరెస్టర్స్ (స్టేషన్ టైప్) (d) 33KV 10KA లైటెనింగ్ అరెస్టర్స్ స్టేషన్ టైప్ (e) 33KV 10KA లైటెనింగ్ అరెస్టర్స్ లైన్ టైప్ (f) 12V 42 AH SMF VRLA బ్యాటరీస్ (ఫ్లాట్ పేస్టెడ్) యొక్క సేకరణ కొరకు టెండరు విడుదల చేయుటకు TGSPDCL ఉద్దేశిస్తోంది. పైన తెలిపిన ప్రతి ఐటమ్ తదుపరి వివరాల కోసం www.tgsouthernpower.org, www.tender.telangana.gov.in లను దర్శించండి. ఫోన్ : 040-23431360, 1033, 1035, 1026.

DIPR RO No.10005-PP/CL/Advt/1/2024-25, Dt: 06.02.2025 — సం/-చీఫ్ ఇంజనీర్ (P&MM)

తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర నీటి సరఫరా మరియు మురుగునీటి పారుదల మండలి

చీఫ్ జనరల్ మేనేజర్ (Engg) కార్యాలయం,O&M సర్కిల్ నం.V, సైనిక్‌పురి, సికింద్రాబాద్ -94, తెలంగాణ.

ఇ.-టెండరు ప్రకటన

ఇ-టెండరు ప్రకటన నం. & తేది

212 to 219/CGM(E)/O&MC-V/2024-25, తేది: 06.02.2025

పని పేరు: O&M సర్కిల్-V పరిధిలోని SD-I & SD-II, O&M Dn. XIV క్రింద ఒక సంవత్సర కాలానికి త్రాగునీటి సరఫరా వ్యవస్థ యొక్క వార్షిక నిర్వహణ అనగా త్రాగునీటి లీకేజీలను అరికట్టుట, త్రాగునీటి సరఫరా లైన్లలో కాలుష్యాన్ని, చోకేజీలను నివారించడం, పాడైన పైపుల పునఃస్థాపన మరియు 300 mm dia వరకు స్లూయిస్ వాల్వ్‌ల యొక్క మరమ్మతు & పునఃస్థాపన మరియు సులభతర వ్యవస్థ పనితీరుకు వివిధ త్రాగునీటి సరఫరా ఇబ్బందుల వినతులను పరిష్కరించడం.

అంచనా కాంట్రాక్టు విలువ: రూ.14.89 లక్షలు నుండి రూ.36.82 లక్షలు

(1) టెండరు డాక్యుమెంట్ ఆన్‌లైన్‌లో **తేది 06.02.2025న సా.5.00 గం.** నుండి లభిస్తుంది మరియు టెండర్ల స్వీకరణకు చివరి తేది **13.02.2025.** (2) సంబంధిత చీఫ్ జనరల్ మేనేజర్ (Engg)పేరు మరియు చిరునామా – **చీఫ్ జనరల్ మేనేజర్ (Engg), O&M సర్కిల్–V, HMWSSB, సైనిక్‌పురి, సికింద్రాబాద్ – 500094.** (3) కాంట్రాక్టర్లు/ సంస్థలు సమాచారమును ముఖ్యంగా "ZIP" ఫార్మాట్‌లో అప్‌లోడ్ చేయవలసిందిగా కోరబడుచున్నారు. (4) తదుపరి వివరాలను **https://tender.telangana.gov.in** లో చూడవచ్చును.

సం/- చీఫ్ జనరల్ మేనేజర్ (Engg), O&M సర్కిల్ నం. V, సైనిక్‌పురి, సికింద్రాబాద్, తెలంగాణ.

HEAVY WATER PLANT (MANUGURU)

NOTICE INVITING e-TENDERS

The General Manager, HWP (M), for and on behalf of President of India, invites online item rate bids, in two bid system for the followings work(s).

e-NIT No. : **HWPM/CIVIL/COL/NIT/2024/56 (2nd call)**	
Name of the Work : **Vector control & ATT operations in HWPM colony for the year 2025 - 2027.**	
Estimated Cost : **Rs. 25,35,000/-**	
Period of completion : **24 Months**	
Last time and date of submission of bid : **Up to 18:00 hrs on 15/02/2025.**	

The bid forms and other details can be obtained from the website https://eprocure.gov.in/eprocure/app.

The notice is also available on www.hwb.gov.in

Sd/-
GENERAL MANAGER

सं.No. भाप्सं (म) HWP(M)/ प्रशा (सा) Admn/G/ई-एनआईटी NIT/19/2024/035 Dt.06.02.2025

भारी पानी संयंत्र, मणुगूरु HEAVY WATER PLANT, MANUGURU
ई-निविदा आमंत्रित करने की सूचना Notice Inviting e-Tenders

महाप्रबंधक, भारी पानी संयंत्र, मणुगूरु भारत के राष्ट्रपति के लिए और उनकी ओर से, निम्नलिखित कार्यों के लिए दो बोली प्रणालीयों में ऑनलाइन आइटम दर बोलियां आमंत्रित करता हैं।

The General Manager, HWP (M), for and on behalf of President of India, invites online item rate bids, in two bid system for the followings work(s).

ईएन आईटी नंबर : एचडब्ल्यूपीएम/सिविल/यमपी/एनआईटी/2025/03	
eNIT No. : HWPM/CIVIL/MP/NIT/2025/03	
काम का नाम : भारी पानी संयंत्र मणुगूरु में आरसीसी के साथ मौजूदा सड़क का सुदृढ़ीकरण, एमएस गेट का सुदृढ़ीकरण और Na2So4 गोदाम के सामने बाड़ लगाने का कार्य Name of Work : **Strengthening of existing road with RCC, M.S. Gate strengthening and fencing work in front of Na2So4 Godown at HWPM.**	
अनुमानित लागत Estimated Cost : **Rs. 38,49,000/-**	
पूरा होने की अवधि Period of completion : **06 महीने 06 Months**	
टेंडर दस्तावेजों की उपलब्धता की तिथि Dates of availability of Tender Documents : **From 27-01-2025 at 09-00 Hrs.**	
बोली जमा करने की अंतिम समय और तिथि Last Time and Date of Submission of bid : **Up to 18-00 hrs. on 10-02-2025**	
तकनीकी बोली के ऑनलाइन (भाग ए) खोलने की तिथि और समय Date and Time of online opening of Technical Bid (Part-A) : **On 14-02-2025 at 14-30 hrs.**	

बोली प्रपत्र और अन्य विवरण वेबसाइट : **https://eprocure.gov.in/eprocure/app** से प्राप्त किए जा सकते हैं। नोटिस www.hwb.gov.in पर भी उपलब्ध हैं।

The bid forms and other details can be obtained from the website : https://eprocure.gov.in/eprocure/app.
The notice is also available on www.hwb.gov.in

Sd/-
महाप्रबंधक
GENERAL MANAGER

सं.No. भापासं (म) HWP(M)/ प्रशा (सा) Admn/G/एनआईटी NIT/19/2024/036 Dt.06-02-2025

भारी पानी संयंत्र, मणुगूरु HEAVY WATER PLANT, MANUGURU
ई-निविदा आमंत्रित करने की सूचना Notice Inviting e-Tenders

महाप्रबंधक, भारी पानी संयंत्र, मणुगूरु भारत के राष्ट्रपति के लिए और उनकी ओर से, निम्नलिखित कार्यों के लिए दो बोली प्रणालीयों में ऑनलाइन आइटम दर बोलियां आमंत्रित करता हैं।

The General Manager, HWP (M), for and on behalf of President of India, invites online item rate bids, in two bid system for the followings work(s).

ईएन आईटी नंबर : एचडब्ल्यूपीएम/सिविल/यमपी/एनआईटी/2025/02	
eNIT No. : HWPM/CIVIL/MP/NIT/2025/02	
काम का नाम : वर्ष 2025-2027 के लिए भारी पानी संयंत्र, मणुगूरु में मुख्य क्षेत्र में सड़कों, सड़क पाटों और नालियों की आवधिक सफाई Name of Work : **Periodical cleaning of Roads, road berms and drains in Main Plant area at HWPM for the year 2025-2027**	
अनुमानित लागत Estimated Cost : **Rs. 30,30,000/-**	
पूरा होने की अवधि Period of completion : **24 महीने 24 Months**	
टेंडर दस्तावेजों की उपलब्धता की तिथि Dates of availability of Tender Documents : **From 03-02-2025 at 09-00 Hrs.**	
बोली जमा करने की अंतिम समय और तिथि Last Time and Date of Submission of bid : **Up to 18-00 hrs. on 17-02-2025**	
तकनीकी बोली के ऑनलाइन (भाग ए) खोलने की तिथि और समय Date and Time of online opening of Technical Bid (Part-A) : **On 21-02-2025 at 14-30 hrs.**	

बोली प्रपत्र और अन्य विवरण वेबसाइट : **https://eprocure.gov.in/eprocure/app** से प्राप्त किए जा सकते हैं। नोटिस www.hwb.gov.in पर भी उपलब्ध हैं।

The bid forms and other details can be obtained from the website : https://eprocure.gov.in/eprocure/app.
The notice is also available on www.hwb.gov.in

Sd/-
महाप्रबंधक
GENERAL MANAGER

सं.No. भापासं (म) HWP(M)/ प्रशा (सा) Admn/G/एनआईटी NIT/19/2024/037 Dt.06-02-2025

ట్రంప్‌కు గోల్డెన్ పేజర్

బహూకరించిన ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు



వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు గోల్డెన్ పేజర్ బహుమతిగా ఇచ్చారు. అమెరికాలో పర్యటిస్తున్న నెతన్యాహు మంగళవారం అధ్యక్ష భవనం వైట్‌హౌస్‌లో జరిగిన సమావేశం సందర్భంగా ట్రంప్‌కు ఈ కానుక అందించారు. ఈ సందర్భంగా నెతన్యాహుకు ట్రంప్ కృతజ్ఞతలు తెలిపారు. సెప్టెంబర్‌లో లెబనాన్‌లో హెజ్‌బొల్లా సాయుధ సంస్థ సభ్యులను వేర్వేరు చోట్ల ఒకేసారి వేలాది పేజర్‌లను పేల్చేసి హతమార్చినందుకు గుర్తుగా ఈ బంగారు పేజర్‌ను ట్రంప్‌కు ఇచ్చినట్లు తెలుస్తోంది. బంగారు పేజర్‌ను చూశాక ట్రంప్ సైతం ఆనాడు శత్రుదేశంలో ఇజ్రాయెల్ సాహస దాడి ఆపరేషన్ మెచ్చుకుంటూ '' అది నిజంగా ఒక గొప్ప ఆపరేషన్' అని వ్యాఖ్యానించారు. ట్రంప్ సైతం నెతన్యాహు దంపతుల ఒక ఫొటోను బహూకరించారు. గత ఏడాది సెప్టెంబర్‌లో లెబనాన్‌లో హెజ్‌బొల్లా ఉగ్రవాదులు ఉపయోగించిన వేలాది పేజర్లు పేలాయి. ఆ మరుసటి రోజే వందలాది వాకీటాకీలు పేలాయి. ఈ వరుస ఘటనల్లో మొత్తం 39 మంది హెజ్‌బొల్లా సభ్యులు మరణించగా, దాదాపు 3,000 మంది గాయపడ్డారు. లెబనాన్‌లో పేజర్ పేలుళ్లకు తామే కారణమని దాదాపు రెండు నెలల తర్వాత నెతన్యాహు వ్యాఖ్యానించడం తెల్సిందే. సెప్టెంబర్ 17, 18 తేదీల్లో పేలుళ్లకు కొన్ని నెలల ముందు హెజ్‌బొల్లా ఆర్డర్ చేసిన పేజర్లలో ఇజ్రాయెల్‌కు గూఢచార సంస్థ మొస్సాద్ పేలుడు పదార్థాలను అమర్చినట్లు వెల్లడైంది. ఇజ్రాయెల్‌పై హమాస్ అక్టోబర్ దాడి తరువాత గాజాలో యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి లెబనాన్ సరిహద్దు వెంబడి ఇజ్రాయెల్–హెజ్‌బొల్లా మధ్య పోరు సాగుతోంది. ఈ దాడుల్లో గ్రూప్ మాజీ చీఫ్ హసన్ నస్రుల్లా సహా పలువురు హెజ్‌బొల్లా నేతలు హతమయ్యారు.

2027లో చంద్రయాన్-4

2026లో సముద్రయాన్ ● కేంద్ర మంత్రి జితేంద్రసింగ్ వెల్లడి



న్యూఢిల్లీ: చంద్రుడిపై శిలలను సేకరించి భూమిపైకి తీసుకువచ్చేందుకు ఉద్దేశించిన చంద్రయాన్-4 మిషన్‌ను 2027లో చేపట్టనున్నట్లు కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ మంత్రి జితేంద్ర సింగ్ వెల్లడించారు. మిషన్‌లో భాగంగా రెండు వేర్వేరు ప్రయోగాలుంటాయన్నారు. ఎల్‌వీఎం-3 రాకెట్ ద్వారా ఐదు రకాల సాంకేతిక వస్తు సామాగ్రిని కక్ష్యలోకి పంపి, అక్కడే వాటిని అసెంబుల్ చేయిస్తారని వివరించారు. వచ్చే ఏడాది గగన్‌యాన్ మిషన్‌లో ప్రత్యేకంగా రూపొందించిన అంతరిక్ష నౌకలో ఇద్దరు భారత వ్యోమగాములను దిగువ భూకక్ష్యలోకి పంపి, తిరిగి సురక్షితంగా తీసుకువస్తామని చెప్పారు. ఈ ఏడాదిలో గగన్‌యాన్ మానవరహిత మిషన్‌లో భాగంగా వ్యోమమిత్ర అనే రోబోను అంతరిక్షంలోకి పంపిస్తామన్నారు. దీంతోపాటు, 2026లో సముద్రయాన్‌లో భాగంగా ముగ్గురు శాస్త్రవేత్తలను 6 వేల మీటర్ల లోతులో సముద్రం అడుగు భాగానికి పంపిస్తామని వెల్లడించారు. వీరు సముద్రగర్భంలో వనరులు, కీలక, అరుదైన ఖనిజాల అన్వేషణతోపాటు, సముద్ర జీవజాలంపై పరిశోధనలు జరుపుతారని చెప్పారు. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) 1969లో అవతరించగా మొదటి లాంఛ్ ప్యాడ్ రెండు దశాబ్దాల అనంతరం 1993లో కార్యరూపం దాల్చిందని చెప్పారు. మరో దశాబ్ద కాలం తర్వాత 2004లో రెండో లాంఛ్ ప్యాడ్‌ను నిర్మించామన్నారు. విస్తరణ, మౌలిక వనరుల కల్పన, పెట్టుబడుల విషయంలో ఇస్రో గణనీయమైన ప్రగతి సాధించిందని మంత్రి జితేంద్ర సింగ్ తెలిపారు. భారత అంతరిక్ష ఆర్థిక రంగ ప్రస్తుతం 8 బిలియన్ డాలర్ల స్థాయికి చేరుకుందని వివరించారు. దీనిని వచ్చే పదేళ్లలో 44 బిలియన్ డాలర్లకు తీసుకెళ్లి, ప్రపంచ అంతరిక్ష రంగంలో భారత్ స్థానాన్ని సుస్థిరం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు.



రాజ్యసభలో ప్రసంగిస్తున్న ప్రధాని మోదీ

కాంగ్రెస్ పార్టీకి కుటుంబమే ఫస్టు

కాంగ్రెస్ పాలనలో మెజార్టీ వర్గానికి అన్యాయం

- ఓట్ల కోసం బుజ్జగింపు రాజకీయాలు చేస్తున్నారు
- రాజ్యాంగం అనే పదం కాంగ్రెస్‌కు సరిపోదు
- వారినుంచి 'సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్'ను ఆశించలేం
- అంబేడ్కర్ ఆశయ సాధన కోసం నిరంతరం శ్రమిస్తున్నాం
- రాజ్యసభలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టీకరణ

న్యూఢిల్లీ: 'సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్' అనే స్ఫూర్తితో కేంద్ర ప్రభుత్వం పని చేస్తోందని, ప్రజలందరి సంక్షేమమే తమ ధ్యేయమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ కేవలం ఓట్ల కోసం బుజ్జగింపు రాజకీయాలు చేస్తోందని మండిపడ్డారు. రాజ్యసభలో రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చకు ప్రధాని మోదీ గురువారం సమాధానమిచ్చారు. కాంగ్రెస్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. 'సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్'ను కాంగ్రెస్ నుంచి ఆశిస్తే అది పెద్ద పొరపాటే అవుతుందని అన్నారు. ఆ పార్టీకి కేవలం ఒక్క కుటుంబమే(సోనియా గాంధీ) ముఖ్యమని ఆక్షేపించారు. కాంగ్రెస్ నిర్ణయాలు, విధానాలు ఆ కుటుంబం చుట్టే తిరుగుతుంటాయని విమర్శించారు. బీజేపీకి దేశమే ప్రథమం అయితే కాంగ్రెస్‌కు కుటుంబమే ప్రథమం అని స్పష్టంచేశారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్‌ను కాంగ్రెస్ దశాబ్దాలుగా వ్యతిరేకిస్తోందని పేర్కొన్నారు. గతంలో కాంగ్రెస్ పాలనలో అత్యవసర పరిస్థితి విధించారని, భావ ప్రకటనా స్వేచ్ఛను అణచివేశారని, అప్పట్లో ఎన్నో ఘోరాలు జరిగాయని ప్రస్తావించారు. ఎమర్జెన్సీని తాను ఎప్పటికీ మర్చిపోలేనని వ్యాఖ్యానించారు. రాజ్యాంగం అనే పదం కాంగ్రెస్‌కు సరిపోదని ఎద్దేవా చేశారు. రాజ్యసభలో ప్రధాని మోదీ ఇంకా ఏం మాట్లాడారంటే...

2014 తర్వాత నూతన పరిపాలన

''పేదల అభ్యున్నతి కోసం మా ప్రభుత్వం కృషి చేస్తోంది. మధ్య తరగతి ప్రజలకు అండగా ఉంటున్నాం. దేశానికి స్వాతంత్య్రం వచ్చిన తర్వాత దాదాపు ఆరు దశాబ్దాలపాటు ప్రజలకు ప్రత్యామ్నాయం లేని పరిస్థితి కొనసాగింది. 2014 తర్వాత నూతన పరిపాలనా విధానం అందుబాటులోకి వచ్చింది. ఇది బుజ్జగింపుపై కాదు, ప్రజలందరి సంతుష్టీకరణపై ఆధారపడిన పరిపాలన. ఈ విషయం నేను గర్వంగా చెప్పగలను. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో అన్నింట్లోనూ బుజ్జగింపులకు పెద్దపీట వేశారు. బుజ్జగింపే ఆ పార్టీ రాజకీయ విధానంగా మారింది. మెజార్టీ వర్గానికి అన్యాయం చేస్తూ ఒక చిన్న సమూహానికి మేలు చేసే విధానం పాటించారు. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం తప్పుడు హామీలతో ప్రజలను మభ్యపెట్టారు. మా ప్రభుత్వం వచ్చిన తర్వాత పరిస్థితి మారిపోయింది.

సంతృప్తికర స్థాయిలో పథకాల అమలు

వనరుల గరిష్ఠ వినియోగంపై మేము ప్రత్యేకంగా దృష్టి పెట్టాం. సంతృప్తికర స్థాయిలో పథకాలు అమలు చేస్తున్నాం. పథకాలు 100 శాతం అర్హులకు అందిస్తున్నాం. ఏ ఒక్కరికీ అన్యాయం జరగడానికి వీల్లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఎవరినీ నిస్సహాయ స్థితిలోకి నెట్టేయకూడదన్నదే మా ఉద్దేశం. గత దశాబ్ద కాలంగా ప్రతిస్థాయిలో సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్ స్ఫూర్తిని అమలు చేయడానికి ప్రయత్నిస్తున్నాం. మా కృషి ఫలితాలను ఇప్పుడు చూస్తున్నాం.

కులతత్వాన్ని రెచ్చగొట్టే కుట్రలు

నేడు సమాజంలో కులతత్వాన్ని రెచ్చగొట్టడానికి కొందరు కుట్రలు పన్నుతున్నారు. ప్రజల్లో కుల విద్వేషాలు వ్యాపింపజేసి పబ్బం గడుపుకోవాలన్నదే వారి పన్నాగం. పార్లమెంట్ ఉభయ సభలకు చెందిన ఓబీసీ ఎంపీలు ప్రత్యేక ఓబీసీ కమిషన్ కావాలని మూడు దశాబ్దాలపాటు పోరాటం సాగించారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు నిరాకరించాయి. మేము అధికారంలోకి వచ్చాక ఓబీసీ కమిషన్‌కు రాజ్యాంగబద్ధత కల్పించాం. దేశంలో జనం మధ్య విభజన సృష్టించానికి కొందరు రిజర్వేషన్లపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు(ఈడబ్ల్యూఎస్) 10 శాతం రిజర్వేషన్ కల్పించాం. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాలు ఈ నిర్ణయాన్ని స్వాగతించాయి. ఎవరికీ ఏ సమస్యా లేదు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లతో ఎవరికీ అన్యాయం జరగలేదు. అధికారంలో ఉన్నప్పుడు అంబేడ్కర్‌కు భారతరత్న పురస్కారం ఇవ్వని కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతం 'జైభీమ్' అని నినదిస్తోంది. అంబేడ్కర్‌ను కాంగ్రెస్ రెండుసార్లు ఎన్నికల్లో ఓడించింది. దళితులు, గిరిజనులు, వెనుకబడిన తరగతులు ఆర్థిక సాధికారత సాధించాలని అంబేడ్కర్ కోరుకున్నారు. అంబేడ్కర్ ఆశయ సాధన కోసం ఎన్నో పథకాలు తీసు కొచ్చాం. ఆయన కలలు సాకారం చేయాలన్నదే మా లక్ష్యం. అందుకోసం ఎంతగానో శ్రమిస్తున్నాం. మా ప్రభుత్వం చేపట్టిన చర్యలతో 25 కోట్ల మంది ప్రజలు పేదరికం నుంచి బయటపడ్డారు.

లైసెన్స్‌రాజ్/పర్మిట్‌రాజ్‌తో నిలిచిన అభివృద్ధి

దేశానికి స్వాతంత్య్రం వచ్చిన వెంటనే సంవిధాన్ సభ నిర్ణయాలను కాంగ్రెస్ వ్యతిరేకించింది. ప్రభుత్వం ఎన్నిక కాకముందే రాజ్యాంగంలో సవరణ చేసింది. కాంగ్రెస్ పాలనలో అమల్లో ఉన్న లైసెన్స్‌రాజ్/పర్మిట్‌రాజ్‌తో అభివృద్ధి నిలిచిపోయింది. కొత్త టెక్నాలజీ కోసం ప్రజలు ఎన్నో ఏళ్లు ఎదురుచూడాల్సి వచ్చింది. ప్రఖ్యాత కవులు మజ్రూ సుల్తాన్‌పురి, నటుడు బల్‌రాజ్ సాహ్నీని నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్నందుకు కాంగ్రెస్ ప్రభుత్వాలు అరెస్టు చేశాయి. వినాయక్ దామోదర్ సావర్కర్‌కు అంకితమిస్తూ పాట పాడినందుకు లతా మంగేష్కర్ సోదరుడు హృదయ్‌నాథ్ మంగేష్కర్‌ను ఆలిండియా రేడియో నుంచి బహిష్కరించారు. ఎమర్జెన్సీకి మద్దతుగా మాట్లాడనందుకు దూరదర్శన్‌లో దేవానంద్ సినిమాలపై నిషేధం విధించారు. కాంగ్రెస్‌పై పాట పాడేందుకు నిరాకరించినందుకు కిశోర్ కుమార్ పాటలను నిషేధించారు. ఎమర్జెన్సీ సమయంలో జార్జి ఫెర్నాండెజ్ లాంటి నాయకులకు సంకెళ్లు వేశారు'' అని ప్రధాని మోదీ కాంగ్రెస్‌పై నిప్పులు చెరిగారు.

మార్చి 7 నుంచి హెచ్–1బీ వీసా రిజిస్ట్రేషన్లు

- ఈ ఏడాది నుంచి భారీ దరఖాస్తు ఫీజు వసూలు
- 10 డాలర్ల నుంచి ఏకంగా 215 డాలర్లకు పెంచేసిన అమెరికా

న్యూఢిల్లీ: అమెరికాలో ఉద్యోగాలు చేయబోయే వాళ్లకు మంజూరుచేసే హెచ్–1బీ వీసాలకు సంబంధించిన దరఖాస్తు ప్రక్రియ ఈ సంవత్సరం మార్చి ఏడో తేదీన మొదలుకానుంది. అయితే భారీగా పెరిగిన వీసా దరఖాస్తు ఫీజులను ఈ సంవత్సరం నుంచే అమెరికా ప్రభుత్వం అమలుచేయనుంది. దరఖాస్తు రుసుమును విపరీతంగా పెంచేస్తున్నట్లు నాటి బైడెన్ సర్కార్ గతంలో ప్రకటించడం తెల్సిందే. ఇన్నాళ్లూ దరఖాస్తు రుసుముగా కేవలం 10 డాలర్లు చెల్లించగా ఇకమీద ఈ సంవత్సరం నుంచి ఒక్కో అప్లికేషన్‌కు ఏకంగా 215 డాలర్లు చెల్లించాల్సి ఉంటుంది. రిజిస్ట్రేషన్ ప్రక్రియ మార్చి 24వ తేదీన ముగియనుంది. ఎలాగైనా వీసా పొందాలనే ఉద్దేశ్యంతో చిన్న చిన్న తేడాలతో ఒకే పేరు మీదా చాలా దరఖాస్తులు వస్తుండటంతో వాటికి చెక్ పెట్టే ఉద్దేశ్యంతో వీసా దరఖాస్తు ఫీజును ఉద్దేశపూర్వకంగా భారీగా పెంచుతున్నట్లు నాటి బైడెన్ సర్కార్ గతంలో ప్రకటించింది. గతంలో ఒక్కో దరఖాస్తును ఖచ్చితంగా పరిశీలించేవారు. కానీ గత సంవత్సరం నుంచి ఎంపిక పద్ధతిని మార్చేశారు. ఒకే వ్యక్తి పేరిట చిన్న చిన్న మార్పులతో ఎక్కువ దరఖాస్తులు వస్తే వాటన్నింటినీ అతని పాస్‌పోర్ట్ నంబర్ ఆధారంగా వడగట్టి ఒకే ఒక్క దరఖాస్తును పరిశీలించి మిగతావాటిని పక్కనపడేస్తారు. ఇలాంటి ఒకే అభ్యర్థికి సంబంధించిన పలు దరఖాస్తుల పరిశీలనతో యూఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీసెస్ విభాగంపై పనిభారం తగ్గి వేగంగా దరఖాస్తుల పరిశీలన సాధ్యమవుతుందని ప్రభుత్వం పేర్కొంది. ఏటా అర్హులైన అభ్యర్థుల నుంచి లాటరీ తీసి కేవలం 65,000 మందికే హెచ్–1బీ వీసాలను జారీచేస్తారు. మాస్టర్స్, పీహెచ్‌డీ వంటి ఉన్నత విద్య కోసం అమెరికా వచ్చే వాళ్ల కోసం మరో 20,000 వీసాలను అందజేస్తారు.

13 ఏళ్ల విద్యార్థినిపై టీచర్ల గ్యాంగ్‌రేప్

- ముగ్గురు ప్రభుత్వ టీచర్ల అకృత్యం
- తమిళనాడులోని దారుణం
- టీచర్ల అరెస్ట్
- వెల్లువెత్తుతున్న నిరసనలు

కృష్ణగిరి(తమిళనాడు): విద్యాబుద్ధులు నేర్పాల్సిన గురువులు కామవాంఛతో మృగాళ్లుగా మారిన దారుణోదంతం తమిళనాడులో జరిగింది. కృష్ణగిరి జిల్లాలోని బార్గూర్ పట్టణ సమీప పంచాయతీ మాధ్యమిక పాఠశాలలో చదువుకుంటున్న 13 ఏళ్ల విద్యార్థినిపై అదే పాఠశాలలోని ముగ్గురు ఉపాధ్యాయులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. గ్యాంగ్‌రేప్ ఆరోపణలపై ఆ ముగ్గురు ప్రభుత్వ టీచర్లను పోక్సో చట్టం కింద పోలీసులు అరెస్ట్‌చేశారు. కొన్ని వారాల క్రితం జరిగిన ఈ సామూహిక అత్యాచార ఘటన చాలా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విషయం తెల్సిన వెంటనే బంధువులు, స్థానికులు బుధవారం ఆందోళనకు దిగారు. దీంతో పోలీసులు, విద్యాశాఖ అధికారులు, జిల్లా యంత్రాంగం రంగంలోకి దిగి ఆందోళనకారులతో చర్చలు జరిపి నిరసన ఉధృతంకాకుండా అడ్డుకోగలిగారు. ముగ్గురు టీచర్లను సస్పెండ్‌చేసి పాఠశాల విద్యా శాఖ ఈ ఘటనపై దర్యాప్తునకు ఆదేశించింది. ఘటనపై విపక్ష అన్నాడీఎంకే వెంటనే ఎంకే స్టాలిన్ సారథ్యంలోని డీఎంకే సర్కార్‌పై విమర్శలు గుప్పించింది. ఇంతటి దారుణ ఘటనపై కనీస బాధ్యతగా సీఎం వెంటనే క్షమాపణలు చెప్పాలని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి కె.పళనిస్వామి డిమాండ్‌చేశారు.

గైర్హాజరుపై ఆరా తీయగా..

కొన్ని వారాల క్రితం ఈ దారుణం జరగ్గా అప్పట్నుంచీ అమ్మాయి స్కూల్‌కు రావడం మానేసింది. చాలా రోజుల విద్యార్థిని గైర్హాజరు అవుతుండటంతో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఇంకో టీచర్ ఫిబ్రవరి మూడోతేదీన బాధితురాలి ఇంటికొచ్చి ఆరాతీశారు. దీంతో బాధితురాలి తల్లిదండ్రులు అసలు విషయం చెప్పారు. తొలుత ఒక టీచర్ అత్యాచారం చేయగా కొన్ని రోజుల తర్వాత ఈ విషయం తెల్సి మరో ఇద్దరు టీచర్లు కూడా కలిసి ఒకేసారి గ్యాంగ్‌రేప్ చేశారని తల్లి వాపోయింది. పాఠశాల మరుగుదొడ్లోకి బలవంతంగా తీసుకెళ్లి ఈ అఘాయిత్యానికి పాల్పడ్డారని తల్లి చెప్పింది. దీంతో తల్లితో వెంటనే బార్గూర్ మహిళా పోలీస్ స్టేషన్‌లో స్కూల్‌హెడ్‌మాస్టర్ ఫిర్యాదు చేయించారు. విషయం తెల్సుకున్న కృష్ణగిరి జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ విభాగం బాధితురాలిని ప్రభుత్వ కృష్ణగిరి బోధనాస్పత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తున్నారు. షాక్ నుంచి తేరుకోని బాధితురాలికి కౌన్సెలింగ్ ఇప్పిస్తున్నారు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు పోక్సో చట్టంలోని పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి ఆ ముగ్గురు టీచర్లను అరెస్ట్ చేశారు.

అవమానించినా మొద్దునిద్రేనా?

- భారతీయులకు సంకెళ్లు వేయడంపై పార్లమెంట్‌లో విపక్షాల ఆగ్రహం
- నరేంద్ర మోదీ ప్రభుత్వం వెంటనే సమాధానం చెప్పాలని డిమాండ్
- ప్రతిపక్ష సభ్యుల ఆందోళనలతో అట్టుడికిన ఉభయ సభలు



నిరసన తెలుపుతున్న శశి థరూర్, ప్రణతీ షిండే, మహువా మొయిత్రా తదితరులు

న్యూఢిల్లీ: అమెరికాలోని భారతీయ అక్రమ వలసదార్లకు బేడీలు వేసి స్వదేశానికి తరలించిన ఘటనపై గురువారం పార్లమెంట్ ఉభయ సభలు అట్టుడికిపోయాయి. భారతీయులను అమెరికా ప్రభుత్వం ఘోరంగా అవమానించినా కేంద్ర ప్రభుత్వంలో చలనం లేదని విపక్ష సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉభయ సభల్లో ఆందోళనకు దిగారు. మోదీ సర్కారు వెంటనే సమాధానం చెప్పాలని నిలదీశారు. లోక్‌సభలో వెల్‌లోకి దూసుకొచ్చి బిగ్గరగా నినాదాలు చేశారు. శాంతించాలని స్పీకర్ కోరినా వారు వినిపించుకోలేదు. దీంతో సభను నాలుగుసార్లు వేయాల్సి వచ్చింది. షెడ్యూల్ ప్రకారం లోక్‌సభలో కేంద్ర బడ్జెట్‌పై చర్చించాల్సి ఉంది. కానీ, భారతీయులకు జరిగిన అవమానంపై చర్చించడానికి వాయిదా తీర్మానాన్ని కోరుతూ కాంగ్రెస్ సభ్యుడు గౌరవ్ గొగోయ్‌తోపాటు పలువురు విపక్ష ఎంపీలు నోటీసులు ఇచ్చారు. సభాపతి అంగీకరించకపోవడంతో వారు ఆందోళనకు దిగారు. మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఇంత అవమానం జరుగుతున్నా సర్కారు మొద్దు నిద్ర వీడడం లేదని దుయ్యబట్టారు. సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. సభ నాలుగు సార్లు వాయిదా పడిన పరిస్థితిలో మార్పు రాలేదు. సాయంత్రం విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ లోక్‌సభలో ఒక ప్రకటన చదివి వినిపించారు. స్వదేశానికి తరలించే భారతీయులను అవమానించకుండా అమెరికా అధికారులతో చర్చిస్తున్నామని చెప్పారు. జైశంకర్ ప్రకటన తర్వాత కూడా విపక్షాల నిరసన కొనసాగింది. సభను శుక్రవారానికి వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. రాజ్యసభలోనూ విపక్షాలు ఆందోళనకు దిగాయి. మనవాళ్ల పట్ల అమెరికా అధికారులు అమర్యాదకరంగా ప్రవర్తిస్తే మోదీ సర్కారు ఎందుకు పట్టించుకోవడం లేదని విపక్ష సభ్యులు ధ్వజమెత్తారు.

పార్లమెంట్ ప్రాంగణంలో నిరసన

పార్లమెంట్ సమావేశాల ప్రారంభం కంటే ముందు ప్రతిపక్ష సభ్యులు పార్లమెంట్ ప్రాంగణంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. కాంగ్రెస్ సభ్యులు మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీ, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్‌తోపాటు పలువురు విపక్ష ఎంపీలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కొందరు ఎంపీలు చేతులకు సంకెళ్లు ధరించారు. 'ఖైదీలు కాదు... మనుషులు' అని రాసి ఉన్న ప్లకార్డులు ప్రదర్శించారు. భారత్‌ను, భారతీయులను అవమానిస్తే సహించబోమని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలతో హోరెత్తించారు.

గౌరవ మర్యాదలతో వెనక్కి తీసుకురాలేరా?

అమెరికా నుంచి భారతీయుల తరలింపుపై మోదీ ప్రభుత్వం సమగ్రమైన ప్రకటన చేయాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే 'ఎక్స్'లో డిమాండ్ చేశారు. భారతీయులను గౌరవ మర్యాదలతో వెనక్కి తీసుకురావడానికి మన విమానాలు ఎందుకు పంపించలేదని ప్రశ్నించారు. ఆవేదన వెల్లడిస్తున్న భారతీయ వలసదారుడి వీడియోను కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ 'ఎక్స్'లో పోస్టు చేశారు. ఈ బాధితుడి ఆవేదన వినాలని ప్రధాని మోదీకి సూచించారు. భారతీయులకు కావాల్సింది గౌరవం, మానవత్వం తప్ప సంకెళ్లు కాదని తేల్చిచెప్పారు. ప్రధానమంత్రి మోదీ ఇప్పటికైనా నోరు విప్పాలని ప్రియాంక అన్నారు. మనవాళ్లను మనం ఎందుకు తీసుకురాలేకపోయామని అన్నారు మోదీ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మధ్య మంచి స్నేహం ఉన్నప్పటికీ భారతీయులకు ఈ పరిస్థితి ఎందుకు వచ్చిందో చెప్పాలని నిలదీశారు. మన దేశం నుంచి ఎవరినైనా పంపించాల్సి వస్తే ఇలాగే బేడీలు వేసి పంపిస్తారా? అని ప్రశ్నించారు. సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్, శివసేన (ఉద్ధవ్) ఎంపీ ప్రియాంక చతుర్వేది, కాంగ్రెస్ ఎంపీలు గౌరవ్ గొగోయ్, శశి థరూర్, తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ కీర్తి ఆజాద్ తదితరులు మోదీ ప్రభుత్వ తీరును తప్పుపట్టారు.

సంకెళ్లు వేయడం మామూలే

- నియమావళిలో అది భాగమే
- అమెరికా నుంచి అక్రమ వలసదార్ల తరలింపు కొత్తేమీ కాదు
- విదేశాంగ మంత్రి జైశంకర్ వెల్లడి

న్యూఢిల్లీ: అక్రమ వలసదార్లకు సంకెళ్లు వేసి, స్వదేశాలకు తరలించడం సాధారణ విషయమని, దీనిపై రాద్ధాంతం అవసరం లేదని విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ స్పష్టంచేశారు. అమెరికా నుంచి అక్రమ వలసదార్ల తరలింపు కొత్తేమీ కాదని, కొన్నేళ్లుగా కొనసాగుతూనే ఉందని తెలిపారు. భారతీయుల తరలింపు విషయంలో అమెరికా అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నామని పేర్కొన్నారు. భారతీయులను అవమానించవద్దని, గౌరవంగా చూడాలని కోరామని అన్నారు. అమెరికాలో అక్రమంగా నివసిస్తున్న 104 మంది భారతీయులను బుధవారం సైనిక విమానంలో స్వదేశానికి తరలించిన విషయం తెలిసిందే. అమెరికా అధికారులు వారికి సంకెళ్లు వేసి అమానవీయంగా ప్రవర్తించారని, అయినా మోదీ ప్రభుత్వం స్పందించడం లేదని ఆరోపిస్తూ ప్రతిపక్షాలు గురువారం రాజ్యసభలో ఆందోళనకు దిగాయి. ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తంచేశాయి. దీంతో సభలో జైశంకర్ ప్రకటన చేశారు. విదేశాల్లోకి వలసదార్లను అక్రమంగా చెరవేసే ముఠాలపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అదే సమయంలో చట్టబద్ధంగా వెళ్లేవారికి సులభంగా వీసాలు వచ్చే విధానం ఉండాలన్నారు. తమ పౌరులు విదేశాల్లో అక్రమంగా ఉంటున్నట్లు తేలితే వారిని వెనక్కి తీసుకెళ్లాల్సిన బాధ్యత అన్ని దేశాలపైనా ఉందన్నారు. ఈ విషయంలో స్పష్టమైన నియమ నిబంధనలు ఉన్నాయని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలకూ వర్తిస్తాయని పేర్కొన్నారు.



అక్రమ వలసదార్ల ఆస్తులపై త్వరలో నిర్ణయం

విమానాల్లో అక్రమ వలసదార్ల తరలింపు విషయంలో ప్రామాణిక నియామవళి(ఎస్‌ఓపీ) అమల్లో ఉందని మంత్రి జైశంకర్ చెప్పారు. అక్రమ వలసదార్లను వారి స్వదేశాలకు తరలిస్తున్నప్పుడు సంకెళ్లు వేయడం నిబంధనల్లో భాగమేనని స్పష్టంచేశారు. అమెరికాలో 2012 నుంచి ఇది అమలవుతోందన్నారు. అయితే, మహిళలకు, చిన్నారులకు సంకెళ్లు వేయడానికి వీల్లేదని వివరించారు. తరలిస్తున్న సమయంలో అక్రమ వలసదార్లకు ఆహారం, ఇతర వసతులు కల్పించాల్సి ఉంటుందన్నారు. అవసరమైతే వైద్యం అందించాలన్నారు. టాయిలెట్‌కు వెళ్లినప్పుడు సంకెళ్లు తాత్కాలికంగా తొలగించాలని చెప్పారు. సాధారణ పౌర విమానంతోపాటు సైనిక విమానంలోనూ ఈ నిబంధనలు పాటించాలని తెలియజేశారు. స్వదేశానికి చేరుకున్న కొందరు భారతీయ అక్రమ వలసదార్లకు అమెరికాలో ఆస్తులున్నాయని, వాటి సమాచారం సేకరిస్తున్నామని జైశంకర్ పేర్కొన్నారు. ఆ ఆస్తులను ఏం చేయాలన్న దానిపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. అమెరికా ప్రభుత్వం 2009లో 734 మంది, 2019లో 2,042 మంది, 2024లో 1,368 మంది భారతీయులను వెనక్కి పంపించిందని జైశంకర్ వెల్లడించారు.

కరిగిపోయిన అమెరికా కల

- లక్షలు అప్పు చేసి ఏజెంట్లకు చెల్లింపులు
- ప్రాణాలను పణంగా పెట్టి ప్రయాణాలు
- చివరకు దొరికి సంకెళ్లతో స్వదేశానికి..
- భారతీయ అక్రమ వలసదారుల వెతలు

చండీగఢ్/హోషియార్‌పూర్(పంజాబ్): ప్రమాదకర రీతిలో సముద్రంలో పడవ ప్రయాణం, ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకుని కిలోమీటర్ల కొద్దీ నడక, మెక్సికో సరిహద్దులోని చీకటి గదుల్లో బస.. ఇలా చెప్పుకుంటూ పోతే అమెరికాకు ఎలాగైనా చేరుకునేందుకు భారతీయ అక్రమ వలసదారుల పడిన కష్టాలెన్నో. రహస్యంగా సరిహద్దు దాటించే ఏజెంట్లకు అప్పు చేసి మరీ డబ్బులు కట్టి అమెరికాకు ఎలాగోలా చేరుకుంటే తిరిగి పోలీసులకు దొరికిపోయి సంకెళ్లతో స్వదేశానికి వచ్చిన కొందరు అక్రమ వలసదారులు తమ కన్నీటి కష్టాలను మీడియా ముందు వెళ్లబోసుకున్నారు. తమ అమెరికా కల ఎలా చెదిరిపోయిందో వివరించారు. తీవ్రమైన నేరస్తుల్లా చేతులకు, కాళ్లకు బేడీలు వేసి సైనిక విమానంలో అమెరికా భారత్‌కు పంపింది. ఒకే ఒక టాయిలెట్ ఉన్న సైనిక విమానంలో వందమందికి పైగా అక్రమ వలసదారులను కుక్కి ఏకంగా 24 గంటల పాటు ప్రయాణం చేసి రావడం ఒక ఎత్తయితే అసలు తాము వచ్చేది స్వదేశానికి అన్న విషయం అమృత్‌సర్ విమానాశ్రయంలో అడుగుపెట్టేదాకా వారికి తెలియకపోవడం మరో విషాదం.

అమెరికా నుంచి అమృత్‌సర్‌కు చేరుకున్న సైనిక విమానంలో 105 మంది వలసదారులన్నారు. వీరిలో హరియాణా రాష్ట్రానికి చెందిన వాళ్లు 33 మంది ఉన్నారు. గుజరాత్(33), పంజాబ్(30), మహారాష్ట్ర(3), ఉత్తరప్రదేశ్(3), చండీగఢ్(2) రాష్ట్రాల వాళ్లూ ఉన్నారు. అమెరికా తిరిగి పంపిన వారిలో 19 మంది మహిళలు, నాలుగేళ్ల బాలుడు, ఐదేళ్ల, ఏడేళ్ల వయసున్న బాలికలున్నారు. ఇక్కడికొచ్చాక భారత అధికారులు పోలీసు వాహనాల్లో ఈ వలసదారులను స్వస్థలాలకు తరలించారు. వీరిలో ఒకొక్కరిదీ ఒక్కో గాథ. అందరిదే ఒకటే వ్యథ.

చీకటి గదిలో ఉంచారు

''నన్ను డంకీ మార్గం గుండా తీసుకెళ్లారు. మేం వెళ్తుండగా మార్గమధ్యంలో రూ.35 వేల విలువైన దుస్తులు చోరీ అయ్యాయి. మమ్మల్ని మొదట ఇటలీకి, ఆ తర్వాత లాటిన్ అమెరికాకు తీసుకెళ్లారు. 15 గంటల పాటు పడవ ప్రయాణం. తర్వాత దాదాపు 45 కిలో మీటర్లు నడిచాం. దాదాపు 18 కొండలు దాటాం. అంతెత్తు నుంచి జారిపడ్డామంటే బతికే అవకాశమే లేదు. మార్గమధ్యంలో కొన్ని మృతదేహాలను కూడా చూశాం. అమెరికాలోకి ప్రవేశించడానికి సరిహద్దు దాటకముందే మెక్సికోలో నన్ను అరెస్ట్ చేశారు. 14 రోజుల పాటు చీకటి గదిలో ఉంచారు. వేలాది మంది పంజాబీలు, వాళ్ల కుటుంబాలు, వాళ్ల పిల్లలు ఇలాంటి దుర్భర పరిస్థితుల్లో బతుకీడుస్తున్నారు. మేం వెళ్లి ఎన్నో కష్టాలు పడ్డాం. ఇంకెవరూ ఇలా తప్పుడు మార్గాల్లో విదేశాలకు వెళ్లడానికి ప్రయత్నించకండి'' అని పంజాబ్‌లోని జలంధర్ జిల్లా దారాపూర్ గ్రామానికి చెందిన సుఖ్‌పాల్ సింగ్ సలహా ఇచ్చారు. కపుర్తలాలోని తర్ఫ్ బెహ్బల్ బహదూర్ గ్రామానికి చెందిన గుర్‌ప్రీత్ సింగ్‌ను అతని కుటుంబం ఇంటిని తాకట్టు పెట్టి అప్పు చేసి మరీ అమెరికాకు పంపింది. ఫతేగఢ్ సాహిబ్‌లో జస్వీందర్ సింగ్‌ను విదేశాలకు పంపేందుకు అతని కుటుంబం రూ.50 లక్షలు అప్పు చేసింది. పంజాబ్‌లో ఎన్‌ఆర్‌ఐలు ఎక్కువగా ఉండే జలంధర్, హోషియార్‌పూర్, కపుర్తలా, నవాన్‌షహర్ జిల్లాల్లో ప్రతి గ్రామంలోనూ ఇలాంటి కథలే ఎప్పుడూ వినిపిస్తుంటాయి. ఇక్కడి నుంచి ఏటా పెద్ద సంఖ్యలో స్థానికులు డాలర్లవేటలో పడి విదేశాలకు అక్రమ మార్గాల్లో వలసలు వెళ్తున్నారు. ఉజ్వల భవిష్యత్తును ఆశిస్తూ అమెరికా వెళ్తున్నారు. ఏజెంట్ల చేతుల్లో మోసపోతున్నారు. ఏజెంట్లపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సంకెళ్లతో ప్రయాణం

''చట్టబద్ధంగానే అమెరికా పంపిస్తానని చెప్పి ట్రావెల్ ఏజెంట్ మోసం చేశాడు. అందుకు రూ.30 లక్షలు తీసుకున్నాడు. గతేడాది జూలైలో విమానంలో బ్రెజిల్‌కు వెళ్లాను. అక్కడి నుంచి అమెరికాకు కూడా విమానంలోనే పంపిస్తామని చెప్పారు. కానీ అందుకు భిన్నంగా జరిగింది. ఆరు నెలలపాటు బ్రెజిల్‌లో ఉన్న తరువాత.. అక్రమంగా సరిహద్దు దాటించి పంపేందుకు ప్రయత్నించారు. అమెరికా బోర్డర్ పెట్రోలింగ్ పోలీసులు అరెస్టు చేశారు. అక్కడ 11 రోజుల పాటు కస్టడీలో ఉంచి ఆ తర్వాత ఇంటికి పంపించారు. భారత్‌కు పంపించేస్తున్నట్లు నాకు తెలియదు. ఏదో క్యాంప్‌కు తీసుకెళ్తున్నారని అనుకున్నాం. అమృత్‌సర్ విమానాశ్రయం వచ్చాక సంకెళ్లను తీసేశారు. బహిష్కరణతో కుంగిపోయా. అమెరికా వెళ్లడానికి అప్పు చేశాను. కుటుంబానికి మంచి భవిష్యత్ ఇవ్వా లని కలలు కన్నా. ఇప్పుడవన్నీ చెదిరిపోయాయి'' అని గురుదాస్ పూర్ జిల్లాలోని హర్‌దోర్వాల్ గ్రామానికి చెందిన జస్పాల్ వాపోయారు.

సముద్రంలో, అడవిలో ప్రాణాలు పోయాయి

''గత ఏడాది ఆగస్టులో అమెరికా వెళ్లా. తొలుత యూరప్‌కు, ఆ తర్వాత మెక్సికోకు తీసుకెళ్తామని ట్రావెల్ ఏజెంట్ హామీ ఇచ్చాడు. రూ.42 లక్షలు చెల్లించాను. కానీ ఖతార్, బ్రెజిల్, పెరూ, కొలంబియా, పనామా, నికరాగ్వా, ఆ తర్వాత మెక్సికో దేశాల గుండా తీసుకెళ్లారు. పర్వత మార్గం గుండా నడుచుకుంటూ వెళ్లాం. మెక్సికో సరిహద్దు వైపు లోతైన సముద్రంలోకి ఒక చిన్న పడవలో పంపారు. నాలుగు గంటల సముద్ర ప్రయాణం. మా పడవ బోల్తా పడింది. మాతో వచ్చిన వలసదారుల్లో ఒకరు నీటిలో పడి జలసమాధి అయ్యారు. మరొకరు పనామా అడవి గుండా వెళ్తుండగా ప్రాణాలు కోల్పోయారు. నేను మాత్రం ప్రాణాలతో బయటపడ్డా. దారిలో కొన్నిసార్లే అన్నం దొరికేది. మంచి భవిష్యత్తుపై ఆశతో అధిక వడ్డీకి అప్పు చేసి ఏజెంట్‌కు చెల్లించాం. కానీ ఏజెంట్ మమ్మల్ని మోసం చేశారు. అమెరికా బహిష్కరించడంతో చివరకు భారీ అప్పుతో సొంతూరుకు వచ్చిపడ్డాం'' అని హోషియార్ పూర్ జిల్లాలోని తహ్లీ గ్రామవాసి హర్వీందర్ సింగ్ ఆవేదన వ్యక్తంచేశారు.

సాక్షి హైదరాబాద్

శుక్రవారం । 7 । ఫిబ్రవరి । 2025



ఇంట్లోకి చొరబడి..

ఇంట్లోకి చొరబడిన గుర్తుతెలియని వ్యక్తులు తల్లి కొడుకుపై కత్తులతో దాడి చేసిన ఘటన గురువారం చిలకలగూడ ఠాణా పరిధిలోని మెట్టుగూడలో చోటుచేసుకుంది. -8లో



విందు.. పసందు..

విభిన్న సంస్కృతుల సమ్మేళనం, విభిన్న రుచుల సంగమం హైదరాబాద్.. వారసత్వం పేర్చిన ఈ ఆహార సంస్కృతిలో దేశవ్యాప్త రుచులనూ నగరవాసులు ఆస్వాదిస్తున్నారు. - సిటీప్లస్‌లో

గరిష్టం/కనిష్టం
34.0/19.0

వాతావరణం

నగరంలో శుక్రవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉదయం వేళ పొగమంచు ఉండే అవకాశముంది. గరిష్టంగా 34, కనిష్టంగా 19 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

మెట్రో పచ్చదనానికి అవార్డుల పంట

సాక్షి, సిటీబ్యూరో: మెట్రో స్టేషన్లు, పరిసరాల్లో పచ్చదనం విస్తరణకు అవార్డుల పంట పండింది. ల్యాండ్‌స్కేప్ గార్డెనింగ్‌లో ఏకంగా 8 గోల్డ్ అవార్డులు లభించాయి. ఇటీవల ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో పబ్లిక్ గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉద్యాన శాఖ డైరెక్టర్ షేక్ యాస్మిన్ బాషా అవార్డులను అందజేశారు. నగరంలోని మెట్రో స్టేషన్లు, ప్రాంగణాల్లో పచ్చదనాన్ని పెంపొందించి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఏర్పాటు చేసేందుకు తాము చేపట్టిన చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయని హెచ్ఎంఆర్ఎల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గత ఆరేళ్లుగా మెట్రో పచ్చదనానికి అవార్డులు లభించడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. సంస్థ ఉద్యాన అధికారులు, సిబ్బంది సేవలను ఆయన అభినందించారు.

చెత్త సేకరణ ఆటోలకు ఆర్టీఏ బ్రేకులు

పన్ను చెల్లించలేదంటూ జరిమానాలు
వాహనాలను నిలిపివేసిన డ్రైవర్లు



మూలకుపడిన చెత్త సేకరణ ఆటో

కూకట్‌పల్లి: జీహెచ్ఎంసీ చెత్త రవాణా ఆటోలకు ఆర్టీఏ బ్రేకులు వేసింది. బల్దియా పరిధిలోని ఇళ్లలోంచి చెత్తను సేకరించి తరలించేందుకు ఏర్పాటు చేసిన స్వచ్ఛ ఆటోల సమయం గడిచిపోయిందని, రవాణా పన్ను చెల్లించలేదని ఒక్కో ఆటోకు రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు అధికారులు జరిమానా విధిస్తున్నారు. దీంతో డ్రైవర్లు రోడ్డు పన్ను చెల్లించలేమని చెత్త తరలింపును నిలిపివేశారు. మూడు రోజులుగా కూకట్‌పల్లిలో కొన్ని కాలనీల్లో చెత్తను తీసుకువెళ్లటం లేదు. ఆటోల్లోని చెత్త సైతం వాటిలోనే ఉండిపోయింది. కాగా.. కూకట్‌పల్లి పరిధిలో ఆర్టీఏ అధికారులు ఇప్పటికే 5 చెత్త రవాణా ఆటోలను సీజ్ చేశారు. మిగిలిన వాటినీ సీజ్ చేస్తారేమోననే భయంతో డ్రైవర్లు అప్రమత్తమై కాలనీ అసోసియేషన్ల వద్ద మొర పెట్టుకుంటున్నారు. జీహెచ్ఎంసీ పరిధిలోని 30 సర్కిళ్లలోనూ ఇదే పరిస్థితి నెలకొన్నట్లు సమాచారం.

వేధింపుల ప్రిన్సిపాల్‌పై పోక్సో కేసు

ఇబ్రహీంపట్నం: విద్యాబుద్ధులు నేర్పించాల్సిన గురువే ఓ విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకున్న ఈ ఘటన గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఇబ్రహీంపట్నంలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న బాలికపై ప్రిన్సిపాల్ లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. ఈ విషయాన్ని సదరు బాలిక తల్లికి చెప్పడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నట్లు ఏసీపీ కేపీవీ రాజు తెలిపారు.

కవితా ధారలతో ప్రజల పక్షాన పోరాడిన దాశరథి

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

చిక్కడపల్లి: 'నా తెలంగాణ కోటి రతనాల వీణ' అని తన కవితా ధారలతో ప్రజల పక్షాన నిలిచి.. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన దాశరథి కృష్ణమాచార్య సాహితీ చరిత్రలో శాశ్వతంగా ఉంటారని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదికలో గురువారం రాత్రి భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో తేజస్విని కల్చరల్ అసోసియేషన్ నిర్వహణలో ప్రముఖ కవి దాశరథి కృష్ణమాచార్య శత జయంతి మహోత్సవం వైభవంగా జరిగింది. డీఆర్‌డీఎల్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసమూర్తిని జీవిత సాఫల్య పురస్కారంతో సత్కరించారు. ప్రముఖ గాయకుడు సర్వకర్త కె.రామాచారికి బాల గాంధర్వ సారథి బిరుదును గవర్నర్ ప్రదానం చేసి ప్రసంగించారు. కళలు, సాహిత్యం నాగరిక సమాజానికి ప్రతీకలన్నారు. సైన్స్‌కు హద్దులు లేనట్లు కళలకు, సాహిత్యానికి సరిహద్దులు లేవన్నారు. విజ్ఞానం విశ్వవ్యాపితమని చెప్పారు. నాడు దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో వందేమాతరం గీతం, కళలు ప్రజలకి ప్రేరణ కలిగించాయని, దాశరథి కృష్ణమాచార్య తన కవితలతో తెలంగాణ ప్రజలకు ఉద్యమ స్ఫూర్తి కలిగించారని చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ నేత మురళీధర్‌రావు, ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం పూర్వ అధ్యక్షుడు విజయబాబు, సాహితీ వేత్త డాక్టర్ ఓలేటి పార్వతీశం పాల్గొన్నారు.



శ్రీనివాసమూర్తిని, రామాచారిలను సత్కరిస్తున్న గవర్నర్ తదితరులు

ఒత్తిడే శత్రువు!



సమీపిస్తున్న టెన్త్, ఇంటర్ వార్షిక పరీక్షలు

మరికొద్ది రోజుల్లో టెన్త్, ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయి. పరీక్షల సమయం సమీపిస్తున్నకొద్దీ.. విద్యార్థుల్లో ఆందోళన మరింత పెరుగుతోంది. పరీక్షల్లో తప్పుతామేమోనని.. కొంత మంది, తల్లిదండ్రులు ఆశించిన దానికంటే తమకు తక్కువ మార్కులు వస్తాయేమోననే టెన్షన్‌తో మరికొంత మంది తీవ్రమైన ఒత్తిడికి లోనవుతున్నారు. బలహీన క్షణంలో ఆత్మహత్యలకూ పాల్పడుతున్నారు. వార్షిక పరీక్షల వేళ.. విద్యార్థులు ఒత్తిడికి గురి కాకుండా కౌన్సెలింగ్ ఇచ్చేందుకు ఏ ఒక్క రెసిడెన్షియల్ కాలేజీలోనూ కౌన్సిలర్ లేకపోవడం కూడా ఈ విపత్కర పరిణామాలకు మరో కారణం. అధ్యాపకులే కాదు తల్లిదండ్రులు కూడా విద్యార్థుల మానసిక స్థితిపై ఓ కన్నేసి ఉంచాలని నిపుణులు సూచిస్తున్నారు. బలవంతపు బోధన, అభ్యాసన కంటే.. ఇష్టంతో చదివేలా విద్యార్థులను మానసికంగా సంసిద్ధులను చేసినప్పుడు మంచి ఫలితాలు వస్తాయని చెబుతున్నారు.

– సాక్షి, సిటీబ్యూరో

ఉత్తీర్ణత సాధిస్తామో.. లేదోనని విద్యార్థుల్లో భయం..

- క్షణికావేశంతో ఆత్మహత్యలకు పాల్పడుతున్న వైనం
- కష్టంగా కాదు.. ఇష్టంగా చదివితేనే విజయం
- పరీక్షలకు మానసికంగా సిద్ధం చేయాలంటున్న నిపుణులు
- తల్లిదండ్రులు, టీచర్లు ఓ కన్నేసి ఉంచాలని సూచన

ర్యాంకులు, గ్రేడ్లు రద్దు చేశాం



విద్యార్థులపై ఒత్తిడి తగ్గించేందుకు ప్రభుత్వం ఇప్పటికే టెన్త్‌లో ర్యాంకులు, గ్రేడింగ్ విధానాన్ని రద్దు చేసింది. ప్రభుత్వ స్కూళ్లలో ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి, వారిలో మానసిక స్థైర్యాన్ని నింపి, మానసికంగా పరీక్షలకు సంసిద్ధులను చేస్తున్నాం. అర్థం కాని పాఠ్యాంశాలను మళ్లీ వివరించే ప్రయత్నం చేస్తున్నాం. వార్షిక పరీక్షలపై వారిలో ఉన్న భయాన్ని పూర్తిగా పోగొట్టే ప్రయత్నం చేస్తున్నాం. మోడల్ పేపర్లను తయారు చేసి, పరీక్షలు రాయిస్తున్నాం.

– సుశీందర్‌రావు, డీఈఓ, రంగారెడ్డి

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



అత్యధిక మార్కులు సాధించాలనే ఉద్దేశంతో చాలా మంది పిల్లలు నిద్రాహారాలు మాని చదువుతుంటారు. అదేపనిగా చదవడం వల్ల తలనొప్పి, మానసిక సంఘర్షణ, కంటిచూపు సమస్య వస్తుంది. తీరా పరీక్షలు మొదలయ్యే నాటికి అనారోగ్యం పాల వుతుంటారు. ఈ సమయంలో పరీక్ష సరిగా రాయలేక..ఫెయిలవుతుంటారు. పిల్లల ఆరోగ్యంపై తల్లిదండ్రులు శ్రద్ధ చూపించాలి. వేళకు నిద్రపుచ్చడం, వేళకు నిద్రలేపి ఓ ప్రణాళిక ప్రకారం చదివించడం చేయాలి. తేలికగా జీర్ణం అయ్యే అప్పుడే వండివార్చిన తాజా ఆహారం అందించాలి.

– డాక్టర్ వెంకటి, డీఎంహెచ్ఓ, హైదరాబాద్


ప్రేమతో చెప్పాలి



పిల్లల ఆత్మహత్యలకు కాలేజీ యాజమాన్యాలది ఎంత బాధ్యత ఉంటుందో? తల్లిదండ్రులది అంతే బాధ్యత ఉంటుంది. పిల్లల మానసిక స్థితిని అర్థం చేసుకోకుండా వారికి ఇష్టం లేని కోర్సులు, కాలేజీల్లో బలవంతంగా చేర్పిస్తుంటారు. ఈ సమయంలో కనీసం కౌన్సెలింగ్ కూడా ఇవ్వడం లేదు. ఒత్తిడికి గురై, ఆత్మహత్యలకు పూనుకుంటున్నారు. వార్షిక పరీక్షలు సమీపిస్తున్నకొద్దీ.. వారిలో ఆందోళన, భయం ఎక్కువై.. ఆత్మహత్యలకు పూనుకుంటున్నారు. ఇలాంటి సమయంలో తల్లిదండ్రులు వారితో ప్రేమగా వ్యవహరించాలి. మానసిక స్థైర్యం చెప్పాలే గాని.. వారిని తోటి పిల్లలు, బంధువుల ముందు తిట్టకూడదు.

– డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి, మానసిక నిపుణుడు

మచ్చుకు కొన్ని ఇటీవలి ఉదంతాలు..



- ప్రిన్సిపాల్ తిట్టాడనే కారణంతో షాద్‌నగర్‌లోని శాస్త్ర పాఠశాల భవనంపై నుంచి దూకి 10వ తరగతి విద్యార్థి నీరజ్ బుధవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు.
- పరీక్షల్లో ఫెయిల్ అవుతాననే భయంతో మైసమ్మగూడ మల్లారెడ్డి మహిళా ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్ ఫస్ట్ ఇయర్ చదువుతున్న ఓ విద్యార్థిని కళాశాల నాలుగో అంతస్తు కిటికీ నుంచి కిందికి దూకి ఆత్మహత్యకు యత్నించగా తోటి విద్యార్థులు గమనించి అడ్డుకున్నారు.
- కుంట్లూరులోని తెలంగాణ గిరిజన రెసిడెన్షియల్ కళాశాలలో ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతున్న నాగర్‌కర్నూలుకు చెందిన సౌమ్య (17) ఇటీవల తరగతి గదిలో ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది.
- చదువు ఒత్తిడి తట్టుకోలేక హైదర్‌నగర్ శ్రీ చైతన్య జూనియర్ కాలేజీలో ఇంటర్ చదువుతున్న షాద్‌నగర్‌కు చెందిన విద్యార్థి కౌశిక్ రాఘవ (17) హాస్టల్ గదిలో ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.
- పరీక్ష సరిగా రాయలేదనే కారణంతో జీడిమెట్ల పీఎస్ పరిధిలో ఇటీవల పదో తరగతి విద్యార్థిని త్రిష ఆత్మహత్యకు పాల్పడింది.

స్కూల్ వ్యాన్ చక్రాల కింద నలిగిన చిన్నారి

నాలుగేళ్ల బాలికను
బలిగొన్న డ్రైవర్ నిర్లక్ష్యం



రిత్విక (ఫైల్)

హయత్‌నగర్: ప్రతిరోజూ తనను పాఠశాల నుంచి తీసుకొచ్చే వాహనమే ఆ చిన్నారి పట్ల మృత్యు శకటంగా మారింది. పాఠశాల నుంచి వచ్చి ఇంటి వద్ద దిగి వెళ్తుండగా డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా బాలిక వ్యాన్ టైరు కింద పడి మృతి చెందిన ఘటన గురువారం హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పెద్దఅంబర్‌పేట్ హనుమాన్ హిల్స్‌లో నివసించే నర్సింహా మెకానిక్‌గా పని చేస్తున్నాడు. ఆయనకు ముగ్గురు కూతుళ్లు. రెండో కుమార్తె రిత్విక (4) హయత్‌నగర్‌లోని శ్రీ చైతన్య పాఠశాలలో ఎల్‌కేజీ చదువుతోంది. గురువారం ఉదయం పాఠశాలకు వెళ్లిన రిత్విక సాయంత్రం స్కూల్ వ్యాన్‌లో వచ్చి ఇంటి సమీపంలో దిగింది. డ్రైవర్ గణేష్ నిర్లక్ష్యంగా వ్యాన్‌ను వెనక్కి తీయడంతో రిత్విక వాహనం ముందు చక్రాల కిందపడి నలిగిపోయింది. తలకు తీవ్రంగా గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. కాగా.. సంబంధిత వ్యాన్‌కు ఎలాంటి పర్మిషన్ లేదని పోలీసులు తెలిపారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృత దేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పాఠశాల ఎదుట ఆందోళన

విషయం తెలుసుకున్న మృతురాలి బంధువులు, గ్రామస్తులు, విద్యార్థి సంఘాల నాయకులు హయత్‌నగర్‌లోని శ్రీ చైతన్య పాఠశాల వద్దకు చేరుకున్నారు. మృతురాలి కుటుంబానికి న్యాయం చేయాలంటూ పాఠశాల గేటు ఎదుట బైఠాయించి ఆందోళనకు దిగారు. పోలీసులు ఘటనా స్థలానికి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. విజయవాడ రహదారిపై కొద్దిసేపు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. రాత్రి 9 గంటల వరకూ పాఠశాల యాజమాన్యం అందుబాటులోకి రాలేదు.

మెట్రో రైలు.. కుయ్యో మొర్రో!

తరచూ నిలిచిపోతున్న సర్వీసులు

- రద్దీ వేళల్లో ప్రయాణికులకు చుక్కలు
- సాంకేతిక వైఫల్యాలతో సిగ్నలింగ్ సమస్యలు
- వేధిస్తున్న కోచ్‌ల కొరత



సాక్షి, సిటీబ్యూరో: నగరంలో తరచూ స్తంభిస్తున్న మెట్రో రైళ్లు ప్రయాణికులకు చుక్కలు చూపిస్తున్నాయి. ఉదయం, సాయంత్రం రద్దీ ఎక్కువగా ఉండే సమయాల్లో సర్వీసులు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఒకవైపు ప్రయాణికుల డిమాండ్ మేరకు కోచ్‌లు అందుబాటులో లేకపోవడంతో కిక్కిరిసిపోతున్నాయి. అదే సమయంలో ఉన్నపళంగా నిలిచిపోతున్న సర్వీసులతో స్కూళ్లు, కాలేజీలకు వెళ్లే విద్యార్థులు, కార్యాలయాలకు వెళ్లే ఐటీ ఉద్యోగులు, ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలకు చెందిన వారు గంటల తరబడి పడిగాపులు కాయాల్సివస్తోంది. కొద్దిరోజుల క్రితం నాగోల్– అమీర్‌పేట్ మార్గంలో సాంకేతిక కారణాలతో సర్వీసులు నిలిచిపోయాయి. ఉదయం 7.30 గంటల నుంచి సుమారు గంట పాటు రైళ్ల నిర్వహణకు ఆటంకాలు తలెత్తడంతో ప్రయాణికులంతా ఎక్కడిక్కడ మెట్రో స్టేషన్లలోనే పడిగాపులు కాశారు. ప్రయాణికులు తీవ్ర అసహనానికి గురయ్యారు. సామాజిక మాధ్యమాల్లో ఆందోళన వ్యక్తమైంది. గతేడాది నవంబర్ 4న సైతం మియాపూర్–ఎల్బీనగర్ రూట్‌లో అసెంబ్లీ సమీపంలో మెట్రో రైలు ఆగిపోయింది. దీంతో ఆ రూట్‌లో సర్వీసులను నిలిపివేయాల్సి వచ్చింది. దీంతో ప్రయాణికులు అసౌకర్యానికి గురయ్యారు. ఇలా తరచూ మెట్రో రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడటం పట్ల నగరంలోని వివిధ ప్రాంతాల ప్రయాణికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ముందస్తు సమాచారం లేదు..

సాధారణంగా సాంకేతికంగా తలెత్తే సమస్యలతో సిగ్నలింగ్ సేవలకు ఆటంకం కలుగుతుంది. అధికారులు ఆ సమస్యను గుర్తించి పరిష్కరించేందుకు అరగంట నుంచి గంట వరకు సమయం పట్టవచ్చు. ఈ క్రమంలో మెట్రో రాకపోకల్లో తలెత్తిన అంతరాయంపై ప్రయాణికులకు ముందస్తుగా ఎలాంటి సమాచారం లభించడం లేదు. ఒకవైపు అప్పటికే టికెట్‌లు తీసుకున్న వాళ్లు మెట్రో కోసం ఎదురు చూస్తుంటారు. మరోవైపు యథావిధిగా టికెట్ విక్రయాలు కొనసాగుతూనే ఉంటాయి. దీంతో ఒక ట్రైన్‌కు సరిపడా ప్రయాణికులు ఎదురుచూస్తుండగా.. అంతకు రెట్టింపు సంఖ్యలో టికెట్‌లు ఇవ్వడం వల్ల రద్దీ అనూహ్యంగా పెరుగుతుంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని సర్వీసులకు అంతరాయం ఏర్పడినట్లు మెట్రో స్టేషన్లలో అనౌన్స్‌మెంట్ ఇవ్వాలని ప్రయాణికులు కోరుతున్నారు. దీంతో ప్రత్యామ్నాయ మార్గాలకు అవకాశం లభిస్తుందని పేర్కొంటున్నారు. అధికారులు ఈ మేరకు ఎలాంటి అనౌన్స్‌మెంట్ చర్యలు చేపట్టకపోవడం వల్ల ప్రయాణికులకు పడిగాపులు తప్పడం లేదు.

కోచ్‌ల కొరత.. తంటాలు

సాంకేతిక సమస్యలతో పాటు కోచ్‌ల కొరత కూడా నగరంలో మెట్రో ప్రయాణానికి సవాల్‌గా మారింది. ప్రస్తుతం నాగోల్–రాయదుర్గం, ఎల్బీనగర్– మియాపూర్, జేబీఎస్–ఎంజీబీఎస్ కారిడార్‌లలో ప్రతి రోజు సుమారు 5 లక్షల మంది ప్రయాణం చేస్తున్నారు. రోజురోజుకూ మెట్రోల్లో రద్దీ పెరుగుతూనే ఉంది. ఒక ట్రైన్ బయలుదేరే సమయానికి మరో రెండు ట్రైన్‌లకు సరిపడా ప్రయాణికులు టికెట్‌లు తీసుకొని ఎదురుచూస్తున్నారు. దీంతో ఉదయం, సాయంత్రం మెట్రోలు ప్రయాణికులకు చుక్కలు చూపిస్తున్నాయి. ప్రయాణికుల రద్దీ, డిమాండ్ మేరకు రైళ్లు పెంచాలనే ప్రతిపాదన ఉంది. నాగ్‌పూర్ నుంచి కొత్త కోచ్‌లను కొనుగోలు చేయనున్నట్లు ఇటీవల ఎల్ అండ్‌టీ అధికారులు పేర్కొన్నారు. కానీ ఆ దిశగా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం గమనార్హం.

శత శాతం దిశగా..

మురుగు శుద్ధికి జలమండలి అడుగులు



- వినియోగంలోకి రానున్న మరో 9 ఎస్టీపీలు
- ఇప్పటికే 11 ఎస్టీపీలు అందుబాటులోకి
- అమృత్ పథకం కింద 39 ఎస్టీపీలకు టెండర్లు

సాక్షి, సిటీబ్యూరో: వందశాతం మురుగు శుద్ధి దిశగా జలమండలి అడుగులేస్తోంది. మహా నగరంలో రోజువారీగా ఉత్పన్నమయ్యే మురుగు నీటిని పూర్తి స్థాయిలో శుద్ధి చేసేందుకు మూడేళ్ల క్రితం చేపట్టిన మురుగు శుద్ధి కేంద్రాల (ఎస్టీపీ) ప్రాజెక్టు పూర్తి కావస్తోంది. ఇప్పటికే సుమారు 663 ఎంఎల్‌డీల సామర్థ్యం గల 11 ఎస్టీపీలను అందుబాటులోకి తీసుకొచ్చింది. మరో 443 ఎంఎల్‌డీ సామర్థ్యం గల తొమ్మిది ఎస్టీపీల నిర్మాణాలు తుది దశకు చేరుకుంటున్నాయి. మరోవైపు అమృత్ పథకంకింద 972 ఎంఎల్‌డీ సామర్థ్యమున్న 39 ఎస్టీపీల నిర్మాణాలకు టెండర్లను ఆహ్వానించింది

1,650 ఎంఎల్‌డీల మురుగు ఉత్పన్నం..

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రోజువారీగా సుమారు 1,650 మురుగు నీరు ఉత్పన్నమవుతోందని అంచనా. అందులో సుమారు 772 ఎంఎల్‌డీల మురుగు నీటిని ఇప్పటికే 25 ఎస్టీపీల ద్వారా శుద్ధి చేస్తోంది. ఉత్పన్నమవుతున్న నీటిలో 46 శాతం శుద్ధి జరుగుతుండటంతో మిగిలిన 54 శాతం సైతం మురుగు నీటిని శుభ్రం చేయడానికి కొత్త ఎస్టీపీల నిర్మాణాలకు నడుం కట్టింది.

31 నుంచి 20కి కుదింపు

మూడేళ్ల క్రితం చేపట్టిన ఎస్టీపీల ప్రాజెక్టును మొత్తం మూడు ప్యాకేజీలుగా విభజించి రూ.3866.41 కోట్ల అంచనా వ్యయంతో 1259.50 ఎంఎల్డీల సామర్థ్యం గల 31 కొత్త మురుగు నీటి శుద్ధి కేంద్రాలకు ప్రణాళిక రూపొందించి కార్యాచరణకు దిగింది. స్థల సేకరణ వివాదాలు ఇతరత్రా అభ్యంతరాలతో ఎస్టీపీల సంఖ్యను 20కి కుదించి ఎంఎల్డీల సామర్థ్యాన్ని మాత్రం తగ్గకుండా చర్యలు చేపట్టింది. అధునాతన సీక్వెన్సింగ్ బ్యాచ్ రియాక్టర్ టెక్నాలజీ వినియోగిస్తూ ఎస్టీపీల నిర్మాణాలు చేపట్టింది. జీహెచ్ఎంసీ పరిధిలోని ప్యాకేజీ -1 కింద అల్వాల్, మల్కాజిగిరి, కాప్రా, ఉప్పల్, ప్యాకేజీ-2 కింద రాజేంద్రనగర్, ఎల్బీ నగర్ ప్యాకేజీ-3 కింద కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, శేరిలింగంపల్లి సర్కిల్ ప్రాంతాల్లో ఎస్టీపీ నిర్మాణాలు చేపట్టగా.. ఇప్పటికే వీటిలో సగం అందుబాటులోకి వచ్చాయి. మిగతావి తుది దశలో ఉన్నట్లు జలమండలి వర్గాలు చెబుతున్నాయి.

తుది దశలో ఉన్న ఎస్టీపీలు

ఎస్టీపీ	ఎంఎల్‌డీ సామర్థ్యం
పాలపిట్ట	7
శివాలయనగర్	14
ముల్లకత్వ చెరువు	25
నలగండ్ల	7
అత్తాపూర్–1	64
అంబర్‌పేట	212.5
రెయిన్‌బో విస్తా	43.5
రామ చెరువు	30
అత్తాపూర్–2	40


నిర్మాణంలో ఉన్న అంబర్‌పేట ఎస్టీపీ



హ్యామ్ మోడ్‌లో అమృత్ ఎస్టీపీలు

కేంద్ర ప్రభుత్వ అమృత్ పథకం కింద మంజూరైన 39 ఎస్టీపీలు హ్యామ్ మోడ్‌లో నిర్మించేందుకు జలమండలి ప్రణాళిక రూపొందించింది. ప్రస్తుతం అవి టెండర్ దశలో ఉన్నాయి. అందులో ఒక ఎస్టీపీ పీపీపీ మోడ్‌లో.. మిగతా 38 ఎస్టీపీలను హైబ్రిడ్ అన్యూయిటీ మోడల్ (హ్యామ్) విధానంలో నిర్మించనున్నారు. ఇవి అందుబాటులోకి వస్తే.. 972 ఎంఎల్డీల మురుగును శుద్ధి చేయవచ్చు. వాటి నిర్మాణ పనులు రెండు ప్యాకేజీల్లో పూర్తి చేయనుంది.. ప్యాకేజీ–1లో 16 ఎస్టీపీలను, ప్యాకేజీ–2లో 22 ఎస్టీపీలు నిర్మిస్తారు. నిర్మాణ సంస్థ ఎస్టీపీలను నిర్మించి 15 ఏళ్ల పాటు నిర్వహణ చేపట్టాల్సి ఉంది. మొత్తం ఎస్టీపీల నిర్మాణ వ్యయం రూ.2,569.81 కోట్లు కాగా.. 15 ఏళ్ల పాటు నిర్వహణకు రూ.1,279.29 కోట్ల అంచనా వ్యయం కానుంది. ఎస్టీపీల ప్రాజెక్టుల నిర్మాణ వ్యయంలో కేంద్రం 30, రాష్ట్రం 30 నిర్మాణ సంస్థ 40 శాతం చొప్పున నిధులు సమకూర్చనున్నాయి.

ఏప్రిల్ నాటికి 9 ఎస్టీపీలు అందుబాటులోకి..



ఈ ఏడాది ఏప్రిల్ నాటికి తొమ్మిది మురుగు శుద్ధి కేంద్రాల నిర్మాణాలు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తాం. ఇప్పటికే 65 నుంచి 90 శాతం వరకు పనులు పూర్తయ్యాయి. గడువు లోగా లక్ష్యం సాధించేందుకు.. అవసరమైతే ఎలక్ట్రో మెకానికల్ ఎక్విప్‌మెంట్‌తో పనులు పూర్తిచేసేలా చర్యలు చేపట్టాం. అమృత్ ఎస్టీపీలకు టెండర్లు ఆహ్వానించాం. వంద శాతం మురుగు శుద్ధి లక్ష్యంతో అడుగులు వేస్తున్నాం.

– సుదర్శన్, డైరెక్టర్ (టెక్నికల్), జలమండలి

బండిలో బాటిల్స్

తోపుడు బండిలో 92 విస్కీ క్వార్టర్ బాటిల్స్

- కంగుతిన్న జీహెచ్‌ఎంసీ అధికారులు
- గచ్చిబౌలి పోలీసులకు అప్పగింత



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

గచ్చిబౌలి: రోడ్డుపై వ్యాపారం చేస్తున్న ఓ మహిళకు చెందిన తోపుడు బండిలో 92 విస్కీ క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్న సంఘటన గురువారం గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. జేవీజీహిల్స్‌లో ఫుట్‌పాత్‌పై ఉన్న డబ్బాలో మద్యం అమ్మకాలు జరుగుతున్నట్లు స్థానికులు శేరిలింగంపల్లి సర్కిల్ ఉప వైద్యాధికారి శ్రీకాంత్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో అక్కడికి వెళ్లిన ఆయన తనిఖీలు చేయగా 10 క్వార్టర్ బాటిల్స్ లభించాయి. వాటిని ధ్వంసం చేసి డబ్బాను తొలగించారు. రాజరాజేశ్వరీ కాలనీలోనూ ఇదే తరహాలో ఉదయం నుంచి మద్యం విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో అక్కడికి వెళ్లిన ఆయన సోదా చేయగా, తోపుడు బండిలో ఏకంగా వివిధ కంపెనీలకు చెందిన 92 క్వార్టర్ బాటిళ్లు గుర్తించి నివ్వెరపోయారు. అంతే కాకుండా పక్కనే ఉన్న గుడిసెలో పలువురు మద్యం సేవిస్తున్నట్లు గుర్తించి డయల్ 100, గచ్చిబౌలి పోలీసులకు సమాచారం అందించారు. మద్యం విక్రయిస్తున్న మహిళతో పాటు మద్యం బాటిళ్లను పోలీసులకు అప్పగించారు. బెల్ట్ షాప్ నిర్వహిస్తున్న మహిళపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ హబీబుల్లాఖాన్ తెలిపారు. గత కొన్ని నెలలుగా ఉదయం 6 గంటల నుంచే మద్యం అమ్మకాలు జరుగుతుండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు పేర్కొన్నారు.

అంతర్రాష్ట్ర గంజాయి పెడ్లర్ అరెస్ట్

7.84 కిలోల గంజాయి స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సాయి ఈశ్వర్‌గౌడ్

సికింద్రాబాద్: ఒడిశా నుంచి మహారాష్ట్రకు అక్రమంగా గంజాయి తరలిస్తున్న పెడ్లర్‌ను జీఆర్పీ పోలీసులు అరెస్ట్ చేశారు. గురువారం జీఆర్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఇన్‌స్పెక్టర్ సాయి ఈశ్వర్ గౌడ్ వివరాలు వెల్లడించారు. ఒడిశా రాష్ట్రం, గజపతి జిల్లాకు చెందిన అబల్(23)వ్యవసాయ కూలీగా పని చేసేవాడు. సులువుగా డబ్బులు సంపాదించాలని భావించిన అతను కొద్ది రోజుల క్రితం అడవ పట్టణానికి వెళ్లి రైనో అనే వ్యక్తిని కలిశాడు. మహారాష్ట్రలో గంజాయికి చాలా డిమాండ్ ఉందని, తనకు 8 కిలోల గంజాయి కావాలని చెప్పిన రైనో పూణేకు గంజాయి తరలిస్తే ప్యాకెట్‌కు రూ. 1000 ఇస్తానని చెప్పడంతో అబల్ అందుకు అంగీకరించాడు. దీంతో అతను మాసియా అనే వ్యక్తి నుంచి కిలో రూ. 800 చొప్పున గంజాయి కొనుగోలు చేసి అబల్‌కు అప్పగించాడు. ఈ నెల 4న అతను గంజాయి ప్యాకెట్లతో ఇచ్ఛాపురం నుంచి కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో బుధవారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు చేరుకున్నాడు. రైల్వే స్టేషన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులకు అనుమానాస్పదంగా కనిపించిన అబల్ బ్యాగ్‌ను సోదా చేయగా రూ.1.96 లక్షల విలువైన 7.8 కిలోల గంజాయిని గుర్తించారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సమావేశంలో ఎస్‌ఐ మాజీద్, హెచ్‌సీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంట్లోకి చొరబడి..కత్తులతో పొడిచి..

- తల్లీకుమారుడిపై హత్యాయత్నం
- తీవ్రగాయాలతో గాంధీలో చికిత్స
- కుమారుడు యశ్వంత్ పరిస్థితి విషమం
- అపస్మారకస్థితిలో తల్లి రేణుక
- ఎవరు, ఎందుకు దాడి చేశారో తెలియని వైనం
- బాధితులు కోలుకుని నోరు విప్పితేనే వాస్తవాలు వెలుగులోకి
- దర్యాప్తు చేపట్టిన పోలీసులు
- ఆధారాల సేకరణ



చికిత్స పొందుతున్న యశ్వంత్, రేణుక



ఘటన జరిగిన ఇల్లు ఇదే (ఇన్‌సెట్‌లో రేణుక, యశ్వంత్ (ఫైల్))

చిలకలగూడ: ఓ ఇంట్లోకి చొరబడిన గుర్తుతెలియని వ్యక్తులు తల్లి కొడుకుపై కత్తులతో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన సంఘటన గురువారం చిలకలగూడ ఠాణా పరిధిలోని మెట్టుగూడలో చోటుచేసుకుంది. . తల్లి అపస్మారకస్థితిలో ఉండగా, కుమారుడి పరిస్థితి విషమంగా ఉంది. ఎవరు, ఎందుకు దాడికి పాల్పడ్డారో తెలియరాలేదు. బాధిత కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మెట్టుగూడ నల్లపోచమ్మ ఆలయ సమీపంలో రేణుక, శేఖర్ దంపతులు నివాసం ఉంటున్నారు. వీరికి ముగ్గురు కుమారులు యశ్వంత్, యశ్పాల్, వినయ్ ఉన్నారు. ఏజీ కార్యాలయంలో పనిచేసే శేఖర్ మూడేళ్ల క్రితం మృతిచెందాడు. రేణుక, తన ముగ్గురు కుమారులు, మంచానికే పరిమితమైన అత్త (శేఖర్ తల్లి) అనసూయ (70) కలిసి ఉంటున్నారు. మౌలాలీలోని ఓ రైల్వే కాంట్రాక్టర్ వద్ద పనిచేస్తున్న యశ్వత్ గత మూడు నెలలుగా పనికి వెళ్లకుండా ఇంట్లోనే ఉంటున్నాడు. యశ్పాల్, వినయ్ ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నారు. గురువారం ఉదయం యశ్పాల్, వినయ్ డ్యూటీకి వెళ్లగా యశ్వంత్, తల్లి రేణుక ఇంట్లోనే ఉన్నారు. ఉదయం 11.30 గంటల సమయంలో ఇంట్లోకి చొరబడిన గుర్తుతెలియని వ్యక్తులు రేణుక, యశ్వంత్‌లపై కత్తులతో విచక్షణా రహితంగా దాడి చేసిన అనంతరం బయట తలుపులకు గడియపెట్టి వెళ్లిపోయారు. తీవ్రంగా గాయపడిన వారి కేకలు విన్న స్థానికులు తలుపులు తెరిచి చూడగా ఇద్దరూ రక్తపు మడుగులో ప్రాణాపాయస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. దీంతో వారిని చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించి పోలీసులకు సమాచారం అందించారు. రేణుక కడుపుపై రెండు, యశ్వంత్ కడుపుపై మూడు కత్తిపోట్లు ఉన్నాయి. రేణుక అపస్మారకస్థితిలో ఉండగా, యశ్వంత్ పరిస్థితి విషమంగా ఉందని, వారికి ఆపరేషన్ చేయాల్సిన అవసరం ఉందని వైద్యులు తెలిపారు.

పథకం ప్రకారమే దాడి..

తాము ఇంట్లో లేని సమయం చూసి పథకం ప్రకారమే దుండగులు హత్యాయత్నానికి పాల్పడ్డారని రేణుక మూడో కుమారుడు వినయ్ తెలిపాడు. తమకు ఎవరితోనూ శతృత్వం లేదన్నాడు. ఎవరు ఎందుకు దాడి చేశారో తెలియడం లేదని, ఆరుగురు వ్యక్తులు దాడిలో పాల్గొన్నారని, నలుగురు ఇంట్లోకి చొరబడి దాడి చేయగా, ఇద్దరు బయటే ఉన్నట్లు తెలిపాడు.

సవాల్‌గా తీసుకున్న పోలీసులు...

హత్యాయత్నంపై పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈస్ట్‌జోన్ అడిషనల్ డీసీపీ నర్సయ్య, చిలకలగూడ ఏసీపీ జైపాల్ రెడ్డి, చిలకలగూడ ఇన్‌స్పెక్టర్ అనుదీప్, డీఐ రమేష్‌గౌడ్‌లు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్‌టీం, డాగ్‌స్క్వాడ్ ఆధారాలు సేకరించారు. రక్తపు మరకలతో ఉన్న పదునైన ఆయుధాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. ఈ ఘటనలో దుండగులను ప్రత్యక్షంగా చూసిన వారు లేకపోవడం గమనార్హం.

బాధితులు నోరు విప్పితేనే...

గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు కోలుకుని నోరువిప్పితేనే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని ఈస్ట్‌జోన్ అడిషనల్ డీసీపీ నర్సయ్య, చిలకలగూడ ఏసీపీ జైపాల్‌రెడ్డి తెలిపారు. దుండగులను కేవలం బాధితులు మాత్రమే చూశారు. అన్ని కోణాల్లోను దర్యాప్తు చేపట్టామని, త్వరలోనే మిస్టరీని చేధిస్తామన్నారు.

రాచకొండలో ఆపరేషన్ స్మైల్

1,051 మంది చిన్నారులకు విముక్తి

సాక్షి, సిటీబ్యూరో: హోటళ్లు, పరిశ్రమలు, ఇటుక బట్టీలు తదితర పారిశ్రామిక ప్రాంతాల్లో పనిచేస్తున్న 1,051 మంది బాల కార్మికులకు రాచకొండ పోలీసులు విముక్తి కలిగించారు. ఆపరేషన్ స్మైల్-11లో భాగంగా కమిషనరేట్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మానవ అక్రమ రవాణా, షీ టీమ్, స్పెషల్ బ్రాంచ్ విభాగాలతో పాటు ఒక సబ్ ఇన్‌స్పెక్టర్, నలుగురు కానిస్టేబుళ్లు (ఒక మహిళా కానిస్టేబుల్ కలిపి)లతో 9 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. జనవరి 1 నుంచి 31 వరకు ఆపరేషన్ స్మైల్ కొనసాగింది. విముక్తి కలిగించిన చిన్నారుల్లో మన రాష్ట్రానికి చెందిన బాలురు 512 మంది, బాలికలు 28 మంది ఉండగా.. ఇతర రాష్ట్రాలకు చెందిన బాలురు 473 మంది, బాలికలు 38 మంది ఉన్నారు. చిన్నారులను పనిలో పెట్టుకున్న 464 మంది యాజమానులపై ఎఫ్‌ఐఆర్‌లు, 410 మందిపై జీడీ ఎంట్రీ కేసులు నమోదు చేశారు.



రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన



సాక్షి, సిటీబ్యూరో: జాతీయ రహదారి భద్రతా మాసం-2025 నేపథ్యంలో రాచకొండ కమిషనరేట్ పరిధిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కమిషనరేట్ పరిసర ప్రాంతాల్లో గురువారం 1494 అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. లా అండ్ ఆర్డర్ విభాగం 708, ట్రాఫిక్ విభాగం 378, ట్రాఫిక్ ట్రయినింగ్ ఇనిస్టిట్యూట్ (టీటీఐ) 408 అవగాహన సెషన్లు నిర్వహించారు. రోడ్డు ప్రమాదాలను నియంత్రించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాలు చేపట్టినట్లు కమిషనర్ జీ సుధీర్ బాబు తెలిపారు. డ్రైవర్లు, పాదచారులు, విద్యార్థులు, ఆర్టీసీ డ్రైవర్లు, లారీ డ్రైవర్లు, ఆటోడ్రైవర్లను అవగాహన కార్యక్రమాల్లో భాగస్వాములను చేశారు. రోడ్డు భద్రతా నిబంధనలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు వివిధ విద్యాసంస్థల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేశారు.

ప్రేమ విఫలమై యువకుడి ఆత్మహత్య

సైదాబాద్: ప్రేమ విఫలమై ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సైదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి..ఉత్తరప్రదేశ్ రాష్ట్రం, కర్నేల్‌గంజ్‌కు చెందిన మహ్మద్ సాదాబ్, మహ్మద్ దిల్‌షాద్ (21) సోదరులు నగరానికి వలస వచ్చి సైదాబాద్ రెడ్డిబస్తీలో ఉంటూ టైలరింగ్ పని చేస్తున్నారు. దిల్‌షాద్ యూపీలోని తమ గ్రామానికి చెందిన యువతిని ప్రేమిస్తున్నాడు. ఇద్దరూ తరచూ ఫోన్‌లో మాట్లాడుకునే వారు. అయితే కొన్ని రోజులుగా వారు ఫోన్‌లో గొడవ పడుతున్నారు. మంగళవారం రాత్రి సాదాబ్ ఇంటికి తిరిగి వచ్చేసరికి దిల్‌షాద్ ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించాడు. అతడి సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు దిల్‌షాద్ మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. ప్రేమ విఫలమై తన సోదరుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడని సాదాబ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సైదాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి దారుణ హత్య



షేక్ షాబాజ్ మృతదేహం

చాంద్రాయణగుట్ట: క్షణికావేశంలో ముగ్గురు స్నేహితులు ఓ యువకుడిని కత్తులతో పొడిచి హత్య చేసిన సంఘటన గురువారం బండ్లగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బండ్లగూడ, ఇందిరానగర్ ప్రాంతానికి చెందిన షేక్ షాబాజ్ (23) డీసీఎం డ్రైవర్, లేబర్‌గా పని చేసేవాడు. అదే ప్రాంతానికి చెందిన ఆజం, ఆయూబ్, అమీర్ అతడి స్నేహితులు. వీరు నలుగురు ఇందిరానగర్‌లోని శ్మశాన వాటికలో కూర్చుని మద్యం తాగేవారు. గురువారం మధ్యాహ్నం మద్యం సేవిస్తుండగా ఆజం, షాబాజ్‌ల మధ్య గొడవ జరిగింది. దీంతో షాజాబ్ అజమ్‌పై ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఈ విషయాన్ని ఆజమ్ తన స్నేహితులు ఆయూబ్, అమీర్‌లకు చెప్పాడు. వీరు ముగ్గురు కలిసి మరోసారి మద్యం తాగి ఇందిరానగర్ శ్మశాన వాటిక నుంచి వెళుతుండగా చిన్న సందులో నుంచి షాబాజ్ వస్తూ కనిపించడంతో ఆజం తన వద్ద ఉన్న కత్తితో షాబాజ్‌పై దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన షాబాజ్ అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ కాంతిలాల్ పాటిల్, చాంద్రాయణగుట్ట ఏసీపీ కె.మనోజ్ కుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. బండ్లగూడ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరు సైబర్ నేరగాళ్లకు ఆరు నెలల జైలు

రూ.10 వేల చొప్పున జరిమానా

సాక్షి, సిటీబ్యూరో: ఓ మహిళ డీమ్యాట్ ఖాతాలోని షేర్లను తమ ఖాతాల్లోకి మార్చుకుని మోసం చేసిన ఇద్దరు సైబర్ నేరగాళ్లపై నేరం నిరూపణ అయింది. వీరికి న్యాయస్థానం ఆరు నెలల జైలు శిక్ష, రూ.10 వేల చొప్పున జరిమానా విధించినట్లు డీసీపీ దార కవిత గురువారం వెల్లడించారు. నగరానికి చెందిన ఓ మహిళకు డీ మ్యాట్ ఖాతాతో పాటు వివిధ కంపెనీల షేర్లు ఉన్నాయి. 2014లో ఆమెకు వారాసిగూడకు చెందిని ఏఎల్ దీపక్ పరిచయం ఏర్పడింది. ఆమె తండ్రి పేరుతో ఉన్న షేర్లను ఆమె ఖాతాలోకి బదిలీ చేయిస్తానంటూ నమ్మబలికాడు. ఆమెతో ఆదిత్య బిర్లా మనీ లిమిటెడ్ సంస్థలో ట్రేడింగ్ ఖాతా తెరిపించాడు. బాధితురాలికి తెలియకుండా ఆమె పేరుతో ఈ-మెయిల్ ఐడీ సృష్టించాడు. దీని ఆధారంగా ఆమె డీమ్యాట్ ఖాతాలో ఉన్న షేర్లను కాజేసి, విక్రయించి సొమ్ము చేసుకున్నాడు. 2018లో ఈ విషయాన్ని గుర్తించిన బాధితురాలు నగర సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. ఈ దందాలో దీపక్‌కు తార్నాక వాసి ఆర్ శ్రవణ్‌కుమార్ సహకరించినట్లు తేలింది. దీంతో అధికారులు వారిని అరెస్టు చేసి కోర్టులో అభియోగపత్రాలు దాఖలు చేశారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయస్థానం ఇరువురు నిందితులను దోషులుగా తేల్చింది. ఆరు నెలల జైలు శిక్షతో పాటు రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చింది.

స్నేహితుడి భార్యను నిండా ముంచాడు...

తన స్నేహితుడి భార్యను టార్గెట్‌గా చేసుకున్న ఓ కేటుగాడు మరో వ్యక్తితో కలిసి రూ.8.13 లక్షలు కాజేశాడు. దీనికోసం సోలార్ ప్రాజెక్ట్ కోసం 100 శాతం రణం ఇప్పిస్తానంటూ నమ్మబలికాడు. బాధితురాలి ఫిర్యాదుతో గురువారం కేసు నమోదు చేసుకున్న సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. గుజరాత్ రాష్ట్ర ఆర్థిక శాఖలోని ప్రైమ్ మినిస్టర్స్ ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్ ప్రోగ్రాంలో (పీఎంఈజీపీ) పని చేసి, కన్నుమూసిన అధికారి భార్య నగరంలో స్థిరపడ్డారు. పదవీ విరమణ చేసిన ఆమె తన భర్త ఫోన్ నెంబర్‌నే వినియోగిస్తున్నారు. పీఎంఈజీపీలో అతడితో కలిసి పని చేసిన ఓ వ్యక్తి దీనిని ఆసరాగా చేసుకున్నాడు. కొన్నాళ్ల క్రితం ఆమెకు ఫోన్ చేసి మాట్లాడిన అతగాడు క్రెడిట్ గ్యారెంటీ ఫండ్ ట్రస్ట్ ఫర్ మైక్రో అండ్ స్మాల్ ఎంటర్‌ప్రైజెస్ (సీజీటీఎంఎస్ఈ) పథకం కింద సోలార్ ప్రాజెక్టులకు 100 శాతం రుణం ఇప్పిస్తానని చెప్పాడు. ఆమె ఆసక్తి చూపడంతో మరో వ్యక్తిని పరిచయం చేసిన అతగాడు దరఖాస్తు చేసుకునే విధానాన్ని వివరించడంతో పాటు సహకరిస్తాడని చెప్పాడు. ఆపై పత్రాల తయారీ, ఇతర ఖర్చుల పేరుతో కొంత, రిఫండబుల్ డిపాజిట్ అంటూ మరికొంత మొత్తం ... ఇలా రూ.8.13 లక్షలు బదిలీ చేయించుకున్నారు. ఆపై రుణం మంజూరైందని, త్వరలోనే మీ ఖాతాలోకి వస్తుందని చెప్పారు. అయితే రోజులు గడుస్తున్నా తన ఖాతాలోకి నగదు రాకపోవడంతో తాను చెల్లించిన మొత్తం తిరిగి ఇవ్వాలని వారిని కోరింది. అయితే రుణం మంజూరుకు మరికొంత మొత్తం డిమాండ్ చేయడంతో మోసపోయినట్లు గుర్తించిన బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

డ్రగ్స్ విక్రేతల అరెస్ట్

23 గ్రాముల కొకైన్, కారు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం

మాదాపూర్: మాదక ద్రవ్యాలు విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన సంఘటన మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఇజ్జత్‌నగర్‌లోని అలేఖ్యహోమ్స్‌లో ఉంటున్న చంద్రపు ప్రసన్నకుమార్ రెడ్డి ప్రైవేటు కంపెనీలో పని చేస్తున్నాడు. అతడికి బెంగళూరుకు చెందిన డ్రగ్స్ విక్రేత కెవిన్‌తో పరిచయాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో అతను గురువారం ప్రసన్నకుమార్ రెడ్డికి డ్రగ్స్ అందజేసేందుకు మాదాపూర్‌లోని హైటెక్స్ మెటల్ చార్మినార్ వద్దకు వచ్చాడు. దీనిపై సమాచారం అందడంతో దాడి చేసిన మాదాపూర్ ఎస్ఓటీ పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 23 గ్రాముల కొకైన్ స్వాధీనం చేసుకున్నారు. మరో ముగ్గురు నిందితులు పాల్వంచకు చెందిన జూపల్లి విశ్వామిత్ర, మణికొండకు చెందిన శ్రీనివాస సాయిదీపక్, సికింద్రాబాద్‌కు చెందిన వరుణ్‌గౌడ్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. కాగా కెవిన్ బెంగళూరులో డ్రగ్స్ దందా నిర్వహిస్తున్నాడని, ప్రస్తుతం హైదరాబాద్‌లో మొదలు పెట్టినట్లు పోలీసులు తెలిపారు. నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు వారి నుంచి మాదకద్రవ్యాలతో పాటు, కారు, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

డ్రగ్స్ కొనుగోలు చేస్తున్న యువకుడి అరెస్ట్

మాదాపూర్: డ్రగ్స్ కొనుగోలు చేస్తున్న యువకుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన సంఘటన మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మాదాపూర్‌లోని జేఎంజే కోలివింగ్ పీజీ హాస్టల్‌లో ఉంటున్న గుత్తాతేజ కృష్ణ ఆర్కిటెక్‌గా పనిచేస్తున్నారు. గురువారం అతను అయ్యప్ప సొసైటీ వద్ద బెంగళూరుకు చెందిన శాండీ అనే యువతి నుంచి డ్రగ్స్ కొనుగోలు చేస్తున్నాడు. దీనిపై సమాచారం అందుకున్న మాదాపూర్ ఎస్ఓటీ పోలీసులు గుత్తా తేజకృష్ణను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. డ్రగ్స్ విక్రేత శాండి పరారీలో ఉన్నట్లు తెలిపారు. పోలీసులు తేజ నుంచి 11.14 గ్రాముల ఎండీఎంతో పాటు రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

బూతులు తిట్టి.. బూటు కాలుతో తన్ని..

- యువతిపై జిమ్ ట్రైనర్ దాష్టీకం
- బాధితురాలి ఫిర్యాదు
- నిందితుడి అరెస్ట్



నిందితుడు ప్రసాద్

బంజారాహిల్స్: ప్రియురాలిపై అనుమానంతో ఆమెను పార్కుకు పిలిచి బూతులు తిట్టి.. బూటు కాలితో పొత్తి కడుపులో తన్నిన జిమ్ ట్రైనర్‌ను జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే..వైజాగ్‌కు చెందిన కుమొరల్లు ప్రసాద్ జూబ్లీహిల్స్ ఐలాం కాలనీలో జిమ్ నిర్వహిస్తున్నాడు. జిమ్ ట్రైనర్‌గా పలువురు యువతులను లోబరచుకుని వారిని మోసం చేస్తున్నాడు. ఇదే తరహాలో ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌ను ప్రేమ పేరుతో దగ్గరకు తీసి ఆమెతో చట్టాపట్టాలేసుకుని తిరుగుతున్నాడు. కొద్ది రోజులుగా ప్రియురాలిపై అనుమానం పెంచుకున్న అతను మాట్లాడుకుందామని జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్-10లోని పార్కుకు రప్పించాడు. అప్పటికే మద్యం మత్తులో తూలుతున్న ప్రసాద్ ఆమె వచ్చీ రావడంతోనే జుట్టు పట్టుకుని నేలకొసి కొట్టాడు. పొత్తి కడుపుతో బూటు కాలితో తన్నాడు. అసభ్యంగా ఆమెను దూషిస్తూ చితక బాదాడు. భయంతో వణికిపోయిన బాధితురాలు తన సోదరికి ఫోన్ చేసి చెప్పింది. ఆమె అక్కడికి వచ్చి సర్దిచెప్పడానికి ప్రయత్నించగా ఆమెను కూడా దూషిస్తూ మద్యం మత్తులో దాడికి పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన జూబ్లీహిల్స్ పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు.

ఎలక్ట్రిక్ బైకులు దగ్ధం



దగ్ధమవుతున్న ఎలక్ట్రిక్ వాహనాలు

మణికొండ: షాపు ఎదుట నిలిపిన ఎలక్ట్రిక్ బైక్‌లు దగ్ధమైన సంఘటన మణికొండ మున్సిపాలిటీ అలకాపూర్ టౌన్‌షిప్‌లో గురువారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అలకాపూర్ రోడ్డు నెంబర్ 23లో డామినోస్ పిజ్జా షాప్ కొనసాగుతుంది. అందులో నుంచి పిజ్జాలు సరఫరా చేసే స్కూటీలను బుధవారం రాత్రి ఎప్పటి లాగే షాప్ ఎదుట పార్క్ చేశారు. గురువారం తెల్లవారు జామున ఓ బైక్‌కు నిప్పంటుకోవడంతో పక్కనే ఉన్న మరో నాలుగు వాహనాలకు వ్యాపించాయి. దీనిని గుర్తించిన స్థానికులు అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించారు. వారు సంఘటనా స్థలానికి చేరుకునేలోపే అవి కాలి బూడిదయ్యాయి.

ఫిలింనగర్‌లోని హోటల్‌కు హైడ్రా నోటీసులు



హైడ్రా గుర్తించిన అక్రమ నిర్మాణం

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్ రోడ్డు నెంబర్–1లోని ఫిలింనగర్ సొసైటీ లే అవుట్‌లో తనకు కేటాయించిన ప్లాట్ ఖాళీ జాగాను ఆక్రమించిన యజమాని అక్రమ నిర్మాణం చేపట్టి హోటల్‌కు అద్దెకు ఇవ్వగా ఈ కట్టడాన్ని కూల్చివేయాలంటూ స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు హైడ్రా అధికారులు సదరు నిర్మాణదారుడికి నోటీసులు జారీ చేశారు. ఫిలింనగర్ రోడ్డునెంబర్–1లో విగ్రహాల చౌరస్తాలో శంకర్ విలాస్ పేరుతో హోటల్ కొనసాగుతుంది. అయితే ప్లాట్ యజమాని రోడ్డు కోసం లే అవుట్‌లో వదిలిన 59 గజాల స్థలాన్ని కబ్జా చేసి హోటల్‌కు అద్దెకు ఇచ్చినట్లుగా హైడ్రాకు ఫిర్యాదు అందింది. ఈ హోటల్‌ను కూల్చివేసి స్థలాన్ని రోడ్డుకు కేటాయించడం జరుగుతుందని శంకర్ విలాస్ హోటల్ యజమానికి హైడ్రా అధికారులు నోటీసులు జారీ చేశారు. హైడ్రా నోటీసులతో స్థానిక వ్యాపారులు బెంబేలెత్తుతున్నారు.

స్మార్ట్‌బిన్.. పరిసరాలు క్లీన్

- చెత్త పేరుకుపోయే చోట్ల మళ్లీ డంపర్ బిన్లు
- నిండుతుండగానే అప్రమత్తం చేసే సెన్సార్లు
- సర్కిళ్ల వారీగా జీవీపీల గుర్తింపు



బంజారాహిల్స్: రోడ్ల పక్కన పేరుకుపోతున్న చెత్త సమస్య రోజుకురోజుకు తీవ్రతరమవుతుంది. అధికారులు ఎన్ని ప్రయత్నాలు చేసినా రోడ్ల పక్కన చెత్త వేసే వారి సంఖ్య ఏమాత్రం తగ్గడం లేదు. చెత్తరహిత నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దాలని అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నా క్షేత్రస్థాయిలో మాత్రం ఆ పరిస్థితులు కనిపించడం లేదు. ముఖ్యంగా జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ సర్కిల్–17, జూబ్లీహిల్స్ సర్కిల్–18 పరిధిలో ప్రధాన రహదారుల నుంచి అంతర్గత రహదారులు, బస్తీలు, కాలనీల్లో భారీగా చెత్త పేరుకుపోతుంది. ఈ నేపథ్యంలో తరచూ చెత్త పేరుకుపోయే ప్రాంతాల్లో (గార్బేజ్ వల్లరబుల్ పాయింట్లు) చెత్త లేకుండా సమస్య పరిష్కారానికి గతంలో నిషేధించిన డంపర్ బిన్లు (చెత్త డబ్బాలు) మళ్లీ అందుబాటులోకి తీసుకు వస్తున్నారు.

1100 లీటర్ల సామర్థ్యంతో..

సర్కిల్–17, 18లో సుమారుగా 73 జీవీపీలను గుర్తించి ఈ మేరకు డంపర్ బిన్లు కేటాయించారు. కొత్తగా మంజూరైన ఈ డంపర్ బిన్లు ఒక్కొక్కటి 1100 లీటర్ల సామర్థ్యంతో ఉండగా గార్బేజ్ వల్లరబుల్ పాయింట్ల వద్ద ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే ఎక్కడెక్కడ వీటిని ఏర్పాటు చేయాలో అధికారులు సంబంధిత డీసీలు, ఏఎంఓహెచ్‌లకు జాబితా అందజేశారు. అడ్వాన్స్ ట్రాకింగ్ సిస్టమ్స్ (ఆర్ఎఫ్ఐడీ) విధానంలో ఈ డస్ట్‌బిన్ల పర్యవేక్షణ జరగనున్నాయి.

70 శాతం చెత్త పడగానే అప్రమత్తం చేసేలా..

బిన్లలో 70 శాతం చెత్త పడగానే ఆర్ఎఫ్ఐడీ సెన్సార్ ద్వారా ఆ రూట్‌లో ఉన్న స్వచ్ఛ ఆటోను అప్రమత్తం చేస్తోంది. దీంతో ఆ రూట్‌లో వెళ్లే వాహనాలు ఈ బిన్లలో నిండుకున్న చెత్తను శుభ్రపరుస్తాయి. దీని ద్వారా బిన్లు నిండేదాకా కాకుండా 30 శాతం ఉండగానే తొలగించడంతో అక్కడ వీధి కుక్కలు చిందరవందర చేసే అవకాశాలు ఉండవని భావిస్తున్నారు. ఖైరతాబాద్ జోన్‌లో 76 జీవీపీల వద్ద 166 బిన్లు ఏర్పాటు చేయనున్నారు. ఈ బిన్ల ఏర్పాటు వల్ల సాధ్యమైనంతగా జీవీపీలను తగ్గించాలని ప్రణాళికలు రూపొందించారు.డంపర్ బిన్ల పర్యవేక్షణపై అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించనున్నారు.

ఆర్ఆర్‌బీ కోర్సుకు ఉచిత కోచింగ్

లక్డీకాపూల్: ఆర్ఆర్‌బీ, ఎస్ఎస్‌సీఆర్ బ్యాంకింగ్ రిక్రూట్‌మెంట్ ఫౌండేషన్ కోర్స్ కు ఉచిత శిక్షణ ఈ నెల15వ తేదీ నుంచి నిర్వహించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 12 తెలంగాణ బీసీ స్టడీ సర్కిల్స్‌లో ఈ కోచింగ్ ఉంటుందని అర్హులైన అభ్యర్థులు ఈనెల 9వ తేదీలోగా www. tgbcstudycircle. cgg. gov. in ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. మరిన్ని వివరాలకు 040–24071178 నంబర్‌ను సంప్రదించాలని నిర్వాహకులు పేర్కొన్నార.

సమస్యల పరిష్కారానికి వినతి



ఎమ్మెల్యే దానంతో కమిటీ సభ్యులు

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్డునెంబర్–10లోని సింగాడబస్తీ సమస్యలపై నూతనంగా ఎన్నికైన వెల్ఫేర్ కమిటీ అధ్యక్షుడు జువ్వాది అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. బస్తీలో సామాజిక భవనం నిర్మించాలని కోరగా రెండ్రోజుల్లో అధికారులతో కలిసి బస్తీలో పర్యటిస్తానన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో సతీష్, గంగరాజు, మూర్తి, సుధీర్ ఉన్నారు.

త్వరలో ముఖ్యమంత్రికి కృతజ్ఞత సభ



సమావేశంలో మాట్లాడుతున్న మేడి పాపయ్య

పంజగుట్ట: ఎస్సీ వర్గీకరణ చేసి ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రాష్ట్రంలోని యావత్ మాదిగ జాతి తరఫున లక్షలాది మందితో త్వరలోనే కృతజ్ఞత సభ ఏర్పాటు చేస్తానని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య పేర్కొన్నారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణకు అన్ని పార్టీలు మద్దతు ప్రకటించినప్పటికీ ఎంతో ధైర్యంగా సుప్రీంకోర్టు తీర్పు రాగానే తాను వర్గీకరణకు కట్టుబడి ఉన్నానని ప్రకటించి వర్గీకరణ అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికే దక్కుతుందన్నారు. ఈ సమావేశంలో గుర్రాల శ్రీనివాస్, కేదాసి మోహన్, మంచాల యాదగిరి, జాతీయ నిర్మల, యాదగిరి పాల్గొన్నారు.

విలక్షణ కథాంశంతో సౌదీ ఆరేబియా ఫిలిం కమిషన్ నిర్మించిన చిత్రాలను బంజారాహిల్స్‌లోని ఆర్కే పీవీఆర్‌లో ప్రదర్శించారు. సౌదీ ఆరేబియా, భారతదేశాల మధ్య సాంస్కృతిక సంబంధాలను బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు డోమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ మహమ్మద్ మురారి తెలిపారు.
–బంజారాహిల్స్



వెనకబడ్డ కులాలకు 3 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న వేణు

పంజగుట్ట: ఎస్సీ వర్గీకరణకు ఆమోదం తెలిపినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలని అదే సమయంలో ఎస్సీ 'ఎ' కేటగిరిలో 15 సంచారజాతులను చేర్చి మూడు శాతం రిజర్వేషన్లు కల్పించాలని బేడ బుడగ జంగం జన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సిరిపాటి వేణు విజ్ఞప్తి చేశారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విద్యా, ఉద్యోగం, ఉపాధి, ఆర్థికంగా ముందున్న పంబాల, మన్నే కులాలను ఎస్సీ ఎ కేటగిరి నుంచి తొలగించాలని వారి స్థానంలో వెనకబడ్డ కులాలైన దాసరి, హోలియ దాసరి కులాలను ఎ జాబితాలో చేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో నర్సింహ, సహదేవుడు, పరుషరాం, వెంకటి, రాజేష్, శివ, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

14న రాష్ట్ర బంద్



మాట్లాడుతున్న వీఎల్ రాజు, కృష్ణ స్వరూప్

కాచిగూడ: తెలంగాణలో ఎస్సీ వర్గీకరణను నిరసిస్తూ ఈ నెల 14న తెలంగాణ రాష్ట్ర బంద్ పాటించాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వీఎల్ రాజు, ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణ స్వరూప్ పిలుపునిచ్చారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణపై జస్టిస్ షమీమ్ అక్తర్ నివేదికను రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించే ముందు ఎలాంటి రాజ్యాంగ నిబంధనలు పాటించలేదన్నారు. జాతీయ ఎస్సీ కమిషన్‌ను ఆర్టికల్ 338 ప్రకారం సంప్రదించకుండా ఏకపక్షంగా ఎస్సీ వర్గీకరణకు ప్రభుత్వం పూనుకుందన్నారు. ఆర్ఎస్ఎస్ అజెండాను అమలు చేయడంలో భాగంగా ప్రధాని మోదీ ఆదేశాల మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ సామాజిక డ్రామా రాజకీయ కుట్రలకు పాల్పడ్డారన్నారు. ఈ సమావేశంలో నక్కా దేవేందర్ రావు, గోలి నరేష్, చిపర్తి సుబ్బారావు, బుంగా జయరాజు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ విరుద్ధమైన వర్గీకరణ చేయడం సరికాదు

లిబర్టీ: రాజ్యాంగ విరుద్ధమైన వర్గీకరణకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పూనుకుంటుందని మాల మహానాడు జాతీయ అధ్యక్షులు డాక్టర్ వి.ఎల్.రాజు ఆరోపించారు. రాజ్యాంగ విరుద్ధమైన ఏబీసీడీ వర్గీకరణకు తెలంగాణ ప్రభుత్వం అసెంబ్లీలో ఆమోదముద్ర వేయటాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. గురువారం మాల మహానాడు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జస్టిస్ షమీం సారథ్యంలోని ఏకసభ్య కమిషన్ రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించడం నివేదికను అసెంబ్లీలో ప్రవేశపెట్టి ఆమోదించడం అంటే రాజ్యాంగ వ్యతిరేక చర్య అన్నారు. గతంలో నాలుగు గ్రూపులుగా ఉంటే ప్రస్తుతం మూడు గ్రూపులుగా రిజర్వేషన్ అమలు చేయాలని కమిషన్ నివేదిక ఇవ్వటాన్ని తప్పుపట్టారు. మాదిగలకు 9 శాతం, మాలలకు ఐదు శాతం ఇతర ఉపకులాలకు ఒక శాతం రిజర్వేషన్లు కల్పించాలని కమిషన్ నివేదికలో పేర్కొందని ప్రభుత్వం ఆ దిశగా అమలు చేసేందుకు కసరత్తులు చేస్తుందని ఆరోపించారు. రాజ్యాంగంలోని 341 ప్రకారం వర్గీకరణ చెల్లదని స్పష్టంగా పేర్కొన్నప్పటికి రాజ్యాంగ విరుద్ధంగా వర్గీకరణ చేసి రాష్ట్ర ప్రభుత్వం లక్షలాది మాలలకు ద్రోహం చేసిందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం మాలలకు వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకుంటుందని రానున్న రోజుల్లో గుణపాఠం తప్పదన్నారు.



మాట్లాడుతున్న వి.ఎల్.రాజు

ప్రజల పక్షాన నిలబడితే నక్సలైట్ ముద్ర వేస్తారా?

లిబర్టీ: ప్రజా సమస్యల పరిష్కారం, కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా ఏఐసీసీ మాజీ అధ్యక్షులు, లోక్‌సభ సభ్యులు రాహుల్‌గాంధీ పోరాటం చేస్తుంటే కేంద్ర ప్రభుత్వం అర్బన్ నక్సలైట్‌గా చిత్రీకరించడాన్ని మాల మహానాడు ప్రధాన కార్యదర్శి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు వెన్న సదానందు తప్పుపట్టారు. ప్రజల పక్షాన నిలబడి పోరాడితే నక్సలైట్ ముద్ర వేస్తారా అని ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జూడో యాత్రతో రాహుల్‌గాంధీకి ప్రజాదరణ పెరిగిందని దాన్ని జీర్ణించుకోలేక కేంద్ర ప్రభుత్వం రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ పార్టీకి వస్తున్న ఆదరణ తట్టుకోలేక అర్బన్ నక్సలైట్‌గా ముద్ర వేసి దెబ్బతీయాలని చూస్తే గుణపాఠం తప్పదని హెచ్చరించారు.

'నిరుపేదల కలలను సాకారం చేసేలా కేంద్ర బడ్జెట్'

సనత్‌నగర్: నిరుపేద కలలను సాకారం చేసేవిధంగా ప్రధాని మోదీ బడ్జెట్ ఉందని బీజేపీ సీనియర్ నేత వెల్లాల రామ్మోహన్ అన్నారు. అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం జరిగే విధంగా బడ్జెట్‌ను రూపొందించారంటూ మోదీ చిత్రపటానికి గురువారం ఆయన పాలాభిషేకం చేశారు. సనత్‌నగర్ స్వామి సోలిటేర్ అపార్ట్‌మెంట్స్ వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో వెల్లాల రామ్మోహన్ మాట్లాడుతూ..పేద, మధ్యతరగతి వర్గాలను ఆదుకునే విధంగా 2025–26 వార్షిక బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ రూపొందించారన్నారు. ప్రధానమంత్రి ధన ధాన్య కృషి యోజన పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో దేశంలో వెనుకబడిన 100 జిల్లాలను గుర్తించి ఆ జిల్లాల సమగ్ర అభివృద్ధికి కృషి చేసే అద్భుత పథకమన్నారు. కిసాన్ క్రెడిట్ కార్డు రుణ పరిమితిని రూ.3 లక్షల నుంచి 5 లక్షల వరకు పెంచడంతో రైతాంగానికి ఎంతో లాభంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు కృష్ణచైతన్య, నాయకులు సుబ్బారావు, రాంప్రసాద్, శ్రీనివాస్, రవి చిటుకుల, రాజేంద్రచారి, చిన్నమ్మ, అనురాధ, మురళీ కిషోర్, బాలాజీ, లక్ష్మి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

దశాబ్దాల సమస్యకు ముగింపు పలికిన ఘనత రేవంత్ రెడ్డిదే..



అభివాదం చేస్తున్న ప్రముఖులు

పంజగుట్ట: ఏ ఉద్యమమైనా ఎప్పుడో ఒకప్పుడు ముగింపు పలకాల్సింది ప్రభుత్వమే అని, కాని ఇప్పటి వరకు పాలకులు మాదిగలను కేవలం ఓట్ల కోసమే వాడుకున్నారు వారి సమస్య పరిష్కరించింది రేవంత్ రెడ్డి ప్రభుత్వమే అని పలువురు పేర్కొన్నారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మాదిగ మేధావుల ఫోరం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అధ్యక్షులు డాక్టర్ ఆరేపల్లి రాజేందర్, ప్రొఫెసర్ కాశీం, ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తం, డాక్టర్ వెంకటేష్ మాట్లాడారు. 30 ఏళ్లుగా విశ్రాంతి లేకుండా న్యాయమైన డిమాండ్ కోసం కృషి చేసిన మందకృష్ణ మాదిగకు మాదిగ మేధావుల ఫోరం తరఫున కృతజ్ఞతలు అన్నారు. అందరూ వర్గీకరణ పట్ల అనుకూలంగా ఉన్నారని, హామీలు ఇచ్చారని అమలు చేసింది మాత్రం రేవంత్‌రెడ్డే అన్నారు. ఐదు రోజుల్లో వర్గీకరణ జీఓ తీసుకు రావాలని అప్పుడే మాదిగల్లో ఉన్న ఆందోళన తొలగిపోతుందన్నారు. త్వరలోనే ముఖ్యమంత్రిని కలిసి కృతజ్ఞతగా విజయోత్సవ సభ ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ మల్లేశం, మేడి శ్రీను, డాక్టర్ మద్దిలేటి, ప్రొఫెసర్ శ్రీనివాస్, డాక్టర్ భాస్కర్, ప్రొఫెసర్ నతాని పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ తప్పించుకునేందుకు యత్నం

పోలీసులకు చిక్కిన మందుబాబులు

బంజారాహిల్స్: మద్యం మత్తులో కారు నడుపుతూ డ్రంకెన్ డ్రైవ్ నుంచి తప్పించుకునే క్రమంలో ఎదురుగా ఆగిన కారును ఢీకొట్టిన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..బాచుపల్లికి చెందిన పాలమాకుల మృదుల్ (20), చింతల్‌కు చెందిన రితుల్‌కుమార్‌రెడ్డి (22), కొంపల్లికి చెందిన అజయ్ మంతెన (22), గుండ్లపోచంపల్లికి చెందిన మెన్నేని అజయ్‌రావు (21), బహదూర్‌పురాకు చెందిన జక్కుల వికాస్(24) బుధవారం రాత్రి జూబ్లీహిల్స్‌లోని ఓల్డ్ పబ్‌లో మద్యం తాగి రాత్రి 11.30 సమయంలో టీఎస్ 07 ఈసీ 1717 కారులో తిరుగు ప్రయాణమయ్యారు. పాలమాకుల మృదుల్ కారు నడుపుతున్నాడు. జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్–10లోని డైమండ్ హౌస్ వద్ద ట్రాఫిక్ పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తుండగా సిద్ధార్థ అనే సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ తన కారులో వెళ్తూ ట్రాఫిక్ పోలీసులు ఆపడంతో కారును నిలిపాడు. అదే సమయంలో వచ్చిన మృదుల్ డ్రంకెన్ డ్రైవ్ చూసి తప్పించుకునేందుకు వెనక్కి తిప్పేందుకు ప్రయత్నిస్తూ సిద్ధార్థ కారును ఢీకొట్టాడు. వీరంతా పారిపోతుండగా పోలీసులు పట్టుకున్నారు.

ఆన్‌లైన్‌లో రిటర్న్ మనీ పేరిట మోసం

వెంగళరావునగర్ : ఆన్‌లైన్‌లో నగదు చెల్లిస్తే అధిక మొత్తంలో తిరిగి ఇస్తామంటూ మోసం చేసిన వ్యక్తిపై మధురానగర్ పీఎస్‌లో కేసు నమోదైంది. వెంగళరావునగర్‌కాలనీలో నివసించే బి.రాజశేఖర్ ప్రైవేట్ సంస్థలో ఇంజినీర్‌గా విధులు నిర్వహిస్తుంటాడు. గతేడాది మే నెలలో రవిప్రకాశ్ అనే వ్యక్తి నుంచి మెసేజ్ వచ్చింది. మనీ మార్కెటింగ్ సంస్థ క్రిప్టో కరెన్సీ ద్వారా నగదు చెల్లిస్తే అధిక లాభాలు వస్తాయని చెప్పడంతో రాజశేఖర్ విడతల వారీగా రూ.35,999 నగదును పంపాడు. ఎలాంటి లాభాలు రాకపోగా చెల్లించిన నగదు తిరిగి ఇవ్వాలని కోరగా స్పందించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

బంగారు ఆభరణాలు చోరీ

బంజారాహిల్స్: కుటుంబంతో కలిసి బయటకు వెళ్లొచ్చే సరికి బంగారు ఆభరణాలు చోరీకి గురైన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బంజారాహిల్స్ రోడ్డునెంబర్–12లోని కిమ్టీ బంజారా హైట్స్‌లో నివసించే దీపక్‌కుమార్ కిమ్టీ గత నెల 22న కుటుంబంతో కలిసి బయటకు వెళ్లి మధ్యాహ్నం ఇంటికొచ్చే సరికి వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి. డెస్క్‌పై ఉంచిన తొమ్మిది గ్రాముల బంగారం, వజ్రం ఉంగరం కనిపించలేదు. ఇంట్లో పనిచేసే రాహుల్‌కుమార్‌ను ప్రశ్నించగా తెలియదని చెప్పాడు. అయితే.. కొన్ని రోజులకు రాహుల్ చెప్పకుండా స్వస్థలమైన బిహార్‌కు వెళ్లిపోయాడు. అతడిపై అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పాఠశాల భవన నిర్మాణ పనులు ప్రారంభం



పనుల ప్రారంభోత్సవంలో పాల్గొన్న నాయకులు

ఫిలింనగర్: ఫిలింనగర్‌లోని బీజేఆర్‌నగర్ బస్తీలో రూ.40 లక్షల వ్యయంతో నిర్మించనున్న ప్రభుత్వ పాఠశాల భవన నిర్మాణ పనులకు గురువారం జూబ్లీహిల్స్ డివిజన్ కాంగ్రెస్ నేత మామిడి నర్సింగరావు శంకుస్థాపన చేశారు. శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనాన్ని పునఃనిర్మించాలని పదేళ్లుగా స్థానికులు డిమాండ్ చేస్తుండగా ఎట్టకేలకు ప్రభుత్వం స్పందించి నిధులు మంజూరు చేసింది. జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ స్కూల్ నిర్మాణానికి బడ్జెట్ మంజూరు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో రమేష్, యాదగిరి, దామోదర్, రాములమ్మ, ధనమ్మ, మల్లీశ్వరి, శ్రీనివాస్, రవి, బాలరాజ్‌గౌడ్, రాజు పాల్గొన్నారు.


'లక్ష డప్పులు.. వేల గొంతులు' సభకు తరలిరావాలి



మాట్లాడుతున్న అంజయ్య

రహమత్‌నగర్ : ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగే లక్ష డప్పులు.. వేల గొంతులు సభకు భారీగా తరలిరావాలని రాష్ట్ర లేబర్ బోర్డు మాజీ సభ్యులు, భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంధం అంజయ్య మాదిగ పేర్కొన్నారు. గురువారం ఆయన నియోజకవర్గంలో పలు లేబర్ అడ్డాల్లో పర్యటిస్తూ మాట్లాడారు. నేడు ట్యాంక్ బండ్ వద్ద జరిగే సభకు భవన నిర్మాణ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు.

బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలి



మాట్లాడుతున్న ఎర్ర సత్యనారాయణ

కాచిగూడ: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించి చట్టబద్ధత కల్పించకపోతే ఉద్యమిస్తామని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ హెచ్చరించారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రకటించిన కులగణనలోని బీసీ జనాభా తగ్గింపు అంశంపై తక్షణమే సవరణకై కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో బీసీ జనాభా 52 శాతం నుంచి 56 శాతం వరకు ఉంటుందని, ఇప్పటి వరకు జరిగిన అన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ సందర్భాల్లో జరిగిన ఎన్నో సర్వేలు పేర్కొంటుంటే దానికి విరుద్ధంగా బీసీల జనాభాను 46 శాతానికి కుదించటం ద్వారా బీసీల మనోస్థైర్యాన్ని దెబ్బతీసిందన్నారు. కొందరు బీసీ నేతలతో తనను తిట్టించుకుని దృష్టి మళ్లించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో వేముల రామకృష్ణ, కోల జనార్ధన్, సుధాకర్, మల్లేష్ పాల్గొన్నారు.


ముగిసిన పీలి దర్గా ఆరాధన మహోత్సవాలు

రహమత్‌నగర్ : బోరబండ డివిజన్ సైట్–2 ఖ్వాజాఆయాజ్ చిస్టి ట్రస్ట్(పీలి దర్గా) ఆరాధన మహోత్సవాలు గురువారం ప్రత్యేక కార్యక్రమాలతో ముగిసాయి.ఆరాధర మహోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి సందాల్ ఊరేగింపు స్థానిక దర్గా నుంచి బంజరానగర్‌కు వరకు కొనసాగింది.ఉదయం తిలావతే ఖురాన్, మహఫిల్–ఏ– సమా తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

తీసుకున్న డబ్బు ఇవ్వడం లేదంటూ ఫిర్యాదు

వెంగళరావునగర్ : ఆడిటర్ అని నమ్మి డబ్బులిస్తే మోసం చేసిన వ్యక్తిపై మధురానగర్ పీఎస్‌లో కేసు నమోదైంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డిగూడలో నివసించే నరేష్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. 2020లో నెట్‌వర్క్ సంబంధిత కంపెనీని ప్రారంభించాడు. అతని వద్ద ఆడిట్ కన్సల్టెంట్‌గా గుంటూరుకు చెందిన వాకా సతీష్ పని చేస్తున్నాడు. ఇటీవల సతీష్ కూడా మ్యాన్ పవర్ కంపెనీని ఏర్పాటు చేసుకున్నాడు. తన కంపెనీకి కొంత నగదు పంపాలని, కంపెనీ టర్నోవర్ కోసం సాయం చేయాలని కోరాడు. నమ్మిన వ్యక్తి అని నరేష్ విడతల వారీగా రూ.59 లక్షలను సతీష్‌కు పంపాడు. ఎన్ని రోజులైనా తన డబ్బులు ఇవ్వకపోవడంతో నరేష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



ఆధార్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మురళీకృష్ణ

వెంగళరావునగర్ : ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఫస్ట్ బెటాలియన్ కమాండెంట్ పి.మురళీకృష్ణ పేర్కొన్నారు. యూసుఫ్‌గూడలోని టీజీఎస్పీ ఫస్ట్ బెటాలియన్‌లో గురువారం ఆధార్ కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆధార్ కార్డులో మార్పులు చేర్పులు ఉంటే ఈ కేంద్రం వద్దకు వచ్చి చేసుకోవాలని సూచించారు. రెండు రోజుల పాటు ఆధార్ సేవలు బెటాలియన్‌లో అందుబాటులో ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్స్ టి.నరేందర్‌సింగ్, రామకృష్ణ, అసిస్టెంట్ కమాండెంట్స్ రాంబాబు, రవిచంద్ర, అప్రోయ్, కెవివి ప్రసాద్, ఆర్ఐలు ధర్మారావు, రాజేష్, జాఫర్, శంకర్, ఆర్ఎస్ఐలు, బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

వేర్వేరు ఘటనల్లో ముగ్గురి రిమాండ్

ఫిలింనగర్: వేర్వేరు ఘటనల్లో ముగ్గురిని రిమాండ్‌కు తరలించిన ఘటన ఫిలింనగర్, బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ల పరిధిలో చోటు చేసుకున్నాయి. పోలీసుల వివరాల ప్రకారం.. ఫిలింనగర్ రోడ్డు నెంబర్–8లో ఈ నెల 26 అర్ధరాత్రి ఓ వ్యక్తి నడుచుకుంటూ వెళ్తుండగా ఇద్దరు బైక్‌పై వచ్చి అతడి మొబైల్ ఫోన్‌ను తస్కరించుకుని పారిపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సాంకేతికతను ఉపయోగించిన పోలీసులు టోలిచౌకి సీతారామం టెంపుల్ సమీపంలోని ఆటో స్టాండ్‌లో ఉన్న బీజేఆర్‌నగర్‌కు చెందిన నీలంసాయి, కర్పతి శ్రీధర్‌ను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

గంజాయి తాగుతున్న యువకుడు..

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్–12లోని కమాన్ ఎన్‌బీటీనగర్‌లో నివసించే వినయ్ (24) డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. గంజాయికి అలవాటు పడి తరచూ వివిధ ప్రాంతాల నుంచి గంజాయి కొనుగోలు చేసి తాగేవాడు. సమాచారం అందుకున్న పోలీసులు గురువారం కమాన్ వద్ద గంజాయి తాగుతుండగా అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

సాక్షి శుక్రవారం, 7, ఫిబ్రవరి, 2025

నగరంలో నేడు

- మాదాపూర్ శిల్పారామంలో : ఒడిస్సా ఫుడ్ అండ్ క్రాఫ్ట్ మేళా ఉదయం 10.30గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు, ఒడిస్సా సాంప్రదాయ నృత్య ప్రదర్శన సాయంత్రం 5 గంటలకు
- నుమాయిష్ ఎగ్జిబిషన్: నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు
- చిత్రప్రదర్శన : మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో రివైవింగ్ ది రూట్స్ పేరిట కళాకారుడు డాక్టర్ కొండపల్లి శేషగిరిరావు వేసిన చిత్ర ప్రదర్శన ఉదయం 10.30 నుంచి సాయంత్రం 7 గంటల వరకు
- లైఫ్ స్టైల్ ఎగ్జిబిషన్ : బంజారాహిల్స్ రోడ్ నెంబరు.2లోని హోటల్ తాజ్ కృష్ణాలో ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు
- కిసాన్ అగ్రి షో -2025 : మాదాపూర్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు
- మధుమేహం, కార్డియారినల్ సమస్యల సదస్సు : ట్యాంక్‌బండ్ రోడ్‌లోని మారియట్ హోటల్‌లో ఉదయం 8 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

ఇదేం సర్వే..?

'ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం ఐదు రోజుల్లో సర్వేను పూర్తిచేస్తాం.. ఆ తరువాత నాలుగు రోజుల్లో వార్డు సభలు నిర్వహించి ఎంపికైన వారి వివరాలను వెల్లడిస్తాం' అని గొప్పగా చెప్పిన గ్రేటర్ అధికారులు ఆ విషయమే మర్చిపోయారు. మహానగరంలో గతనెల 16న ప్రారంభమైన ఇందిరమ్మసర్వే ఇంకా కొనసాగుతూనే ఉంది. దీంతో లబ్ధిదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

– సాక్షి, సిటీబ్యూరో

'ఇందిరమ్మ' సర్వే కోసం.. ఇంకొంత సమయం

- జీహెచ్‌ఎంసీలో ఇంకా పూర్తి కాని సర్వే
- గతనెల 20కే పూర్తవుతుందని చెప్పిన అధికారులు
- ఇప్పటికీ కొనసాగుతున్న సర్వే



జీహెచ్ఎంసీ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద అర్హుల ఎంపికకు సర్వే ఇంకా కొనసాగుతోంది. జీహెచ్ఎంసీయేతర ప్రాంతాల్లో ఇప్పటికే సర్వే పూర్తయి వార్డు, గ్రామ సభలు జరిగినప్పటికీ జీహెచ్ఎంసీలో మాత్రం సర్వే ఇంకా పూర్తికాలేదు. గతనెల 16న ప్రారంభమైన సర్వే 20వ తేదీకే పూర్తవుతుందని, 21 నుంచి 24 తేదీల మధ్య లబ్ధిదారుల వివరాలు వార్డుసభల ద్వారా వెల్లడిస్తామని అధికారులు ప్రకటించారు. అయితే.. నగరంలో సర్వే ఆశించినంత వేగంగా సాగడం లేదు. దీంతో 22వ తేదీన గృహనిర్మాణశాఖ అధికారులు ఒక ప్రకటన జారీ చేశారు. వారం రోజుల్లో సర్వే పూర్తి కానుందని దరఖాస్తుదారులు ఆందోళన చెందవద్దని, దరఖాస్తు చేసుకున్న ప్రతి ఇంటికీ సర్వే అధికారులు వస్తారని హామీ ఇచ్చారు. రెండు వారాలైనా ఈ సర్వే ఇంకా పూర్తికాలేదు.

మరో వారం..

సర్వే నత్తనడకన నిర్వహించడానికి అనేక కారణాలున్నాయి. ఇంటి చిరునామాకు వస్తున్నామని చెప్పేందుకు సర్వే సిబ్బంది ఫోన్లు చేసినా కొందరు స్పందించడం లేదు. ఇళ్ల వద్దకు వెళ్లినప్పుడు కొందరు తమ వివరాలిచ్చేందుకు నిరాకరిస్తున్నారు. కొందరు దరఖాస్తులో పేర్కొన్న చిరునామాలో లేరు. కొందరి ఇళ్లకు తాళాలు వేసి ఉన్నాయి. కొన్ని దరఖాస్తులు జీహెచ్ఎంసీయేతర ప్రాంతాలవి ఉన్నాయి. ఇలాంటి వారు దాదాపు లక్ష మంది వరకు ఉండవచ్చునని అంచనా. మిగతా వారందరి సర్వే పూర్తయ్యేందుకు మరో వారం పట్టవచ్చునని తెలుస్తోంది.

సొంత స్థలాల్లేక..

సొంత స్థలాలుండి ఇళ్లు నిర్మించుకోవాలనుకునేవారికి ప్రభుత్వం రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందించనుండటం తెలిసిందే. జీహెచ్ఎంసీ పరిధిలో అలా సొంత స్థలాలున్న వారికంటే స్థలం లేనివారే ఎక్కువగా ఉన్నారు. వారికి మరో రకంగా ప్రయోజనం కల్పించాలని భావిస్తున్న ప్రభుత్వం వారి వివరాలు కూడా సేకరిస్తోంది. జీహెచ్ఎంసీలో సర్వే జాప్యం కావడానికి ఇదీ ఒక కారణమని చెబుతున్నారు.

84వేల మంది కోసం వడపోత..

సర్వే పూర్తయ్యాక గ్రేటర్ పరిధిలో ఈ విడత అర్హులుగా 84వేల మందికి ప్రయోజనం కల్పించనున్నారు. నియోజకవర్గానికి 3500 మంది చొప్పున లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల ప్రయోజనం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అలా జీహెచ్ఎంసీ పరిధిలో 24 నియోజకవర్గాల్లో 84వేల మందికి ప్రయోజనం కలుగనుంది. కంటోన్మెంట్ బోర్డు కూడా జీహెచ్ఎంసీ పరిధిలో ఉండటంతో ఆ వివరాలూ సర్వే చేస్తున్నారు.

ఇప్పటి వరకు జరిగిన సర్వే వివరాలు..

జోన్	సర్కిళ్లు	దరఖాస్తులు	సర్వే పూర్తి	ఎంత శాతం
శేరిలింగంపల్లి	4	111282	110546	99.34
సికింద్రాబాద్	5	192527	178901	92.92
ఖైరతాబాద్	5	160984	144961	90.05
ఎల్‌బీనగర్	5	157211	141390	89.94
కూకట్‌పల్లి	5	201565	180310	89.46
చార్మినార్	6	213736	190121	88.95
కంటోన్మెంట్‌బోర్డు	1	29648	21347	72.00
మొత్తం	31	1066953	967576	90.69

వార్డు సభల కోసం ఎదురుచూపులు

ఈ సర్వే పూర్తయ్యాక నిర్వహించే వార్డు సభల్లోనే రేషన్‌కార్డుల్లేని వారి నుంచి కొత్త రేషన్‌కార్డులకోసం దరఖాస్తులు స్వీకరించనున్నట్లు అధికారులు ప్రకటించారు. రేషన్ కార్డుల కోసం ఎదురు చూస్తున్న ఎందరో కూడా ఎప్పుడు వార్డు సభలు నిర్వహిస్తారో తెలియక ఆందోళన చెందుతున్నారు.

ప్రైవేటు చాపర్‌కు తప్పిన ముప్పు

- బేగంపేట ఎయిర్‌పోర్టులో ఘటన
- రన్‌వేను బలంగా తాకిన చాపర్
- దెబ్బతిన్న రన్‌వే
- ల్యాండింగ్ సమయంలో సాంకేతిక సమస్య
- చాపర్‌లో ఇద్దరు పైలెట్లు

సనత్‌నగర్: పైలట్లకు శిక్షణనిచ్చే ప్రైవేటు చాపర్‌కు పెనుప్రమాదం తప్పింది. ల్యాండింగ్ [illegible] పంక్చర్ అయ్యింది. ఈ ప్రమాదంతో ఒక్కసా [illegible] అంతరాయం కలగలేదు.

డీఈఓకు సత్కారం

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కేంద్ర ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ ద్వారా ప్రకటించే పీజీఐ పర్ఫార్మెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్ సూచికలో జిల్లా స్థాయి ఉత్తమ కేటగిరిలో నిలిచింది.ఈ సందర్భంగా గురువారం మేడ్చల్ డీఈఓ విజయకుమారిని ఆర్‌యుపిపి టిజి జిల్లా శాఖ ఆధ్వర్యంలో సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు వీఎస్ఎస్‌సీఎస్ శర్మ, ఏఎంఓ రవీందర్ రాజు పాల్గొన్నారు.

హెచ్‌సీయూలో పలు కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

రాయదుర్గం:హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ వర్చువల్ లెర్నింగ్ (సీడీవీఎల్) ద్వారా వివిధ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఏడాది కాలపరిమితితో కూడిన ఈ డిప్లొమా కోర్సులకు యూజీసీ అనుమతి ఉందని అధికారులు తెలిపారు. బిజినెస్ మేనేజ్‌మెంట్, ప్రాజెక్టు మేనేజ్‌మెంట్, సైబర్‌లాస్, ఫోరెన్సిక్ సైన్స్, లైబ్రెరీ ఆటోమేషన్ నెట్ వర్కింగ్, కమ్యూనికేటివ్ ఇంగ్లీష్, ఇన్‌ఫెక్షన్ ప్రివెన్షన్ కంట్రోల్, కమ్యూనిటీ ఐ హెల్త్ తదితర కోర్సులకు దరఖాస్తు చేసుకోవచ్చు. పూర్తి వివరాలకు హెచ్‌సీయూ వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు.

అగ్రి వర్సిటీతో 'ఇండో క్లైమేట్ సెన్స్' ఒప్పందం



ఏజీవర్సిటీ: నేలలోని పోషకాల స్థాయిని గుర్తించే సెన్సార్లపై కలిసి పని చేసేందుకు ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, హైదరాబాద్‌కు చెందిన ఇండో క్లైమేట్ సెన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌ల మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. అగ్రి హబ్‌లో వీసీ డాక్టర్ అల్దాస్ జానయ్య సమక్షంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ విద్యాసాగర్, ఇండో క్లైమైట్ సైన్స్ ప్రతినిధి రామచంద్రులు అవగాహన ఒప్పందాలపై గురువారం సంతకాలు చేశారు. కార్యక్రమంలో పరిశోధన సంచాలకులు డాక్టర్ బలరామ, డాక్టర్ కె.పి.రాణి పాల్గొన్నారు.

నేటి నుంచి మహిళా భక్త సమ్మేళనం

సాక్షి, హైదరాబాద్: ఆధునిక మహిళ శారదమ్మ బాటలో పయనించేలా ప్రేరేపించే సంకల్పంతో దక్షిణ భారత రెండవ మహిళా భక్త సమ్మేళనాన్ని హైదరాబాద్‌లోని కన్యా శాంతివనంలో నిర్వహిస్తున్నట్టు ప్రవాజిక భవానీ ప్రాణ మాతాజీ తెలిపారు. గుంటూరు రామకృష్ణ శారదా మిషన్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 7 నుంచి 9వ తేదీ వరకు మూడు రోజుల పాటు ఈ కార్యక్రమం జరగనుందని వెల్లడించారు. తొలిరోజు యువ సమ్మేళనం జరుగుతుందన్నారు. ఆధ్యాత్మిక ప్రసంగాలు, చర్చాగోష్టులు, సాంస్కృతిక కార్యక్రమాలతో సాగే మా శారదా మహిళా సమావేశాలను జయప్రదం చేయాలని భవానీ ప్రాణ మాతాజీ కోరారు.

సెల్లార్ పనుల్లో మరణాలపై .. షోకాజ్ నోటీసులు

సాక్షి,సిటీబ్యూరో:ఎల్‌బీనగర్ పరిధిలో సెల్లార్ పనుల్లో ముగ్గురు కార్మికులు మృతి చెందిన ఘటనలో భవన యజమాని, ఆర్కిటెక్ట్, స్ట్రక్చరల్ ఇంజినీర్లకు జీహెచ్ఎంసీ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. నిర్మాణంలో అడుగడుగునా ఉల్లంఘనలుండి ముగ్గురి మరణాలకు కారణమైనందున ఎందుకు చర్యలు తీసుకోరాదో ప్రశ్నిస్తూ షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది.

పరీక్ష నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

- డీఆర్‌ఓ వెంకటాచారి
- కంబైండ్ జియో సైంటిస్ట్ ప్రిలిమినరీ పరీక్ష ఏర్పాట్లపై సమీక్ష



లక్డీకాపూల్ : యుపీఎస్సీ కంబైండ్ జియో సైంటిస్ట్ ప్రిలిమినరీ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి వెంకటాచారి తెలిపారు. గురువారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో పరీక్ష నిర్వహణపై సూపర్‌వైజర్లు, రూట్ ఆఫీసర్లు, స్థానిక అధికారులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిఆర్‌ఓ మాట్లాడుతూ.. హైదరాబాద్ జిల్లాలో మూడు పరీక్షా కేంద్రాల్లో పరీక్ష జరుగుతుందన్నారు. ఆయా పరీక్షా కేంద్రాలకు అభ్యర్థులు గంట ముందే చేరుకోవాలన్నారు. 803 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారన్నారు. సమావేశంలో రూట్ అధికారులు, లోకల్ ఇన్స్పెక్టింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కులగణన కేవలం అంకెల గారడీ



మాట్లాడుతున్న ప్రొఫెసర్ మురళీ మనోహర్

పంజగుట్ట: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుల గణన లెక్కలు తప్పుల తడకలని, అది కేవలం అంకెల గారడీ అని బీసీ మేధావులు పేర్కొన్నారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయా సంఘాల ప్రతినిధులు ప్రొఫెసర్ మురళీ మనోహర్, దేవళ్ల సమ్మయ్య, ప్రొఫెసర్ తిరుమలి, ప్రొఫెసర్ ఎస్.సింహాద్రి, డాక్టర్ ఎస్.పృథ్వీరాజ్ యాదవ్‌లు మాట్లాడారు. కుల గణన కేవలం 50 శాతం మాత్రమే జరిగిందని మిగిలిన 50 శాతం అసలు జరగలేదని అన్నారు. 51 శాతం ఉన్న బీసీలు 10 సంవత్సరాల్లో 46 శాతానికి ఎలా పడిపోతారని ప్రశ్నించారు. సమగ్ర కుటుంబ సర్వే చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా విఫలమైందని, వారు చేసిన తప్పులు ఎత్తి చూపడంలో ప్రధాన ప్రతిపక్షాలు విఫలమయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం 3.1 శాతం మాత్రమే సర్వే చేయలేదని ప్రభుత్వం చెబుతున్నా చాలా చోట్ల సర్వే నిర్వహించలేదన్నారు. కులగణన సర్వేకు ఉత్తమ్ కుమార్ రెడ్డి చైర్మన్‌గా ఎలా ఉంటాడని, ఆయన ఉన్నప్పుడే ఇది రాజకీయ ఉద్దేశంతో రూపొందించిన డేటా అని అర్థమవుతోందన్నారు. బిహార్, ఇతర రాష్ట్రాల్లో కుల గణన చేసినప్పుడు ఒక యాప్ తయారు చేశారని, మిస్ అయిన వారు మీసేవ ద్వారా అయినా, ఇతర కార్యాలయాల్లోకి వెళ్లి నమోదు చేసుకునే అవకాశం కల్పించారని ఇక్కడ అలాంటిదేదీ లేదన్నారు. ఇది బీసీలను మభ్యపెట్టేందుకు నామమాత్రంగా చేసిన సర్వే అన్నారు. సమావేశంలో తుల్జారామ్ సింగ్, సతీష్ కొట్టే తదితరులు పాల్గొన్నారు.

వైద్యరంగంలో మరిన్ని పరిశోధనలు జరగాలి

కేపీహెచ్‌బీకాలనీ: వైద్యరంగంలో రోగ నిర్ధారణ మందుల అభివృద్ధి, కేన్సర్ చికిత్సపై మరిన్ని పరిశోధనలు జరగాల్సిన అవసరం ఉందని జాన్ హాప్కిన్స్ స్కూల్ ఆఫ్ మెడిసిన్ ప్రొఫెసర్ డా. శ్రీధర్ నిమ్మగడ్డ తెలిపారు. జేఎన్‌టీయూహెచ్‌లో పీజీ, యూజీ విద్యార్థుల కోసం 'ఇమేజింగ్ ఫర్ డ్రగ్ డెవలప్‌మెంట్' అనే అంశంపై గురువారం నిర్వహించిన సదస్సులో ఆయన ప్రసంగించారు. కేన్సర్ చికిత్సలో నూతన పరిజ్ఞానం, ఇమేజింగ్, థెరానోస్టిక్స్, ఆహారపు ప్రభావం తదితర అధ్యయనాలతో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. క్యాన్సర్ నివారణను మెరుగుపరిచేందుకు శాస్త్రవేత్తలు అధునాతన వైద్య పద్ధతులను అభివృద్ధి చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ డా. కె. వెంకటేశ్వర రావు, కళాశాల ప్రిన్సిపాల్ డా.జీవీ నరసింహారెడ్డి, విభాగ అధిపతి డాక్టర్ అర్చనగిరి, డా. సైదా నాయక్ పాల్గొన్నారు.



సదస్సులో పాల్గొన్న ప్రొఫెసర్ శ్రీధర్ నిమ్మగడ్డ, తదితరులు

వైఎస్సార్ హయాంలోనే నగరాభివృద్ధి

శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్



బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ నూతన కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్, మంత్రి శ్రీధర్‌బాబు

బండ్లగూడ: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలోనే హైదరాబాద్ నగరం అత్యంత వేగంగా అభివృద్ధి చెందిందని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ అన్నారు. హిమాయత్‌సాగర్ వద్ద రూ. 40.40 కోట్ల తో చేపట్టిన పలు అభివృద్ధి పనులను మంత్రి శ్రీధర్‌బాబు, ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ..బడుగు బలహీన వర్గాలకు సామాజిక న్యాయం చేయాలనే తపనతో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేవలం పరిపాలన చేపట్టిన సంవత్సరంలోనే గొప్ప నిర్ణయాలను అమలు చేశారన్నారు. నగర అభివృద్ధికి నవాబుల నుంచి నేటి ముఖ్యమంత్రుల వరకు అందరూ కృషి చేశారన్నారు. అందుకే ఈ నగరం ఇంతగా అభివృద్ధి చెందిందన్నారు. ముఖ్యంగా డాక్టర్ వైఎస్ఆర్ హయాంలో హైదరాబాద్ నగరం అత్యంత వేగంగా అభివృద్ధి చెందిందన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు, శంషాబాద్ విమానాశ్రయాలను నిర్మించడంతో పాటుగా మెట్రో నిర్మాణానికి సర్వేలు చేయించడంతో ఊహించనంత అభివృద్ధి చెందిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నగరం అన్ని వైపులా సమానంగా అభివృద్ధి చెందే విధంగా ప్రణాళికలను అమలు చేస్తున్నారన్నారు.

పేదలకు కచ్చితంగా మేలు చేస్తాం మంత్రి శ్రీధర్‌బాబు

అనేక సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఎస్సీ వర్గీకరణ సమస్యను పరిష్కరించిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనన్నారు. ప్రజాపాలన అంశానికి సంబంధించిన విషయంలో ఎంతమంది ఎన్ని ఇబ్బందులు పెట్టినా పేదవారికి మేలు జరగాలనే ఆలోచనతో ముందుకు వెళ్తున్నామన్నారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, ముదిరాజ్ సంఘం సొసైటీ చైర్మన్ జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన సమాజమే లక్ష్యం

అదనపు కలెక్టర్ ముకుంద రెడ్డి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ముకుంద రెడ్డి

లక్డీకాపూల్ : ఆరోగ్య వంతమైన సమాజం కోసం పిల్లలకు నులిపురుగుల నివారణ మాత్రలివ్వాలని జిల్లా అదనపు కలెక్టర్ ముకుంద రెడ్డి పేర్కొన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా ఈ నెల 10న జిల్లాలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలు, అంగన్వాడి కేంద్రాలు, మదర్సాలు, ఎస్సీ ఎస్టి బీసీ మైనార్టీ గురుకులాల్లో 10 లక్షల 17 వేల239 మంది పిల్లలు ఉన్నారన్నారు. వారందరికీ నులిపురుగుల నివారణ మాత్రలను వేయించాలన్నారు. శుక్రవారం నుండి జిల్లాలోని అన్ని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో ప్రార్థన సమయంలో విద్యార్థులకు నులి పురుగుల నివారణ మాత్రలపై అవగాహన కల్పించాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకట్, డిఈఓ ఆర్ రోహిణి, సిఎంఓ హెచ్ డాక్టర్ పద్మజ పాల్గొన్నారు.

వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించాలి

అపోలో హాస్పిటల్స్ జేఎండీ డాక్టర్ సంగీతారెడ్డి



కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ సంగీతారెడ్డి తదితరులు

మాదాపూర్: జీవనశైలితో వచ్చే వచ్చే వ్యాధులు అంటువ్యాధులను మించిపోయాయని అపోలో హస్పిటల్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సంగీతారెడ్డి తెలిపారు. మాదాపూర్‌లోని వెస్టిన్ హోటల్‌లో రెండు రోజుల పాటు క్రిటికల్ సర్వీసెస్‌పై నిర్వహించిన శిక్షణ గురువారం ముగిసింది.ఈ సందర్భంగా సంగీతారెడ్డి మాట్లాడుతూ.. జీవనశైలిలో వచ్చే వ్యాధులను ప్రారంభదశలోనే గుర్తించగలిగితే నివారించవచ్చన్నారు. దేశ విదేశాల నుంచి వందమందికిపైగా ఈ శిక్షణ సమావేశానికి హాజరయ్యారు. కార్యక్రమంలో అపోలో హస్పిటల్స్ అసోసియేట్ డైరెక్టర్ మెడికల్ సర్వీసెస్ హెచ్‌ఓడీ డాక్టర్ కె.సుబ్బారెడ్డి, తెలంగాణ రీజియన్ సీఈవో తేజస్వీరావు పాల్గొన్నారు.

ఓయూలో జాతీయ వర్క్‌షాప్ ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న రాష్ట్ర ఉన్నత విద్య మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకృష్ణారెడ్డి, తదితరులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో రెండు రోజుల జాతీయ వర్క్‌షాప్ గురువారం ప్రారంభమైంది. ఓయూ దూర విద్య కేంద్రం ఆడిటోరియంలో ఎడ్యుకేషనల్ డిజిటల్ ఫ్రాంటియర్, మాసివ్ ఓపెన్ ఆన్ లైన్ కోర్స్ రూప కల్పనపై ఈ వర్క్‌షాప్ నిర్వహిస్తారు. ఈఎంఎంఆర్‌సీ డైరెక్టర్ పి.రఘుపతి అధ్యక్షత వహించగా రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకృష్ణారెడ్డి, సీఈసీ డైరెక్టర్ ప్రొఫెసర్ జగత్ భూషణ్ నడ్డా, రాయల సీమ వర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ వై.నర్సింహులు తదితరులు పాల్గొన్నారు. ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించేందుకు డిజిటల్ విద్యా విధానం ఉపయోగపడుతుందన్నారు. మార్కెట్‌లో లక్షల సంఖ్యలో ఉద్యోగాలు ఉన్నాయని నైపుణ్యం లేనందునే ఉద్యోగాలు రావడం లేదని వక్తలు పేర్కొన్నారు. ఏటా ఆన్‌లైన్ విద్య విధానంలో విద్యార్థుల సంఖ్య పెరుగుతోందని 2035 వరకు ఆన్‌లైన్ విద్య ప్రవేశాలు 50 శాతానికి పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో యూజీసీ డీన్ ప్రొఫెసర్ లావణ్య, క్లౌడ్ సెల్ సీఈవో పల్లె శ్రీనివాస్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నరేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షోభంలో ప్రింట్ మీడియా

సీనియర్ జర్నలిస్ట్ దేవులపల్లి అమర్

బంజారాహిల్స్: డిజిటల్ మీడియా వినియోగం పెరగడంతో ప్రింట్ మీడియా తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని సీనియర్ జర్నలిస్ట్ దేవులపల్లి అమర్ పేర్కొన్నారు. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ బషీరుద్దీన్ 89వ జయంతిని పురస్కరించుకుని విశ్వవిద్యాలయంలో ఆయన స్మారకోపన్యాసం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన దేవులపల్లి అమర్ మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితుల్లో డిజిటల్ మీడియా వినియోగం, ఎలక్ట్రానిక్ మీడియా ఉపయోగం బాగా పెరిగిందని, దీంతో వార్తా పత్రికల సర్క్యులేషన్, ప్రకటనల ఆదాయం తగ్గడంతో పాటు అనేక ప్రఖ్యాత పత్రికా సంస్థలు నిలదొక్కుకోవడానికి ఇబ్బంది పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలు, మీడియాపై అభిమానం ఉన్నవాళ్లు ఆయా సంస్థలకు స్వచ్ఛందంగా చందాలు ఇచ్చి లాభాపేక్ష లేని వాటాదారులుగా ఉండాలన్నారు. అప్పుడే ప్రింట్ మీడియాను రక్షించుకునే అవకాశం ఉందని వివరించారు. వీసీ ఘంటా చక్రపాణి మాట్లాడుతూ విశ్వవిద్యాలయ అభివృద్ధికి ప్రొఫెసర్ బషీరుద్దీన్ చేసిన సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ విజయ్‌కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సీనియర్ జర్నలిస్ట్ దేవులపల్లి అమర్

నకిలీ ఐడీతో సచివాలయంలోకి వెళ్లే యత్నం

అదుపులోకి తీసుకున్న భద్రతా సిబ్బంది



నకిలీ ఐడీ కార్డుతో పట్టుబడ్డ అంజయ్య, నకిలీ కార్డు

లక్డీకాపూల్ : తెలంగాణ రాష్ట్ర సచివాలయానికి ఇటీవల కాలంలో నకిలీ ఉద్యోగుల బెడద ఎక్కువైంది. నకిలీ గుర్తింపు కార్డులతో అధికారులుగా చెలామణీ అవుతూ సచివాలయంలో నకిలీ ఉద్యోగులు హల్‌చల్ చేయడం చర్చనీయంశంగా మారింది. ఈ క్రమంలోనే గురువారం మరో నకిలీ ఉద్యోగి సచివాలయంలోకి ప్రవేశించారు. కొంపల్లి అంజయ్య అనే వ్యక్తి తహశీల్దార్ అని చెప్పుకొని సచివాలయంలోకి వెళ్లడాన్ని అక్కడ విధులు నిర్వహిస్తున్న సెక్యూరిటీ సిబ్బంది గుర్తించారు. అనుమానం రావడంతో భద్రతా సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు.అనంతరం సైఫాబాద్ పోలీసులకు అంజయ్యను అప్పగించారు. దీంతో పోలీసులు అతని వద్ద నుంచి ఫేక్ ఐడీ కార్డును స్వాధీనం చేసుకున్నారు. ఒక జిరాక్స్ సెంటర్‌లో తహశీల్దార్‌గా ఫేక్ ఐడీ కార్డు తయారు చేసినట్టుగా పోలీసు విచారణలో వెల్లడైంది.

విభిన్న సంస్కృతుల సమ్మేళనం, విభిన్న రుచుల సంగమం హైదరాబాద్.. వారసత్వం పేర్చిన ఈ ఆహార సంస్కృతిలో దేశవ్యాప్తంగా అన్ని రుచులనూ నగరవాసులు ఆదరిస్తున్నారు, ఆస్వాదిస్తున్నారు. ఈ కల్చరల్ డైవర్సిటీలో తన ప్రశస్తి సువాసనలు నలుదిశలా వెదజల్లుతున్నాయి. అందుకు చక్కని వేదికైంది బెంగాలీ రుచులు ప్రదర్శన. నగరంలో బెంగాలీలు ఉన్నప్పటికీ దాదాపు 40 శాతం వరకూ స్థానికులు కూడా ఆదరణ చూపిస్తున్నారని హైటెక్ సిటీలోని 'ఓ కలకత్తా' రెస్టారెంట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఫిరోజ్ సాద్రి తెలిపారు. గత 25 సంవత్సరాలుగా బెంగాలీ రుచులను అందిస్తున్న 'ఓ కలకత్తా'.. హైదరాబాద్ వేదికగా బెంగాలీ ఆహార సంస్కృతిని పెంచడంలో కీలక పాత్ర పోషిస్తోంది. ఈ నేపథ్యంలో నగరానికి బెంగాలీ ఫుడ్ కల్చర్ వచ్చిన తీరు, ఇక్కడ వినూత్నంగా అందుబాటులో ఉన్న వెరైటీ డిషెస్ గురించి ఫిరోజ్ సాద్రి వెల్లడించారు. - సాక్షి, సిటీబ్యూరో



విందు.. పసందు..

- భాగ్యనగరంలో బెంగాలీ రుచులు..
- సాంస్కృతిక సమ్మేళనంలో వినూత్న వంటకాలు
- 25 ఏళ్లుగా 'ఓ కలకత్తా' పాకశాస్త్ర వైభవం
- 1992లో ముంబై వేదికగా ప్రారంభం
- నగర వాసులను అలరిస్తున్న బెంగాలీ ఫుడ్

దేశాన్ని వందల ఏళ్లు పాలించిన బ్రిటిష్ వారు బెంగాల్ కేంద్రంగా ఎంచుకున్నారు.. ఎందరో ముస్లిం రాజవంశస్తులు పరిపాలించిన ప్రాంతం కూడా బెంగాల్. ఈ ఇద్దరికీ ప్రధాన కేంద్రం హైదరాబాద్. ఇలా సాంస్కృతిక పరిణామంలో నగరానికి బెంగాలీ ఆహారం వచ్చింది. బ్రిటిష్‌వారు స్పైసీ తక్కువ, తీపి ఎక్కువ ఇష్టపడతారు. ఇందులో భాగంగా వారు ప్రత్యేకంగా తయారుచేసుకున్న బెంగాలీ వెరైటీ అడాబ్ చిగిరీ. ఇది కొబ్బరి నీరు, కొబ్బరి క్రీంతో తయారు చేసే అరుదైన వంటకం. ఈ వెరైటీ 'ఓ కలకత్తా'లో లభిస్తుంది. దీనిని నగరవాసులు ఇష్టంగా ఆరగిస్తున్నారు.

హిల్సా ఆఫ్ పాతూరి..

ఈ వెరైటీ మాన్‌సూన్ సీజన్‌లో మాత్రమే లభించే అరుదైన హిల్సా చేపతో తయారు చేస్తారు. దీనిలో మిలియన్ల సంఖ్యలో సన్నని ఎముకలుంటాయి. వీటన్నింటినీ సృజనాత్మకంగా తొలగించి, అరిటాకులో కొబ్బరిని కలిపి స్టీమ్ చేసి వడ్డించే వినూత్న వంటకం. ఇది కలకత్తా స్పెషల్, ఖరీదైనది కూడా. మాన్‌సూన్ సీజన్‌లో బ్రహ్మపుత్ర నదిలో బ్రీడింగ్ కోసం వలస వచ్చే అరుదైన చేప కావడమే దీని ప్రత్యేకత.



మోచా..

అరటి పువ్వుతో ప్రత్యేకంగా తయారు చేసే కలకత్తా వంటకం. అరటి పువ్వులో పోషక విలువలుంటే చిన్న చిన్న పెటల్స్‌తో దీనిని తయారు చేస్తారు. ఆరోగ్యంతో పాటు రుచికరమైనదని చెఫ్ వెల్లడించారు.

గోబిందో బోగ్..

బెంగాల్‌లో గోబిందో బోగ్ రైస్‌ను దేవుని ఆహారంగా భావిస్తారు (ఫుడ్ ఫర్ ది గాడ్). ఇది బెంగాల్‌లో తప్ప మరెక్కడా దొరకదు. సాధారణ బియ్యం, బాస్మతి బియ్యానికీ భిన్నంగా, రుచికరంగా ఉంటుంది. అత్యంత సాధారణమైన బెంగాలీ వంటకం ఈ రైస్ వెరైటీ.

జర్నా ఘీ..

తెలుగు వారి ఆహారంలో నెయ్యికి ఎంతో ప్రాధాన్యం ఉంది. అలాగే బెంగాలీలు కూడా ఆహార పదార్థాల్లో నెయ్యికి ఎక్కువ ప్రాధాన్యతనిస్తారు. ఇందులో భాగంగానే ఫ్లేవర్ కోసం బెంగాలీలు జర్నా నెయ్యిని వాడతారు. ఇది ఒక్క స్పూన్‌తో మొత్తం రుచినే మార్చేస్తుంది.





ఆమ్ ఆదా అల్లం..

నగరవాసులకు సరికొత్త బెంగాలీ రుచులను అందించడానికి కలకత్తా పరిసర ప్రాంతాల నుంచి ఆమ్ ఆదా అల్లంను పరిచయం చేశారని ఫిరోజ్ సాద్రి తెలిపారు. దీనిని మామిడి అల్లం అని పిలుస్తారు. దీంతో చేసే ఆమ్ ఆదా మాచ్‌కు నగరంలో ఆదరణ పెరుగుతోంది.

మిస్టీ దహీ..

బెంగాల్ నుంచి ఎవరైనా హైదరాబాద్ వస్తున్నారంటే విమానంలో కూడా ఓ బాక్స్‌లో పార్సిల్ తెచ్చుకునే ప్రియమైన వెరైటీ ఈ మిస్టీ దహీ(దోయి). ఇది కూడా బెంగాలీ సిగ్నేచర్ వెరైటీ.

మటన్ టిక్కా..

ముస్లింలు ఎక్కువగా ఉండే కలకత్తాలో వారి ప్రత్యేక వంటకం ఇది. షాఫ్రాన్, రోజ్ వాటర్ సమ్మిళితంగా సంప్రదాయ వంటగా దీనిని చేస్తారు. దీనిని నగరవాసులు సైతం ఇష్టంగా తింటున్నారు.

ఇవే కాకుండా ఇండియన్ చికెన్ కట్‌లెట్, రాయల్ మటన్ చాప్స్, కోల్‌కతా బిర్యానీ, రాధునీ మసాలా, రాధా తిలక్ రైస్, చానా పాతూరి, జాక్ ఫ్రూట్ టిక్కీ (స్పైసీ.. సూపర్ ఫుడ్), పెఫెటా చీజ్, మలాయీ కర్రీ, పెటాయ్ పరోటా, ఆమ్‌ఆచావో ఇలా.. విభిన్న రకాల బెంగాలీ రుచులతో ఓ కలకత్తాలో నోరూరిస్తుందని చెఫ్‌లు పేర్కొన్నారు. 1992లో ముంబై వేదికగా నాలుగు టేబుళ్లతో 'ఓన్లీ ఫిష్' పేరుతో అంజన్ ఛటర్జీ ప్రారంభించిన హోటల్ క్రమంగా హైదరాబాద్‌తో పాటు ఢిల్లీ, బెంగళూరు, కోల్‌కతా వంటి 8 ప్రాంతాలతో పాటు యూఏఈ, లండన్‌లో వండి వడ్డిస్తున్నారు.





ఆసియా జ్యువెల్స్

- హోటల్ హరికృష్ణలో ఆభరణాల ప్రదర్శన
- అలరించిన పలువురు సెలిబ్రిటీలు, మోడల్స్

బంజారాహిల్స్‌లోని హరికృష్ణ హోటల్‌లో ఆసియా జ్యువెలరీ ఎగ్జిబిషన్ జరగనుంది. ఇందుకు సంబంధించిన సన్నాహక కార్యక్రమం బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-10లో గురువారం నిర్వహించారు. ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకూ మూడు రోజుల పాటు నిర్వహించనున్న కార్యక్రమంలో సినీతార ప్రతీక మిశ్రా, మిస్ ఇండియా తెలంగాణ ప్రకృతి కంభం పాల్గొన్నారు. వివిధ డిజైన్ల డైమండ్ ఆభరణాలు ధరించి సందడి చేశారు. మోడల్స్ ఆభరణాలను ధరించి ఆకట్టుకున్నారు. - బంజారాహిల్స్



మ్యాజికల్ ఇల్యూజన్..

మెంటలిజం మదిని చదివే కళ
సాక్షితో ముచ్చటించిన సుహానీ షా..

మెంటలిజం, ఇల్యూజన్ వంటి వినూత్న మ్యాజిక్ మాయాజాలాలకు ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పెరిగింది. సోషల్ మీడియాలో మెంటలిస్టులకు ఫాలోయింగ్ అంతా ఇంతా కాదు. ఇదే తరహాలో ప్రముఖ భారత మెంటలిస్ట్, ఇల్యూజనిస్ట్, ఇంద్రజాలికురాలు సుహానీ షా సోషల్ సెలిబ్రిటీగా మారింది. ఒక మనిషిని చూసి తన మనసులో ఏమనుకుంటున్నారో ఇట్టే చెప్పేయగల ప్రముఖ మెంటలిస్ట్ సుహానీ. ఇలా తన మైండ్ రీడింగ్‌తో ప్రపంచ వ్యాప్తంగా ప్రదర్శనలతో హాలీవుడ్, బాలీవుడ్ తారలతో పాటు క్రికెటర్లు, వ్యాపార దిగ్గజాలను మెస్మరైజ్ చేస్తోంది. నగరంలోని ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన 'ది మ్యాజిక్ ఆఫ్ మెంటలిజం' కార్యక్రమంలో ఈ మానసిక మాంత్రికురాలు మరో సారి తన స్కిల్‌తో వావ్ అనిపించింది. ఈ సందర్భంగా ఆమె 'సాక్షి'తో ప్రత్యేకంగా ముచ్చటించారు. మెంటలిజం, ఇల్యూజన్ తదితర అంశాల గురించి సుహానీ చెప్పిన కహానీలు ఆమె మాటల్లోనే..
– సాక్షి, సిటీబ్యూరో



మైండ్ రీడింగ్ టెక్నిక్..

మెంటలిజం మనుషులను, వారి ఆలోచనలను పసిగట్టగల మైండ్ రీడింగ్ టెక్నిక్. దీనికి మాతృక మాత్రం మ్యాజిక్కే. మ్యాజిక్‌లో సబ్ జానర్ ఈ మెంటలిజం. మ్యాజిక్‌లో దాగున్న విభిన్న రూపాల్లో ఇల్యూజన్, బ్లైండ్ ఫోల్డ్, స్ట్రీట్ మ్యాజిక్, పాలో మ్యాజిక్, ఎస్కూలోపోలాజీ, పిక్ పాకెటింగ్ తదితరాలు ఉన్నాయి. ఒకరి ఆలోచనలను చదవగలగడం, గతాన్ని, భవిష్యత్తును సైకలాజికల్‌గా ఊహించగలగడం. దీనికి కొన్ని రకాల కోర్సులు ఉన్నాయి. నిపుణులు కూడా ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నారు.

20 ఏళ్ల ప్రయాణంలో..

నేను ఏడేళ్ల వయసు నుంచి ఈ రంగంలో ఉన్నాను. దాదాపు 20 ఏళ్ల ప్రయాణంలో మొదట ఇల్యూజనిస్ట్‌గా చేశాను. ట్రెడిషనల్ ఇండియన్ మ్యాజిక్ నా మూలం. నేను గొప్ప గొప్ప చదువులు చదువుకోలేదు.. 14 ఏళ్ల వరకూ నాకు అంతగా చదవడం, రాయడం రాదు. కానీ 15వ ఏట 'సైకాలజీ అండ్ హ్యూమన్ బిహేవియర్' అనే పుస్తకాన్ని రాశాను. స్వీయ అనుభవాలతో రాసిన ఈ పుస్తకం బెస్ట్ సెల్లర్‌గా గుర్తింపు పొందింది. ఇప్పటి వరకూ 35 నుంచి 40 దేశాల వరకూ తిరిగి మెంటలిస్టుగా షోలు చేశాను. భారత్‌లో ప్రముఖ మహిళా మెంటలిస్ట్‌గా సహానీ షా ప్రయాణం మహిళలందరికీ స్ఫూర్తిదాయకం. 200 మంది ఫిక్కీ లేడీస్‌ను సుహానీ మాయ చేసి మంత్రముగ్ధుల్ని చేసింది.

నేటి నుంచి

ఒడిశా ఫుడ్ అండ్ క్రాఫ్ట్ మేళా

- శిల్పారామంలో మూడు రోజుల పాటు నిర్వహణ
- ఉదయం 10.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకూ

మాదాపూర్ : హైదరాబాద్‌లో ఒడిశా ప్రజలు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఒడియాఫుడ్, క్రాఫ్ట్ మేళాను శిల్పారామంలో శుక్రవారం ప్రారంభించనున్నారు. మూడు రోజుల పాటు నిర్వహించనున్న మేళాను స్వాభిమాన్ ఒడియా ఉమెన్స్ వరల్డ్, శిల్పారామం సంయుక్తంగా ఏర్పాటు చేయనున్నారు. ప్రదర్శనలో ఒడిశా సంప్రదాయ వంటకాలు, హస్తకళా ఉత్పత్తులను ప్రదర్శించనున్నారు. ప్రతి రోజూ సాయంత్రం యాంఫీథియేటర్‌లో 5.00 గంటలకు ఒడిశా సంప్రదాయ నృత్యాలను కళాకారులు ప్రదర్శించి సందర్శకులను ఆకట్టుకోనున్నారు. మూడు రోజుల ఉత్సవం సందర్శకులకు ప్రత్యేక అనుభవాన్ని అందిస్తుందని సంస్థ అధ్యక్షురాలు సుస్మితా మిశ్ర తెలిపారు. ఒడిశాలోని ప్రసిద్ధ సంబల్‌పురి, బొమ్‌కై, కోట్‌ప్యాడ్ అల్లికలతో పాటు, క్లిష్టమైన పెయింటింగ్‌లు, ధోక్రా మెటల్‌వర్క్, ప్రముఖ కళాకారులచే అప్లిక్ వర్క్‌లను ప్రదర్శించనున్నారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఒడిశా కళాత్మక వారసత్వానికి ప్రాణం పోసే ఒడిస్సీ నృత్యం, జానపద, గిరిజన నృత్య ప్రదర్శనలు సందర్శకులను అలరించనున్నాయి.



ఒడిశా సంప్రదాయ వంటకాలు..

రసగొల్ల, చెనపోడ, కిర్మోహణ, ఒడియా స్ట్రీట్‌ఫుడ్ గపచుప్, దహీ బారా, ఆలూదమ్, ఆలూచాప్ తదితరులు వంటకాలు అందుబాటులో ఉంచనున్నారు.



అనాథలకు

అమ్మా నాన్నలై..

- అక్కా చెల్లెళ్లకు నిర్వాహకుల వివాహం
- ఆశ్రమంలోనే అనాథల మధ్య పెళ్లి వేడుక

బంజారాహిల్స్: వాళ్లిద్దరూ కవలలు.. పదేళ్ల వయసున్నప్పుడే తల్లిదండ్రులను, ఆ కొద్ది రోజులకే తోబుట్టువు, సోదరుడిని కోల్పోయి అనాథలయ్యారు. దీంతో నా అనేవారు ఎవరూ లేకుండా పోయారు.. వీరిని 'మా ఇల్లు' ఆశ్రమం చేరదీసింది. మా ఇల్లు ఆశ్రమ నిర్వాహకులు గాదె ఇన్నారెడ్డి, గాదె పుష్పరాణి ఈ కవల సోదరీమణులను చేరదీయడమే కాకుండా విద్యాబుద్ధులను నేర్పించారు. అనాథలైన విజేత, శ్వేత ఆదర్శనగర్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఉన్న 'మా ఇల్లు' ఆశ్రమంలో నిర్వాహకుల నమ్మకాన్ని ఏమాత్రం వమ్ము చేయకుండా పెద్ద చదువుల్లో విశేషంగా రాణించారు. విజేత ఎమ్మెస్సీ సైకాలజీ చేసి బీఈడీ చేస్తూనే ఉద్యోగం పొందింది. చెల్లెలు శ్వేత ఎల్‌ఎల్‌బీ పూర్తిచేసి ప్రస్తుతం హైకోర్టులో లా ప్రాక్టీస్ చేస్తోంది. చిన్నప్పటి నుంచి చదువుల్లో చురుకుగా రాణించిన వీరిద్దరికీ ఆశ్రమ నిర్వాహకులు గాదె ఇన్నారెడ్డి, గాదె పుష్పరాణి దంపతులు తామే తల్లిదండ్రులై సొంత కూతుళ్ల కంటే ఎక్కువగా ప్రేమించారు. అయితే వీరికి వివాహం ఒక సమస్యగా మారింది. అనాథలైన ఈ కవలలను చేసుకోడానికి ఎవరు ముందుకొస్తారా అని ఇన్నారెడ్డి దంపతులు ఎదురుచూస్తున్న సమయంలోనే వారికి అండగా మేముంటామంటూ ఇద్దరు ముందుకొచ్చారు. వారిద్దరి గుణగణాలను పరిశీలించిన ఇన్నారెడ్డి దంపతులు విజేత, శ్వేతలకు సరిజోడీ అని నిర్ణయించుకున్నారు. వరంగల్ జిల్లా ఈసుకొండ మండలం ఎల్కుర్తి హవేలీ గ్రామానికి చెందిన అల్లూరి రంజిత్‌రెడ్డి ఎంబీఏ పూర్తి చేసి ల్యాండ్ సర్వేయర్‌గా పనిచేస్తున్నాడు. విజేతను పెళ్లి చేసుకోడానికి ముందుకొచ్చాడు. ఇక అడ్వకేట్‌గా హైకోర్టులో పనిచేస్తున్న సురేష్‌రెడ్డి అక్కడే పనిచేస్తున్న శ్వేతను పెళ్లి చేసుకోడానికి ముందుకొచ్చాడు.







నేడు వివాహం..

రంజిత్‌రెడ్డి-విజేత, సురేష్‌రెడ్డి-శ్వేతల వివాహం ఫిబ్రవరి 7న అంగరంగ వైభవంగా అనాథల మధ్యనే నిర్వహించనున్నారు. జనగామ జిల్లా జాఫర్‌ఘడ్ మండలం రేగడి తండాలోని 'మా ఇల్లు' ప్రాంగణంలోనే తాము వీరి పెళ్లి ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. దీనికి రంజిత్, సురేష్ అంగీకరించారు. విజేత, శ్వేత వివాహం సందర్భంగా 'మా ఇల్లు' ఆశ్రమంలో ఆనందోత్సాహాలు వ్యక్తమవుతున్నాయి.

క్లుప్తంగా...

రాష్ట్రంలో బర్డ్ ఫ్లూ లేదు

- కోళ్లకు అలాంటి వ్యాధులు సోకలేదు
- పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ గోపి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కోళ్లకు బర్డ్‌ఫ్లూ వంటి వ్యాధులేవీ సోకలేదని, ప్రజలు ఆందోళనకు గురికావద్దని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ బి.గోపి తెలిపారు. ఇతర రాష్ట్రాలలో వెలుగు చూస్తున్న బర్డ్ ఫ్లూ ఘటనల దృష్ట్యా గురువారం పశు వైద్య, పశుసంవర్ధక శాఖ పౌల్ట్రీ పరిశ్రమ ప్రతినిధులతో సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా ఆయన గోపి మాట్లాడుతూ.. ఇతర రాష్ట్రాల నుంచి కోళ్లు రాష్ట్రంలోకి రాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అంతర్ రాష్ట్ర సరిహద్దుల్లో చెక్‌పోస్టులను పటిష్టం చేశామని, పౌల్ట్రీ లేదా ఫీడ్‌ను తెలంగాణలోకి అనుమతించబోమని తెలిపారు. కోళ్ల పెంపకందారుల కోసం జిల్లాల్లో అవగాహన సమావేశాలు కూడా నిర్వహిస్తున్నట్లు చెప్పా రు.

కంటి పరీక్షల ఆవశ్యకతపై 'అగర్వాల్స్' కొత్త యాడ్

ముంబై: క్రికెట్ దిగ్గజాలు సచిన్ టెండూలకర్, మెక్‌గ్రాత్‌లతో కంటి సంరక్షణ, పరీక్షల ఆవశ్యకతపై సరికొత్త కమర్షియల్ యాడ్‌ను రూపొందించినట్లు డాక్టర్ అగర్వాల్ ఐ హాస్పిటల్ ప్రతినిధులు తెలిపారు. ప్రజలు క్రమం తప్పకుండా కంటి పరీక్షలు నిర్వహించుకోవలసిన అవసరాన్ని గురించి వివరించడమే ఈ యాడ్ లక్ష్యమని ఆసుపత్రి చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ ఆయుష్మాన్ చిరనేవాలా పేర్కొన్నారు.

ప్రతి ఇద్దరిలో ఒకరు ఏఐ యూజర్



- భారతీయ ఇంటర్నెట్ వినియోగదారుల్లో పెరిగిన ఏఐ వాడకం
- అత్యధికంగా చాట్ జీపీటీ వాడుతున్నవారు 28 శాతం మంది
- 90 శాతం టెక్ట్స్ మోడ్‌లో.. 10 శాతం వాయిస్ కమాండ్‌లో..
- లోకల్ సర్కిల్స్ సర్వేలో ఆసక్తికర అంశాలు వెల్లడి

సాక్షి, హైదరాబాద్: దేశంలో ఇంటర్నెట్ వినియోగం పెరిగిన తర్వాత వినియోగదారుల అభిరుచులు వేగంగా మారుతున్నాయి. క్షణాల్లోనే అనేక రకాల పనులు చేసిపెట్టే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ప్లాట్‌ఫామ్‌ల వాడకం కూడా వేగం పెరుగుతోంది. భారతీయ ఇంటర్నెట్ యూజర్లలో ప్రతి ఇద్దరిలో ఒకరు ఏదో ఒక ఏఐ ప్లాట్‌ఫామ్‌ను వాడుతున్నట్టు 'లోకల్ సర్కిల్స్'సంస్థ ఇటీవల నిర్వహించిన సర్వేలో వెల్లడైంది. ప్రస్తుతం కొత్తకొత్త ఏఐ ప్లాట్‌ఫామ్స్ వినియోగదారులకు అందుబాటులోకి వస్తూనే ఉన్నాయి. చాట్‌జీపీటీ, గూగుల్ ఏఐ ప్లాట్‌ఫామ్ జెమిని, మెటాకు చెందిన లామా 3.. ఇలా అనేక రకాల ఏఐ ప్లాట్‌ఫామ్‌ల వాడకంపై గత ఏడాది ఆగస్టు నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి 1 వరకు దేశవ్యాప్తంగా 309 జిల్లాల్లో 92 వేల మంది అభిప్రాయాలు సేకరించినట్టు లోకల్ సర్కిల్స్ సంస్థ వెల్లడించింది. డీప్‌సీక్ ఏఐ ప్లాట్‌ఫామ్‌కు త్వరలో మారాలనుకుంటున్నట్టు సర్వేలో పాల్గొన్న 31 శాతం మంది తెలిపారు. అయితే ఏఐ ఫ్లాట్‌ఫామ్‌లు వాడి సేకరించిన సమాచారం తప్పుగా ఉందని 18 శాతం మంది చెప్పగా.. 28 శాతం మంది కచ్చితమైన సమాచారమని అంగీకరించారు. ఏఐ ఫొలెట్‌ఫామ్‌లను వాడబోమని.. కానీ గూగుల్, ఇతర సెర్చ్ ఇంజిన్లను వాడతామని 40 శాతం మంది తెలిపారు. ఏమీ చెప్పలేమని 5 శాతం మంది అభిప్రాయపడ్డారు.

ఏఐ ప్లాట్‌ఫామ్‌లను ఎందు కోసం వాడుతున్నారు?

అంశం	చెప్పినవారి శాతం
సమాచారం కోసం	66
సెర్చ్ ఇంజిన్లలో సులువుగా దొరకని సమాచారం కోసం	25
ఏదైనా విషయం రాసేందుకు	9
చిత్రాలను రూపొందించేందుకు	9
వీడియోలను క్రియేట్ చేసేందుకు	9
డాక్యుమెంట్లను క్లుప్తీకరించేందుకు	25
ప్రైవేట్ కాని పనుల కోసం	16

ఏ ఏఐ టూల్‌ను వాడుతున్నారు?

ఏఐ టూల్	వాడుతున్నవారి శాతం
చాట్‌జీపీటీ	28
ఓ-పైలెట్ డైరెక్ట్‌లీ లేదా వయాబింగ్	6
జెమిని వయా గూగుల్	3
లామా	3
క్లాడ్	6
పర్‌ప్లెక్సిటీ	9

ఏఐ ప్లాట్‌ఫామ్‌లు ఇచ్చే సమాచారంలో కచ్చితత్వం ఎంత?

అంశం	అభిప్రాయపడినవారి శాతం
అత్యంత కచ్చితమైనది	8
చాలావరకు కచ్చితమైన సమాచారమే	20
కొంతవరకు ఫర్వాలేదు	49
పూర్తిగా తప్పుడు సమాచారం	18
చెప్పలేం	5

ఏఐ ప్లాట్‌ఫామ్‌లను ఎలా వాడుతున్నారు?

టెక్ట్స్ ఫార్మాట్‌లో	వాయిస్ మెసేజ్‌లో
90 శాతం	10 శాతం

ప్రిజం పబ్ కాల్పుల కేసులో
మెన్నీ రంజిత్ అరెస్ట్


గచ్చిబౌలి: ప్రిజం పబ్‌లో సీసీఎస్ పోలీసులపై కాల్పులు జరిపిన కేసులో ప్రధాన నిందితుడు బత్తుల ప్రభాకర్ స్నేహితుడు మెన్నీ రంజిత్(28)ను గచ్చిబౌలి పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పశ్చిమగోదావరి జిల్లాలోని గోపవరం గ్రామానికి చెందిన మిన్నీ రంజిత్ 2022లో రాజమండ్రిలో ఓ ఆర్టీసీ బస్సులో బత్తుల ప్రభాకర్‌కు పరిచయమయ్యాడు. ఈ నెల 1వ తేదీన ప్రభాకర్, రంజిత్, రోహిత్‌లు కారులో బీర్లు తాగుతూ ఐటీ కారిడార్‌లో తిరిగారు. ఈ క్రమంలో కారు బ్రేక్‌డౌన్ కావడంతో గ్యారేజ్‌కు వెళ్లారు. ఆ సమయంలోనే ప్రభాకర్ ఫోన్‌చార్జింగ్ పెట్టుకునేందుకు ప్రీజం పబ్‌కు వెళ్లాడు. ఊహించని రీతిలో పోలీసులు పట్టుకోవడంతో కాల్పులు జరపగా, హెడ్‌కానిస్టేబుల్ వెంకట్‌రెడ్డికి గాయాలైన విషయం తెలిసిందే.

బిహార్ టు హైదరాబాద్

బిహార్‌లో ఉద్యోగం చేస్తున్న రంజిత్‌కు 2023లో ఐటీ కారిడార్‌లోని ఓ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా ఉద్యోగం వచ్చింది. కేపీహెచ్‌బీలో ఉంటున్న సమయంలో తరచుగా ప్రభాకర్ అతని వద్దే ఉండేవాడు. అక్కడి నుంచి రంజిత్ వట్టినాగులపల్లిలోని ఓ అపార్ట్‌మెంట్‌కు వెళ్లాడు. అక్కడ ఇరుకుగా ఉందని చెప్పి నార్సింగిలోని ఓ గేటెడ్ కమ్యూనిటీలోని ఫ్లాట్‌ను రంజిత్ పేరిట బత్తుల ప్రభాకర్ అద్దెకు తీసుకున్నారు. కొద్ది నెలల తర్వాత ఒడిశాకు చెందిన ఓ యువతితో ప్రభాకర్ సహజీవనం చేశాడు. దీంతో రంజిత్ గచ్చిబౌలి టీఎన్‌జీవోస్ కాలనీలో స్నేహితుడు రోహిత్‌తో కలిసి ఉంటున్నాడు. రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నానని నమ్మించి రంజిత్ క్రెడిట్ కార్డులు ఉపయోగించుకొని ఆ తర్వాత డబ్బు తిరిగిఇచ్చేవాడు. అలా ఇద్దరి మధ్య స్నేహం ఏర్పడటంతో రంజిత్ యూపీఐలు, క్రెడిట్ కార్డులను ప్రభాకర్ వాడుకున్నాడు. రంజిత్ పేరిట కొనుగోలు చేసిన కారులోనే పబ్‌లు, జిమ్‌లకు వెళ్లేవారు. గన్‌లు కావాలని అడగ్గా, రంజిత్ బిహార్‌లో తనకు తెలిసిన వారిని పరిచయం చేశాడు. వారి ద్వారా మూడు కంట్రీమేడ్ గన్‌లను ప్రభాకర్ కొనుగోలు చేశాడు. గన్‌ల కొనుగోలులో రంజిత్ ప్రమేయం ఉండటం, బ్యాంక్ లావాదేవీలు రంజిత్ ద్వారానే జరిగాయని పోలీసులు చెబుతున్నారు. ఘటన జరిగిన రోజు కారులో రంజిత్‌తోపాటు రోహిత్ కూడా ఉన్నాడని, ప్రభాకర్ లావాదేవీలు, చోరీల్లో అతని ప్రమేయం లేదని పోలీసులు వెల్లడించారు. ఏ 2 రంజిత్ నుంచి కారు, కేటీఎం బైక్, ఫోన్, కొన్ని డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నారు.

సీసీఎల్‌ఏకు ఆ అధికారం లేదు

- ప్రైవేటు భూముల రిజిస్ట్రేషన్‌ను తోసిపుచ్చలేరని తేల్చిచెప్పిన హైకోర్టు
- పిటిషనర్ వద్ద సరైన పత్రాలుంటే 4 వారాల్లో రిజిస్ట్రేషన్ చేయాలని ఆదేశం



సాక్షి, హైదరాబాద్: ప్రైవేటు భూముల రిజిస్ట్రేషన్‌ను ఆపే అధికారం భూ పరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్‌ఏ)కు లేదని హైకోర్టు తేల్చిచెప్పింది. రిజిస్ట్రేషన్ చట్టంలోని సెక్షన్ 22-ఏలో పేర్కొన్న భూముల విషయంలో తప్ప ఇతర భూములను నిషేధిత జాబితాలో చేర్చే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి, అధికారులకు ఉండదని స్పష్టం చేసింది. వింజమూరి రాజగోపాలాచారి, ఇతరులు వర్సెస్ తెలంగాణ రెవెన్యూ ముఖ్య కార్యదర్శి కేసులో ఇదే కోర్టు విస్తృత ధర్మాసనం రిజిస్ట్రేషన్ చట్టంలోని సెక్షన్ 22-ఏ కింద అనుసరించాల్సిన విధానానికి సంబంధించి మార్గదర్శకాలను నిర్దేశించిన విషయాన్ని గుర్తుచేసింది. పిటిషనర్లు సమర్పించిన పత్రాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించింది. ఆ పత్రాలు చట్ట నిబంధనలకు అనుగుణంగా ఉంటే కోర్టు ఉత్తర్వులు అందుకున్న తేదీ నుంచి 4 వారాల్లోగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభించాలని స్పష్టం చేసింది. ఈ మేరకు పిటిషన్‌పై జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి విచారణ చేపట్టి తీర్పు వెలువరించారు.

ఇదీ కేసు నేపథ్యం..

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా బాచుపల్లి గ్రామంలో తాము కొనుగోలు చేసిన ఎకరం 26 గంటల భూమి రిజిస్ట్రేషన్‌ను తహసీల్దార్ నిరాకరించడాన్ని సవాల్ చేస్తూ వెంకటసుబ్బయ్య, ఇతరులు హైకోర్టును ఆశ్రయించారు. సీసీఎల్‌ఏ ఆదేశాల మేరకు తహసీల్దార్ రిజిస్ట్రేషన్ నిరాకరిస్తున్నారని పేర్కొన్నారు. ఇది చట్ట నిబంధనలకు విరుద్ధమని.. తమకు రిజిస్ట్రేషన్ చేసేలా అధికారులను ఆదేశించాలని కోరారు.

ఫిర్యాదు చేసేందుకు వస్తే.. గర్భవతిని చేశాడు

- కానిస్టేబుల్‌పై ఉన్నతాధికారులకు బాధితురాలి ఫిర్యాదు
- కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించిన పోలీసులు



మేడ్చల్ రూరల్: సమస్య చెప్పుకునేందుకు పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన యువతిని.. న్యాయం చేస్తానని లోబర్చుకుని గర్భవతిని చేశాడో కానిస్టేబుల్. ఆపై బెదిరింపులకు దిగాడు. బాధితురాలు విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లగా కేసు నమోదు చేసిన పోలీసులు గుట్టుచప్పుడు కాకుండా సదరు కానిస్టేబుల్‌ను రిమాండ్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మేడ్చల్ ఇందిరానగర్ కాలనీలో ఉండే యువతి (31) డబ్బుల విషయమై తనను కొందరు ఇబ్బంది పెడుతున్నారంటూ ఫిర్యాదు చేసేందుకు గతేడాది మార్చి 21న తన తల్లితో కలిసి మేడ్చల్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లింది. క్రైమ్ విభాగం కానిస్టేబుల్ సుధాకర్‌రెడ్డి వారి సమస్య పరిష్కరిస్తానంటూ హామీఇచ్చి తన సెల్‌ఫోన్ నంబర్‌ను యువతికి ఇచ్చాడు.

ఇంటికి పిలిచి అఘాయిత్యం

మర్నాడు తన కేసు విషయమై యువతి కానిస్టేబుల్‌కు ఫోన్ చేసింది. లాయర్‌తో మాట్లాడదామంటూ ఆమెను తన ఇంటికి రప్పించి ఆమెను మాటల్లో పెట్టి, తనకు పెళ్లి కాలేదని మాయమాటలు చెప్పి లైంగికదాడికి పాల్పడ్డాడు. మరోసారి కూడా ఇంటికి రప్పించుకుని ఇలాగే చేశాడు. యువతి గతేడాది జూలైలో గర్భం దాల్చడంతో ఆమెకు బలవంతంగా అబార్షన్ చేయించాడు. ఈ క్రమంలో ఆగస్టు 15న యువతి సుధాకర్‌రెడ్డికి ఫోన్ చేయగా అతని భార్య ఫోన్ లిఫ్ట్ చేసింది. దీంతో అతడికి పెళ్లయిన విషయం తెలియడంతో యువతి కానిస్టేబుల్‌ను నిలదీసింది. ఆమె కారణంగా తన కుటుంబంలో గొడవలు తలెత్తాయని భావించిన సుధాకర్‌రెడ్డి యువతి అడ్డు తొలగించుకునేందుకు మేడ్చల్‌లోని ఆమె ఇంటికి వెళ్లి బలవంతంగా ఫినాయిల్ తాగించాడు. అనంతరం సుధాకర్‌రెడ్డి దంపతులు సదరు యువతిని ఇంటికి పిలిపించుకుని దాడి చేశారు. అలాగే, తన మిత్రుడైన మరో కానిస్టేబుల్ ద్వారా సుధాకర్‌రెడ్డి యువతిని బెదిరింపులకు గురిచేశాడు. డిసెంబర్ 16న సుధాకర్‌రెడ్డి తన బండిపై యువతిని తీసుకెళ్లి గిర్మాపూర్ సమీపంలో కిందికి తోసేయడంతో ఆమె తీవ్ర గాయాలపాలైంది.

బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు

కానిస్టేబుల్ వ్యవహారం గురించి తెలిసి మేడ్చల్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ.. అతడిని సైబరాబాద్ కమిషనరేట్‌కు బదిలీ చేయించారు. అయినా బెదిరింపులు ఆగకపోవడంతో ఆ యువతి ఈ నెల 3న సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో ఫిర్యాదు చేసింది. మేడ్చల్ పోలీసులు కేసు నమోదు చేసి సుధాకర్‌రెడ్డిని రిమాండ్‌కు తరలించారు.

కుమార్తెను వేధిస్తున్నాడని..
యువకుడిని హతమార్చిన తండ్రి

- మహబూబ్‌నగర్ జిల్లాలో ఘటన
- మృతుడు, నిందితులు కర్నూలు జిల్లా వాసులు




వివరాలను తెలుసుకుంటున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

చిన్నచింతకుంట: తన కుమార్తెను వేధించడంతో పాటు ఎక్కడికి వెళితే అక్కడికి వస్తూ మనశ్శాంతి లేకుండా చేస్తున్నాడనే కోపంతో ఆమె తండ్రి ఓ యువకుడిని హతమార్చాడు. ఈ సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా కౌకుంట్ల మండలం తిర్మలాపురంలో చోటు చేసుకుంది. వనపర్తి జిల్లా ఆత్మకూరు పట్టణానికి చెందిన షేక్ అబ్దుల్ రహిమాన్.. తన భార్య సొంతూరు ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా నందికొట్కూర్‌కు వెళ్లి అక్కడే నివాసం ఉంటున్నాడు. బతుకుదెరువు కోసం అప్పుడప్పుడు మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర పట్టణంలో కూలి పనులకోసం వచ్చి వెళ్తుండేవాడు. కాగా, అబ్దుల్ రహిమాన్ కుమార్తెను నందికొట్కూర్‌కు చెందిన అలీఖాన్ (33) కొంతకాలంగా వెంటబడుతూ వేధిస్తున్నాడు. ఇటీవల అలీఖాన్ వేధింపులు మరింత ఎక్కువ కావడంతో నాలుగు రోజుల క్రితం తన కుమార్తెతో పాటు కుటుంబసభ్యులను తీసుకొని రహిమాన్ తిర్మలాపురంలోని తన దగ్గరి బంధువుల ఇంటికి వచ్చాడు. కాగా.. వీరు ఇక్కడికి వచ్చినట్లు తెలుసుకున్న అలీఖాన్ కూడా గురువారం ఉదయం తిర్మలాపురం గ్రామానికి చేరుకున్నాడు. మధ్యాహ్నం ఆ యువతి ఉన్న ఇంటి వద్దకు వచ్చిన అలీఖాన్‌ను చూసిన అబ్దుల్ రహిమాన్, అతని కుమారుడు రుస్తూంఖాన్‌లు ఆవేశంతో ఊగిపోయి ఇనుప రాడ్లు, రాళ్లతో దారుణంగా దాడిచేశారు. దీంతో తీవ్ర గాయాలతో అలీఖాన్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని నిందితులను అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రికి తరలించారు. డీఎస్పీ వెంకటేశ్వర్లు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

మస్తాన్‌సాయి కస్టడీకి పోలీసుల పిటిషన్

- వారం రోజులు తమ కస్టడీ ఇవ్వాలని కోర్టుకు విన్నపం
- లైంగిక దాడుల వీడియోలు, డ్రగ్స్ వాడకంపై దర్యాప్తు



మణికొండ: మహిళల నగ్న వీడియోలు తీసి బ్లాక్‌మెయిల్ చేయటం, డ్రగ్స్ కేసులో జైలులో ఉన్న మస్తాన్‌సాయిని విచారించేందుకు వారంపాటు తమ కస్టడీకి ఇవ్వాలని నార్సింగి పోలీసులు రాజేంద్రనగర్ కోర్టులో గురువారం పిటిషన్ వేశారు. మస్తాన్‌సాయిపై ఫిర్యాదు చేసిన లావణ్య అందించిన హార్డ్ డిస్క్‌తోపాటు అతని వద్ద లభించిన ల్యాప్‌టాప్, పెన్‌డ్రైవ్‌లు, సెల్‌ఫోన్‌లలో అనేక మంది మహిళల నగ్న వీడియోలు ఉన్నాయని, వాటిపై సమగ్రంగా దర్యాప్తు జరపాల్సి ఉందని పిటిషన్‌లో పేర్కొన్నారు. అతడు ఎంతమందికి డ్రగ్స్ అమ్మాడు? ఎందరికి డ్రగ్స్ అలవాటు చేశాడనే విషయాలు కూడా తెలుసుకోవాల్సి ఉందని తెలిపారు.

వీడియోలతో బ్లాక్‌మెయిల్..

గుంటూరుకు చెందిన మస్తాన్‌సాయి ఐఐటీలో చదువుకుని ఐటీ సంస్థను నెలకొల్పానని ప్రచారం చేసుకున్నాడు. తన సంస్థలో ఉద్యోగాలు ఇస్తానని కొందరిని, సినిమాల్లో అవకాశం ఇప్పిస్తానని మరికొంతమంది యువతులను నమ్మించాడు. తన విల్లాతోపాటు లావణ్య ఇంట్లో అనేక సార్లు డ్రగ్స్ పార్టీలు నిర్వహించి వారిని పిలిచి డ్రగ్స్ అలవాటు చేశాడు. చాలామందికి డ్రగ్స్ విక్రయించాడని పోలీసులు తెలిపారు. మహిళలకు డ్రగ్స్ ఇచ్చి మత్తులోకి జారుకున్నాక కామకలాపాలు సాగించి వీడియోలు తీసినట్లు లావణ్య ఫిర్యాదులో పేర్కొంది. ఆ వీడియోలను అడ్డుపెట్టుకొని సదరు మహిళలను బ్లాక్ మెయిల్ చేసినట్లు అతని ఫోన్ కాల్ రికార్డుల ద్వారా వెలుగులోకి వచ్చింది. ఈ అన్ని అంశాలపై లోతుగా దర్యాప్తు చేసేందుకు మస్తాన్‌సాయిని తమ కస్టడీకి ఇవ్వాలని పోలీసులు కోర్టును కోరారు.

ఆర్జే శేఖర్‌బాషాపై పోలీసులకు శ్రేష్టివర్మ ఫిర్యాదు

తనను వేధిస్తున్నాడన్న మహిళా సహాయ కొరియోగ్రాఫర్

మణికొండ: తన ఫోన్ కాల్స్‌ను రికార్డు చేసి కొన్ని యూట్యూబ్ చానల్స్‌లో తన పరువుకు నష్టం కలిగించేలా మాట్లాడుతున్నారని బిగ్‌బాస్ ఫేం, ఆర్‌జే శేఖర్‌బాషాపై సహాయ మహిళా కొరియోగ్రాఫర్ శ్రేష్టివర్మ గురువారం నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేసింది. గతంలో జానీమాస్టర్ కేసు విచారణ జరుగుతున్నప్పుడు తన కాల్స్‌ను రికార్డు చేశారని తెలిపింది. వాటిని ఆయనకు అనుకూలంగా మార్చుకుని తన పరువుకు నష్టం కలిగిస్తున్నాడని ఆరోపించింది. అతడు యూట్యూబ్ ఛానళ్లలో తన గురించి చెడుగా మాట్లాడిన వీడియోలను తొలగింప చేయాలని, అతడిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరింది. దాంతో పోలీసులు బీఎన్ఎస్ సెక్షన్ 67, 79 ప్రకారం కేసు నమోదు చేశారు. గతంలో ఈమె కొరియోగ్రాఫర్ జానీమాస్టర్‌పైనా పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే.


ఫోన్ ట్యాపింగ్ కేసు
ఎంతవరకు వచ్చింది?

- రాధాకిషన్‌రావును 12 వరకు అరెస్టు చేయొద్దు
- పోలీసులకు హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్‌పై కాంగ్రెస్ నేత, రియల్ వ్యాపారి చక్రధర్‌గౌడ్ ఫిర్యాదు మేరకు నమోదైన కేసు దర్యాప్తు ఎంత వరకు వచ్చింది, ఎంత మంది వాంగ్మూలాలు రికార్డు చేశారనే వివరాలను సీల్డ్ కవర్‌లో సమర్పించాలని పీపీ పల్లె నాగేశ్వర్‌రావును హైకోర్టు ఆదేశించింది. ఈ కేసులో మాజీ డీసీపీ పి.రాధాకిషన్‌రావును ఈ నెల 12 వరకు అరెస్టు చేయవద్దని పోలీసులను ఆదేశించింది. చక్రధర్‌గౌడ్‌కు నోటీసులు జారీ చేసింది. చక్రధర్‌గౌడ్ ఫిర్యాదు మేరకు పంజాగుట్ట పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టివేయాలని కోరుతూ ఆ కేసులో రెండో నిందితుడు రాధాకిషన్‌రావు హైకోర్టును ఆశ్రయించారు. మాజీ మంత్రి టి.హరీశ్‌రావు తొలి నిందితుడిగా ఉన్నారు. కాగా తనకు బెయిల్ రాకుండా చేయాలనే కుట్రతో ఈ ఫిర్యాదు చేశారని మాజీ డీసీపీ పేర్కొన్నారు. ఇప్పటికే 10 నెలలుగా జైలులో ఉన్నానని, విచారణకు ముందే జైలుశిక్ష విధించాలనే లక్ష్యంతో చక్రధర్‌గౌడ్ చేసిన ఫిర్యాదు వెనుక రాజకీయ కుట్ర ఉందని అన్నారు. ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించిన మరో కేసులో తనకు హైకోర్టు బెయిలు మంజూరు చేసిందని.. మళ్లీ అదే అంశంపై రెండో ఎఫ్ఐఆర్ దాఖలు చేయడం చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ గురువారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున న్యాయవాది ఉమామహేశ్వర్‌రావు వాదనలు వినిపించారు. ఒకే అంశంపై రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయడం చెల్లదన్నారు. పీపీ వాదిస్తూ.. ఈ కేసుకు, ప్రధాన ఫోన్ ట్యాపింగ్ కేసుకు ఎటువంటి సంబంధం లేదని చెప్పారు.

వ్యూహమా? ప్రభాకర్‌రావుపై ప్రేమా?

- శ్రవణ్‌కుమార్‌పై ప్రొక్లైమ్డ్ అఫెండర్ పిటిషన్
- నాంపల్లి కోర్టులో దాఖలు చేసిన పోలీసులు
- ప్రధాన నిందితుడిపై మాత్రం మౌనముద్ర



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబీ) కేంద్రంగా సాగిన అక్రమ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం వెలుగులోకి వచ్చిన నాటి నుంచి ప్రధానంగా వినిపించింది టి.ప్రభాకర్‌రావు పేరే. ఆ విభాగ మాజీ చీఫ్ అయిన ఈ రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ట్యాపింగ్ కేసు నమోదుతో అమెరికా వెళ్లిపోయారు. ఈ కేసు దర్యాప్తు కొలిక్కిరావాలంటే ఆయన్ను వెనక్కి రప్పించడం, విచారించడం అనివార్యంగా మారింది. అయితే ఇప్పుడెందుకో పోలీసులకు ఆయనపై ప్రేమ పుట్టుకొచ్చింది. ఇదే కేసులో ఆరో నిందితుడిగా ఉండి, విదేశాల్లో తలదాచుకున్న శ్రవణ్‌రావును ప్రొక్లైమ్డ్ అఫెండర్‌గా (ప్రకటిత నేరస్తుడు) ప్రకటించాలంటూ ఇటీవల నాంపల్లి కోర్టులో పోలీసు విభాగం పిటిషన్ దాఖలు చేసింది. అయితే ప్రభాకర్‌రావు పేరును మాత్రం ఇందులో చేర్చలేదు. మరోపక్క పి.రాధాకిషన్‌రావు, భుజంగరావులకు హైకోర్టు మంజూరు చేసిన బెయిల్ రద్దు చేయాలంటూ పోలీసు విభాగం సుప్రీంకోర్టును ఆశ్రయించనుంది.

ఎఫ్ఐఆర్ నమోదు చేసింది మొదలు..

అక్రమ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై పంజగుట్ట పోలీసులు 2024 మార్చి 10 కేసు నమోదు చేశారు. ప్రభుత్వ ఆస్తుల ధ్వంసానికి సంబంధించి ప్రణీత్‌రావుపై నమోదైన ఈ కేసులో ఇప్పటి వరకు మొత్తం ఆరుగురిని నిందితులుగా చేర్చారు. కీలక నిందితులుగా పేర్కొంటూ అదే నెలలో అడిషనల్ ఎస్పీలు నాయిని భుజంగరావు, తిరుపతన్న, మాజీ డీసీపీ రాధాకిషన్‌రావు, మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావును అరెస్టు చేశారు. ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు, ఓ టీవీ ఛానల్ అధినేత శ్రవణ్‌కుమార్ మాత్రం పరారీలో ఉన్నారు. ఈ కేసులో పోలీసులు గత జూన్‌లో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. అప్పట్లో ట్యాపింగ్‌కు గురైన వారిలో కాంగ్రెస్ నేతలు, ఓ న్యాయమూర్తి, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులతోపాటు కొందరు బీఆర్ఎస్ నేతలు కూడా ఉన్నారని ప్రస్తావించారు. ఇంకా విచారణ సాగుతున్నందున అదనపు చార్జ్‌షీట్ దాఖలు చేస్తామని పోలీసులు పేర్కొన్నారు.

విచారణ ఇంకా పూర్తికాలేదంటూ...

ఇప్పటికీ ప్రభాకర్‌రావు, శ్రవణ్‌కుమార్ అమెరికాలో ఉన్నారు. ట్రయల్ కోర్టు రెండుసార్లు నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసినా స్పందన లేదు. ఇటీవల పోలీసులు కోర్టుకు సమర్పించిన సీల్డ్ కవర్ నివేదికలో ప్రస్తుత హైకోర్టు న్యాయమూర్తులు, మాజీ న్యాయమూర్తులతోపాటు ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఉన్నతాధికారుల ఫోన్ నంబర్లు, ఇతర వివరాలు ఉన్నాయి. నిందితుల వ్యక్తిగత కంప్యూటర్ల నుంచి ఫోరెన్సిక్ నిపుణులు రిట్రీవ్ చేసిన డేటాలో వీటిని గుర్తించినట్టు పేర్కొన్నారు. వీరందరి నంబర్లు ట్యాపింగ్ అయినట్టు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. ఈ దశలో కీలక నిందితులకు బెయిల్ ఇవ్వడం విచారణను ప్రభావితం చేస్తుందని అధికారులు చెబుతున్నారు. వారి బెయిల్ రద్దు కోరుతూ సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేయాలని, వివరాలతో వాదనలు సిద్ధం చేయాలని పీపీకి పోలీసు విభాగం సూచించింది.

'ప్రొక్లైమ్డ్ అఫెండర్' ఒక్కరిపైనే ఎందుకు?

ఒకరిని న్యాయస్థానం ప్రొక్లైమ్డ్ అఫెండర్‌గా ప్రకటిస్తే.. వారి ఆస్తులు జప్తు చేసే అధికారం పోలీసులకు వస్తుంది. ఇలా ఒత్తిడి తీసుకొచ్చి నిందితులను విదేశాల నుంచి రప్పించే అవకాశం ఉంటుంది. అయితే ఈ పిటిషన్‌ను ప్రధాన నిందితుడైన ప్రభాకర్‌రావుపై దాఖలు చేయకుండా, శ్రవణ్‌కుమార్‌పై దాఖలు చేయడం వెనుక ఆంతర్యం అంతు చిక్కట్లేదు. పోలీసు విభాగం ఇలా వ్యవహరించడం వెనుక ప్రభుత్వ ప్రమేయం ఉందా? లేక వ్యూహంలో భాగమా? అనేది ప్రశ్నార్థకంగా మారింది.

● బిష్ణోయి స్త్రీలు



● లేడి కూనతో బిష్ణోయి స్త్రీ




● అమృతాదేవి త్యాగానికి చిత్రరూపం

చెట్ల కోసం తలలు ఇచ్చారు

'పచ్చటి చెట్టు నరకకూడదు' అని బిష్ణోయ్ తెగ మొదటి నియమం. మన దేశంలో పర్యావరణానికి మొదటి యోధులు బిష్ణోయ్ స్త్రీలే. కరువు నుంచి రక్షించే'ఖేజ్రీ' చెట్లను 1730లో రాజభటులు నరకడానికి వస్తే అమృతాదేవి అనే మహిళ తన తల అర్పించి కాపాడుకుంది. ఆమెతో పాటు 363 మంది బిష్ణోయిలు ఆరోజు బలిదానం ఇచ్చారు. బిష్ణోయిల పర్యావరణ స్పృహ గురించి బ్రిటిష్ రచయిత మార్టిన్ గుడ్‌మాన్ 'మై హెడ్ ఫర్ ఏ ట్రీ' పుస్తకం రాశాడు. 'జైపూర్ లిటరేచర్ ఫెస్టివల్'లో దాని గురించి మాట్లాడాడు. వివరాలు...

అందరూ ఎండు కట్టెలు వంట కోసం నేరుగా పొయ్యిలో పెడతారు. కాని బిష్ణోయి స్త్రీలు ఆ ఎండు కట్టెలను పరీక్షించి వాటి మీద క్రిమి కీటకాలు, చెదరును ఆశ్రయించి ఉండే పురుగులు... వీటన్నింటిని విదిలించి కొట్టి అప్పుడు పొయ్యిలో పెడతారు. 'ప్రాణం ఉన్న ఏ జీవజాలాన్నీ చంపే హక్కు మనిషికి లేదు' అని బిష్ణోయిలు గట్టిగా విశ్వసించడమే దీనికి కారణం. బిస్ అంటే 20. నొయి అంటే 9. బిష్ణోయిల ఆది గురువు జంభోజీ వారి కోసం 29 నియమాలను ఖరారు చేశారు. వాటిని పాటిస్తారు కాబట్టి వీరిని బిష్ణోయిలు అంటారు. మరో విధంగా వీరు వైష్ణవ పథానికి చెందిన వారు కాబట్టి కూడా విష్ణోయి లేదా బిష్ణోయి అని అంటారు.



కరువు నుంచి బయటపడేందుకు

పశ్చిమ రాజస్తాన్‌లో జోధ్‌పూర్, బికనీర్‌లు బిష్ణోయిల ఆవాసం. 15వ శతాబ్దంలో ఇక్కడ తీవ్రమైన కరువు వచ్చింది. అందుకు కారణం చెట్లు, అడవులు నాశనం కావడమేనని ఆ సమయానికి జీవించి ఉన్న గురు జంభోజీ గ్రహించారు. అందుకే చెట్టును కాపాడుకుంటే మనిషి తనను తాను కాపాడుకోవచ్చునని కచ్చితమైన నియమాలను విధించారు. వాటిని శిరోధార్యంగా చేసుకున్న బిష్ణోయిలు నాటి నుంచి నేటి వరకూ గొప్ప పర్యావరణ రక్షకులుగా ఉన్నారు. వీరి ప్రాంతంలో ఉన్న ఖేజ్రీ చెట్లను, కృష్ణ జింకలను వీరు ప్రాణప్రదంగా చూసుకుంటారు. జింక పిల్లలను వీరు సాకుతారు. అవసరమైతే చనుబాలు ఇస్తారు.

1730 స్త్రీల ఊచకోత

1730లో జోధ్‌పూర్ రాజు అభయ్ సింగ్ కొత్త ప్యాలస్ నిర్మాణానికి కలప కోసం సైనికులను ఖేజర్లీ అనే పల్లెకు పంపాడు. అక్కడ ఖేజ్రీ చెట్లు విస్తారం. ఆ సమయానికి మగవారంతా పశువుల మందను మేపడానికి వెళ్లి ఉన్నారు. ఊళ్లో స్త్రీలు మాత్రమే ఉన్నారు. సైనికులు చెట్లు కొట్టబోతుంటే అమృతాదేవి



● రచయిత మార్టిన్ గుడ్‌మాన్ (మధ్యలో)

అనే స్త్రీ పరిగెత్తుకుంటూ వచ్చి అడ్డుపడింది. పచ్చని చెట్టును నరకకూడదు అంది. ఆమెకు ముగ్గురు కూతుళ్లు. వారంతా వచ్చి చెట్లను చుట్టుకుని నిలబడ్డారు. చాలామంది స్త్రీలు అలాగే చేశారు. సైనికులు వెర్రెత్తి పోయారు. గొడ్డలి ఎత్తారు. 'చెట్టుకు బదులు నా తల ఇస్తాను తీసుకో' అని గర్జించింది అమృతాదేవి. సైనికులు నిర్దాక్షిణ్యంగా ఆమెను, ఆమె కూతుళ్లను, ఆ తర్వాత మొత్తం స్త్రీ, పురుషులను కలిపి మొత్తం 363 మందిని నరికారు. ఇప్పటికీ ఆ ఊళ్లో ఆ జ్ఞాపకంగా స్మారక స్థూపం ఉంది.

చలించిన రచయిత

'2020లో జైపూర్ లిటరేచర్ ఫెస్టివల్‌కు వచ్చినపుడు ఈ ఊచకోత గురించి తెలిసింది. పర్యావరణం కోసం ఇలా ప్రాణత్యాగం చేసిన స్త్రీలు లేరు. నేను ఇది పుస్తకంగా రాయాలనుకున్నాను' అన్నాడు బ్రిటిష్ రచయిత మార్టిన్ గుడ్‌మాన్. 2022లో అతను లండన్ నుంచి వచ్చి ఆరు నెలల పాటు బిష్ణోయి సమూహంతో ఉండి 'మై హెడ్ ఫర్ ఏ ట్రీ' పుస్తకం రాశాడు. 'నేను బిష్ణోయి గురువు జంభోజీ ఏ చెట్టు కిందైతే మరణించాడో ఆ చెట్టు కిందకు వెళ్లాను. ఆ రోజు రాజస్థాన్‌లో 36 డిగ్రీల ఎండ ఉంటే లండన్‌లో 40 డిగ్రీల ఎండ వుంది. బిష్ణోయిల నుంచి ఈ ప్రపంచం నేర్చుకోవాల్సింది చాలా ఉంది. బిష్ణోయిలు చెట్లు పెంచుతూ, కుంటలు తవ్వుతూ తమ భూమిని సస్యశ్యామలం చేసుకుంటూనే ఉన్నారు. ఇందులో స్త్రీల కృషి అసామాన్యం. వీరి వల్లే చిప్కో ఉద్యమ ఆలోచన వచ్చిందని కూడా మనం గ్రహించాలి' అన్నాడు మార్టిన్ గుడ్‌మాన్.

వేటాడితే జైల్లో వేస్తాం

పుస్తకం ఆవిష్కరణ వేడుకలో బిష్ణోయి ఉద్యమకర్త నరేంద్ర బిష్ణోయి కూడా పాల్గొన్నాడు. 'రాజస్థాన్‌లో 1972, 1980 చట్టాల ప్రకారం చెట్టు కొడితే 100 రూపాయల ఫైను. ఆ రోజుల్లో 100 పెద్దమొత్తం కావచ్చు. ఇవాళ్టికీ వంద కట్టి తప్పించుపోతున్నారు. ఈ చట్టంలో మార్పు కోసం పోరాడుతున్నాం. మేము పెద్దఎత్తున చెట్లు పెంచుతుంటే అభివృద్ధి పేరుతో సోలార్ ప్లాంట్ల కోసం ప్రభుత్వం చెట్లు కొట్టేస్తోంది. ఇంతకు మించిన అన్యాయం లేదు. గత రెండు దశాబ్దాలుగా మా ప్రాంతంలో కృష్ణ జింకలను చంపిన వారు కోర్టుల్లో ఏదో చేసి తప్పించుకున్నారు. అందుకే మా కుర్రాళ్లే లా చదివి అడ్వకేట్లు అవుతున్నారు. ఇక ఎవరు వేటాడినా వారిని జైళ్లల్లో మేమే వేయిస్తాం' అన్నాడు నరేంద్ర బిష్ణోయి.

ఈ గొప్ప పర్యావరణ ప్రేమికులు దేశం మొత్తానికి స్ఫూర్తినివ్వాలి.

– సాక్షి ప్రత్యేక ప్రతినిధి



ఆ... భరణం అచ్చం అలాగే!



సినిమా తారలు ఏదైనా ఈవెంట్‌లో పాల్గొన్నప్పుడు వారు ధరించిన వస్త్రాలు, ఆభరణాలను అంతా ఆసక్తిగా పరిశీలిస్తుంటారు. అత్యంత ఖరీదైన ఆ డ్రెస్సులు, ఆభరణాలు వారిని మరింత ప్రత్యేకంగా చూపుతుంటాయి. యునిక్‌గా కనిపించే వాటిని అచ్చం అలాగే తయారు చేయించుకోవడమే కాదు మార్కెట్‌లోనూ ఆ రెప్లికా డిజైన్స్ లభిస్తుంటాయి. ఆభరణాలలో కనిపించే ఈ ట్రెండ్స్ వివాహ వేడుకలలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంటాయి.

బాలీవుడ్ నటి ప్రియాంకచోప్రా గురువారం తన సోదరుడు సిద్దార్థ్ మెహందీ వేడుకలో పది కోట్ల రూపాయలకు పైగా విలువైన బల్గారి నెక్లెస్‌ను ధరించి, అందరినీ విశేషంగా ఆకట్టుకుంది. ఆ మధ్య నీతా అంబానీ తన కుమారుడి పెళ్లిలో కోట్ల ఖరీదైన పచ్చల హారాన్ని ధరించింది. వేడుకలలో స్టార్ సెలబ్రిటీలు ధరించే జ్యువెలరీ ధర కోట్లలో ఉంటుంది. అంత ఖరీదు మనం పెట్టలేం, అలాంటి డిజైన్‌ని పొందలేం అని ఈ రోజుల్లో వెనకంజ వేయనక్కర్లేదు. కొన్ని రోజులలోనే అలాంటి డిజైన్లు మార్కెట్లో కనిపిస్తుంటాయి. సెలబ్రిటీలు ధరించిన ఆభరణాల రెప్లికా డిజైన్స్ రూ.1500 నుంచి పది వేల రూపాయల వరకు లభిస్తున్నాయి.





బీడ్స్ .. చోకర్స్

ఇప్పుడు వివాహ వేడుకలలో ట్రెండ్‌లో ఉన్నవి బీడ్స్, చోకర్స్. అన్నిరకాల బీడ్స్ లేయర్లుగా ఉన్నవి బాగా ఇష్టపడుతున్నారు. శారీ, డ్రెస్ కలర్‌కు మ్యాచింగ్ బీడ్స్ హారాలు, చోకర్స్ బాగా నప్పుతుంటాయి. వీటికి గోల్డెన్ బాల్స్, స్టోన్స్ లాకెట్స్ జత చేయడంతో గ్రాండ్‌గా కనిపిస్తుంటాయి. వేడుకలలో ఆకర్షణీయంగా కనిపించాలి, ఫొటో, వీడియోలలో అందంగా కనిపించాలనుకునేవారు వీటినే ఎక్కువ ఇష్టపడుతున్నారు. బంగారం ధరలు బాగా పెరిగి పోవడం, ప్రతీ వేడుకకు కొత్త హారం కావాలనుకోవడం వల్ల కూడా ఇలాంటివాటికి బాగా డిమాండ్ ఉంటోంది.

ఫోటో సెండ్ చేస్తే... ఆభరణం తయారు



ఎంత గ్రాండ్ డిజైన్ అయినా, సెలబ్రిటీలు వేసుకున్న ఆభరణాలైనా.. నచ్చిన డిజైన్ ఫోన్‌లో ఫోటో సేవ్ చేసుకొని, మాకు ఇస్తే ఆర్డర్ మీద ఆ డిజైన్‌ని తయారు చేసి ఇస్తుంటాం. వివాహ వేడుకలలో హైలైట్‌గా నిలిచే రెప్లికా డిజైన్స్, బీడ్ జ్యువెలరీని మూడు దశాబ్దాలుగా తయారుచేస్తున్నాం. స్టోన్స్, బీడ్స్, వడ్డాణం, చేతి పట్టీలూ.. పూర్తి సెట్ వారి పెళ్లి శారీ కలర్ కాంబినేషన్ బట్టి తయారుచేయించుకుంటున్నారు. సంప్రదాయ వేడుకలలో ఇప్పుడు ఫ్యాషన్ జ్యువెలరీ ఎంపికే ముందు వరసలో ఉంటుంది.

– ఎల్.పద్మ, ఇమిటేషన్ జ్యువెలరీ మేకర్, హైదరాబాద్

మెరుపు తగ్గకుండా!



ఇమిటేషన్, వన్‌గ్రామ్ గోల్డ్, ఆర్టిఫిషియల్.. ఆభరణాలను కొత్తగా ఉంచడానికి వాటిని శుభ్రంగా ఉంచాలి. ● ఆభరణాన్ని వాడిన ప్రతిసారి మృదువైన, పొడి కాటన్ వస్త్రంతో తుడవాలి. దీనివల్ల మురికి, చెమట తొలగిపోతాయి ● ఆభరణాల నాణ్యతను కాపాడుకోవడానికి సరైన విధంగా భద్రపరచుకోవాలి. తక్కువ ఖరీదు అనో, టైమ్ లేదనో.. అన్నింటినీ ఒకే బాక్స్‌లో పెట్టేస్తుంటారు. బీడ్స్, స్టోన్స్‌పై గీతలు పడకుండా, పాడవకుండా ఉండాలంటే ప్రతి ఆభరణాన్ని ప్రత్యేక కంపార్ట్‌మెంట్‌లలో ఉంచాలి ● ఏ కాస్త తేమ ఉన్నా ఆభరణాల రంగు మారుతుంది. ఆభరణాలను ఉంచే పెట్టెలో అదనపు తేమను గ్రహించడానికి మీరు సిలికా జెల్ ప్యాకెట్లను ఉపయోగించవచ్చు ● పెర్ఫ్యూమ్‌లు, లోషన్లు ఉపయోగించిన తర్వాతనే ఆభరణాలను అలంకరించుకోవాలి. లేదంటే వాటిలోని రసాయనాలు ఆభరణాలను మసకబారిస్తాయి ● ఆర్టిఫిషియల్ ఆభరణాలలో ఒకేరకాన్ని తరచూ ధరించకూడదు. దీనివల్ల ఆ ఆభరణం త్వరగా రంగు పోవడం వంటి సమస్యలు తలెత్తుతాయి ● ఆభరణాలలో ఏదైనా నష్టం గమనించినట్లయితే, వెంటనే మరమ్మతు చేయించాలి. వదులుగా ఉన్న రాళ్ళు లేదా విరిగిన వాటిని సకాలంలో గమనించినట్లయితే సులభంగా మరమ్మతు చేయవచ్చు. ఈ ఆభరణాలను బాగు చేసే షాపులు కూడా ఉంటాయి. వాటి ద్వారా నగను మరో రూపంగా కూడా మార్చుకోవచ్చు.

● అదర్ సైడ్

నాడు చెత్తకుండీలో... నేడు క్రికెట్ దిగ్గజం!





'జీవిత వాస్తవాలు ఫిక్షన్ కంటే వింతగా ఉంటాయి' అంటారు. దీనికి బలమైన ఉదాహరణ లిసా స్థలేకర్. పుణెలోని ఒక చెత్తకుండీలో దయనీయమైన స్థితిలో కనిపించిన ఆ పాపను విధి ఆస్ట్రేలియాకు చేర్చింది. ఆస్ట్రేలియన్ మహిళా క్రికెట్ జట్టు కెప్టెన్‌గా లిసా సత్తా చాటింది. వరల్డ్ కప్ గెలుచుకుంది.

మహారాష్ట్రలోని పూణేలో గుర్తు తెలియని వ్యక్తులు ఆ పాపను అనాథాశ్రమం ముందు ఉన్న చెత్తకుండీలో పడేసి వెళ్లిపోయారు. ఆ ఆశ్రమ నిర్వాహకుడు పాపను తన బిడ్డగా అక్కున చేర్చుకున్నాడు 'లైలా' అనే పేరు పెట్టాడు. ఆ రోజుల్లో స్యూ, హరేన్ అనే అమెరికన్ దంపతులు మన దేశానికి వచ్చారు. వారికి ఒక బిడ్డ ఉన్నప్పటికీ అబ్బాయిని దత్తత తీసుకోవడానికి ఇండియాకి వచ్చారు.

'మాకు అందమైన అబ్బాయి కావాలి' అంటూ ఆ దంపతులు ఆశ్రమానికి వచ్చారు.

కోరుకున్న అబ్బాయి వారికి కనిపించలేదు.

అయితే స్యూ కళ్లు లైలా మీద పడ్డాయి.

లైలా ప్రకాశవంతమైన గోధుమ రంగు కళ్లు, అమాయకమైన ముఖం చూసి వావ్ అనుకుంది స్యూ.

ఆ తరువాత లైలాను దత్తత తీసుకున్నారు.

దత్తత తరువాత 'లైలా' పేరు 'లిసా'గా మారింది. మొదట్లో యూఎస్‌లో ఉన్న ఆ దంపతులు ఆ తరువాత సిడ్నీలో శాశ్వతంగా స్థిరపడ్డారు. కుమార్తెకు క్రికెట్ ఆడడం నేర్పించారు. ఆ ఆటే లిసా జీవితాన్ని మార్చేసింది.

మొదట లిసా మాట్లాడింది. ఆ తరువాత ఆమె బ్యాట్ మాట్లాడింది.

ఆ తరువాత ఆమె రికార్డ్‌లు మాట్లాడడం మొదలైంది!

ఐసీసీ ర్యాంకింగ్ విధానం మొదలైనప్పుడు ఆమె ప్రపంచంలోనే నంబర్‌వన్ ఆల్‌రౌండర్‌గా ఉంది.

నాలుగు ప్రపంచ కప్‌లలో పాల్గొంది.

ఆస్ట్రేలియా మహిళల క్రికెట్ జట్టు కెప్టెన్‌గా సత్తా చాటిన లిసా ఇటీవలే అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికింది.

● న్యూ

ముడతలు, సోరియాసిస్, మచ్చలు, ఎండతాకిడికి దెబ్బతిన్న చర్మానికి మంచి చికిత్సగా 'లెడ్‌లైట్ థెరపీ' ఉత్తమమని చెబుతున్నారు ఆధునిక పరిశోధకులు. కొందరైతే'లెడ్‌లైట్ థెరపీ' అనేది అన్ని రకాల రోగాలకు దివ్యౌషధం అని ప్రచారం చేస్తున్నారు.

లెడ్‌లైట్ థెరపీని లో–పవర్డ్ లేజర్ థెరపీ, కోల్డ్ లేజర్ థెరపీ, ఎల్‌ఈడీ లైట్ థెరపీ అని కూడా పిలుస్తారు.

నొప్పి, మంట, కణజాల నష్టాన్ని తగ్గించడంలో, నోటిపూతలు, మచ్చలు, కాలిన గాయాలను నయం చేయడానికి, కొన్ని రకాల అల్సర్‌లను నయం చేయడానికి లెడ్‌లైట్ థెరపీ ఉపయోగపడుతుందని నిపుణులు చెబుతున్నారు.

లెడ్‌లైట్ థెరపీ



పార్కిన్సన్, అల్జీమర్స్, మల్టిపుల్ స్క్లిరోసిస్, ఆర్థరైటిస్, ఆటిజం ఉన్న రోగులకు కూడా లెడ్‌లైట్ థెరపీ ఉపయోగపడుతుందని పరిశోధనలు తెలియజేస్తున్నాయి.

ఈ చికిత్స సులువైనది. నొప్పి ఉండదు. లెడ్‌లైట్ థెరపీలో కూర్చున్న లేదా పడుకున్న పేషెంట్‌ను పదిహేను నిమిషాల పాటు లెడ్‌లైట్‌కు ఎక్స్‌పోజ్ చేస్తారు.

'సరిగ్గా వినియోగించినప్పుడు లెడ్‌లైట్ చికిత్స చాలా సురక్షితం' అంటున్నారు నిపుణులు.

'అన్నిరకాల సమస్యలకు లెడ్‌లైడ్ థెరపీ పనిచేయకపోవచ్చు' అంటున్నారు వైద్య అవసరాల కోసం లైట్, లేజర్‌ల ఉపయోగాలకు సంబంధించిన ఎక్స్‌పర్ట్, వోరల్ బయాలజీ, బయో మెడికల్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్ ప్రవీణ్ అరణి.

ఆందోళన నుంచి ఉపశమనం, కండరాల పనితీరును మెరుగుపరచడం, ఆటల వల్ల అయిన గాయాల నుంచి కోలుకోవడం, చర్మానికి యాంటీ ఏజింగ్ ప్రయోజనాలు...మొదలైన వాటికి సంబంధించి లెడ్‌లైట్ థెరపీని ఉపయోగిస్తున్నారు. అయితే దీనివల్ల ఎంత మేలు జరుగుతుందనే విషయంలో లోతైన అధ్యయనాల కొరత కనిపిస్తుంది.

క్లుప్తంగా...

12 వరకు కేటీఆర్ అరెస్టు వద్దు

- మహదేవ్‌పూర్ పోలీసులకు హైకోర్టు ఆదేశం
- 'మేడిగడ్డ'పై డ్రోన్ ఎగరేసిన కేసులో ఊరట

సాక్షి, హైదరాబాద్: జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మహదేవ్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసులో ఈ నెల 12 వరకు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారక రామారావును అరెస్టు చేయవద్దని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. ట్రయల్ కోర్టులో హాజరు నుంచి కూడా మినహాయింపు ఇచ్చింది. గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను పొడిగిస్తూ కేటీఆర్‌తోపాటు గండ్ర వెంకటరమణారెడ్డి, బాల్క సుమన్‌లకు ఊరటనిచ్చింది. కేసులో కౌంటర్ అఫిడవిట్లు దాఖలు చేయాలని పోలీసులను ఆదేశించింది. గతేడాది జూలై 26న మేడిగడ్డ బరాజ్‌ను సందర్శించిన కేటీఆర్, వెంకటరమణారెడ్డి, సుమన్.. ఎటువంటి సమాచారం, అనుమతి లేకుండా డ్రోన్ కెమెరాతో వీడియో చిత్రీకరించారంటూ మేడిగడ్డ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే తప్పు చేయకున్నా తప్పుడు కేసు పెట్టారని.. విచారణ సహా తదుపరి చర్యలు నిలిపివేయడంతోపాటు ఎఫ్ఐఆర్‌ను కొట్టేయాలంటూ కేటీఆర్, వెంకటరమణారెడ్డి, సుమన్ హైకోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ విచారణ చేపట్టి ఈ మేరకు ఆదేశాలిచ్చారు.

నిధుల విడుదలలో రాష్ట్ర ప్రభుత్వం తాత్సారం

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



సాక్షి, హైదరాబాద్: మాజీ సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులు, రైతుభరోసా నిధుల విడుదలలో రాష్ట్ర ప్రభుత్వం తాత్సారం చేస్తుందని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం తాజా మాజీ సర్పంచ్‌లు కవితను ఆమె నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా గ్రామాల్లో రైతాంగం పడుతున్న కష్టాలు, పెండింగ్ బిల్లులు విడుదల కాక పడుతున్న ఇబ్బందులను ఆమె దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ సర్పంచ్‌ల పదవీకాలం పూర్తయి ఏడాది అయినా ఇంకా నిధులు విడుదల చేయకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థతను తెలియజేస్తోందని మండిపడ్డారు. రైతు భరోసా విషయంలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేనట్టు కనిపిస్తుందని ధ్వజమెత్తారు. కాగా, వేసవి రాకముందే గోదావరి నదిని ఎడారి చేశారంటూ రేవంత్ సర్కార్‌పై కవిత మండిపడ్డారు. మాజీ సీఎం కేసీఆర్‌పై కక్షలో భాగంగా సజీవజలధారను వట్టిపోయేలా చేశారంటూ విమర్శించారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో ట్వీట్ చేశారు.

సర్వేపై చర్చకు రండి

కాంగ్రెస్‌కు బీఆర్‌ఎస్ డిమాండ్

సాక్షి, హైదరాబాద్: 'సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను తూతూ మంత్రంగా చేశారు. మీ గణాంకాలు తప్పని రుజువు చేస్తాం. మాతో చర్చకు రావాలి'అని కాంగ్రెస్‌ను బీఆర్‌ఎస్ నేతలు డిమాండ్ చేశారు. గురువారం తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి జోగు రామన్న.. మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, బీఆర్‌ఎస్ నేత పల్లె రవికుమార్‌గౌడ్, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు కిషోర్‌గౌడ్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. కులగణన సర్వే తప్పుల తడక అని ఇప్పటికే గణాంకాలతో సహా నిరూపించామని, అయినా సీఎం రేవంత్ రెడ్డికి, బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు అర్థం కావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల కమిషన్ జాబితాలో 4.18 కోట్ల మంది బీసీలు ఉంటే... కాంగ్రెస్ సర్వేలో 3.75 కోట్ల జనాభాకు పరిమితం చేశారని ఆరోపించారు. అందుకే రీ సర్వే కోరడంలో తప్పేంటని ప్రశ్నించారు. పొన్నం ప్రభాకర్ బీసీ జాతికి ద్రోహం చేయొద్దని, సీఎం రేవంత్ రెడ్డికి పొన్నం తొత్తుగా మారొద్దని అన్నారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను తుంగలో తొక్కిన కాంగ్రెస్‌ను స్థానిక ఎన్నికల్లో నిలదీయాలని కోరారు. కులగణన మొదలు పెట్టినప్పటినుంచే రేవంత్‌రెడ్డి బీసీలపై కుట్ర మొదలు పెట్టారని వారు విమర్శించారు.

అసైన్డ్ భూముల్లో ఆలేరు ఎమ్మెల్యే వ్యాపారం

సేల్‌డీడ్ రద్దు చేసి గిరిజనులకు అప్పగించాలి: గొంగిడి సునీత

సాక్షి, హైదరాబాద్: ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యాయాదవ్ తన కారు డ్రైవర్, పీఏ పేరిట అసైన్డ్ భూముల్లో వ్యాపారం చేస్తున్నాడని మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత ఆరోపించారు. అనుచరుల పేరిట గిరిజనుల భూములను జీపీఏ చేసి తన బంధువులకు విక్రయించాడన్నారు. ప్రభుత్వం వెంటనే సేల్ డీడ్ రద్దు చేసి హక్కుదారులైన గిరిజనులకు ఆ భూములు తిరిగి అప్పగించాలని డిమాండ్ చేశారు. తెలంగాణభవన్‌లో గురువారం గొంగిడి సునీత మీడియాతో మాట్లాడారు. గతంలో కొలనుపాకలో బీర్ల ఐలయ్య భూ కబ్జాలకు పాల్పడ్డారని, తాజాగా ఆలేరు రెవెన్యూ తండాలో భూ దందాలకు తెరలేపాడన్నారు. అసైన్డ్ భూములను అక్రమమార్గంలో దగ్గరి బంధువులకు విక్రయించి, సదరు భూమిని నాలా కన్వర్షన్ చేయించారని తెలిపారు. అమాయక గిరిజనుల భూములపై ఎమ్మెల్యే కన్నేసి భూదందా చేస్తున్నారన్నారు. తప్పు చేసిన ఎమ్మెల్యేపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ తరహాలోనే బీర్ల ఐలయ్య కూడా అక్రమ వ్యవహారాలు చేస్తున్నారని గొంగిడి సునీత విమర్శించారు.

ఉప ఎన్నికలు రావాలి..

ప్రజల కోరిక అదే!

పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అంశంలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

గురువారం ఢిల్లీలో పర్యటించిన కేటీఆర్ బృందం.. కేంద్ర మంత్రులతో భేటీ



గురువారం ఢిల్లీలో కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో సమావేశమైన కేటీఆర్, వినోద్‌కుమార్, సురేశ్‌రెడ్డి, సబితారెడ్డి, దామోదరరావు

సాక్షి, న్యూఢిల్లీ: ''రాష్ట్ర ప్రజలంతా ఉప ఎన్నికలు రావాలని కోరుకుంటున్నారు. పార్టీ ఫిరాయించిన పది మంది ఎమ్మెల్యేలకు సుప్రీంకోర్టు ఇప్పటికే నోటీసులు జారీ చేసింది. వారిపై అనర్హత వేటు పడే వరకూ న్యాయ పోరాటం చేస్తూనే ఉంటాం''అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు పేర్కొన్నారు. నెల రోజుల్లోగా ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు పడేలా కోర్టులో వాదనలు వినిపించాలని తమ న్యాయవాదుల బృందానికి సూచించారు. కేటీఆర్ గురువారం ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, కల్వకుంట్ల సంజయ్, ఎంపీలు వద్దిరాజు రవిచంద్ర, దామోదర్‌రావు, కేఆర్ సురేశ్‌రెడ్డి, పార్థసారథిలతో కలసి ఢిల్లీలో పర్యటించారు. కేంద్ర మంత్రులు ధర్మేంద్ర ప్రధాన్, నితిన్ గడ్కరీలతో భేటీ అయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. తర్వాత తమ న్యాయవాదుల బృందంతో సమావేశమై చర్చించారు.

యూజీసీ నిబంధనలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం

➤ రాష్ట్రాల స్వయం ప్రతిపత్తిని, హక్కులకు భంగం కలగకుండా యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ) నూతన నిబంధనలను రూపొందించాలని కేంద్ర మంత్రికి కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. యూజీసీ నిబంధనల్లో తలపెట్టిన మార్పులపై బీఆర్‌ఎస్ అభిప్రాయాన్ని ఆరు పేజీల లేఖ రూపంలో కేంద్ర ప్రభుత్వానికి అందిస్తున్నామని తెలిపారు. ''దేశంలో రాష్ట్రాల హక్కులను హరిస్తూ, ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా, రాష్ట్ర పరిధిలోని యూనివర్సిటీలకు వీసీల నియామకానికి వేసే సెర్చ్ కమిటీల బాధ్యతను గవర్నర్లకు అప్పగిస్తూ యూజీసీ తలపెట్టిన నిబంధనలు సరికాదు. ఇది రాష్ట్ర ప్రభుత్వ యూనివర్సిటీలను గవర్నర్ల రూపంలో కేంద్ర ప్రభుత్వం తన అధీనంలోకి తీసుకోవడమే. ఇది సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం. అలాగే నో సూటబుల్ క్యాండిడేట్ ఫౌండ్ (ఎన్ఎస్ఎఫ్) అనే నిబంధన తీసుకురావడం ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీలు రిజర్వేషన్లు కోల్పోతారు. అభ్యర్థులు దొరకలేదనే సాకుతో ఆ ఉద్యోగాలను ఇతర కేటగిరీలతో భర్తీ చేసే ప్రమాదం ఉంది..''అని కేటీఆర్ చెప్పారు. యూనివర్సిటీ ఉద్యోగాల భర్తీలో కేవలం విద్యార్హతలకే కాకుండా పరిశోధనలకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలని కేంద్ర మంత్రిని కోరామన్నారు.

'ఎన్‌హెచ్ 365బి'ని కోరుట్ల వరకు విస్తరించండి

➤ సిరిసిల్ల వరకు నిర్మాణం అవుతున్న 'నేషనల్ హైవే-365 బి'ని వేములవాడ మీదుగా కోరుట్ల వరకు విస్తరించాలని కేంద్ర మంత్రి గడ్కరీని కోరినట్టు కేటీఆర్ తెలిపారు. ఈ రహదారిలో కొండగట్టు ఆలయం, ధర్మపురిలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయం ఉన్నాయని.. రహదారిని విస్తరిస్తే ఆధ్యాత్మిక పర్యాటకాన్ని ప్రోత్సహించినట్టు కూడా ఉంటుందని వివరించామన్నారు. ధవళేశ్వరం బ్రిడ్జి మాదిరిగా.. మిడ్ మానేరుపై రోడ్ కమ్ రైల్ బ్రిడ్జిని ఏర్పాటు చేసి.. వేములవాడ మీదుగా కోరుట్ల వరకు ఎన్‌హెచ్-63ని కలిపేలా విస్తరించాలని కోరామన్నారు.

నెల రోజులు గడువు పెట్టేలా చూడాలి..

➤ ఫిరాయింపులకు పాల్పడ్డ ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకునే అంశంపై ప్రముఖ న్యాయవాది మోహిత్‌రావు నేతృత్వంలోని లాయర్లతో కేటీఆర్ బృందం భేటీ అయింది. గంటపాటు జరిగిన ఈ భేటీలో ఫిరాయింపుల కేసు విషయంలో వ్యవహరించాల్సిన తీరు, ఈ నెల 10న సుప్రీంకోర్టులో జరిగే విచారణ సందర్భంగా అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. ''ఆ పది మంది ఎమ్మెల్యేలకు అసెంబ్లీ కార్యదర్శి వి.నరసింహాచార్యులు ఇటీవల నోటీసులు జారీ చేశారు. నోటీసులకు సమాధానం ఇచ్చేందుకు ఎలాంటి కాలపరిమితి విధించలేదు. కాబట్టి ఇటీవలే నోటీసులు ఇచ్చామని తమకు 6, 7 నెలలు సమయం కావాలని కోర్టును అసెంబ్లీ కార్యదర్శి కోరే అవకాశం ఉంది. వారికి అంత సమయం ఇస్తే పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై ఇప్పట్లో అనర్హత వేటు పడే అవకాశం ఉండదు. నెల రోజులే గడువు పెట్టేలా, అనర్హత వేటు పడేలా వాదనలు వినిపించాలి''అని కేటీఆర్ సూచించారు. నెలరోజుల్లో ఈ ప్రక్రియ అంతా ముగిస్తే ఉప ఎన్నికలకు వెళ్లొచ్చని కూడా పేర్కొన్నట్టు సమాచారం.

గీత దాటితే వేటే..!

▶ మొదటి పేజీ తరువాయి

శాసనసభా పక్ష సమావేశం జరిగింది. ఐదుగంటల పాటు కొనసాగిన ఈ సమావేశంలో సీఎంతోపాటు పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపా దాస్‌మున్షీ, టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్ర మార్క సహా మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల ఎన్నికలు, కులగణన, ఎస్సీ వర్గీకరణ, ఎమ్మెల్యేల ప్రత్యేక సమావేశాలు తదితర అంశాలపై చర్చించారు.

నేను ఫ్రెండ్లీ సీఎంను..!

పార్టీ కోసం అందరం కలసికట్టుగా పనిచేసుకుంటూ ముందుకు వెళ్లాలని ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్ స్పష్టం చేశారు. ''నేను ఫ్రెండ్లీ సీఎంను.. నా దగ్గరకు ఎమ్మెల్యేలు ఎప్పుడైనా రావచ్చు. సాధ్యమైనంత వరకు చేసి పెడతా. సాధ్యం కాని పనులు చేయలేం. కొందరు మా దగ్గరకు వచ్చి పనులు కాకపోతే.. మళ్లీ మీతో కలసి వస్తున్నారు. అలాంటప్పుడు పనులు చేయలేదని బాధపడాల్సిన అవసరం లేదు. మొదటిసారి గెలిచిన ఎమ్మెల్యేలు క్యారెక్టర్ కాపాడుకోవాలి. పైరవీలు చేసి ప్రజల్లో, అధికారుల్లో చులకన కావద్దు. తొలిసారి గెలిచినవారు రెండోసారి గెలవడం చాలా కష్టం. మన పని తీరే రెండోసారి గెలిపిస్తుంది. ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి..'' అని పేర్కొన్నట్టు తెలిసింది.

డిన్నర్ మీటింగ్‌లు వద్దు..

ఎమ్మెల్యేలు మామూలుగానే భోజనం చేయాలని డిన్నర్‌కు కలిసి ఉండవచ్చని, కానీ ప్రత్యర్థులు ఈ విషయాన్ని చిలువలు పలువలుగా ప్రచారం చేస్తున్నారని సీఎం రేవంత్ పేర్కొన్నట్టు సమాచారం. ''మన గురించి మాట్లాడుకునే ఆస్కారం ఎదుటివారికి ఇవ్వొద్దు. జీ-23 పేరుతో గులాం నబీ ఆజాద్ వంటి వారు మీటింగ్‌లు పెడితేనే పార్టీ సహించలేదు. ఇంకోసారి ఇలాంటి డిన్నర్ మీటింగులు పెట్టుకోకపోవడమే మంచిది. నేను పని చేయలేదని ఎవరైనా సీరియస్‌గా భావిస్తే నేరుగా ఏఐసీసీ దగ్గరికి వెళ్లొచ్చు, చెప్పొచ్చు. అవసరమైతే ఖర్గే అపాయింట్‌మెంట్ నేనే ఇప్పిస్తా..'' అని సూచించినట్టు తెలిసింది.

ఎన్ని చేసినా ప్రజల్లోకి వెళ్లలేకపోయాం

మహిళలకు ఉచిత ప్రయాణం నుంచి ఉద్యోగాల భర్తీ వరకు అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేశామని, కుల గణన, ఎస్సీ వర్గీకరణ చేపట్టామని.. అయినా ప్రజల్లోకి పూర్తిస్థాయిలో వెళ్లలేకపోయామని సీఎం రేవంత్ వ్యాఖ్యానించినట్టు తెలిసింది. ఇప్పటికైనా ఎమ్మెల్యేలు ఈ అంశాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని, అందరం ఒక లైన్ మీద ఉండి పనిచేయాలని స్పష్టం చేసినట్టు సమాచారం. స్థానిక సంస్థల ఎన్నికలకు పది, పదిహేను రోజుల్లో నే నోటిఫికేషన్ రావచ్చని, కేబినెట్‌లో నిర్ణయం తీసుకుంటామని.. అప్పటివరకు ఎన్నికలు ఎప్పుడు వస్తాయనిగానీ, షెడ్యూల్ గురించిగానీ ఎవరూ మాట్లాడవద్దని సూచించిన ట్టు తెలిసింది. అందరూ ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని, వీలైనంత వరకు ఏకగ్రీవాలకు ప్రయత్నం చేయాలని దిశానిర్దేశం చేసినట్టు సమాచారం. స్థానిక సంస్థల ఎన్నికలు అయ్యేంతవరకు స్థానికంగానే ఉండాలని సీఎం సూచించినట్టు తెలిసింది. కాగా, బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన 10 మంది ఎమ్మెల్యేలు తాజాగా సీఎల్పీ సమావేశానికి హాజరుకాలేదు. టీజేఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ కోదండరామ్ సమావేశంలో పాల్గొన్నారు.

'స్థానిక' ఎన్నికల్లో ఘన విజయం సాధించాలి

ఇదే సమయంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే.. త్వరలోనే ఎమ్మెల్యేలకు నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో నిర్వహించిన కులగణన, ఎస్సీ వర్గీకరణ అంశాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ఎమ్మెల్యేలకు సూచించారు. కులగణన, ఎస్సీ వర్గీకరణపై సూర్యాపేట, మెదక్‌లలో భారీ బహిరంగ సభలు నిర్వహించాలని నిర్ణయించినట్టు వెల్లడించారు. సూర్యాపేటలో కులగణన సభకు రాహుల్ గాంధీని, మెదక్ ఎస్సీ వర్గీకరణ సభకు ఖర్గేను ఆహ్వానిస్తామని తెలిపారు. ఇక ఉప ముఖ్యమంత్రి భట్టి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, వచ్చిన ఆదాయాన్ని ఏ విధంగా వ్యయం చేస్తున్న అంశాలపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చినట్టు తెలిసింది. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఎన్నెన్ని నిధులిచ్చారనే అంశాన్ని కూడా భట్టి ఇందులో వివరించినట్టు సమాచారం.

పథకాల విషయంలో క్షేత్రస్థాయిలో ఇబ్బందులు!

సీఎల్పీ భేటీలో మాట్లాడిన ఎమ్మెల్యేలు పలు అంశాలను ప్రస్తావించారు. రైతు భరోసాను పూర్తిస్థాయిలో అమలు చేయాలని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సూచించినట్టు సమాచారం. రుణమాఫీ అనుకున్న స్థాయిలో జరగలేదని, క్షేత్రస్థాయిలో ఇబ్బందిగా ఉందని.. రుణమాఫీ కారణంగా మిగతా పథకాలను వంద శాతం అమలు చేయ లేకపోతున్నామని ఆయన పేర్కొన్నట్టు తెలిసింది. ఇక పథకాలను హడావుడిగా ప్రారంభిస్తున్నామని.. ఏదీ వంద శాతం రీచ్ కావడం లేదని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి స్పష్టం చేసినట్టు సమాచారం. మంత్రి సీతక్క మాట్లాడుతూ.. ఒక్కొక్కరు ఒక్కోలా మాట్లాడుతుండటంతో గందరగోళం నెలకొంటోందని, ఇకపై గాంధీభవన్ నుంచి మంత్రులు, ఎమ్మెల్యేలకు మెటీరియల్ వచ్చేలా చూడాలని కోరినట్టు తెలిసింది. ఇక మాజీ మంత్రి కేటీఆర్ అనుచరులు అమీన్‌పూర్‌లో భూములు ఆక్రమించిన వివరాలు తన వద్ద ఉన్నాయని, వాటిపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేస్తే పట్టించుకోవడం లేదని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి పేర్కొన్నట్టు తెలిసింది. వ్యక్తిగత, స్వార్థ ప్రయోజనాల కోసం తాను ఏ మంత్రి వద్దకూ వెళ్లలేదని ఆయన కుటుంబసభ్యుల మీద ఒట్టుపెట్టినట్టు సమాచారం. చివరగా ప్రభుత్వం ఏర్పాటై ఏడాది అయినా నిధులు రాకపోతే నియోజకవర్గాల్లో అభివృద్ధి పను లు ఎలాగని కొందరు ఎమ్మెల్యేలు ప్రస్తావించగా.. త్వరలో విడుదల చేస్తామని సీఎం రేవంత్ చెప్పినట్టు తెలిసింది.

అసంతృప్తికి ఆస్కారం ఇవ్వొద్దు!

- ఎమ్మెల్యేలను సమన్వయం చేసుకోండి.. వారి సమస్యలకు ప్రాధాన్యమివ్వండి
- సీఎం రేవంత్, పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, రాష్ట్ర నేతలకు కేసీ వేణుగోపాల్ సూచన
- ఎస్సీ వర్గీకరణ, కులగణన, పీసీసీ కమిటీల నియామకంపై చర్చలు
- నేడు ఖర్గే, రాహుల్‌ను కలవనున్న సీఎం రేవంత్, ఇతర నేతలు

సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్ర ఎమ్మెల్యేల్లో అసంతృప్తికి ఎలాంటి అవకాశం ఇవ్వొద్దని, వారి సమస్యల సత్వర పరిష్కారానికి ప్రాధాన్యమివ్వాలని సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర నేతలకు ఏఐసీసీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ సూచించినట్టు తెలిసింది. ఎమ్మెల్యేలతో ఎప్పటికప్పుడు భేటీలు నిర్వహించి వారి సమస్యలు తెలుసుకోవాలని, 2 నెలలకోసారి అయినా సీఎల్పీ భేటీ నిర్వహించుకోవాలని స్పష్టం చేసినట్టు సమాచారం. గురువారం ఢిల్లీకి వచ్చిన సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ తదితరులు కేసీ వేణుగోపాల్ నివాసానికి వెళ్లి ఆయనతో భేటీ అయ్యారు. సుమారు గంటన్నర పాటు జరిగిన చర్చలో రాష్ట్ర రాజకీయ అంశాలు, పీసీసీ కమిటీల కూర్పు, కులగణన, ఎస్సీ వర్గీకరణ, నామినేటెడ్ పదవుల భర్తీ తదితర అంశాలపై చర్చించారు. ముఖ్యంగా ఇటీవల ఎమ్మెల్యేల విందు భేటీ, దానిపై జరిగిన గందరగోళం, ఇందుకు దారితీసిన పరిస్థితులపై కేసీ ఆరా తీసినట్టు తెలిసింది. దీనితోపాటు సీఎల్పీ భేటీలో ఎమ్మెల్యేలు వ్యక్తం చేసిన అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నట్టు సమాచారం. రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షం బీఆర్‌ఎస్ బలంగా ఉన్న నేపథ్యంలో.. ఇలాంటి ఊహాగానాలకు ఆస్కారం ఇవ్వొద్దని కేసీ సూచించినట్టు తెలిసింది. ఎమ్మెల్యేలతో నిరంతరం మంత్రులు టచ్‌లో ఉండేలా చూడాలని, వారితో పీసీసీ మాట్లాడాలని.. ముఖ్యంగా కొత్త ఎమ్మెల్యేల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని పేర్కొన్నట్టు తెలిసింది.

పీసీసీ కమిటీలపైనా కసరత్తు..

భేటీలో పీసీసీ కమిటీల కూర్పుపైనా చర్చించినట్టు తెలిసింది. రాష్ట్రంలో చేసిన కులగణన ఆధారంగా పదవుల పంపకాల్లో బీసీలు, దళితులు, ఆదివాసీలు, మైనార్టీలకు ప్రాధా న్యమివ్వాలని కేసీ సూచించి నట్టు సమాచారం. కనీసం నలుగురు వర్కింగ్ ప్రెసిడెంట్లు ఉండాలన్న ప్రతిపాదన వచ్చినట్టు తెలిసింది. జిల్లా అధ్యక్ష పదవుల్లో 50శాతానికిపైగా బలహీన వర్గాలకు ఇవ్వాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కులగణన ఆధారంగానే టికెట్ల కేటాయింపు ఉండాలనే అభిప్రాయం వ్యక్తమైనట్టు సమాచారం. కాగా.. ఢిల్లీ పర్యటనలో భాగంగా సీఎం రేవంత్, ఇతర నేతలు శుక్రవారం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్‌తో భేటీ కానున్నట్టు పార్టీ వర్గాలు వెల్లడించాయి.

రెండు, మూడు రోజుల్లో పీసీసీ కార్యవర్గం: మహేశ్‌గౌడ్

పార్టీ అధిష్టానం రెండు, మూడు రోజుల్లో పీసీసీ కార్యవర్గాన్ని ప్రకటిస్తుందని పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ తెలిపారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో భేటీ అనంతరం డిప్యూటీ సీఎం భట్టితో కలసి మీడియాతో మాట్లాడారు. వేణుగోపాల్‌తో రాష్ట్ర మంత్రివర్గ విస్తరణపై చర్చ జరిగిందని.. అర్హులను ఎంపిక చేసేందుకు సమయం పడుతుందని చెప్పారు. కులగణన, ఎస్సీ వర్గీకరణ పూర్తయిన నేపథ్యంలో అధిష్టానం పెద్దలను రాష్ట్రానికి ఆహ్వానించేందుకు ఢిల్లీకి వచ్చామన్నారు.

త్వరలో రెండు భారీ బహిరంగ సభలు: భట్టి

కులగణన, ఎస్సీ వర్గీకరణకు సంబంధించిన పూర్తి వివరాలను తమ పార్టీ అధినాయకత్వానికి వివరించామని భట్టి విక్రమార్క తెలిపారు. కులగణన, ఎస్సీ వర్గీకరణకు సంబంధించి త్వరలో రాష్ట్రంలో రెండు భారీ బహిరంగ సభలను నిర్వహిస్తామని తెలిపారు.

మండలి ఎన్నికలకు బీఆర్‌ఎస్ దూరం!

పోటీపై పార్టీ నేతల ప్రతిపాదనను తిరస్కరించిన కేసీఆర్

అధికారికంగా ఎవరికీ మద్దతు ఇవ్వరాదని నిర్ణయం



సాక్షి, హైదరాబాద్: శాసన మండలిలోని మూడు స్థానాలకు ఈ నెల 27న జరిగే ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉండాలని బీఆర్‌ఎస్ నిర్ణయించింది. ఈ మేరకు పార్టీ అధ్యక్షుడు కె.చంద్రశేఖర్‌రావు ముఖ్య నేతలకు స్పష్టత ఇచ్చారు. పట్టభద్రుల కోటా స్థానంలో పోటీ చేయాలని పార్టీ నేతలు చేసిన ప్రతిపాదనను కేసీఆర్ తిరస్కరించారు. పట్టభద్రుల కోటాలో పార్టీ టికెట్ ఆశిస్తున్న నేతలకు ఈ సమాచారం ఇవ్వాల్సిందిగా కీలక నేతలకు సూచించారు. అదే సమయంలో మండలి ఎన్నికల్లో ఇతర పార్టీలు లేదా అభ్యర్థులెవరికీ మద్దతు ఇవ్వ డం లేదనే సంకేతాలు కూడా ఇచ్చారు. శాసన మండలి ఎన్ని కలకు బదులు త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల దిశగా సన్నాహాలు ప్రారంభించాలని పార్టీ శ్రేణులను కేసీఆర్ ఆదేశించారు. ఇక స్థానిక ఎన్నికల సన్నద్ధతకు సంబంధించి ఫిబ్రవరి నెలాఖరులో భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు.. త్వరలో పార్టీ ముఖ్య నేతలతో సమావేశం నిర్వహిస్తామని కేసీఆర్ పేర్కొన్నట్టు పార్టీ వర్గాలు వెల్లడించాయి. సభ నిర్వహణపై వారంలో స్పష్టత వచ్చే అవకాశం ఉందని తెలిపాయి.

పోటీకి నేతలు సిద్ధమైనా..

శాసనమండలిలో పట్టభద్రుల నియోజకవర్గంతోపాటు ఉపాధ్యాయ కోటా స్థానాలకు ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో బీఆర్‌ఎస్ నుంచి పలువురు ఆశావహులు టికెట్ కోసం ప్రయత్నాలు చేశారు. కరీంనగర్ మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్, డాక్టర్ బీఎన్ రావు, శేఖర్‌రావు, రాజారాం యాదవ్ తదితరుల పేర్లు వినిపించాయి. పట్టభద్రుల కోటాలో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేస్తున్న నరేందర్‌రెడ్డిని బీఆర్‌ఎస్‌లో చేర్చుకుని టికెట్ ఇవ్వాలని ఓ దశలో ప్రతిపాదనలు వచ్చాయి. ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేసి పోటీకి సన్నద్ధమవుతున్న ప్రసన్న హరికృష్ణను బీఆర్‌ఎస్‌లోకి తీసుకువచ్చి పార్టీ టికెట్ ఇప్పించేందుకు కరీంనగర్ జిల్లాకు చెందిన ఓ మాజీ మంత్రి కొంతమేర ప్రయత్నాలు కూడా చేశారు. కానీ చివరికి పోటీకి దూరంగా ఉండాలని పార్టీ అధినేత కేసీఆర్ నిర్ణయించారు. కాగా ఢిల్లీ పర్యటనలో ఉన్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు తిరిగి వచ్చాక స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధతపై ఫోకస్ చేయనున్నారు.

వర్గీకరణను అడ్డుకునే కుట్రలను సాగనీయం

వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణను అడ్డుకునే కుట్రలను సాగనివ్వబోమని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ స్పష్టం చేశారు. గురువారం మంత్రుల నివాస సముదాయంలో మాదిగ, మాదిగ ఉపకులాల ప్రతినిధులు మంత్రి రాజనర్సింహతో సమావేశమయ్యారు. మాదిగల కలను నెరవేర్చేందుకు కృషి చేస్తున్న ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. మంత్రిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా దామోదర మీడియాతో మాట్లాడుతూ.. వర్గీకరణ ప్రక్రియ దాదాపు పూర్తయిందని, అతి త్వరలో ఉత్తర్వులు వెలువడతాయని తెలిపారు. ఈ ప్రక్రియను అడ్డుకొనేవారికి ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ప్రభుత్వం వర్గీకరణను పక్కాగా అమలు చేయాలని నిర్ణయించిందని, ఇందులో భాగంగానే ఏకసభ్య కమిషన్ ఏర్పాటు సిఫారసులు స్వీకరించిందని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి కమిట్‌మెంట్ వల్లే వర్గీకరణ సాధ్యమవుతోందని చెప్పారు. మాదిగ, మాదిగ ఉపకులాలకు సుమారు 9.8% రిజర్వేషన్లు అందుతాయని తెలిపారు. గ్రూప్ 1లో 0.77 శాతం, గ్రూప్ 2లో 9% దక్కుతాయని వివరించారు.

ఎన్నికలు ఎప్పుడొచ్చినా కాంగ్రెస్‌దే విజయం

మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ధీమా



సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థలకు ఎప్పుడు ఎన్నికలొచ్చినా వంద శాతం కాంగ్రెస్ పార్టీదే విజయమని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. రాబోయే 30 ఏళ్లు కాంగ్రెస్ పార్టీ చేతిలోనే రాష్ట్రం ఉంటుందని స్పష్టం చేశారు. సీఎల్పీ సమావేశం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎల్పీ సమావేశంలో పార్టీ బలోపేతం గురించి చర్చించామని తెలిపారు. ప్రతి ఒక్క కార్యకర్తకు అందుబాటులో ఉండాలని సూచించామన్నారు. తొలిసారి ఎమ్మెల్యే కావడం సులభం.. కానీ దాన్ని నిలబెట్టుకోవడానికి కష్టపడాలని హితవు పలికారు. ఎమ్మెల్యేలు కలిసి భోజనం చేసినా తప్పేనా? దాన్ని కూడా రాజకీయం చేస్తారా? అని కోమటిరెడ్డి ప్రశ్నించారు.

స్థానిక ఎన్నికల్లో వ్యూహాలపై చర్చించాం

టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్



సాక్షి, హైదరాబాద్: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై సీఎల్పీ సమావేశంలో చర్చించినట్లు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. ఎంసీహెచ్‌ఆర్‌డీలో గురువారం జరిగిన సీఎల్పీ సమావేశం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికలకు సంబంధించి ఎమ్మెల్యేలు వారి అభిప్రాయాలను తెలియజేశారని, వారి అనుమానాలను నివృత్తి చేసినట్లు చెప్పారు. ఆర్థిక పరిస్థితులు, ఎస్సీ వర్గీకరణపై మంత్రి భట్టి విక్ర మార్క పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న వర్గీకరణ, కులగణన నిర్ణయాలపై విస్తృతంగా ప్రచారం చేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను క్షేత్ర స్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యేలు, డీసీసీలకు సూచించినట్లు చెప్పారు. కులగణనపై సూర్యాపేటలో సభ ఏర్పాటు చేసి రాహుల్‌గాంధీని ఆహ్వానిస్తామన్నారు. ఎస్సీ వర్గీకరణపై మెదక్‌లో నిర్వహించే సభకు ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేను ఆహ్వానించేందుకు ఢిల్లీకి వెళ్తున్నట్లు చెప్పారు. బీజేపీతో లోపాయికారి ఒప్పందం కోసం కేటీఆర్ ఢిల్లీ వెళ్లారని ఆరోపించారు.

తీన్మార్ మల్లన్నకు కాంగ్రెస్ షోకాజ్ నోటీస్

12వ తేదీలోగా వివరణ ఇవ్వాలని ఆదేశం



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, ఏఐసీసీ నిర్ణయాలకు వ్యతిరేకంగా కులగణన జరిగిన తీరుపై పరుష పదజాలంతో చేసిన వ్యాఖ్యలకు ఈనెల 12లోగా వివరణ ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నకు టీపీసీసీ స్పష్టం చేసింది. ఈ మేరకు పార్టీ క్రమశిక్షణ సంఘం చైర్మన్ జి.చిన్నారెడ్డి గురువారం షోకాజ్ నోటీస్ జారీ చేశారు. దేశంలోనే తొలిసారిగా రాష్ట్రంలో 50 రోజుల్లో కులగణన జరిపి, అసెంబ్లీ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారని, ముస్లింలతో కలిపి బీసీలు 56 శాతం ఉన్నారని, చెప్పారని, అదేరోజు ఎస్సీ వర్గీకరణ ప్రక్రియ కూడా పూర్తి చేశారని నోటీస్‌లో పేర్కొన్నారు. కులగణన, ఎస్సీ వర్గీకరణను ప్రతి ఒక్కరు అభినందిస్తుంటే, పార్టీ ప్రయోజనాలను పక్కన బెట్టి, వ్యక్తిగత ఎజెండాతో పరుష పదజాలంతో బీసీ జనాభా, కులగణన ప్రక్రియను విమర్శించడాన్ని పార్టీ తీవ్రంగా పరిగణిస్తుందని తెలిపారు. 12వ తేదీలోగా వివరణ ఇవ్వని పక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని, ఈ మేరకు ఏఐసీసీకి సమాచారం ఇచ్చినట్టు తెలిపారు.

కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డికి బీఫామ్

సీఎల్పీ సమావేశంలో అందించిన సీఎం రేవంత్

సాక్షి, హైదరాబాద్: మెదక్ - కరీంనగర్ - నిజామాబాద్ - ఆదిలాబాద్ పట్టభద్రుల నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థిగా ఎంపికైన నరేందర్‌రెడ్డికి సీఎం రేవంత్‌రెడ్డి గురువారం బీఫామ్ అందజేశారు. సీఎల్పీ సమావేశం సందర్భంగా ఏఐసీసీ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ సమక్షంలో బీఫామ్ అందించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో నరేందర్‌రెడ్డి విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్ బాబు, సీతక్క, జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

కులగణన నివేదికను పునఃసమీక్షిస్తామంటే చర్చలకు సిద్ధం

బీసీ సంఘాలు, మేధావుల వెల్లడి

సాక్షి , హైదరాబాద్: సమగ్ర కులగణన నివేదికపై బీసీ సంఘాలతో చర్చించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించడాన్ని తాము స్వాగతిస్తున్నామని బీసీ సంఘాల నేతలు పేర్కొన్నారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం కులగణన నివేదికను పునఃసమీక్షిస్తామంటే చర్చలకు తాము సిద్ధమేనని బీసీ సంఘాల నేతలు, బీసీ మేధావులు సంయుక్తంగా ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన సమగ్ర కులగణన నివేదికను వ్యతిరేకిస్తూ ఆందోళన చేపట్టిన బీసీ సంఘాలు, ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయడానికి తదుపరి కార్యాచరణకోసం గురువారం ఒక ప్రైవేటు హోటల్లో సమావేశం అయ్యాయి. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, బీసీ మేధావుల ఫోరం చైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి టి.చిరంజీవులు, ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేశ్, బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేశ్‌చారితోపాటు పలువురు ఇతర బీసీ సంఘాల నేతలు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన సమగ్ర కుటుంబ సర్వే రిపోర్ట్‌లో బీసీల జనాభాను తక్కువగా చూపించి, బీసీలకు చేసిన అన్యాయాన్ని వివరిస్తూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి శుక్రవారం లేఖ రాయాలని నాయకులు నిర్ణయించారు. అలాగే ఈనెల 9న హైదరాబాద్‌లో 'ఏది నిజం'పేరుతో బీసీ ప్రజా ప్రతినిధుల విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. అదే విధంగాఈనెల రెండో వారంలో చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని చేపడతామని తెలిపారు.

అన్ని పంచాయతీలను 4 గ్రేడ్‌లుగా విభజించాలి

మంత్రి సీతక్కకు టీపీఎస్‌ఏ వినతిపత్రం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని పంచాయతీలను 4 గ్రేడ్‌లుగా పునర్ వ్యవస్థీకరించి, ఆయా గ్రేడ్‌ల వారీగా కేడర్ స్ట్రెంత్‌ను పెంచాలని పీఆర్ శాఖ మంత్రి సీతక్కకు తెలంగాణ పంచాయతీ సెక్రటరీస్ అసోసియేషన్ (టీపీఎస్‌ఏ) విజ్ఞప్తి చేసింది. జూనియర్ పంచాయతీ కార్యదర్శుల (జేపీఎస్) నియామకపు తేదీ నుంచి సర్వీస్ లెక్కిస్తూ, రెగ్యులరైజేషన్ కాలాన్ని నాలుగేళ్లనుంచి రెండేళ్లకు తగ్గించి ప్రొబేషన్ డిక్లేర్ చేయాలని కోరింది. ఔట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దుచేసి ప్రస్తుతం పనిచేస్తున్న ఓపీఎస్‌లను జేపీఎస్‌లుగా వారి సర్వీస్ కాలాన్ని గుర్తించి రెగ్యులరైజ్ చేయాలని విజ్ఞప్తి చేసింది. గురువారం ఈ మేరకు సీతక్కకు టీపీఎస్‌ఏ అధ్యక్షుడు పి.మధుసూదనరెడ్డి ఆధ్వర్యంలో సంఘ నాయకులు వినతిపత్రం సమర్పించారు. పంచాయతీ కార్యదర్శుల సమస్యలపై అధికారులతో విడిగా సమావేశం ఏర్పాటు చేసి చర్చిద్దామని మంత్రి హామీనిచ్చినట్టు సంఘం నేతలు తెలిపారు. ఈ సందర్భంగా సంఘం 2025 డైరీ, కేలండర్‌లను మంత్రి ఆవిష్కరించారు. తమ సమస్యలపై సీఎస్ శాంతికుమారి, పీఆర్‌శాఖ కార్యదర్శి లోకేశ్‌కుమార్‌లకు సంఘం నేతలు మధుసూదనరెడ్డి, శ్రీనివాస్ తదితరులు వినతిపత్రం సమర్పించారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)		
సెన్సెక్స్ ▽ 213	78,058	నాస్‌డాక్	19,728	△ 38
నిఫ్టీ ▽ 93	23,603	డోజోన్స్	44,741	▽ 132
		ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,727	△ 104
		డాక్స్	21,902	△ 316
		షాంఘై	3,271	△ 4
		నికాయ్	39,067	△ 235

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై		
బంగారం (99.9 స్వచ్ఛత)	84,613	▽ 33
బంగారం (99.5 స్వచ్ఛత)	84,274	▽ 44
వెండి (కేజీ)	94,762	▽ 663

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	87.10	88.12
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	108.00	110.88
€	యూరో	ఎస్‌బీఐ	89.74	92.38
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	56.85	58.28
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.80	56.02
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	62.08	62.40
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.45	24.06
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.95	24.74
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.14	12.96

ఎస్‌బీఐ లాభం హైజంప్

క్యూ3లో రూ. 16,891 కోట్లు ● వడ్డీ ఆదాయం రూ. 41,446 కోట్లు



ముంబై: ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బీఐ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికం (2024-25,క్యూ3)లో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. స్టాండెలోన్ నికర లాభం 84% దూసుకెళ్లి రూ. 16,891 కోట్లను తాకింది. గతేడాది (2023-24) ఇదే కాలంలో రూ. 9,164 కోట్లు ఆర్జించింది. పెన్షన్ చెల్లింపులకు రూ. 7,100 కోట్ల మేర ప్రొవిజన్ చేపట్టడం ప్రభావం చూపిన సంగతి తెలిసిందే. అయితే ఈ ఏడాది క్యూ2(జూలై-సెప్టెంబర్)లో ఎస్‌బీఐ రూ. 18,331 కోట్ల లాభం ఆర్జించింది. కాగా.. మొత్తం ఆదాయం రూ. 1,18,193 కోట్ల నుంచి రూ. 1,28,467 కోట్లకు బలపడింది. నికర వడ్డీ ఆదాయం 4% పుంజుకుని రూ. 41,446 కోట్లకు చేరింది. రుణాల్లో 14% వృద్ధి నమోదైనప్పటికీ నికర వడ్డీ మార్జిన్లు 0.19% నీరసించి 3.15%కి పరిమితమయ్యాయి. కాసాకు బదులు కస్టమర్లు అధిక రాబడినిచ్చే ఫిక్స్‌డ్ డిపాజిట్లకు మొగ్గు చూపడం ఇందుకు కారణమైనట్లు బ్యాంక్ చైర్మన్ సీఎస్ శెట్టి పేర్కొన్నారు.

ఎన్‌పీఏలు తగ్గాయ్: ప్రస్తుత సమీక్షా కాలంలో ఎస్‌బీఐ కన్సాలిడేటెడ్ నికర లాభం 70 శాతం జంప్‌చేసి రూ. 18,853 కోట్లను తాకింది. గతేడాది క్యూ3లో రూ. 11,064 కోట్ల లాభం ఆర్జించింది. ఆదాయం రూ. 1,53,072 కోట్ల నుంచి రూ. 1,67,854 కోట్లకు ఎగసింది. స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 2.42 శాతం నుంచి 2.07 శాతానికి దిగి వచ్చాయి. నికర ఎన్‌పీఏలు 0.64 శాతం నుంచి 0.53 శాతానికి తగ్గాయి.

ఫలితాల నేపథ్యంలో ఎస్‌బీఐ షేరు 1.8% క్షీణించి రూ. 752 వద్ద క్లోజైంది.

ఎయిర్‌టెల్ లాభాల ట్యూన్

క్యూ3లో రూ. 16,135 కోట్లు ● ఏఆర్‌పీయూ రూ. 245



న్యూఢిల్లీ: మొబైల్ టెలికం దిగ్గజం భారతీ ఎయిర్‌టెల్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) మూడో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. అక్టోబర్-డిసెంబర్ (క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 5 రెట్లు పైగా దూసుకెళ్లి రూ. 16,135 కోట్లకు చేరింది. గతేడాది (2023-24) ఇదే కాలంలో కేవలం రూ.2,876 కోట్లు ఆర్జించింది. ఇండస్ టవర్స్ బిజినెస్ కన్సాలిడేషన్ కారణంగా రూ. 14,323 కోట్లు ఆర్జించినట్లు కంపెనీ పేర్కొంది. రూ. 1,194 కోట్ల విదేశీ మారక లాభం అందుకుంది. మరోపక్క రూ. 128 కోట్ల ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ లభించింది. మొత్తం ఆదాయం సైతం 19% ఎగసి రూ. 45,129 కోట్లను తాకింది. గత క్యూ3లో రూ. 37,900 కోట్ల టర్నోవర్ అందుకుంది. ఈ కాలంలో ఒక్కో వినియోగదారునిపై సగటు ఆదాయం (ఏఆర్‌పీయూ) రూ. 233 నుంచి రూ. 245కు బలపడింది. ప్రస్తుత సమీక్షా కాలంలో ఎయిర్‌టెల్ దేశీ బిజినెస్ 25%జంప్‌చేసి రూ. 34,654 కోట్లను తాకింది. దాదాపు రూ. 7,546 కోట్ల అనూహ్య లాభాలు ఆర్జించింది.

ఫలితాల నేపథ్యంలో షేరు 2.5% క్షీణించి రూ. 1,620 వద్ద ముగిసింది.

మార్కెట్‌కు దేశీ ఇంధనం!

సుమారు 15 ఏళ్ల తదుపరి తొలిసారి దేశీ స్టాక్ మార్కెట్లలో సరికొత్త ట్రెండ్‌కు తెరలేవనుంది. ఇటీవల దేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల (డీఐఐలు) పెట్టుబడులు విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల (ఎఫ్‌పీఐలు) అమ్మకాలను మించుతున్నాయి. దీంతో ఎన్‌ఎస్‌ఈ లిస్టెడ్ కంపెనీలలో డీఐఐల వాటా ఎఫ్‌పీఐలకున్న పెట్టుబడుల విలువను అధిగమించనుంది! ఫలితంగా తొలిసారి లిస్టెడ్ కంపెనీలలో ప్రమోటర్ల తదుపరి అతిపెద్ద వాటాదారులుగా డీఐఐలు నిలవనున్నాయి. వెరసి రేసులో ఎఫ్‌పీఐలను వెనక్కి నెట్టనున్నాయి. –సాక్షి, బిజినెస్ డెస్క్

విదేశీ ఇన్వెస్టర్లకు దేశీ ఫండ్స్ చెక్

ఇటీవల స్టాక్స్‌లో డీఐఐల భారీ పెట్టుబడులు

ఎఫ్‌పీఐల అమ్మకాలను మించుతున్న కొనుగోళ్లు	ఎన్‌ఎస్‌ఈ లిస్టెడ్ కంపెనీలలో 16.9% వాటా	17.2%కి దిగివచ్చిన ఎఫ్‌పీఐల వాటా

దేశీ లిస్టెడ్ కంపెనీలలో ఈ ఏడాది ప్రమోటర్లేతర ఓనర్‌షిప్‌లో ఆధిపత్యం చేతులు మారనుంది. 1992లో దేశీ స్టాక్ మార్కెట్లలో ఎఫ్‌పీఐలను అనుమతించాక భారీ పెట్టుబడులతో దూకుడు చూపుతున్నారు. డీఐఐల పెట్టుబడులకంటే అధికంగా ఇన్వెస్ట్ చేస్తూ దేశీ స్టాక్స్‌లో ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తూ వస్తున్నారు. అయితే ఇటీవల ట్రెండ్ మారుతోంది. గత నాలుగేళ్లుగా బుల్ ట్రెండ్‌తో దేశీ మార్కెట్లు సరికొత్త గరిష్టాలను తాకుతూ వచ్చాయి. ఇందుకు ప్రధానంగా దేశీ సంస్థాగత ఇన్వెస్టర్లుగా పిలిచే మ్యూచువల్ ఫండ్స్, బీమా కంపెనీలు, పెన్షన్ ఫండ్స్ పెట్టుబడులు ప్రభావం చూపుతున్నాయి. అయితే గతేడాది అక్టోబర్ నుంచి ఎఫ్‌పీఐలు యూటర్న్ తీసుకున్నారు. ఇదే సమయంలో డీఐఐలు మరిన్ని పెట్టుబడులు కుమ్మరిస్తున్నారు. వెరసి ఎన్‌ఎస్‌ఈ లిస్టెడ్ కంపెనీల్లో ఎఫ్‌పీఐల వాటా తగ్గుతుంటే.. డీఐఐల వాటా పెరుగుతోంది.

2015తో పోలిస్తే


2025లో ఎఫ్‌పీఐలు, డీఐఐల పెట్టుబడుల విలువ మధ్య అంతరం 2009 తదుపరి అత్యంత కనిష్టానికి చేరింది. ఎన్‌ఎస్‌ఈ లిస్టెడ్ కంపెనీలలో 2024 డిసెంబర్‌కల్లా ఎఫ్‌పీఐల వాటా 17.23 శాతానికి దిగిరాగా.. డీఐఐల వాటా 16.90 శాతానికి బలపడింది. అంటే అంతరం 33 బేసిస్ పాయింట్లు(0.33 శాతం) మాత్రమే. నిజానికి 2015లో ఎఫ్‌పీఐ, డీఐఐ వాటాల మధ్య అంతరం 1032 బేసిస్ పాయింట్లు(10.32 శాతం)గా నమోదైంది. జనవరిలోనూ ఎఫ్‌పీఐల అమ్మకాలు కొనసాగడం, పెట్టుబడుల బాటలో డీఐఐలు కొనసాగుతుండటంతో త్వరలో ఎఫ్‌పీఐలపై డీఐఐలు ఆధిపత్యం వహించనున్నట్లు మార్కెట్ విశ్లేషకులు పేర్కొంటున్నారు.

ఫండ్స్ ఆధిపత్యం

డీఐఐలలో మ్యూచువల్ ఫండ్స్‌దే అగ్రస్థానంకాగా.. వీటికి రిటైల్ ఇన్వెస్టర్ల నుంచే అధిక బలం సమకూరుతోంది. గత నెల(జనవరి)లో ఎఫ్‌పీఐలు నికరంగా రూ. 78,000 కోట్ల విలువైన స్టాక్స్ విక్రయిస్తే.. డీఐఐలు రూ. 86,000 కోట్లు ఇన్వెస్ట్ చేశాయి. ఇక 2024 అక్టోబర్-డిసెంబర్‌లో ఎఫ్‌పీఐలు రూ. లక్ష కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకోగా.. డీఐఐలు రూ.1.86 లక్షల కోట్ల విలువైన స్టాక్స్ కొనుగోలు చేశాయి. విలువపరంగా డీఐఐల వద్ద గల ఈక్విటీలు రూ. 73.5 లక్షల కోట్లు! ఎఫ్‌పీఐల వాటాల విలువకంటే 1.9 శాతమే తక్కువ! దశాబ్దంక్రితం ఎఫ్‌పీఐల పెట్టుబడులలో దేశీ ఫండ్స్ ఈక్విటీల విలువ సగమేకావడం ఈ సందర్భంగా ప్రస్తావనార్హం! ఈ బాటలో లిస్టెడ్ కంపెనీల మార్కెట్ విలువలో మ్యూచువల్ ఫండ్స్(ఎంఎఫ్‌లు) పెట్టుబడులు 10వ వంతుకు చేరడం విశేషం!

రిటైలర్ల బలమిది

ఇటీవల కొన్నేళ్లుగా రిటైల్ ఇన్వెస్టర్లు దేశీ మార్కెట్లకు తరలి వస్తున్నారు. ఎంఎఫ్‌లలో భారీగా ఇన్వెస్ట్ చేస్తున్నారు. ఫలితంగా 2019లో రూ. 7.7 లక్షల కోట్లుగా నమోదైన ఫండ్స్ నిర్వహణలోని ఆస్తుల విలువ (ఏయూఎం) 2024 డిసెంబర్‌కల్లా రూ. 31 లక్షల కోట్లను తాకింది! ఇదే కాలంలో సిప్ ద్వారా పెట్టుబడులు రూ. 8,518 కోట్ల నుంచి రూ. 26,549 కోట్లకు జంప్ చేశాయి. 2024 చివరి క్వార్టర్‌లో రిటైలర్లు స్టాక్స్‌లో రూ. 57,524 కోట్లు ఇన్వెస్ట్ చేశారు! ఈ జోష్‌తో గతేడాది 91 కంపెనీలు ఐపీఓలతో రూ.1.6 లక్షల కోట్లకు పైగా సమకూర్చుకోవడం కొసమెరుపు!!



రూ. లక్ష కోట్లు
అక్టోబర్-డిసెంబర్‌లో ఎఫ్‌పీఐల అమ్మకాలు

రూ. 78,000 కోట్లు
జనవరిలో ఎఫ్‌పీఐల అమ్మకాలు

రూ. 86,000 కోట్లు
దేశీ ఫండ్స్ పెట్టుబడుల విలువ

రూ. 1.86 లక్షల కోట్లు
ఇదే కాలంలో డీఐఐల కొనుగోళ్లు

రూ.86,000 దాటేసిన బంగారం

రూ.270 పెరుగుదల ● రూపాయి మరింత డౌన్



న్యూఢిల్లీ: బంగారం ధరలు మరో కొత్త గరిష్టానికి చేరాయి. ఢిల్లీ మార్కెట్లో 99.9 స్వచ్ఛత 10 గ్రాముల బంగారం ధర గురువారం రూ.270 లాభపడింది. రూపాయి మరో 16 పైసల నష్టంతో ఆల్‌టైమ్ కనిష్టాలకు (87.59) చేరడం బంగారం ధరలకు బలాన్నిస్తోంది. ఆర్‌బీఐ వడ్డీ రేట్ల తగ్గింపు అంచనాలు, అమెరికా వాణిజ్య సుంకాల పెంపు ఆందోళనలు దేశీ కరెన్సీ కోతకు కారణమయ్యాయి. స్థానిక ఆభరణాల వర్తకుల నుంచి కొనుగోళ్ల మద్దతు స్థిరంగా ఉందని, రూపాయి క్షీణతకుతోడు స్టాక్ మార్కెట్లో నష్టాలు పసిడి ర్యాలీకి దోహదపడినట్టు ట్రేడర్ల వర్గాలు తెలిపాయి. ఈ ఏడాది జనవరి 1 నుంచి ఇప్పటి వరకు ఢిల్లీలో బంగారం 10 గ్రాములకు రూ.6,680 (8.41 శాతం) పెరగడం గమనార్హం.

హైదరాబాద్‌లో ఎంఎస్‌పీ గ్రూప్ తొలి టీవీఎస్ డీలర్‌షిప్



హైదరాబాద్: ఆటోమోటివ్ సంస్థ ఎంఎస్‌పీ గ్రూప్ హైదరాబాద్‌లో తన తొలి టీవీఎస్ డీలర్‌షిప్‌ను ప్రారంభించింది. టీవీఎస్ కస్టమర్లకు మెరుగైన 3ఎస్ సౌకర్యాలు (అమ్మకాలు, సేవలు, విడిభాగాలు) అందించేందుకు కట్టుబడి ఉన్నామని ఎంఎస్‌పీ గ్రూప్ తెలిపింది. టీవీఎస్ మోటార్స్ సేల్స్ జనరల్ మేనేజర్ కేందర్నాక్ జోషి ప్రధాన షోరూంను, ఏరియా సేల్స్ మేనేజర్ విశాల్ విక్రమ్ సింగ్ వర్క్‌షాప్‌ను, ఏరియా సర్వీసెస్ మేనేజర్ వరుణ్ గుప్తా పార్ట్స్ కౌంటర్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌పీ గ్రూప్, టీవీఎస్ గ్రూప్ అధికార ప్రతినిధులు పాల్గొన్నారు.

పాలసీ ముందు అప్రమత్తత

- అధిక వెయిటేజీ షేర్లలో లాభాల స్వీకరణ
- సెన్సెక్స్ నష్టం 213 పాయింట్లు

ముంబై: అధిక వెయిటేజీ ఎస్‌బీఐ (-2%), ఐటీసీ (-1.50%), ఎయిర్‌టెల్ (-2.50%) షేర్లలో లాభాల స్వీకరణ చోటు చేసుకోవడంతో స్టాక్ సూచీలు రెండోరోజూ నష్టాలు చవిచూశాయి. ఆర్‌బీఐ ద్రవ్య పరపతి విధాన కమిటీ సమావేశ నిర్ణయాల వెల్లడికి(నేడు)ముందు ఇన్వెస్టర్లు అప్రమత్తత వహించారు. ఫలితంగా గురువారం సెన్సెక్స్ 213 పాయింట్లు నష్టపోయి 78,058 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 92 పాయింట్లు కోల్పోయి 23,603 వద్ద నిలిచింది. ఉదయం స్వల్ప లాభాలతో మొదలైన సూచీలు ప్రారంభంలో కాసేపు సానుకూలంగా ట్రేడయ్యాయి. అయితే వడ్డీ రేట్ల సంబంధిత రంగాలైన రియల్టీ, ఆటో, బ్యాంకింగ్ షేర్లలో అమ్మకాలు తలెత్తడంతో సూచీలు నష్టాల్లోకి జారుకున్నాయి. ఒక దశలో సెన్సెక్స్ 427 పాయింట్లు బలహీనపడి 77,844 వద్ద, నిఫ్టీ 140 పాయింట్లు నష్టపోయి 23,556 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకాయి. ట్రేడింగ్ చివర్లో ఐటీ, సర్వీసు రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో సూచీల నష్టాలు సగానికి పైగా తగ్గాయి.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో..
కొత్తగా 2,835 విమానాలు కావాలి | ఐటీసీ లాభం డీలా



యశస్వి జైస్వాల్, రాణా అరంగేట్రం

పేస్ బౌలర్ హర్షిత్ రాణా, ఓపెనర్ యశస్వి జైస్వాల్ ఈ మ్యాచ్‌తో వన్డే క్రికెట్‌లోకి అడుగు పెట్టారు. భారత్ తరఫున వన్డేలు ఆడిన 257, 258వ ఆటగాళ్లుగా వీరిద్దరు గుర్తింపు పొందారు. భారత్ తరఫున ఇప్పటికే 19 టెస్టులు, 23 టి20లు ఆడిన 23 ఏళ్ల ముంబై ఆటగాడు జైస్వాల్ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోగా... ఢిల్లీకి చెందిన రాణా ఆస్ట్రేలియా గడ్డపై తొలి రెండు టెస్టులు ఆడాడు. ఆపై ఇంగ్లండ్‌తో గత శుక్రవారం జరిగిన చివరి మ్యాచ్‌తో అంతర్జాతీయ టి20ల్లోకి అడుగు పెట్టాడు.

శుబ్‌మన్, శ్రేయస్ సత్తా చాటగా...

స్వదేశంలో జరుగుతున్న పోరులో ఇంగ్లండ్‌పై భారత్ సంపూర్ణ ఆధిపత్యం కొనసాగుతోంది. టి20 సిరీస్‌లో ఘన విజయం సాధించిన టీమిండియా ఇప్పుడు వన్డేల్లో గెలుపుతో బోణీ చేసింది. బౌలింగ్‌లో జడేజా, రాణా రాణించడంతో ముందుగా ప్రత్యర్థిని తక్కువ స్కోరుకే కట్టడి చేసిన జట్టు...ఆపై గిల్, శ్రేయస్, అక్షర్ బ్యాటింగ్‌తో 11.2 ఓవర్లు మిగిలి ఉండగానే లక్ష్యాన్ని చేరింది. పేలవ బ్యాటింగ్‌తో ఇంగ్లండ్ మరోసారి పరాజయానికే పరిమితమైంది.

తొలి వన్డేలో భారత్ ఘనవిజయం

4 వికెట్లతో ఇంగ్లండ్ పరాజయం ● ఆదివారం కటక్‌లో రెండో వన్డే



శ్రేయస్



శుబ్‌మన్

నాగ్‌పూర్: ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్‌లో భారత్ 1-0తో ముందంజ వేసింది. గురువారం జరిగిన తొలి మ్యాచ్‌లో భారత్ 4 వికెట్ల తేడాతో ఇంగ్లండ్‌ను ఓడించింది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ ఎంచుకున్న ఇంగ్లండ్ 47.4 ఓవర్లలో 248 పరుగులకే ఆలౌటైంది. కెప్టెన్ జోస్ బట్లర్ (67 బంతుల్లో 52; 4 ఫోర్లు), జాకబ్ బెతెల్ (64 బంతుల్లో 51; 3 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీలు చేయగా...ఫిల్ సాల్ట్ (26 బంతుల్లో 43; 5 ఫోర్లు, 3 సిక్స్‌లు) ధాటిగా ఆడాడు. భారత బౌలర్లలో రవీంద్ర జడేజా, హర్షిత్ రాణా చెరో 3 వికెట్లు పడగొట్టారు. అనంతరం భారత్ 38.4 ఓవర్లలో 6 వికెట్లకు 251 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' శుబ్‌మన్ గిల్ (96 బంతుల్లో 87; 14 ఫోర్లు), శ్రేయస్ అయ్యర్ (36 బంతుల్లో 59; 9 ఫోర్లు, 2 సిక్స్‌లు), అక్షర్ పటేల్ (47 బంతుల్లో 52; 6 ఫోర్లు, 1 సిక్స్) ఆకట్టుకున్నారు. రెండో వన్డే ఆదివారం కటక్‌లో జరుగుతుంది.

కీలక భాగస్వామ్యాలు...

ఓపెనర్లు సాల్ట్, బెన్ డకెట్ (29 బంతుల్లో 32; 6 ఫోర్లు) ఇంగ్లండ్‌కు శుభారంభం అందించారు. వీరిద్దరు దూకుడుగా ఆడుతూ తొలి వికెట్‌కు 8.5 ఓవర్లలోనే 75 పరుగులు జోడించారు. ఓపెనర్లను నిలువరించడంలో భారత బౌలర్లు విఫలమవుతున్న స్థితిలో ఇంగ్లండ్ స్వయంకృతం ఇన్నింగ్స్‌ను మలుపు తిప్పింది. లేని మూడో పరుగు కోసం ప్రయత్నించిన సాల్ట్‌ను చక్కటి ఫీల్డింగ్‌తో శ్రేయస్ రనౌట్ చేయడంతో జట్టు తొలి వికెట్ కోల్పోయింది. ఆ తర్వాత రెండు పరుగుల వ్యవధిలో మరో 2 వికెట్లు కోల్పోయి జట్టు కష్టాల్లో పడింది. సుదీర్ఘ విరామం తర్వాత వన్డే ఆడిన జో రూట్ (19) కూడా ఎక్కువ సేపు నిలవలేకపోయాడు. ఈ దశలో బట్లర్, బెతెల్ కలిసి ఇంగ్లండ్‌ను ఆదుకున్నారు. వీరిద్దరు భారీ షాట్లకు పోకుండా జాగ్రత్తగా ఆడారు. 58 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తయిన వెంటనే బట్లర్ నిష్క్రమించాడు. బెతెల్‌తో కలిసి ఐదో వికెట్‌కు అతను 14.3 ఓవర్లలో 59 పరుగులు జత చేశాడు. 62 బంతుల్లో బెతెల్ హాఫ్ సెంచరీ మార్క్‌ను చేరుకోగా...తర్వాతి బ్యాటర్లెవరూ నిలవలేకపోవడంతో మరో 16 బంతులు మిగిలి ఉండగానే ఇంగ్లండ్ ఆట ముగిసింది.

రాణించిన అక్షర్...

ఛేదనలో ఆరంభంలో భారత్ తడబడింది. 19 పరుగుల వద్దే యశస్వి జైస్వాల్ (15), రోహిత్ శర్మ (2) వెనుదిరిగారు. అయితే గిల్, శ్రేయస్ భాగస్వామ్యంలో జట్టు దూసుకుపోయింది. ముఖ్యంగా శ్రేయస్ మెరుపు బ్యాటింగ్‌తో అలరించాడు. ఆర్చర్ ఓవర్లో వరుసగా 2 సిక్స్‌లు బాదిన అతను, కార్స్ ఓవర్లో మూడు ఫోర్లు కొట్టాడు. ఈ జోరులో 30 బంతుల్లోనే అతని అర్ధసెంచరీ పూర్తయింది. గిల్‌తో కలిసి మూడో వికెట్‌కు 94 పరుగులు (10.4 ఓవర్లలో) జోడించిన తర్వాత శ్రేయస్ వెనుదిరిగాడు. బ్యాటింగ్ ఆర్డర్‌లో ప్రమోట్ అయిన అక్షర్ పటేల్ కూడా గిల్‌కు తగిన విధంగా సహకరించడంతో జట్టు లక్ష్యం దిశగా సాగింది. ఈ క్రమంలో గిల్ 60 బంతుల్లో, అక్షర్ 46 బంతుల్లోనే హాఫ్ సెంచరీలను అందుకున్నారు. నాలుగో వికెట్‌కు 17.5 ఓవర్లలో 108 పరుగులు జత చేసిన అనంతరం అక్షర్ అవుటయ్యాడు. ఈ దశలో భారత్ విజయానికి 28 పరుగులు, గిల్ సెంచరీకి 19 పరుగులు అవసరమయ్యాయి. అయితే గిల్ సెంచరీ చేజార్చుకోగా, రాహుల్ (2) కూడా నిలబడలేదు. కానీ పాండ్యా (9 నాటౌట్), జడేజా (12 నాటౌట్) కలిసి మ్యాచ్‌ను ముగించారు.

26 పరుగులు సమర్పించుకున్నా...

కెరీర్‌లో తొలి వన్డే ఆడుతున్న రాణా బౌలింగ్ ఆరంభంలో తడబడ్డాడు. ముఖ్యంగా అతని మూడో ఓవర్లో సాల్ట్ 3 సిక్స్‌లు, 2 ఫోర్లతో చెలరేగిపోయాడు. ఈ ఓవర్లో సాల్ట్ వరుసగా 6, 4, 6, 4, 0, 6 బాదడంతో మొత్తం 26 పరుగులు వచ్చాయి. అయితే తన నాలుగో ఓవర్లో అతను సత్తా చాటి పరిస్థితిని మార్చాడు. మూడో బంతికి డకెట్‌ను అవుట్ చేసిన రాణా చివరి బంతికి బ్రూక్‌ను డకౌట్ చేశాడు. ఆ తర్వాత కీలకమైన లివింగ్‌స్టోన్ వికెట్ కూడా రాణా ఖాతాలోనే చేరింది.

సినిమా చూస్తుండగా...

'నేను ఈ మ్యాచ్ ఆడతానని అనుకోలేదు. కాస్త ఎక్కువ సేపు మెలకువతో ఉండవచ్చు అనుకొని రాత్రి సినిమా చూస్తూ కూర్చున్నాను. అయితే కోహ్లి మోకాలికి గాయం అయిందని నువ్వు ఆడాల్సి ఉంటుందని కెప్టెన్ రోహిత్‌నుంచి ఫోన్ వచ్చింది. వెంటనే సినిమాను సగంలోనే ఆపేసి వెంటనే వెళ్లి పడుకున్నాను' –శ్రేయస్ అయ్యర్

జైస్వాల్‌ను ఆడించాలని టీమ్ మేనేజ్‌మెంట్ ముందే సిద్ధమైందని శ్రేయస్ వ్యాఖ్యలను బట్టి తెలుస్తోంది. గత కొంత కాలంగా వన్డేల్లో ఘనమైన రికార్డు ఉన్నా సరే... శ్రేయస్‌కు తుది జట్టులో చోటు లేకపోవడం ఆశ్చర్యకరం.

గాయంతో దూరమైన కోహ్లి



టాప్ బ్యాటర్ విరాట్ కోహ్లి లేకుండానే భారత జట్టు తొలి వన్డేలో బరిలోకి దిగింది. కుడి మోకాలికి గాయం కారణంగా కోహ్లి ఈ మ్యాచ్‌కు దూరమయ్యాడు. బుధవారం ప్రాక్టీస్ సమయంలోనే అతనికి ఈ గాయమైందని టాస్ సమయంలో కెప్టెన్ రోహిత్ వెల్లడించాడు. అయితే మ్యాచ్ ముందు రోజు టీమ్ మేనేజ్‌మెంట్ ఈ విషయాన్ని చెప్పలేదు. గురువారం జట్టు సభ్యులందరితో కలిసి మైదానానికి వచ్చిన కోహ్లి స్వల్పంగా డ్రిల్స్‌లో పాల్గొన్నాడు. అయితే ఈ సమయంలో అతను కాలికి ప్లాస్టర్‌తో కనిపించాడు.

స్కోరు వివరాలు:

ఇంగ్లండ్ ఇన్నింగ్స్: సాల్ట్ (రనౌట్) 43; డకెట్ (సి) జైస్వాల్ (బి) రాణా 32; రూట్ (ఎల్బీ) (బి) జడేజా 19; బ్రూక్ (సి) రాహుల్ (బి) రాణా 0; బట్లర్ (సి) పాండ్యా (బి) అక్షర్ 52; బెతెల్ (ఎల్బీ) (బి) జడేజా 51; లివింగ్‌స్టోన్ (సి) రాహుల్ (బి) రాణా 5; కార్స్ (బి) షమీ 10; రషీద్ (బి) జడేజా 8; ఆర్చర్ (నాటౌట్) 21; మహమూద్ (స్టంప్డ్) రాహుల్ (బి) కుల్దీప్ 2; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం (47.4 ఓవర్లలో ఆలౌట్) 248. వికెట్ల పతనం:** 1-75, 2-77, 3-77, 4-111, 5-170, 6-183, 7-206, 8-220, 9-241, 10-248. **బౌలింగ్:** షమీ 8-1-38-1, రాణా 7-1-53-3, అక్షర్ 7-0-38-1, పాండ్యా 7-1-37-0, కుల్దీప్ 9.4-0-53-1, జడేజా 9-1-26-3.

భారత్ ఇన్నింగ్స్: జైస్వాల్ (సి) సాల్ట్ (బి) ఆర్చర్ 15; రోహిత్ శర్మ (సి) లివింగ్‌స్టోన్ (బి) మహమూద్ 2; గిల్ (సి) బట్లర్ (బి) మహమూద్ 86; శ్రేయస్ (ఎల్బీ) (బి) బెతెల్ 59; అక్షర్ (బి) రషీద్ 52; రాహుల్ (సి) అండ్ (బి) రషీద్ 2; పాండ్యా (నాటౌట్) 9; జడేజా (నాటౌట్) 12; ఎక్స్‌ట్రాలు 13; **మొత్తం (38.4 ఓవర్లలో 6 వికెట్లకు) 251. వికెట్ల పతనం:** 1-19, 2-19, 3-113, 4-221, 5-225, 6-235. **బౌలింగ్:** ఆర్చర్ 7-1-39-1, మహమూద్ 6.4-0-47-2, కార్స్ 5-0-52-0, రషీద్ 10-1-49-2, బెతెల్ 3-0-18-1, లివింగ్‌స్టోన్ 5-0-28-0, రూట్ 2-0-10-0.



స్వప్నిల్

స్వప్నిల్‌కు కాంస్యం

- పసిడి గెలిచిన దీపిక కుమారి
- 38వ జాతీయ క్రీడలు

డెహ్రాడూన్: జాతీయ క్రీడల్లో ఒలింపిక్ పతక విజేత స్వప్నిల్ కుసాలె కాంస్య పతకంతో సరిపెట్టుకున్నాడు. షూటింగ్ పురుషుల 50 మీటర్ల రైఫిల్ త్రి పొజిషన్ విభాగంలో మహారాష్ట్ర షూటర్ స్వప్నిల్ మూడో స్థానంలో నిలిచాడు. ఈ విభాగంలో సర్వీసెస్ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డు (ఎస్ఎస్‌సీబీ) తరఫున బరిలోకి దిగిన 25 ఏళ్ల నీరజ్ కుమార్ 464.1 పాయింట్లతో స్వర్ణం చేజిక్కించుకున్నాడు. మధ్యప్రదేశ్‌కు చెందిన ఐశ్వరీ ప్రతాప్ సింగ్ (462.4 పాయింట్లు) రజత పతకం దక్కించుకోగా... పారిస్ ఒలింపిక్స్ కాంస్యం నెగ్గి ఈ విభాగంలో దేశానికి తొలి పతకం అందించిన స్వప్నిల్ (447.7 పాయింట్లు) కాంస్యం గెలుచుకున్నాడు. మరో వైపు 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో సురుచి సింగ్–ప్రమోద్ (హరియాణా) 17-7 పాయింట్ల తేడాతో అంజలి షెఖావత్–ఉమేశ్ చౌదరీ (రాజస్తాన్)పై గెలిచి పసిడి ఖాతాలో వేసుకుంది. రాహి సర్నోబత్–ప్రణవ్ అరవింద్ పాటిల్ (మహారాష్ట్ర) జట్టు కాంస్యం గెలుచుకుంది. సుదీర్ఘ కాలంగా భారత టాప్ ఆర్చర్‌గా ఉన్న దీపిక కుమారి పసిడిని అందుకుంది. పారిస్ ఒలింపిక్స్‌లో పతకం సాధించడంలో విఫలమైన దీపిక నేషనల్ గేమ్స్‌లో జార్ఖండ్ తరఫున బరిలోకి దిగి వ్యక్తిగత విభాగంతో పాటు టీమ్ ఈవెంట్‌లోనూ స్వర్ణం కైవసం చేసుకుంది. పురుషుల విభాగంలో నాలుగుసార్లు ఒలింపిక్స్‌లో పాల్గొన్న సీనియర్ ఆర్చర్ తరుణ్‌దీప్ రాయ్‌ను ఓడించిన 18 ఏళ్ల బెంగాల్ ఆర్చర్ జుయెల్ సర్కార్ జాతీయ చాంపియన్‌గా అవతరించాడు. మరో వైపు బాక్సింగ్‌లో లవ్లీనా బోర్గొహైన్, ఆరుసార్లు ఆసియా చాంపియన్ శివ థాపా విజయాలు సాధించారు. మహిళల 75 కేజీల విభాగంలో లవ్లీనా తిరుగులేని ప్రదర్శన కనబర్చగా... పురుషుల 64 కేజీల విభాగంలో శివ థాపా (అసోం) సత్తాచాటాడు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో



మాంసమే కాదు.. మట్టి వాసనా కావాలి

పులులు సాధారణంగా వన్యప్రాణులను వేటాడి ఆరగిస్తాయి. కానీ కొన్నిసార్లు మట్టిని సైతం నాకుతూ తమ జీర్ణక్రియను మెరుగుపరచుకుంటాయని నిపుణులు చెబుతున్నారు. వేటాడి తిన్నది ఒంటికి ఎక్కాలన్నా, ఒంట్లో లవణాలు తగ్గినా, మట్టిని నాలుకతో చప్పరిస్తాయని చెబుతున్నారు. తమ పరిధిలో కొత్త జంతువు వచ్చిందా? లేదా? అని తెలుసుకునేందుకు కూడా.. వాసనతో పసిగట్టి ఆ మేరకు అప్రమత్తమవుతాయి. అలా ఒక పెద్ద పులి మహారాష్ట్రలోని తిప్పేశ్వర్ టైగర్ రిజర్వులో మట్టి పరిమళాన్ని ఆస్వాదిస్తుండటాన్ని ఆదిలాబాద్‌కు చెందిన వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్ లింగంపల్లి కృష్ణ తన కెమెరాలో బంధించారు.

- సాక్షి ప్రతినిధి, మంచిర్యాల


మిగులు విద్యుత్ మోపెడు!

2025-26లో రాష్ట్రానికి విద్యుత్ లభ్యత 1,23,631 మిలియన్ యూనిట్లు

అవసరాలు 98,319 ఎంయూ మాత్రమే.. 25,312 ఎంయూ మేర మిగులు

ఈ విద్యుత్ విలువ సుమారు రూ.14,022.84 కోట్లు..

అవసరాల్లో వినియోగదారులకు చేరేది 87,384 ఎంయూ మాత్రమే



2025-26లో రాష్ట్ర డిస్కంల వ్యయ అంచనాలివీ (రూ.కోట్లలో)

వ్యయాలు	ఎస్పీడీసీఎల్	ఎన్పీడీసీఎల్	మొత్తం
విద్యుత్ కొనుగోలు వ్యయం	36,530	14,042	50,572
ట్రాన్స్‌మిషన్	1,468	613	2,081
పీజీసీఐఎల్, యూఎల్డీసీ	1,702	711	2,413
డిస్ట్రిబ్యూషన్ వ్యయం	5,414	3,928	9,342
ఆపరేషన్, మెయింటెనెన్స్	425	334	759
సెక్యూరిటీ డిపాజిట్లపై వడ్డీలు	347	105	452
ఇతర వ్యయాలు	230	133	363
నాన్ టారిఫ్ ఆదాయం(-)	-81	-52	-133
మొత్తం	46,035	19,814	65,849
కాస్ట్ ఆఫ్ సర్వీస్ (యూనిట్‌కు రూ.ల్లో)	7.26	8.28	7.54

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వచ్చే ఆర్థిక సంవత్సరం 2025–26లో ఏకంగా 25,312 మిలియన్ యూనిట్ల (ఎంయూ) విద్యుత్ మిగిలిపోనుంది. వచ్చే ఏడాది రాష్ట్ర విద్యుత్ అవసరాలు 98,319 ఎంయూగా అంచనా వేయగా.. 1,23,631 ఎంయూ విద్యుత్ లభ్యత ఉండనుంది. ఇప్పటికే కుదుర్చుకున్న/భవిష్యత్తులో చేసుకోనున్న విద్యుత్ కొనుగోలు ఒప్పందాల మేరకు ఇంత భారీగా విద్యుత్ సమకూరనుంది. కొనుగోలు చేసే విద్యుత్‌లో రాష్ట్ర అవసరాలు పోగా 25,312 ఎంయూ మిగిలిపోనుంది. సగటున యూనిట్‌కు రూ.5.54 ధర లెక్కన మిగులు విద్యుత్ విలువ రూ.14,022.84 కోట్లు అవుతోంది. అదనంగా ఉందనే ఉద్దేశంతో మిగులు విద్యుత్‌ను కొనుగోలు చేయకపోయినా... ఒప్పందాల మేరకు విద్యుదుత్పత్తి సంస్థలకు ఫిక్స్‌డ్ చార్జీలు చెల్లించాల్సిందే. అంటే డిస్కంలపై, పరోక్షంగా రాష్ట్ర ప్రజలపై భారం పడినట్టే అవుతుందని విద్యుత్ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. మరోవైపు రాష్ట్ర విద్యుత్ అవసరాలు 98,318 ఎంయూ కాగా.. డిస్కంలు రాష్ట్రంలోని వినియోగదారులకు విక్రయించనున్న మొత్తం విద్యుత్ 87,384 ఎంయూ మాత్రమే. మిగతా 10,934 ఎంయూ విద్యుత్‌ను డిస్కంలు 'సాంకేతిక, వాణిజ్య నష్టాల (ఏటీ అండ్ సీ లాసెస్)'రూపంలో నష్టపోనున్నాయి. ఈ నష్టాల విలువ సుమారు రూ.6,057.43 కోట్లు కావడం గమనార్హం. దక్షిణ/ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లు ఇటీవల రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (టీజీఈఆర్సీ)కి సమర్పించిన 'వార్షిక ఆదాయ అవసరాల నివేదిక(ఏఆర్ఆర్) 2025–26'లో వెల్లడించిన వివరాలు ఈ వాస్తవాలను స్పష్టం చేస్తున్నాయి.

రూ.20,151 కోట్ల విద్యుత్ సబ్సిడీ అవసరం

రాష్ట్రంలో విద్యుత్ సరఫరా కోసం 2025–26లో రూ.65,849 కోట్లు వ్యయం కానుండగా.. ప్రస్తుత విద్యుత్ చార్జీలతో డిస్కంలకు రూ.45,698 కోట్లే ఆదాయం అందుతుంది. అయినా విద్యుత్ చార్జీలు పెంచకుండా ప్రస్తుత చార్జీలనే కొనసాగించాలని డిస్కంలు ప్రతిపాదించాయి. దీనితో మిగిలిన రూ.20,151 కోట్ల ఆదాయ లోటును భర్తీ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ సబ్సిడీలను పెంచక తప్పదని.. లేకుంటే డిస్కంలు గట్టెక్కే అవకాశాలు ఉండవని విద్యుత్ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే రూ.64,227 కోట్లకు పైగా నష్టాల్లో ఉన్న డిస్కంలు ఆర్థికంగా మరింత కుంగిపోతాయని పేర్కొంటున్నాయి.

భారీగా పెరిగిన కాస్ట్ ఆఫ్ సర్వీస్!

విద్యుత్ కొనుగోలు చేసేందుకు డిస్కంలు మొత్తంగా రూ.50,572 కోట్లను ఖర్చు చేయనున్నాయి. అంటే విద్యుదుత్పత్తి కంపెనీలకు ఒక్కో యూనిట్‌కు సగటున రూ.5.54 చెల్లించనున్నాయి. అయితే వినియోగదారులకు సరఫరా చేసేసరికి వ్యయం యూనిట్‌కు రూ.7.54కు చేరుతోంది. ఇలా విద్యుత్‌ను వినియోగదారులకు చేర్చే సరికి అయ్యే వ్యయాన్ని విద్యుత్ రంగ పరిభాషలో 'కాస్ట్ ఆఫ్ సర్వీస్'అంటారు. విద్యుత్ ఉద్యోగుల జీతభత్యాలు, విద్యుత్ పంపిణీ వ్యవస్థ నిర్వహణ, పర్యవేక్షణ వ్యయాలు, ట్రాన్స్‌మిషన్, డిస్ట్రిబ్యూషన్ ఖర్చులు, ఇతర వ్యయాలన్నీ ఇందులో కలిసి ఉంటాయి. అంటే సగటున ఒక్కో యూనిట్‌కు రూ.2 చొప్పున పెరిగిపోయినట్టు కాస్ట్ ఆఫ్ సర్వీస్ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఇక ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎన్పీడీసీఎల్) కాస్ట్ ఆఫ్ సర్వీస్ ఏకంగా యూనిట్‌కు రూ.8.28గా ఉండటం ఆందోళనకరమని విద్యుత్ ఉద్యోగులు అంటున్నారు. దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్పీడీసీఎల్) కాస్ట్ ఆఫ్ సర్వీస్ యూనిట్‌కు రూ.7.26గా ఉండటం గమనార్హం.

ఎక్స్ఛేంజీల విద్యుత్‌తో రూ.982 కోట్లు ఆదా చేశాం

ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణభాస్కర్ వెల్లడి



సాక్షి, హైదరాబాద్: థర్మల్ విద్యుత్‌కన్నా తక్కువ ధరకు లభించే పవర్ ఎక్స్ఛేంజీల విద్యుత్‌ను కొనుగోలు చేయడం ద్వారా 2023 డిసెంబర్ నుంచి 2025 జనవరి మధ్య రూ. 982.66 కోట్లు ఆదా చేశామని ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణ భాస్కర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పవర్ ఎక్స్ఛేంజీల్లో తక్కువ ధరకు విద్యుత్ లభిస్తున్న సమయాల్లో విద్యుత్ వేరియబుల్ కాస్ట్ అధికంగా ఉన్న థర్మల్ విద్యుత్ కేంద్రాలను బ్యాక్‌డౌన్ చేసి ఈ మేరకు డబ్బు ఆదా చేశామని పేర్కొన్నారు. దీనివల్ల వినియోగదారులపై ఆ మేరకు ఆర్థిక భారం తప్పిందన్నారు. దీన్ని కేంద్రం సైతం గుర్తించి తెలంగాణ లోడ్ డిస్పాచ్ సెంటర్‌ను దేశంలోనే అత్యుత్తమైన ఎస్ఎల్డీసీగా ఎంపిక చేసి గతేడాది డిసెంబర్ 14న పురస్కారం అందించిందని గుర్తుచేశారు. గతేడాది డిసెంబర్, ఈ ఏడాది జనవరిలో థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో తయారైన విద్యుత్ యూనిట్ ధర సగటున రూ. 3.97 నుంచి రూ. 4.18గా ఉండటంతో థర్మల్ విద్యుత్ కేంద్రాలను బ్యాక్‌డౌన్ (ఉత్పత్తి తగ్గించి) చేసి పవర్ ఎక్స్ఛేంజీల నుంచి రూ. 2.69 నుంచి రూ. 2.82 సగటు ధరతో విద్యుత్ కొన్నామని కృష్ణ భాస్కర్ ఆ ప్రకటనలో వివరించారు. దీంతో డిసెంబర్‌లో రూ. 196.68 కోట్లు, జనవరిలో రూ. 185.27 కోట్లు ఆదా అయ్యాయన్నారు. దీర్ఘకాలిక విద్యుత్ ఒప్పందాల ద్వారా 9,134 మెగావాట్ల విద్యుత్ మాత్రమే లభ్యతగా ఉండటంతో విద్యుత్ కొనుగోళ్లు తప్పవన్నారు.

విద్యుత్ డిమాండ్ కొత్త రికార్డు

రాష్ట్రంలో గురువారం గరిష్ట విద్యుత్ డిమాండ్ రికార్డు స్థాయిలో పెరిగి ఏకంగా 15,752 మెగావాట్లకు ఎగబాకింది. రాష్ట్ర చరిత్రలో ఇప్పటివరకు ఇదే అత్యధిక గరిష్ట విద్యుత్ డిమాండ్. గతేడాది మార్చి 8న ఏర్పడిన 15,523 మెగావాట్ల గరిష్ట విద్యుత్ డిమాండ్ ఇప్పటివరకు అత్యధికంకాగా దాన్ని తాజాగా రాష్ట్రం అధిగమించిందని ట్రాన్స్‌కో సీఎండీ డి.కృష్ణభాస్కర్ పేర్కొన్నారు. వేసవిలో గరిష్ట డిమాండ్ 17,000 మెగావాట్లకు పెరిగినా సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

ఎక్స్ఛేంజీల్లో కొనుగోళ్లతో నష్టమే: ఎం.వేణుగోపాల్‌రావు



ట్రాన్స్‌కో సీఎండీ వాదనను విద్యుత్‌రంగ నిపుణుడు ఎం.వేణుగోపాల్‌రావు తోసిపుచ్చారు. ఎక్స్ఛేంజీల్లో కొనుగోళ్ల కోసం అధికంగా ఖర్చు చేశారని ఆరోపించారు. ఎక్స్ఛేంజీల నుంచి యూనిట్‌కు రూ. 2.82 ధరతో విద్యుత్ కొనుగోలు చేయగా ఆ మేరకు బ్యాక్‌డౌన్ చేసిన విద్యుత్ స్థిర చార్జీ యూనిట్‌కు రూపాయిన్నరగా ఉన్నా మొత్తం యూనిట్ విద్యుత్ ధర రూ. 4.32కు పెరిగిపోతుందన్నారు. మరోవైపు బ్యాక్‌డౌన్ చేసిన విద్యుత్ ధర యూనిట్‌కు రూ. 4.15 మాత్రమే ఉండటంతో వాస్తవానికి డిస్కంలు యూనిట్‌కు అదనంగా 0.17 పైసలు నష్టపోయాయని తేల్చిచెప్పారు. బ్యాక్‌డౌన్ చేసి ఉత్పత్తి తగ్గించిన విద్యుత్‌కు సంబంధించిన మొత్తం స్థిర ధరలు చెల్లించాల్సి ఉంటుందని.. సగటు స్థిర చార్జీలు కాదన్నారు. దీనికితోడు ఎక్స్ఛేంజీల నుంచి విద్యుత్ కొంటే ఇంటర్‌స్టేట్ ట్రాన్స్‌మిషన్ చార్జీలు, ట్రాన్స్‌మిషన్ నష్టాలు భరించాల్సి ఉంటుందన్నారు.

ఆ అవయవాన్ని పునః సృష్టించారు..!

తెలంగాణలోనే తొలిసారిగా విజయవంతంగా అరుదైన శస్త్రచికిత్స

'సున్తీ' ఇన్ఫెక్షన్ వల్ల బాల్యంలోనే పురుషాంగాన్ని కోల్పోయిన సోమాలియా యువకుడు

- ముంజేతి నుంచి చర్మం, కణజాలం, ధమని సేకరించి పూర్తిగా పునర్నిర్మించిన 'మెడికవర్' వైద్యులు
- లైంగిక స్పందనల కోసం ఇంప్లాంట్ సైతం అమరిక.. తిరిగి పని చేస్తున్న 'అవయవం'

మాదాపూర్: బాల్యంలో సోకిన ఇన్ఫెక్షన్ కారణంగా పురుషాంగాన్ని పూర్తిగా కోల్పోయిన ఓ 19 ఏళ్ల సోమాలియా జాతీయుడికి హైదరాబాద్ మాదాపూర్‌లోని మెడికవర్ హాస్పిటల్స్ వైద్యులు కొత్త జీవితాన్ని ప్రసాదించారు. తెలంగాణ వైద్య చరిత్రలోనే తొలిసారిగా అత్యంత క్లిష్టమైన మైక్రోవాస్క్యులర్ సర్జరీ (ఒక రకమైన ప్లాస్టిక్ సర్జరీ) ద్వారా విజయవంతంగా పురుషాంగాన్ని పునఃసృష్టించారు. ఇందుకు సంబంధించిన వివరాలను గురువారం విలేకరుల సమావేశంలో ఆస్పత్రి సీనియర్ యూరాలజిస్ట్–ఆండ్రాలజిస్ట్ డాక్టర్ ఏవీ.రవి కుమార్, ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ దాసరి మధువినయ్ కుమార్ వెల్లడించారు.

ఎన్ని దేశాలు తిరిగినా..

వైద్యులు తెలిపిన వివరాల ప్రకారం.. బాధిత యువకుడికి నాలుగేళ్ల వయసులో జరిగిన సున్తీ ఆపరేషన్ అనంతరం ఇన్ఫెక్షన్ సోకి పురుషాంగం కోల్పోయాడు. ఈ సమస్యకు పరిష్కారం కోసం వివిధ దేశాలు తిరిగినా ఫలితం దక్కలేదు. చివరకు హైదరాబాద్‌లోని మెడికవర్ ఆస్పత్రి ప్లాస్టిక్ సర్జన్లను సంప్రదించాడు.



మాదాపూర్‌లోని మెడికవర్ ఆస్పత్రిలో చికిత్స అనంతరం విలేకరుల సమావేశంలో పాల్గొన్న డాక్టర్లు మధువినయ్‌కుమార్, రవికుమార్ తదితరులు

ముంజేతి ధమనితో..

యువకుడికి పురుషాంగాన్ని పునః సృష్టించాలని నిర్ణయించిన వైద్యులు.. అందుకోసం అతని ముంజేతి నుంచి చర్మం, కణజాలం, రేడియల్ ధమనిని ఫ్లాప్ సర్జరీ ద్వారా సేకరించారు. అనంతరం వాటిని పురుషాంగం ప్రదేశంలో విజయవంతంగా పునర్నిర్మించారు. పురుషాంగానికి లైంగిక స్పందనలను కలిగించేందుకు ఒక ఇంప్లాంట్ (పరికరం)ను అమర్చారు. ఈ మొత్తం శస్త్రచికిత్సకు 10 గంటల సమయం పట్టింది. ప్రస్తుతం ఆ యువకుడు తిరిగి పూర్తిస్థాయిలో మూత్రవిసర్జన చేసే సామర్థ్యాన్ని పొందాడని డాక్టర్ దాసరి మధువినయ్ కుమార్ వివరించారు. ఇకపై అతను సాధారణ లైంగిక జీవనాన్ని కూడా గడపొచ్చని చెప్పారు.

కొత్త జీవితం పొందా..

అవయవ లోపంతో నన్ను నేను అసంపూర్ణమైన వ్యక్తిగా భావిస్తూ ఏళ్ల తరబడి ఎంతో మానసిక క్షోభ అనుభవించా. ఇప్పుడు నేను నా గుర్తింపును, విశ్వాసాన్ని, అందరిలా సాధారణ జీవితాన్ని పొందే అవకాశాన్ని తిరిగి పొందా. నాకు కొత్త జీవితాన్ని అందించిన వైద్యులకు ఎప్పటికీ రుణపడి ఉంటా.

– సోమాలియా యువకుడు

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

సాక్షి ప్లస్
శుక్రవారం • 7-2-2025



రేషన్ షాపు ఎదుట క్యూలో సంచులు, వాటిపై రాళ్లు పెట్టిన లబ్ధిదారులు

రేషన్ కోసం...

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని సుభాష్‌నగర్ కాలనీలోని ఒక రేషన్ దుకాణాన్ని తెరవకముందే మధ్యాహ్నం 3 గంటల నుంచి లబ్ధిదారులు బారులు తీరారు. ఇందుకోసం వరుసలో సంచులు, బండరాళ్లను పెట్టి డీలర్ రాక కోసం నిరీక్షించడం కనిపించింది.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్



యూరియా కోసం బారులు తీరిన రైతులు

ఎరువు కష్టాలు రైతులకే ఎరుక

సరిపడా యూరియా నిల్వలు లేకపోవడంతో సహకార సంఘాల ఎదుట రైతులు బారులు తీరుతున్నారు. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ వ్యవసాయ సహకార సంఘం వద్ద యూరియా కోసం రైతులు బారులు తీరారిలా..

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి



పాఠశాల ఆవరణలో టెన్త్ విద్యార్థుల స్టడీఅవర్... స్నాక్స్‌గా అందజేసిన అరటిపండ్లు, పల్లి పట్టీలు



చక్కని ఉత్తీర్ణతకు చిరుతిండి..

ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు టెన్త్ విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్నారు. ఇందులో మిల్లెట్స్, పల్లీపట్టీలు, నువ్వుల పట్టీలు, మొలకలు, అరటిపండ్లు, ఉడికించిన పల్లీలు ఉంటున్నాయి. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం గట్టెపెల్లి జెడ్పీ హైస్కూల్ పదో తరగతి విద్యార్థుల స్టడీఅవర్స్‌లో స్నాక్స్ అందిస్తూ, పిల్లల సందేహాలు నివృత్తి చేస్తూ.. హెచ్‌ఎం అన్నపూర్ణ ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి





జంపన్న వాగులో భక్తుల పుణ్యస్నానాలు (ఫైల్)

సహజత్వం కోల్పోతున్న నీరు

జంపన్నవాగులో పరిశోధనల ద్వారా తేల్చిన డాక్టర్ మదన్‌మోహన్

- మేడారం జాతరకు ముందు, జాతర సమయంలో, తర్వాత జంపన్నవాగులో నీటి శాంపిల్స్ సేకరణ
- ఈ నెల 24, 25న నేపాల్‌లో జరిగే సదస్సుకు పరిశోధన పత్రం ఎంపిక
- పుణ్య స్నానాల సందర్భంగా షాంపూలు, సబ్బుల వినియోగంతోనే ఈ పరిస్థితి
- ప్రవాహ వేగం పెంచితే మేలంటున్న అధ్యయనాలు

సాక్షి, సిద్దిపేట: మేడారం సమ్మక్క–సారలమ్మ జాతరను తెలంగాణ కుంభమేళాగా అభివర్ణిస్తారు. జాతర జరిగే నాలుగు రోజుల్లో కోటికి పైగా భక్తులు జంపన్నవాగులో పుణ్యస్నానాలు చేసి అమ్మవార్లను దర్శించుకుంటారు. అయితే భక్తులు ఉపయోగించే షాంపూలు, సబ్బుల ఇతర కెమికల్స్ వల్ల వాగులో నీరు సహజత్వాన్ని కోల్పోతోందని సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల సూక్ష్మ జీవశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ మదన్‌మోహన్ పరిశోధనల ద్వారా తేల్చారు.

వాగులో పుణ్యస్నానాలు చేశాకే...

మేడారం జాతరకు జంపన్నవాగుకు విడదీయలేని బంధం ఉంది. కాకతీయులతో యుద్ధం జరిగిన సమయంలో రోజుల తరబడి పోరాటం చేసిన సమ్మక్క కుమారుడు జంపన్న.. మేడారం పొలిమేరలో ఉన్న సంపెంగ వాగులో దూకి ఆత్మార్పణ చేసుకున్నారని చరిత్ర చెబుతోంది. ఆనాటి నుంచి ప్రజలు ఆ వాగును జంపన్నవాగుగా పిలుస్తున్నారు. భక్తజనులు జంపన్నవాగులో పుణ్యస్నానమాచరించి ఆ తర్వాత తల్లుల దర్శనానికి వెళ్లడం ఆనవాయితీగా వస్తోంది.

వాగుకు ఇరువైపులా 2 కిలోమీటర్ల మేర స్నానఘట్టాలు

మేడారంలోని జంపన్నవాగుకు ఇరువైపులా రెండు కిలోమీటర్ల పొడవులో స్నానఘట్టాలు ఉన్నాయి. భక్తులు ఈ వాగులో స్నానం చేసేందుకు వీలుగా లక్నవరం జలాశయం నుంచి జాతర సమయాల్లో నీటిని వదులుతారు. ఈ నీరు స్నానఘట్టాల దగ్గర నిల్వ ఉండేలా ఇసుక బస్తాలతో తాత్కాలిక చెక్‌డ్యామ్‌లు నిర్మిస్తారు. మరోవైపు వాగులో ఉన్న ఇన్‌ఫిల్టరేషన్ వెల్స్ ద్వారా నీటిని తోడి స్నానఘట్టాల దగ్గర ఏర్పాటు చేసిన బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్‌కు పంపిస్తారు. భక్తులు జంపన్నవాగులో మునక వేసిన తర్వాత బ్యాటరీ ట్యాప్స్ దగ్గర స్నానాలు చేస్తారు. ఇలా కేవలం రెండు కిలోమీటర్ల పరిధిలోనే లక్షలాది మంది భక్తులు జాతర జరిగే నాలుగు రోజుల పాటు నిర్విరామంగా స్నానాలు చేస్తారు. ఈ సమయంలో ఉపయోగించే షాంపులు, సబ్బుల కారణంగా జంపన్న వాగులోని నీరు సహజత్వానికి కోల్పోతోందని తాజా అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. దీనికి తోడు సహజమైన కుంకుమ స్థానాన్ని చాలా చోట్ల కెమికల్ కుంకుమలు ఆక్రమించడం ఈ సమస్యను మరింత తీవ్రం చేసింది.


18 శాంపిల్స్ సేకరణ

గతేడాది ఫిబ్రవరి 21వ తేదీ నుంచి 24వ తేదీ వరకు మేడారం జాతర జరిగింది. ఈ సందర్భంగా జాతరకు వారం రోజుల ముందు సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల సూక్ష్మజీవశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో జంపన్న వాగులో ఆరు చోట్ల, జాతర సమయంలో ఆరు చోట్ల, జాతర ముగిసిన వారం రోజులకు ఆరుచోట్ల ఇలా 18 శాంపిల్స్ సేకరించారు. వీటిని ప్రత్యేక బాటిళ్లలో తీసుకొచ్చి కళాశాలలో టెస్ట్ చేశారు. వాటి ఫలితాలు ఇలా ఉన్నాయి. సాధారణంగా అయితే పీహెచ్ 6.5 నుంచి 8.5, డిజాల్వ్‌డ్ ఆక్సిజన్(డీవో) 6 ఎంజీ కంటే ఎక్కువ (లీటరు నీటిలో), బయోకెమికల్ ఆక్సిజన్ డిమాండ్(బీవోడీ) 2ఎంజీ అంతకంటే తక్కువ (లీటరు నీటిలో), బాక్టీరియా అసలు ఉండొద్దు.

	ముందు	జాతర సమయంలో	తర్వాత
పీహెచ్	6.8-8.0	6.2-6.7	7.0-7.1
డీవో	6.8-8.0	3.0-4.5	4.5-5.5
బీవోడీ	1.5-2	5.0-7.5	3.0-4.0
బ్యాక్టీరియా	50-100	500-100	200-400

24, 25 తేదీల్లో నేపాల్‌లో ప్రజెంటేషన్

బయోటెక్నాలజీ సొసైటీ ఆఫ్ నేపాల్ ఆధ్వర్యంలో కాఠ్మాండ్‌లో ఈ నెల 24,25 తేదీల్లో జరిగే 3వ అంతర్జాతీయ బయోటెక్నాలజీ సదస్సుకు జంపన్న వాగులో సామూహిక పుణ్యస్నానాలతో నీటి కాలుష్యంపై చేసిన పరిశోధన పత్రం ఎంపికైంది. దీనిపై పేపర్ ప్రజెంటేషన్ ఇచ్చేందుకు డాక్టర్ మదన్‌మోహన్‌కు ఆహ్వానం అందింది.



వాటర్ శాంపిల్స్

నివారణ మార్గాలు

సహజత్వాన్ని కోల్పోయిన నీటిలో బ్యాక్టీరియాలు పెరుగుతాయి. ఇలాంటి నీటిలో ఎక్కువ సేపు ఉండటం వల్ల ఇబ్బందులు వచ్చే అవకాశం ఉంది.

- వాగులో నీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు దిగువకు వెళ్లేలా నీటి ప్రవాహం కొంచెం ఎక్కువ ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి.
- క్లోరినేషన్ ఎక్కువగా చేయాలి.
- సబ్బు, షాంపుల వినియోగం, బట్టలు ఉతకడం, కుంకుమ వేయడాన్ని నియంత్రించాలి.
- జాతర నుంచి ఇంటికి వెళ్లిన తర్వాత మళ్లీ స్నానం చేయడం వల్ల ఎలాంటి ఇన్ఫెక్షన్లు రావు అని పరిశోధన ద్వారా నిర్ధారణ అయ్యింది.



జాగ్రత్తలు పాటించాలి

పుణ్యస్నానాలు చేయడం మంచిదే. తగు జాగ్రత్తలు పాటించాలి. పుణ్యస్నానాలు చేసే సమయంలో పూజా ద్రవ్యాలు అందులో వేయొద్దు. షాంపూలు, సబ్బులు వినియోగించడం వలన నీరు సహజత్వం కోల్పోయి కాలుష్యం అవుతుంది. దీంతో చర్మ వ్యాధులు, ఇతర ఇన్ఫెక్షన్లు వస్తాయి.

– డాక్టర్ మదన్ మోహన్, సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల సూక్ష్మజీవశాస్త్ర విభాగాధిపతి

యూజీసీ ముసాయిదా నిబంధనలు రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకం: శ్రీనివాస్‌గౌడ్

సాక్షి, న్యూఢిల్లీ: యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) ముసాయిదా నిబంధనలు రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకమని బీఆర్‌ఎస్ మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. రాష్ట్ర విశ్వవిద్యాలయాలపై కేంద్ర ప్రభుత్వ నియంత్రణ పెంచి, వాటి స్వయం ప్రతిపత్తిని దెబ్బతీసేలా ఈ నిబంధనలు రూపొందించారని, దీనివల్ల దేశ విద్యావ్యవస్థ, సమాఖ్య నిర్మాణం ప్రమాదంలో పడతాయని ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం ఢిల్లీలోని జంతర్ మంతర్‌లో డీఎంకే విద్యార్థి విభాగం యూజీసీ ముసాయిదా నిబంధనలకు వ్యతిరేకంగా ధర్నా నిర్వహించింది. దీనికి అఖిలభారత ఓబీసీ విద్యార్థుల సంఘం (ఏఐఓబీసీఎస్‌ఏ) జాతీయ అధ్యక్షుడు జి.కిరణ్‌కుమార్‌తో కలిసి శ్రీనివాస్‌గౌడ్ హాజరై మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..యూజీసీ ముసాయిదా నిబంధనలు విద్యను వ్యాపారీకరణ చేసే దిశగా పావులు కదుపుతూ, రాజ్యాంగపరమైన హక్కులను బలహీనపరిచే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు. నియామక కమిటీల్లో కనీసం 50 శాతం మంది సంబంధిత స్థానానికి సంబంధించిన రిజర్వ్ కోటాకు చెందినవారే ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. దీనివల్ల నియామక ప్రక్రియ బాధ్యతాయుతంగా మారి, నిష్పాక్షికత పెరుగుతుందని శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.

ఫింగర్‌ప్రింట్ బ్యూరో సిబ్బందికి సీఐడీ డీజీ అభినందన

సాక్షి, హైదరాబాద్: వేలి ముద్రల నిపుణులకు జాతీయ స్థాయిలో నిర్వహించే అఖిల భారత బోర్డ్ పరీక్ష 2023లో ఉత్తమ ఫలితాలు సాధించిన ఫింగర్‌ప్రింట్ బ్యూరో సిబ్బందిని సీఐడీ విభాగం డీజీ శిఖాగోయల్ అభినందించారు. స్మార్ట్ యూజ్ ఆఫ్ ఎఫ్‌పీ సైన్స్ విభాగంలో ఫింగర్ ప్రింట్ బ్యూరో డైరెక్టర్ తాతారావు, ఇతర సిబ్బంది అవార్డులు సాధించారు. వీరిని శిఖాగోయల్ గురువారం తన కార్యాలయంలో అభినందించారు.

సచివాలయాన్ని సందర్శించిన ఎన్‌డీసీ బృందం

జాతీయ భద్రతపై ఉన్నతాధికారులతో భేటీ

సాక్షి, హైదరాబాద్: జాతీయ భద్రత, వ్యూహాత్మక అధ్యయనాలు అనే అంశంపై స్టడీ టూర్‌లో భాగంగా నేషనల్ డిఫెన్స్ కాలేజ్ (ఎన్‌డీసీ) ప్రతినిధి బృందం గురువారం సచివాలయాన్ని సందర్శించింది. మేజర్ జనరల్ సమ్రత్ నగర్ నేతృత్వంలోని ఎన్‌డీసీ అధ్యాపక బృందం ఈ మేరకు హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవిగుప్తా, విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, వ్యవసాయశాఖ సంయుక్త కార్యదర్శి ఉదయ్‌కుమార్‌లతో సమావేశమైంది. ఈ సందర్భంగా పలు అంశాలపై వారు చర్చించారు.

రూ.360 కోట్లతో ట్రైకార్ వార్షిక ప్రణాళిక

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ షెడ్యూల్డ్ తెగల ఆర్థిక సహకార సంస్థ (ట్రైకార్) 2024–25 వార్షిక ప్రణాళికకు బోర్డు ఆమోదం తెలిపింది. రూ.360 కోట్లతో రూపొందించిన ఈ ప్రణాళిక ద్వారా 28,350 మందికి లబ్ధి చేకూరుతుందని స్పష్టం చేసింది. గురువారం డీఎస్‌ఎస్ భవన్‌లో ట్రైకార్ బోర్డు సమావేశం చైర్మన్ బెల్లయ్య నాయక్ అధ్యక్షతన జరిగింది.

రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేసింది

ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో బీజేపీ నేతలు

సాక్షి, హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని బీజేపీ నేతలు అన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించకపోగా, మళ్లీ ఇప్పుడు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు అడిగేందుకు కాంగ్రెస్ పార్టీ వస్తోందని వారు మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలు, మేధావులు, ఉద్యోగ సంఘాలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి అన్నివర్గాలను మోసం చేసిందని ఆరోపించారు. త్వరలో జరగనున్న టీచర్స్, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మేధావులు, ఉపాధ్యాయులు ఆలోచించి బీజేపీ అభ్యర్థులకు మద్దతు ఇచ్చి గెలిపించాలని కోరారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో చర్చించిన అంశాలను గురించి బీజేపీ ప్రధాన కార్యదర్శులు గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, కాసం వెంకటేశ్వర్లుయాదవ్ మీడియాకు తెలియజేశారు. శుక్రవారం వరంగల్–ఖమ్మం–నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి సరోత్తమ్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేస్తారని చెప్పారు.

బీజేపీకి మద్దతుగా పోటీ నుంచి వైదొలిగిన సాయిరెడ్డి

వరంగల్–ఖమ్మం–నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ టికెట్‌ను తెలంగాణ ఉపాధ్యాయ సంఘం మాజీ అధ్యక్షుడు సాయిరెడ్డి ఆశించారు. ఆ దిశగా ప్రచారం కూడా చేశారు. అయితే సరోత్తమ్‌రెడ్డికి మద్దతుగా పోటీ నుంచి వైదొలగాలని బీజేపీ నేతలు కోరారు. వారి విజ్ఞప్తిని మన్నించిన సాయిరెడ్డి తాను పోటీ నుంచి విరమించుకుంటున్నట్లు ప్రకటించారు.

తెలంగాణకు రూ.176.5 కోట్ల సాయం

సాక్షి, హైదరాబాద్: జాతీయ రోడ్డు రవాణా శాఖ 'రాష్ట్రాలకు ప్రత్యేక ఆర్థిక పెట్టుబడి సహాయం 2024-2025 పథకం'నిర్వహణలో కీలకమైన ప్రగతి సాధించినందుకు తెలంగాణ రాష్ట్రానికి అదనపు ప్రోత్సాహక సహాయం కింద కేంద్రం నుంచి సాయం అందనుంది. ఇందులో భాగంగా తెలంగాణకు మైల్‌స్టోన్-1, మైల్‌స్టోన్-2 పథకాల కింద రూ.125 కోట్లు, రూ 51.5 కోట్ల చొప్పున మొత్తం రూ.176.5 కోట్లకు అర్హత సాధించింది. తెలంగాణ రాష్ట్రం మోటార్ వెహికల్ టాక్స్ కన్సెషన్ ఇచ్చినందుకు రూ.50 కోట్లు .. 15 ఏళ్ల పైబడిన రవాణా వాహనాలను తొలగించడానికి స్క్రాప్ చేస్తున్న పథకం కింద రూ.75 కోట్లకు అర్హత సాధించినట్టు అధికారులు తెలిపారు.

పార్టీ పెద్దలకు మంత్రి కొండా సురేఖ లేఖలు

కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేసినట్టు వెల్లడి

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ అగ్రనేతలు సోనియా, రాహుల్ గాంధీలకు రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖల మంత్రి కొండా సురేఖ వేర్వేరుగా లేఖలు రాశారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో.. రాష్ట్రంలో బీసీ కులగణనను కాంగ్రెస్ ప్రభుత్వం విజయవంతంగా చేపట్టిందని పేర్కొన్నారు. ఇందుకోసం రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, కేబినెట్ సబ్ కమిటీ చైర్మన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ శ్రమించారని వెల్లడించారు.



గురువారం జూబ్లీహిల్స్‌లోని నివాసంలో సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన ప్రముఖ ఆధ్యాత్మిక సంస్థ ఈషా ఫౌండేషన్ వ్యవస్థాపకులు సద్గురు జగ్గీ వాసుదేవ్

ఓపీఎస్ ఊసే ఎత్తని కాంగ్రెస్..

బీజేపీ టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి సరోత్తమ్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: తాము అధికారంలోకి వచ్చాక ఆరు నెలల్లో సీపీఎస్‌ను రద్దుచేసి ఓపీఎస్‌ను ఇస్తామన్న కాంగ్రెస్ పార్టీ, ఇప్పుడు ఆ ఊసే ఎత్తడం లేదని వరంగల్–ఖమ్మం–నల్లగొండ జిల్లాల టీచర్స్ ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థి సరోత్తమ్‌రెడ్డి విమర్శించారు. సమగ్ర శిక్షా అభియాన్ (ఎస్‌ఎస్‌ఏ) ఉద్యోగులు సమ్మె చేస్తే, సమ్మె కాలానికి జీతం ఇవ్వకుండా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అవమానించిందన్నారు. గతంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులకు మినిమమ్ బేసిక్‌పేను చెల్లించాలని డిమాండ్ చేశారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు అన్యాయం చేస్తే, ప్రస్తుత రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అంతకంటే ఎక్కువగా దగా చేస్తోందని మండిపడ్డారు. ఈ నెల 27న జరగనున్న ఎన్నికల్లో టీచర్లు తమ మొదటి ప్రాధాన్యత ఓటును బీజేపీకి వేసి తనను గెలిపించాలని కోరారు.

బీసీలంటే సీఎం రేవంత్‌కు చులకన భావం

బీఆర్‌ఎస్ నేత గట్టు రాంచందర్‌రావు

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్‌కు విరుద్ధంగా కులగణన పేరిట అసెంబ్లీలో చేసిన తీర్మానంపై సీఎం రేవంత్‌రెడ్డి బీసీలకు క్షమాపణ చెప్పాలని బీఆర్‌ఎస్ నేత గట్టు రాంచందర్‌రావు డిమాండ్ చేశారు. కామారెడ్డి డిక్లరేషన్‌కు విలువ లేకపోతే దానిని తగులబెట్టాలన్నారు. గురువారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ బీసీల పట్ల సీఎం రేవంత్‌కు చులకన భావం ఉందని, కులగణన సబ్ కమిటీ చైర్మన్‌గా నియమించడానికి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తప్ప బీసీల్లో సమర్థులు దొరకలేదా అని ప్రశ్నించారు.

పార్లమెంట్ ప్రశ్నోత్తరాలు

ఐకానిక్ టూరిస్టు సెంటర్ల అభివృద్ధికి నిధులు

సాక్షి, న్యూఢిల్లీ: ఐకానిక్ టూరిస్ట్ సెంటర్ల అభివృద్ధి పథకంలో భాగంగా తెలంగాణలోని రామప్ప అభివృద్ధికి రూ.73.74 కోట్లు, సోమశిల అభివృద్ధికి రూ.68.10 కోట్లను గత ఏడాది డిసెంబర్ 13న విడుదల చేశామని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ తెలిపారు. గురువారం రాజ్యసభలో బీఆర్‌ఎస్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి ఈ మేరకు లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

పాలమూరు-రంగారెడ్డికి జాతీయ హోదా అడిగారు..

పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా కల్పించాలని తెలంగాణ ప్రభుత్వం డిమాండ్ చేసిందని కేంద్ర జలశక్తి శాఖ సహాయ మంత్రి రాజ్ భూషణ్ చౌదరి తెలిపారు. ఏ ప్రాజెక్టునైనా మరింత పరిశీలించడానికి సెంట్రల్ వాటర్ కమిషన్ (సీడబ్ల్యూసీ) టెక్నో ఎకనామిక్ అప్రైజల్ నిర్వహించడం తప్పనిసరి అని పేర్కొన్నారు. 2022లో పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల పథకం టెక్నో ఎకనామిక్ అప్రైజల్ కోసం సీడబ్ల్యూసీకి తెలంగాణ ప్రభుత్వం డీపీఆర్ అందించిందని చెప్పారు. అయితే ప్రస్తుతం ఈ ఎత్తిపోతల పథకంలో కృష్ణానదీ జలాల వినియోగం సహా ఇతర అంశాలు కోర్టు పరిధిలో ఉన్నందున టెక్నో ఎకనామిక్ అప్రైజల్ అమలు సాధ్యం కాదని కాంగ్రెస్ ఎంపీ బలరాం నాయక్ అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి లోక్‌సభలో లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

స్మార్ట్ సిటీస్ పథకంలో 169 ప్రాజెక్టులకు ఆమోదం..

తెలంగాణలో గ్రేటర్ వరంగల్, కరీంనగర్ నగరాలను స్మార్ట్ సిటీస్ పథకంలో భాగంగా అభివృద్ధి చేయడానికి మొత్తం రూ.2,918 కోట్ల విలువైన 169 ప్రాజెక్టులను ఆమోదించామని కేంద్ర గృహ నిర్మాణం, పట్టణ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి తోఖన్ సాహు తెలిపారు. అందులో ఇప్పటివరకు రూ.2,241 కోట్ల విలువైన 104 ప్రాజెక్టులను పూర్తిచేశామని బీజేపీ ఎంపీలు డీకే అరుణ, ఈటల రాజేందర్, కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డిలు అడిగిన ప్రశ్నలకు లోక్‌సభలో గురువారం కేంద్రమంత్రి బదులిచ్చారు.

ఎస్టీ జనాభా 40% కంటే ఎక్కువగా ఉన్న గ్రామాలు 924

తెలంగాణలో ఎస్టీ జనాభా 40% కంటే ఎక్కువగా ఉన్న 924 గిరిజన గ్రామాలను గుర్తించామని కేంద్ర జలశక్తి శాఖ వి.సోమన్న తెలిపారు. అందులో 883 గ్రామాలు మల్టీ విలేజ్ స్కీం, సింగిల్ విలేజ్ స్కీం కింద ఉన్నాయని, మిగిలిన 41 గ్రామాలను స్థానిక ప్రైవేట్ వనరులతో కవర్ చేసినట్లు తెలంగాణ ప్రభుత్వం తమకు తెలిపిందని కాంగ్రెస్ ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి లోక్‌సభలో వెల్లడించారు.

క్లుప్తంగా...

బడ్జెట్‌లో తెలుగు రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం

వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ కార్యదర్శి బి.వెంకట్

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2025–26 బడ్జెట్‌లో తెలుగు రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరిగిందని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ కార్యదర్శి బి.వెంకట్ ఆరోపించారు. మాటల్లో గురజాడను గుర్తు చేసిన తెలుగింటి కోడలు చేతల్లో కార్పొరేట్లకు కొమ్ము కాశారని విమర్శించారు. గురువారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ.. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు గత బడ్జెట్‌లో రూ.8 వేల కోట్లు ఇచ్చి.. ఇప్పుడు రూ.5 వేల కోట్లకు కుదించారని మండిపడ్డారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణ వ్యయం రూ.50 వేల కోట్లు అంచనా కాగా.. రూ.30 వేల కోట్లకు కుదించారని దుయ్యబట్టారు. అయినా.. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ బీజేపీని పల్లెత్తు మాట అనడం లేదన్నారు. బడ్జెట్‌లో తెలంగాణ ఊసే లేదని, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి నిధులు కేటాయించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వామపక్షాలు ఫిబ్రవరి 14 నుంచి 20 వరకు చేపట్టనున్న నిరసన కార్యక్రమంలో వ్యవసాయ కార్మికులు, ప్రజలు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

హజ్ కమిటీ ఈవోగా మొహమ్మద్ గౌస్ పీర్

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ హజ్ కమిటీ కార్యనిర్వహణ అధికారి(ఈవో)గా షేక్ మొహమ్మద్ గౌస్ పీర్‌కు ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించింది. ప్రస్తుతం నూర్‌బాషా, దూదేకుల ముస్లిం కో ఆపరేటివ్ సొసైటీ ఫెడరేషన్ లిమిటెడ్ ఎండీగా ఉన్న గౌస్ పీర్‌కు హజ్ కమిటి ఈవోగా అదనపు బాధ్యతలు అప్పగించింది. ఇప్పటి వరకు హజ్ కమిటీ ఈవోగా ఉన్న ఎల్.అబ్దుల్ ఖాదీర్‌ను అదనపు బాధ్యతల నుంచి రిలీవ్ చేసి ఏపీ స్టేట్ వక్ఫ్‌బోర్డు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పరిమితం చేసినట్లు రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శి కె.హర్షవర్ధన్ గురువారం పేర్కొన్నారు.

అమెరికా పర్యటనను ప్రధాని రద్దు చేసుకోవాలి

ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్



సీతమ్మధార (విశాఖ ఉత్తర): భారత దేశ పౌరులకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బేడీలు వేస్తుంటే ప్రధాని మోదీ ఏం చేస్తున్నారని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ ప్రశ్నించారు. గురువారం విశాఖలోని కేఏ పాల్ ఫంక్షన్ హాల్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు. అమెరికా పట్ల మోదీ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ట్రంప్ వ్యవహార శైలికి నిరసనగా మోదీ అమెరికా పర్యటనను రద్దు చేసుకోవాలని డిమాండ్ చేశారు. భారత విదేశాంగ మంత్రి జయశంకర్ తన పదవికి తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. చైనాను ఎదిరించడానికి అమెరికాకు భారత్ సహకారం చాలా అవసరమని..అందుకనే ట్రంప్, మోదీని కలుస్తున్నారని తెలిపారు. అమెరికాలో భారతీయులకు ఇబ్బంది లేకుండా చూసే బాధ్యత తనదని, అమెరికాలో ఇబ్బందులు పడుతున్న భారతీయులు తన (కేఏ పాల్) వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు. ట్రంప్ తనకు మిత్రుడు మాత్రమేనని, భారతీయుల కోసం ఏమైనా చేస్తానని అన్నారు.

చంద్రబాబు హయాంలోనే తగ్గిన కేంద్ర ఆర్థిక సాయం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



మధురవాడ: చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయిన తర్వాత కేంద్ర ఆర్థిక సహకారం తగ్గిందని, ఈ విషయం సాక్షాత్తు ఆర్థిక శాఖ అధికారులే ఇటీవల జరిగిన సమీక్షా సమావేశంలో వివరించారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ చెప్పారు. గురువారం సీపీఐ ఆధ్వర్యంలో జీవీఎంసీ 7వ వార్డు మధురవాడ వాంబేకాలనీలో ఇళ్ల స్థలాల కోసం పేదల వ్యక్తిగత దరఖాస్తులు నింపేందుకు చేపట్టిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బడ్జెట్‌లో రాష్ట్రానికి ప్రాధాన్యం లేకున్నా బ్రహ్మాండం అంటూ చంద్రబాబు పొగుడుతున్నాడన్నారు. పవన్ కల్యాణ్ కూడా అదే పనిలో ఉన్నాడన్నారు. వాస్తవంగా లెక్కలు చూస్తే 2023–24 ఆర్థిక సంవత్సరం కంటే 2024–25 ఆర్థిక సంవత్సరంలో దాదాపు 3,300 కోట్లు ఆర్థిక సహాయం తగ్గిందన్నారు. 2024–25లో కేంద్రం నుంచి ఎంత ఆర్థిక సహాయం వచ్చింది? అంతకు ముందు ఎంత వచ్చింది అన్న విషయాలపై ముఖ్యమంత్రి శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 2023–24 ఆర్థిక సంవత్సరం రూ.59 వేల కోట్లు కేంద్ర నిధులు వస్తే ఈ ఏడాది రూ.3,300 కోట్లు తక్కువ వచ్చినట్టు తమ వద్ద సమాచారం ఉందని తెలిపారు. ఎన్నికల్లో కూటమి నాయకులు ఇచ్చిన హామీ ప్రకారం అర్హులైన పేదలకు గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు ఇవ్వాలంటూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల తరపున ఒత్తిడి చేస్తామని, అవసరమైతే ఛలో అసెంబ్లీ కార్యక్రమం కూడా నిర్వహిస్తామన్నారు.

'విరి'సిన అందం



ఆకులు రాల్చుకుంటూ వాటి స్థానంలో పూలను ఇస్తూ టబేబుయా రోజా(రోజీ ట్రంపెట్ చెట్టు) ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మహానంది క్షేత్రంలోని ప్రసాదాల కౌంటర్ పక్కన ఈ వృక్షం కనువిందు చేస్తోంది. ప్రతి ఏడాది ఫిబ్రవరిలో మాత్రమే ఇది పుష్పిస్తుంది. దీన్ని ఎల్.సాల్విడార్ జాతీయ వృక్షం అంటారని, నల్లమల అడవుల్లో ఇలాంటి చెట్టు కనిపించదని అటవీ ప్రేమికుడు దూపాడు శ్రీధర్ తెలిపారు. - మహానంది

ముంచెత్తిన మంచు



పొద్దుపొడిచి గంటలు గడుస్తున్నా మంచుమాత్రం కురుస్తూనే ఉంది. అడుగుల దూరంలో ఉన్న మనిషి కూడా కనిపించనంత దట్టంగా కురుస్తున్న పొగమంచుతో గురువారం ఉదయం వివిధ పనుల మీద బయటకు వెళ్లాల్సినవారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విజయవాడ సమీపంలోని నున్న వద్ద పై దృశ్యాన్ని సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది. - సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

వంగతోటకు బొమ్మ కాపలా



రోడ్డుకు పక్కనే ఉన్న తన వంగతోట నుంచి రాత్రిపూట ఎవరూ దొంగతనంగా కాయలు కోయకుండా ఉండేందుకు ఓ రైతు వినూత్నంగా ఆలోచించాడు. తోట మధ్య సాధారణ మనుషుల వస్త్రధారణతో బొమ్మలు పెట్టాడు. రోడ్డుపై రాకపోకలు సాగించేవారు ఈ బొమ్మల్ని ఆసక్తిగా తిలకిస్తున్నారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

రాయల నాటి రాజసానికి చిహ్నం



ఉదయగిరి దుర్గం

చెరిగిపోని చరిత్రకు సాక్ష్యం ఉదయగిరి దుర్గం

- ఉదయగిరి చుట్టూ చూడదగ్గ ప్రదేశాలెన్నో
- పర్యాటక అభివృద్ధి కోసం పడిగాపులు
- గత ప్రభుత్వ హయాంలో అటవీశాఖతో ఎకోటూరిజం కోసం ప్రతిపాదనలు

ప్రభుత్వం మార్పుతో ప్రతిపాదనలు బుట్టదాఖలు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: చుట్టూరా ప్రకృతి సోయగాలు.. కనువిందు చేసే జలపాతాలు, ప్రాచీన పుణ్యక్షేత్రాలు, కళ్లు తిప్పుకోనివ్వని శిల్పాలతో నిర్మాణాలు, తిరుమల గిరులను పోలిన ఎత్తయిన పర్వత శ్రేణులు.. అడుగడుగున కనిపించే అలనాటి రాచ మందిరాలు.. ఒకటేమిటి ఎన్నో విశిష్టతలతో నిండిన ఉదయగిరి ప్రాంతం పర్యాటక శోభకోసం ఎదురుచూస్తోంది. గత ప్రభుత్వంలో సిద్దేశ్వరం, దుర్గంపల్లి ప్రాంతాలను అటవీశాఖ ఎకో టూరిజం స్పాట్స్‌గా తీర్చిదిద్దేందుకు ప్రతిపాదనలు పంపింది .. ఈ లోపే ప్రభుత్వం మారడంతో ఆ ప్రతిపాదనలు కార్యరూపం దాల్చలేదు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో ఉదయగిరి దుర్గానికి ఎంతో చారిత్రక ప్రాముఖ్యత ఉంది. చోళులు, పల్లవులు, రెడ్డి రాజులు, గజపతులు, విజయనగర రాజులు, గోల్కొండ నవాబులు ఏలిన ఈ ప్రాంతం ఒకప్పుడు వైభవోపేతంగా విలసిల్లింది. కాలక్రమేణా తన ప్రాభవాన్ని పూర్తిగా కోల్పోయింది. ప్రస్తుతం అలనాటి రాచరిక పాలనకు గుర్తులుగా కనిపించే మొండి గోడలు, శిథిల రాజభవనాలు ఇక్కడ దర్శనమిస్తున్నాయి. జిల్లా కేంద్రానికి వందకిలోమీటర్ల దూరంలో, నీటి వసతిలేని మెట్ట ప్రాంతంగా ఉదయగిరి అభివృద్ధికి దూరంగా ఉండిపోయింది.

తొలి సూర్యకిరణాల పడే గిరి..

ఉదయగిరి కోట సముద్ర మట్టానికి 755 అడుగుల ఎత్తులో ఉంది. ఇక్కడ ఉష్ణోగ్రత గరిష్టంగా 20 డిగ్రీలు మాత్రమే ఉంటుంది. ఉదయగిరి కోట 5 కి.మీ వ్యాసార్థంతో తిరుమల కొండను పోలి ఉంది. పచ్చని పచ్చిక బయళ్లతో, వన్యప్రాణులతో ఇక్కడ ప్రకృతి సౌందర్యం విరాజిల్లుతూ ఉంటుంది. ఉదయ సూర్యుని తొలికిరణాలు ఈ కొండపైనే ముందుగా పడుతుండటంతో దీన్ని ఉదయగిరిగా విజయనగరం రాజులు పేరుపెట్టారు. ఈ ఉదయగిరి కోటలో శ్రీకృష్ణదేవరాయలు 18 నెలలు ఉండి పాలన సాగించారు.

చారిత్రక కట్టడాలకు ప్రసిద్ధి

విజయనగర రాజులు ఉదయగిరి ప్రాంతంలో దేవాలయాలు, కోనేరులు నిర్మించారు. శ్రీకృష్ణ దేవరాయలు నిర్మించిన ఆలయాలు, నవాబులు నిర్మించిన మసీదులు, రాణీ మందిరాలు, ధాన్యాగారాలు, గుర్రపు శాలలు, ఫిరంగి కోటలు, కోనేరులు, సొరంగ మార్గం నేటికీ ఉన్నాయి. ఉదయగిరి దుర్గం కింద పట్టణంలో తల్పగిరి రంగనాయకులస్వామి దేవాలయం, కృష్ణాలయం, కల్యాణమండపం నేటికీ చూపరులను ఆకర్షిస్తున్నాయి. నెల్లూరులో ఉన్న రంగనాయకుల స్వామి విగ్రహం ఉదయగిరి నుంచి తరలించిందే కావటం విశేషం. శ్రీకృష్ణ దేవరాయల పాలనకు గుర్తుగా ఉదయగిరి ట్యాంక్‌బండ్ సమీపంలో కల్యాణ మండపం, కోనేరు అలనాటి శిల్పకళా వైభవాన్ని చాటి చెబుతాయి. ఉదయగిరి నుంచి బండకిందపల్లికి వెళ్లే ఘాట్‌రోడ్డులో పాదచారుల కోసం రాతిలో తవ్విన బావి నేటికీ తానాబావిగా ప్రసిద్ధి చెందింది. అనంతరం బ్రిటిష్ పాలనలో స్టేట్ దొర నిర్మించిన ప్రార్థనా మందిరం, తహసీల్దారు కార్యాలయ భవనాలు నేటికీ చెక్కు చెదరకుండా ఉన్నాయి.

చూడదగిన ప్రదేశాలు

ఉదయగిరికి 33 కి.మీ దూరంలో అత్యంత ప్రాచీనమైన, అతి శక్తివంతమైన ఘటిక సిద్దేశ్వరం శైవక్షేత్రం ఉంది. అగస్త్య మహాముని తపోపీఠమైన ఈ క్షేత్రం శ్రీకృష్ణ దేవరాయలకు యుద్ధకాలంలో దుర్గంకు దారి చూపించింది. సిద్ధేశ్వరానికి అతి సమీపంలో ఉన్న బూసానాయుడు కోటను అభివృద్ధి చేయవచ్చు. సిద్ధేశ్వరం నుంచి మరో 30 కి.మీ దూరంలో ప్రకృతి సోయగాల నడుమ పయనిస్తూ ముందుకు వెళితే 7, 8 శతాబ్దాల్లో పల్లవుల కాలంలో అద్భుతమైన శిల్పకళా నైపుణ్యంతో రూపుదిద్దుకున్న ఒకే రాతిపై దేవాలయం, ద్వారపాలకులు, శివలింగాలు, నందీశ్వరుడు కొలువైన భైరవకోన ఉంది. ఇక్కడ ఏడాది పొడవునా జాలువారే జలపాతాలు పర్యాటకులను ఎంతగానో ఆకర్షిస్తాయి.. అక్కడి నుంచి మరో 24. కి.మీ ముందుకు వెళితే నారాయణస్వామి ఆలయం ఉంది. అక్కడి నుంచి మరో పది కి.మీ దూరంలో హనుమని కొండ ఉంది. అక్కడి నుంచి మరో 25 కి.మీ ముందుకు వెళితే వెంగమాంబ దేవాలయాన్ని సందర్శించవచ్చు.



రంగనాయకుల స్వామి ఆలయం

అభివృద్ధిని మరచిన పాలకులు

ఈ ప్రాంతం పర్యాటకంగా అభివృద్ధి చెందితే ఎంతో మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభించే అవకాశముంది. గత ఐదు దశాబ్దాలుగా ఈ ప్రాంతం అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలు ఉన్నాయి. ఉదయగిరి ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని చెబుతున్న పాలకులు ఆచరణలో విఫలమయ్యారు. ఎన్డీయే ప్రభుత్వంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రిగా ఉన్న సమయంలో మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యానాయుడు ఆనాటి కేంద్ర మంత్రులు అనంతకుమార్, సుష్మాస్వరాజ్‌ను ఉదయగిరి పిలిపించి హెలికాప్టర్ ద్వారా పరిశీలించారు. అప్పట్లో ఉదయగిరి ప్రాంతం పర్యాటకంగా అభివృద్ధి చెందుతుందని అంతా భావించారు. కానీ ఎందుకో ఆ హామీలు నెరవేరలేదు.

ప్రతిపాదనలు చేసి..

తిరుమల కొండలను మరిపించే పర్వతశ్రేణులు, పచ్చని ప్రకృతి రమణీయతను పుణికి పుచ్చుకున్న సిద్దేశ్వరం, దుర్గంపల్లి ప్రాంతాలను టూరిజం స్పాట్‌గా అభివృద్ధి చేసేందుకు గత ప్రభుత్వం అటవీశాఖ ద్వారా ప్రణాళిక సిద్ధం చేయించింది. చిన్నపిల్లల ఆటలకు అనువుగా పార్కులు, తాగునీటి వసతి, సేదతీరేందుకు గదులు, గార్డెన్స్, జిమ్‌లు, ఫిట్‌నెస్ సెంటర్లు, యోగా కేంద్రాలు, ప్రకృతి అందాలు వీక్షించేందుకు వాచ్ టవర్లు, సోలార్ షెడ్స్, లైట్లు ఇలా ఒక్కో ప్రాంతంలో 45 రకాల పనులకు రూ.2.78 కోట్ల చొప్పున అంచనాలతో గత ప్రభుత్వంలో ప్రతిపాదనలు పంపించారు. ఆసమయంలో ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడంతో ఆ ప్రతిపాదనలు బుట్టదాఖలయ్యాయి. స్థానిక ఎమ్మెల్యే మనసుపెట్టి పనులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.



రాయల కాలంలో నిర్మించిన కోనేరు



శిథిలమైన రంగనాయకుల స్వామి ఆలయం లోపలి భాగం

వెయ్యేళ్ల చరిత్ర



ఉదయగిరి దుర్గానికి వెయ్యేళ్ల చరిత్ర ఉంది. గత ఐదు దశాబ్దాలుగా ఉదయగిరి దుర్గాన్ని పర్యాటక కేంద్రంగా చేయాలని ఈప్రాంత ప్రజలు కోరుతున్నారు. ప్రభుత్వాలు పంపిన ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమవుతున్నాయి. ఉదయగిరిని పర్యాటక కేంద్రంగా అభివృద్ధిచేస్తే ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధిచెందుతుంది.

– ఎస్‌కె.ఎండీ.ఖాజా, చరిత్ర కారుడు, ఉదయగిరి

మద్యానికి డబ్బులివ్వలేదని.. తాతపై మనవడు దాడి

చికిత్స పొందుతూ మృతి



కృష్ణమూర్తి మృతదేహం

నెల్లూరు (క్రైమ్): మద్యానికి డబ్బులు ఇవ్వలేదని ఓ మనవడు తన తాతపై దాడి చేశాడు. గాయపడిన వృద్ధుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. పోలీసుల సమాచారం మేరకు.. బుజబుజనెల్లూరు రాజులవీధికి చెందిన విశ్రాంత సీఐఎస్ఎఫ్ హెడ్‌కానిస్టేబుల్ కృష్ణమూర్తి (68), వెంకట సుబ్బమ్మ దంపతులు. వారికి రవి కుమార్, విజయలక్ష్మి, గీతారాణి సంతానం. అందరికీ వివాహాలై వేర్వేరుగా జీవిస్తున్నారు. వెంకట సుబ్బమ్మ కొంతకాలం కిందట కాలం చేసింది. కృష్ణమూర్తి వలంటరీ రిటైర్‌మెంట్ తీసుకుని అదే ప్రాంతంలో ఉంటున్న చిన్న కుమార్తె గీతారాణి వద్ద ఉంటున్నాడు. ఆమె కుమారుడు అనిల్‌సాయి మద్యానికి బానిసై తరచూ తాత కృష్ణమూర్తిని డబ్బుల కోసం వేధించేవాడు. ఈ నెల ఐదో తేదీ రాత్రి మద్యం మత్తులో ఉన్న అనిల్‌సాయి మళ్లీ మద్యం తాగేందుకు నగదు ఇవ్వాలంటూ తాతపై ఒత్తిడి చేసినా ఆయన ఇవ్వలేదు. ఈ క్రమంలో బయటకు వెళ్తున్న కృష్ణమూర్తిపై వెనుక నుంచి అనిల్‌సాయి దాడి చేశాడు. దీంతో ఆయన ముందుకు పడి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన కుమార్తె, అల్లుడు, మరో మనుమడు భాస్కర్‌సాయి ఆయన్ను చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని చెప్పడంతో నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు సైతం అదే విషయాన్ని వెల్లడించడంతో తిరిగి జీజీహెచ్‌లో చేర్పించారు. చికిత్స పొందుతూ గురువారం కృష్ణమూర్తి మృతి చెందాడు. సమాచారం అందుకున్న మృతుడి కుమారుడు రవికుమార్ తన తండ్రి మృతికి కారకుడిపై చర్యలు తీసుకోవాలని వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

8, 9 తేదీల్లో హిందీ ప్రచార సభ పరీక్షలు

సాక్షి, అమరావతి: దక్షిణ భారత హిందీ ప్రచార సభ నిర్వహించే పరీక్షలు రాసేలా విద్యార్థులను ప్రోత్సహించాలని పాఠశాల విద్యాశాఖ... జిల్లా అధికారులను ఆదేశించింది. ఈనెల 8, 9 తేదీల్లో ప్రాథమిక్, మధ్యమ, రాష్ట్రభాష, ప్రవేశిక వరకు పరీక్షలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో పరీక్షల నిర్వహణకు విద్యాశాఖ సిబ్బంది సహకరించాలని ఆర్జేడీలు, డీఈవోలకు పాఠశాల విద్యాశాఖ సూచించింది. కాగా, పరీక్షలు భవిష్యత్‌లో హిందీ పండిట్ శిక్షణ, ఇతర హిందీ కోర్సులు చదివేందుకు ఉపయోగపడతాయి.

ఆధ్యాత్మిక సమాచారం

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 6 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 58,600 మంది స్వామివారిని దర్శించుకోగా 19,083 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.97 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది.

11న పెంచలకోనలో పుష్పయాగం



రాపూరు: శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా రాపూరు మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో శ్రీపెనుశిల లక్ష్మి నరసింహ స్వామి,ఆదిలక్ష్మిదేవి,చెంచు లక్ష్మిదేవిఅమ్మవార్లకు పుష్పయాగాన్ని 11వ తేది నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. మాఘ పౌర్ణమి సందర్భంగా పుష్పయాగం నిర్వహిస్తామన్నారు. ఉదయం స్వామిఅమ్మవార్లకు స్నపన తిరుమంజనం,రాత్రికి వివిధ రకాల పుష్పాలతో పుష్పయాగం,అనంతరం క్షేత్రోత్సవం జరుగుతుందన్నారు. 10వ తేది రాత్రి శ్రీవారి నిత్యకల్యాణ మండపంలో పుష్పయాగం విజయవంతం అయ్యేందుకు అంకురార్పణ జరుగుతుందని అధికారులు వివరించారు.

సామాన్య భక్తులకు ప్రాధాన్యమివ్వాలి

అమరావతి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అమరావతిలో వేంచేసియున్న శ్రీ బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి వారి దేవస్థానంలో మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా సామాన్య భక్తులకు ఇబ్బంది కలుగకుండా ఏర్పాట్లు చేయాలని సత్తెనపల్లి ఆర్డీవో రమణకాంతరెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం అమరేశ్వరాలయంలో మహాశివరాత్రి ఉత్సవాల మొదటి సమన్వయకమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 26వ తేదీ మహాశివరాత్రి, 27వ తేదీ రథోత్సవం ఉంటుందని, భక్తులు అమరావతి చేరుకోవటానికి గుంటూరు నుంచి ప్రతి 10నిముషాలకు ఒక బస్‌సర్వీస్ నడిపేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని ఆర్టీసీ అధికారులు తెలిపారు.

విద్యా సమాచారం

రేపు తిరుపతిలో జాబ్‌మేళా

తిరుపతి అర్బన్: తిరుపతి నగరం న్యూ బాలాజీ కాలనీలోని ఎమరాల్డ్స్ డిగ్రీ కళాశాలలో శనివారం ఉదయం 9గంటల నుంచి జై ఇన్ఫ్‌టెక్ సంస్థ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ జై గణేష్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏదైనా డిగ్రీతోపాటు బీటెక్, డిప్లొమా, ఐటీఐ చదువుకున్న 18–35 ఏళ్ల వయస్సు కల్గిన వారు అర్హులుగా పేర్కొన్నారు. యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జాబ్‌మేళా కార్యక్రమానికి పలు కంపెనీలకు చెందిన ప్రతినిధులు హాజరుకానున్నారని వెల్లడించారు. అదనపు సమాచారం కోసం 96763 76855, 90008 58008 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి తుడా: తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర వైద్య కళాశాల, రుయా ఆసుపత్రి, ప్రసూతి ఆసుపత్రి, శ్రీపద్మావతి నర్సింగ్ కళాశాల, ప్రభుత్వ స్కూల్ ఆఫ్ నర్సింగ్, ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఉద్యోగ నియామకాల కోసం నోటిఫికేషన్‌ను విడుదల చేసినట్లు ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పీఏ చంద్రశేఖరన్ ఒక ప్రకటనలో తెలిపారు. డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ ఆదేశాల మేరకు గురువారం నూతన నోటిఫికేషన్‌ను విడుదల చేశామన్నారు. ఉద్యోగాల వివరాలు, అర్హతల కోసం https://tirupati.ap.gov.in, ttps://chittoor.ap.gov.in, www.svmctpt.edu.in వెబ్‌సైట్లను సంప్రదించాలని కోరారు. అభ్యర్థులు దరఖాస్తులను ఈ నెల 22వ తేదీ సాయంత్రం 5గంటల్లోపు ఎస్వీ వైద్య కళాశాలలో అందజేయాలన్నారు.

కంప్యూటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ

తిరుపతి ఎడ్యుకేషన్: తిరుపతి కేటీ రోడ్డులోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కంప్యూటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై.ద్వారకనాథ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి, ఆపై విద్యార్హత ఉన్న వారు అర్హులని పేర్కొన్నారు. వివరాలకు 81435 76866, 99851 29995నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ప్రకృతి వ్యవసాయానికి ప్రోత్సాహం

రేణిగుంట: రైతులు ప్రకృతి వ్యవసాయ విధానాలను అవలంబించేలా ప్రోత్సహించాలని ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవసాయ విస్తరణ సంచాలకులు డాక్టర్ జి.శివనారాయణ అన్నారు. రాస్ కృషి విజ్ఞాన కేంద్రంలో గురువారం శాస్త్రీయ సలహా మండలి సమావేశంలో మాట్లాడారు.

గెట్... సెట్... గో

స్పోర్ట్స్ మూవీస్‌కి ఆడియన్స్‌లో స్పెషల్ క్రేజ్ ఉంటుంది. ఈ తరహా సినిమాలు ఏమాత్రం ఆడియన్స్‌కి కనెక్ట్ అయినా బాక్సాఫీస్ స్కోర్స్ (కలెక్షన్స్) కొత్త రికార్డులు సృష్టిస్తాయి. దీంతో వీలైనప్పుడల్లా స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్ మూవీస్ చేస్తుంటారు యాక్టర్స్. ఇలా ప్రస్తుతం సెట్స్‌లో 'గెట్..సెట్..గో' అంటూ సిల్వర్ స్క్రీన్ కోసం స్పోర్ట్స్ ఆడుతున్న కొందరు హీరోల గురించి తెలుసుకుందాం.


● సూర్య ● రామ్‌చరణ్ ● ధనుష్ ● అరుణ్ విజయ్ ● శర్వానంద్ ● కిరణ్ అబ్బవరం ● ఆర్య ● ధ్రువ్ విక్రమ్


● సిద్ధార్థ్ ● నయనతార ● మాధవన్

పెద్ది... ప్లే స్టార్ట్

'రచ్చ, ఆరెంజ్'... ఇలా కొన్ని సినిమాల్లో రామ్‌చరణ్ క్రికెట్ ఆడిన సన్నివేశాలు చాలా తక్కువ నిడివిలో కనిపిస్తాయి. కానీ 'పెద్ది' సినిమాలో మాత్రం ఫుల్ మ్యాచ్ ఆడనున్నారట రామ్‌చరణ్. 'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు దర్శకత్వంలో రామ్‌చరణ్ హీరోగా 'పెద్ది' (ప్రచారంలో ఉన్న టైటిల్) అనే మూవీ రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఈ పీరియాడికల్ స్పోర్ట్స్ డ్రామాలో రామ్‌చరణ్ క్రికెటర్‌గా నటిస్తున్నారనే టాక్ వినిపిస్తోంది. ఉత్తరాంధ్ర నేపథ్యంలో సాగే ఈ మూవీ తాజా షూటింగ్ షెడ్యూల్ హైదరాబాద్‌లో ముగిసింది. చివరి రోజు తన కుమార్తె క్లీంకారని సెట్స్‌కి తీసుకొచ్చారు రామ్‌చరణ్. అలాగే ఈ సినిమాలో క్రికెట్‌తో పాటు కబడ్డీ వంటి ఇతర స్పోర్ట్స్‌ల ప్రస్తావన కూడా ఉంటుందట. జాన్వీ కపూర్ హీరోయిన్‌గా చేస్తున్న ఈ మూవీలో దివ్యేందు, జగపతిబాబు, శివరాజ్‌కుమార్ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఏఆర్ రెహమాన్ ఈ సినిమాకు మ్యూజిక్ డైరెక్టర్. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్, వృద్ధి సినిమాస్ బ్యానర్స్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్న ఈ మూవీని ఈ దీపావళికి రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నారని తెలిసింది.

ఒక మ్యాచ్.... మూడు జీవితాలు!

మాధవన్, నయనతార, సిద్ధార్థ్ లీడ్ రోల్స్‌లో నటించిన స్పోర్ట్స్ డ్రామా 'టెస్ట్'. ఈ స్పోర్ట్స్ డ్రామా థ్రిల్లర్‌కి శశికాంత్ దర్శకత్వం వహించారు. తాజాగా ఈ మూవీ టీజర్ విడుదలైంది. ఈ చిత్రంలో క్రికెటర్‌గా నటించారు సిద్ధార్థ్. చక్రవర్తి రామచంద్రన్, శశికాంత్ నిర్మించిన ఈ మూవీ త్వరలోనే డైరెక్ట్‌గా నెట్‌ఫ్లిక్స్ ఓటీటీలో రిలీజ్ కానుంది. ఒక టెస్ట్ క్రికెట్ మ్యాచ్ ముగ్గురి జీవితాలను ఏ విధంగా ప్రభావితం చేసింది? అనే కోణంలో ఈ సినిమా కథనం ఉంటుందని కోలీవుడ్ సమాచారం. ఇక 2006లో వచ్చిన హిందీ చిత్రం 'రంగ్ దే బసంతి' తర్వాత మళ్లీ 18 సంవత్సరాల అనంతరం మాధవన్, సిద్ధార్థ్ కలిసి నటించిన చిత్రం ఇదే.

జల్లికట్టు నేపథ్యంలో...

తమిళనాడు సంప్రదాయ క్రీడ జల్లికట్టు. ఈ క్రీడ నేపథ్యంలో చాలా సినిమాలొచ్చాయి. కాగా సూర్య హీరోగా వెట్రిమారన్ దర్శకత్వంలో 'వాడి వాసల్' అనే పీరియాడికల్ యాక్షన్ మూవీ రానున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాను నాలుగు సంవత్సరాల క్రితమే ప్రకటించారు. కానీ వివిధ కారణాల వల్ల సెట్స్‌పైకి వెళ్లలేదు. దీంతో ఈ ఏడాది ఈ మూవీని సెట్స్‌పైకి తీసుకుని వెళ్లాలని సూర్య, వెట్రిమారన్ ప్లాన్ చేశారు. జనవరిలో సూర్య, వెట్రిమారన్, ఈ చిత్రనిర్మాత కలైపులి .ఎస్ థానుల మధ్య 'వాడి వాసల్' గురించిన చర్చలు కూడా జరిగాయి. ఇక ఎప్పట్నుంచో ఈ మూవీ ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి కాబట్టి, ఈ చిత్రం ఈ ఏడాదే సెట్స్‌పైకి వెళ్లనున్నట్లుగా తెలుస్తోంది. 'వాడి వాసల్' రెండు భాగాలుగా విడుదల కానుందని తెలిసింది.

రేస్ రాజా

హీరో శర్వానంద్ బైక్ రేసింగ్‌తో బిజీగా ఉన్నారు. శర్వానంద్ హీరోగా అభిలాష్ కంకర్ డైరెక్షన్‌లో 'రేజ్ రాజా' (ప్రచారంలో ఉన్న టైటిల్) అనే మూవీ రూపొందుతోంది. ఈ చిత్రంలో మోటారు బైకు రేసర్‌గా శర్వానంద్ నటిస్తున్నారు. 1990 నుంచి 2000ల మధ్య కాలంలో జరిగే ఈ స్పోర్ట్స్ మూవీలో మాళవికా నాయర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. యూవీ క్రియేషన్స్ సంస్థ ఈ సినిమాను నిర్మిస్తోంది. త్వరలోనే ఈ మూవీని రిలీజ్ చేయాలనుకుంటున్నారు మేకర్స్. ఇదిలా ఉంటే... స్పోర్ట్స్ డ్రామా జానర్‌లో సినిమాలు చేసిన అనుభవం శర్వానంద్‌కు ఉంది. 'మళ్ళీ మళ్లీ ఇది రాని రోజు (2015)' మూవీలో రన్నింగ్ రేసర్‌గా, 'పడి పడి లేచే మనసు (2018)' మూవీలో ఫుట్‌బాల్ ప్లేయర్‌గా శర్వానంద్ నటించి, మెప్పించిన సంగతి తెలిసిందే.

బాక్సింగ్ రౌండ్ 2

హీరో ఆర్య, దర్శకుడు పా. రంజిత్ కాంబినేషన్‌లో వచ్చిన పీరియాడికల్ స్పోర్ట్స్ డ్రామా 'సార్పట్టై పరంబర'. ఈ మూవీ 2021లో డైరెక్ట్‌గా ఓటీటీలో విడుదలై, వీక్షకుల మెప్పు పొందింది. దీంతో ఈ సినిమాకు సీక్వెల్‌గా 2023 మార్చిలో 'సార్పట్టై పరంబర రౌండ్ 2' అంటూ సీక్వెల్‌ను ప్రకటించారు. అయితే తొలి భాగం మాదిరి, రెండో భాగాన్ని ఓటీటీలో రిలీజ్ చేయకుండా థియేటర్స్‌లో రిలీజ్ చేయడానికి ప్రణాళికలు చేస్తున్నారు మేకర్స్.

కబడ్డీ... కబడ్డీ..

ధృవ్ విక్రమ్ హీరోగా చేస్తున్న మూవీ 'బైసన్: కాలమాడన్'. మారి సెల్వరాజ్ ఈ మూవీకి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంలో అనుపమా పరమేశ్వరన్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. కాగా, ఈ చిత్రంలో ధృవ్ విక్రమ్ కబడ్డీ ప్లేయర్‌గా నటిస్తున్నారని తెలిసింది. ఆల్రెడీ విడుదలైన ఈ సినిమా ఫస్ట్ లుక్ ఈ విషయాన్ని స్పష్టం చేస్తోంది. అలాగే కబడ్డీ ప్లేయర్‌గా కెరీర్‌ను మొదలుపెట్టి, రాజకీయ నాయకుడిగా మారిన మనత్తి పి. గణేశన్ జీవితం ఆధారంగా 'బైసన్' మూవీ రూపొందుతోందని కోలీవుడ్ సమాచారం. అప్లాజ్ ఎంటర్‌టైన్మెంట్, నీలం ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న ఈ మూవీ ఈ ఏడాదే విడుదల కానుంది.

మరోసారి బాక్సింగ్

ధనుష్ మెయిన్ లీడ్ రోల్‌లో నటిస్తూ, దర్శకత్వం వహిస్తున్న తమిళ చిత్రం 'ఇడ్లీ కడై'. ఈ మూవీలో అరుణ్ విజయ్ మరో లీడ్ రోల్‌లో నటిస్తున్నారు. ఈ చిత్రంలో అరుణ్ విజయ్ ఓ బాక్సర్ రోల్ చేస్తున్నారు. కాగా అరుణ్ విజయ్ బాక్సర్‌గా కనిపించడం ఇదే తొలిసారి కాదు. గతంలో 'బాక్సర్' అనే మూవీలో అరుణ్ విజయ్ బాక్సర్‌గా నటించారు. అయితే 'బాక్సర్' కంప్లీట్ స్పోర్ట్స్ ఫిల్మ్ కాగా, 'ఇడ్లీ కడై' మాత్రం స్పోర్ట్స్‌తో పాటు ఫ్యామిలీ ఎమోషన్స్ కూడా ఉన్న మూవీ. ధనుష్, ఆకాష్ భాస్కరన్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఏప్రిల్ 10న రిలీజ్ కా నుంది. నిత్యామీనన్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ మూవీలో షాలినీ పాండే, సత్యరాజ్ ఇతర లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు.

కె-ర్యాంప్

'క' వంటి సక్సెస్‌ఫుల్ మూవీ తర్వాత కిరణ్ అబ్బవరం హీరోగా నటిస్తున్న చిత్రం 'కె-ర్యాంప్'. ఈ చిత్రం టైటిల్ లోగోలో ఓ వ్యక్తి ఫుట్‌బాల్ ఆడుతున్నట్లుగా కనిపిస్తోంది. దీన్ని బట్టి ఇది స్పోర్ట్స్ డ్రామా మూవీ అని ఊహించవచ్చు. జైన్స్ నాని దర్శకత్వంలో రాజేశ్ దండ నిర్మిస్తున్న ఈ మూవీ చిత్రీకరణ త్వరలోనే ప్రారంభం కానుంది. యుక్తీ తరేజా హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో వీకే నరేశ్, 'వెన్నెల' కిశోర్ ఇతర ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు.

ఇలా స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌లో రూపొందతున్న చిత్రాలు మరికొన్ని ఉన్నాయి.

– ముసిమి శివాంజనేయులు

కందిపోయిన సుందరి

ఎండ తాకిడిని లెక్క చేయకుండా షూటింగ్‌లో పాల్గొంటున్నారు జాన్వీ కపూర్. సిద్ధార్థ్ మల్హోత్రా, జాన్వీ కపూర్ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న హిందీ చిత్రం 'పరమ్ సుందరి'. ఈ రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ మూవీకి తుషార్ జలోటా దర్శకత్వం వహిస్తున్నారు. ఇటీవల ఈ సినిమా చిత్రీకరణ కేరళలో ప్రారంభమైంది.



సిద్ధార్థ్, జాన్వీలతో పాటు ప్రధాన తారాగణం పాల్గొంటున్న ఈ షెడ్యూల్‌లో కీలక సన్నివేశాల చిత్రీకరణ జరుగుతోంది. అయితే అక్కడి లొకేషన్స్‌లో తీవ్రమైన ఎండ ప్రభావం కారణంగా తన చర్మం కందిపోయినట్లుగా సోషల్ మీడియాలో 'బర్న్ట్స్' అంటూ ఓ ఫొటోను షేర్ చేశారు జాన్వీ కపూర్. ఈ ఫోటోను బట్టి ఈ సినిమా కోసం జాన్వీ కపూర్ తీవ్రమైన ఎండ వేడిమిని కూడా తట్టుకుంటూ షూటింగ్‌లో పాల్గొంటున్నట్లుగా తెలుస్తోంది. దీంతో మా సుందరి కందిపోయిందన్నట్లుగా కొందరు నెటిజన్లు, ఆమె అభిమానులు సోషల్ మీడియాలో కామెంట్స్ చేస్తున్నారు. ఇక ఈ చిత్రంలో నార్త్ అబ్బాయి పరమ్‌గా సిద్ధార్థ్ మల్హోత్రా, సౌత్ అమ్మాయి సుందరిగా జాన్వీ కపూర్ నటిస్తున్నారు. ఈ మూవీ జూలై 25న విడుదల కానుంది.


● జాన్వీ కపూర్

థ్రిల్లింగ్ శబ్దం

'వైశాలి' వంటి సూపర్ హిట్ మూవీ తర్వాత హీరో ఆది పినిశెట్టి, దర్శకుడు అరివళగన్ కాంబినేషన్‌లో రూపొందిన ద్వితీయ చిత్రం 'శబ్దం'. లక్ష్మీ మీనన్ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రంలో సిమ్రాన్, లైలా, రాజీవ్ మీనన్ తదితరులు ఇతర పాత్రలు పోషించారు. తెలుగు, తమిళ భాషల్లో శివ నిర్మించారు. ఈ నెల 28న తెలుగు, తమిళ, కన్నడ, హిందీ భాషల్లో ఈ చిత్రాన్ని రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించారు. తెలుగులో ఎన్ సినిమాస్ ద్వారా రిలీజ్ అవుతోంది. ''సూపర్ నేచురల్ క్రైమ్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రం 'శబ్దం'. తమన్ అద్భుతమైన సంగీతం అందించారు. ప్రేక్షకులు గొప్ప సినిమాటిక్ అనుభవాన్ని పొందేలా విజువల్ ఎఫెక్ట్స్, సౌండ్ ఎఫెక్ట్స్ ఉంటాయి'' అని చిత్రయూనిట్ పేర్కొంది.


● ఆది పినిశెట్టి

న్యాయం కోసం...


● జ్యోతిక


● సోనాక్షీ సిన్హా

జ్యోతిక, సోనాక్షీ సిన్హా ఓ కేసు విషయంలో కోర్టుకు హాజరు కానున్నారు. కానీ ఇది రియల్ కేసు కాదు... రీల్ కేసు. ఇంతకీ విషయం ఏంటంటే... బాలీవుడ్ దర్శకురాలు అశ్వనీ అయ్యర్ తివారి ఓ కోర్టు రూమ్ డ్రామాను తెరకెక్కించనున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ దాదాపు పూర్తయ్యాయి. అతి త్వరలోనే ఈ సినిమా చిత్రీకరణను ముంబైలో ప్రారంభించాలనుకుంటున్నారు. ఈ చిత్రంలో జ్యోతిక, సోనాక్షీ సిన్హా లీడ్ రోల్స్‌లో నటించనున్నారని సమాచారం. అయితే ఈ ఇద్దరి హీరోయిన్స్‌లో లాయర్‌గా నటించేది ఎవరు? న్యాయం కోసం పోరాడేది ఎవరు? అనే అంశాలపై మాత్రం ఓ క్లారిటీ రావాల్సి ఉంది. మరోవైపు ఈ సినిమాకు ముందుగా కరీనా కపూర్, కియారా అద్వానీలను అనుకున్నారని, ఫైనల్‌గా జ్యోతిక, సోనాక్షిలు ఫైనల్ అయ్యారని బాలీవుడ్ టాక్.

స్పెషల్ సాంగ్?

'దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలి' అనే సామెత చిత్ర పరిశ్రమలో బాగా వినిపిస్తుంటుంది. ఈ విషయంలో హీరోయిన్లు ఎప్పుడూ ముందుంటారు. ఓ వైపు హీరోకి జోడీగా నటించి, ప్రేక్షకులను అలరిస్తూనే.. మరోవైపు స్పెషల్ సాంగ్స్‌లో నటించేందుకు పలువురు కథానాయికలు పచ్చజెండా ఊపుతుంటారు. ఇప్పటికే సమంత, తమన్నా, కాజల్ అగర్వాల్, పూజా హెగ్డే, శ్రుతీ హాసన్, శ్రీలీల, రెజీనా, ఫరియా అబ్దుల్లా వంటి పలువురు కథానాయికలు ప్రత్యేక పాటల్లో చిందేశారు. తాజాగా ఈ జాబితాలో హీరోయిన్ కృతీ శెట్టి కూడా చేరనున్నారని బాలీవుడ్ టాక్. 'ఉప్పెన' సినిమాతో తెలుగు చిత్ర పరిశ్రమలో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చిన ఈ బ్యూటీ బేబమ్మగా అభిమానుల మనసులో స్థానం సంపాదించుకున్నారు. తొలి సినిమాతోనే వంద కోట్ల క్లబ్‌లో చేరిన హీరోయిన్‌గా పేరు తెచ్చుకున్న ఈ కన్నడ బ్యూటీ 'శ్యామ్ సింగరాయ్, బంగార్రాజు, ది వారియర్, మాచర్ల నియోజక వర్గం, కస్టడీ, మనమే' వంటి పలు తెలుగు చిత్రాల్లో నటించి, ప్రేక్షకులను మెప్పించారు. 2024 జూన్ 7న విడుదలైన 'మనమే' సినిమా తర్వాత కృతీ శెట్టి తెలుగులో ఏ సినిమా కూడా కమిట్ కాలేదు. అయితే తమిళ చిత్రాలతో మాత్రం ఫుల్ బిజీగా ఉన్నారామె. ఇదిలా ఉంటే.. కృతీ శెట్టి బాలీవుడ్‌లో ఓ స్పెషల్ సాంగ్ చేయనున్నారని టాక్. అద్భుతమైన డ్యాన్స్ చేయడంలో ఆమెకు మంచి పేరుంది. అందుకేనేమో... ప్రత్యేక పాటలో మెరిసేందుకు సై అన్నారని టాక్. అయితే ఆమె ఏ సినిమాలో స్పెషల్ సాంగ్ చేయనున్నారు? ఇందులో వాస్తవం ఎంత? అనే విషయాలపై స్పష్టత రావాలంటే మరి కొన్ని రోజులు వేచి చూడాలి.


● కృతీశెట్టి

బిజినెస్ రీల్

ఎటర్నల్‌గా జొమాటో పేరు మార్పు



న్యూఢిల్లీ: ఆహార, నిత్యావసరాల డెలివరీ సంస్థ జొమాటో పేరు ఎటర్నల్‌గా మారింది. అయితే, యాప్‌తో పాటు ఫుడ్ డెలివరీ వ్యాపారం బ్రాండ్ పేరు ఇకపైనా జొమాటోగానే కొనసాగనుంది. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనకు బోర్డు ఆమోదముద్ర వేసినట్లు షేర్‌హోల్డర్లకు రాసిన లేఖలో కంపెనీ వ్యవస్థాపకుడు, సీఈవో దీపిందర్ గోయల్ తెలిపారు. ఎటర్నల్ కింద జొమాటో, బ్లింకిట్, డిస్ట్రిక్ట్, హైపర్‌ప్యూర్ అని నాలుగు ప్రధాన వ్యాపారాలు ఉంటాయని ఆయన వివరించారు. పేరు మార్పునకు షేర్‌హోల్డర్లు, కార్పొరేట్ వ్యవహారాల శాఖ, ఇతరత్రా నియంత్రణ సంస్థల నుంచి ఆమోదం రావాల్సి ఉందని గోయల్ తెలిపారు.

హెన్లియస్‌తో రెడ్డీస్ జోడీ

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: అభివృద్ధి దశలో ఉన్న క్యాన్సర్ ఔషధాన్ని తదుపరి అభివృద్ధి, వాణిజ్యీకరించడానికి బయోటెక్ సంస్థ షాంఘై హెన్లియస్ బయోటెక్‌తో తమ అనుబంధ కంపెనీ లైసెన్స్ ఒప్పందాన్ని కుదుర్చుకుందని డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్ తెలిపింది. ఒప్పందంలో భాగంగా ఔషధం అభివృద్ధి, తయారీ, వాణిజ్య సరఫరాకు హెన్లియస్ బాధ్యత వహిస్తుంది. అలాగే ఈ కంపెనీ 131.6 మిలియన్ డాలర్ల వరకు చెల్లింపులను అందుకోవచ్చని రెడ్డీస్ గురువారం తెలిపింది.

ఎంటీఏఆర్‌కు రూ.200 కోట్ల కాంట్రాక్ట్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: రక్షణ రంగ పరికరాల తయారీలో ఉన్న ఎంటీఏఆర్ టెక్నాలజీస్ తాజాగా రూ.200 కోట్ల విలువైన ఆర్డర్లను దక్కించుకుంది. క్లీన్ ఎనర్జీ–ఫ్యూయల్ సెల్స్, సివిల్ న్యూక్లియర్ పవర్, ఎంఎస్‌సీ ఏరోస్పేస్, స్పేస్ విభాగాలు వీటిని పొందినట్టు కంపెనీ తెలిపింది. చాలా ఆర్డర్లు 2025–26 చివరి నాటికి పూర్తి అవుతాయని వివరించింది.

ఆకాశ ఎయిర్‌లో ప్రేమ్‌జీ ఫ్యామిలీ ఆఫీసు పెట్టుబడులు

న్యూఢిల్లీ: టెక్ దిగ్గజం అజీం ప్రేమ్‌జీ, మణిపాల్ గ్రూప్ చీఫ్ రంజన్ పాయ్‌లకు చెందిన ఫ్యామిలీ ఆఫీసులు తాజాగా విమానయాన సంస్థ ఆకాశ ఎయిర్‌లో ఇన్వెస్ట్ చేశాయి. ఇందుకు సంబంధించి క్లేపాండ్ క్యాపిటల్ (రంజన్ పాయ్), ప్రేమ్‌జీ ఇన్వెస్ట్, అసెట్ మేనేజ్‌మెంట్ సంస్థ 360 వన్ అసెట్ తదితర ఇన్వెస్టర్ల కన్సార్షియంతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఆకాశ ఎయిర్ వెల్లడించింది. ప్రమోటరు ఝున్‌ఝున్‌వాలా కుటుంబం కూడా మరింతగా మూలధనం సమకూర్చనున్నట్లు వివరించింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్‌-నెక్ / 100కు రూ.లలో)

7-2-2025

విశాఖ	470-00
చిత్తూరు	493-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	452-00
విజయవాడ	500-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	440-00
వరంగల్	442-00
రిటైల్ ధర	5.00

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
CIPLA	1,472.80	2.51
ADANIPORTS	1,166.10	1.9
ITCHOTELS	171.5	1.77
DRREDDY	1,240.00	1.01
HDFCLIFE	634	0.98

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
TRENT	5,268.00	-8.38
BEL	280.05	-3.08
BHARTIARTL	1,621.90	-2.32
TITAN	3,413.00	-2.23
ONGC	256.45	-1.99

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	4,825
ఎన్ఎస్ఈ	90,769
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,50,774
ఎఫ్ఐఐ	- 3.550
డీఐఐ	+ 2,721

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	70.69 (రాత్రి 11.30కి)	$ 71.03
బ్రెంట్	74.36 (రాత్రి 11.30కి)	$ 74.61

కొత్తగా మరో 2,835 విమానాలు

- భారత్, దక్షిణాసియాలో డిమాండ్
- బోయింగ్ తాజా నివేదికలో వెల్లడి

న్యూఢిల్లీ: విమాన ప్రయాణానికి నానాటికీ పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చడానికి.. వచ్చే 20 ఏళ్లలో భారత్, దక్షిణాసియాలోని పౌర విమానయాన సంస్థలు కొత్తగా 2,835 విమానాలను సమకూర్చుకునే అవకాశం ఉందని యూఎస్‌కు చెందిన విమానాల తయారీ దిగ్గజం బోయింగ్ వెల్లడించింది. గురువారం విడుదల చేసిన కమర్షియల్ మార్కెట్ ఔట్‌లుక్ ప్రకారం.. భారత బలమైన ఆర్థిక వ్యవస్థ, వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశీయ మార్కెట్ మద్దతు, 2043 నాటికి ఏటా 7 శాతం కంటే వార్షిక ట్రాఫిక్ వృద్ధి ఇందుకు దోహదం చేయనుంది. అలాగే మెరుగైన కనెక్టివిటీ, విమాన రంగానికి మద్దతు ఇచ్చే విధానాలు వృద్ధికి ఆజ్యం పోస్తాయి. భారత ట్రావెల్ మార్కెట్‌లో అతిపెద్ద, అభివృద్ధి చెందుతున్న సెగ్మెంట్‌గా దేశీయ విమాన ట్రాఫిక్ ఉంటుంది.

లో–కాస్ట్ ఎయిర్‌లైన్స్ మరిన్ని కొత్త మార్గాలకు చేరుకోవడంతోపాటు, నూతన గమ్యస్థానాలను అనుసంధానిస్తాయి. అలాగే కార్గో విమానాల సంఖ్య అయిదింతలకు పెరుగుతుంది. అంతర్జాతీయంగా సరఫరా విస్తరణ, తయారీ, ఈ–కామర్స్ రంగం జోరు ఇందుకు కారణం.

ప్రపంచంలోనే అత్యంత వేగంగా..

బలమైన ఆర్థిక వ్యవస్థ, వాణిజ్య వృద్ధి, పెరుగుతున్న గృహ ఆదాయాలు, మౌలిక సదుపాయాలు, అభివృద్ధిలో పెట్టుబడులు.. వెరసి భారత్, దక్షిణాసియా ప్రాంతం ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న వాణిజ్య విమానయాన మార్కెట్‌గా కొనసాగుతోందని బోయింగ్ భారత్, దక్షిణాసియా కమర్షియల్ మార్కెటింగ్ ఎండీ అశ్విన్ నాయుడు తెలిపారు.

'ప్రజలకు విమాన ప్రయాణం ఎక్కువ అందుబాటులో వస్తుంది. రాబోయే రెండు దశాబ్దాలలో పెరిగిన డిమాండ్‌ను తీర్చడానికి ఈ ప్రాంతంలోని విమానయాన సంస్థలకు ఇంధనాన్ని సమర్థవంతంగా వినియోగించే ఆధునిక విమానాల అవసరం. వీటిలో న్యారో బాడీ విభాగంలో 2,445, వైడ్ బాడీ సెగ్మెంట్‌లో 370 విమానాలకు డిమాండ్ ఉండొచ్చు. పైలట్లు, క్యాబిన్ సిబ్బంది, టెక్నీషియన్ల డిమాండ్ నాలుగు రెట్లు పెరిగి 1,29,000కి చేరుతుంది' అని చెప్పారు.



వడ్డీ రేట్ల తగ్గింపుతో ఇళ్లకు డిమాండ్

- పావు శాతం అయినా తగ్గించాలి
- రియల్టర్ల మండలి నరెడ్కో వినతి



న్యూఢిల్లీ: దేశంలో ఇళ్లకు (హౌసింగ్) డిమాండ్‌ను పెంచేందుకు ఆర్‌బీఐ రెపో రేటును కనీసం 0.25 శాతం నుంచి 0.30 శాతం వరకు అయినా తగ్గించాలని రియల్టర్ల మండలి నరెడ్కో డిమాండ్ చేసింది. ''రియల్టీ రంగం బలమైన వృద్ధి, సానుకూల సెంటిమెంట్‌ను చూస్తోంది. రెపో రేటును కొంత మేర తగ్గించడం ద్వారా దీన్ని బలోపేతం చేయవచ్చు. 25–30 బేసిస్ పాయింట్లను తగ్గించాలి. ఇది రియల్ ఎస్టేట్ మార్కెట్‌కు ఉత్సాహం ఇవ్వడమే కాకుండా, అనుబంధ రంగాలైన నిర్మాణం, సిమెంట్, స్టీల్‌కు కూడా ప్రయోజనం కల్పించినట్టు అవుతుంది''అని నరెడ్కో ప్రెసిడెంట్ జి.హరిబాబు తెలిపారు. ఆర్‌బీఐ ఎంపీసీ కీలక వడ్డీ రేట్లపై తన నిర్ణయాలను శుక్రవారం వెల్లడించనున్న నేపథ్యంలో నరెడ్కో ఈ సూచనలు చేయడం గమనార్హం. ''వడ్డీ రేట్ల తగ్గింపుతో టైర్–2, 3 పట్టణాల్లో అందుబాటు ధరల ఇళ్లకు ఎక్కువగా ప్రయోజనం కలుగుతుంది. సమ్మిళిత వృద్ధి, పట్టణాభివృద్ధి పట్ల ప్రభుత్వ ప్రణాళికలకు మద్దతునిస్తుంది. రేట్ల తగ్గింపుతో డెవలపర్లు, ఇళ్ల కొనుగోలుదారులకు తోడ్పాటు, పెట్టుబడులకు ప్రోత్సాహం లభిస్తుంది, లిక్విడిటీ మెరుగుపడుతుంది. దీంతో ప్రస్తుత ప్రాజెక్టుల నిర్మాణాన్ని డెవలపర్లు వేగవంతం చేయడంతో పాటు కొత్తవి ప్రారంభించేందుకు ఉత్సాహం వస్తుంది''అని హరిబాబు తెలిపారు. రెపో రేటు తగ్గింపుతో అన్ని ప్రాంతాల్లో స్థిరమైన వృద్ధి సాధ్యపడుతుందన్నారు.

కచ్చితంగా ప్రయోజనమే..

వడ్డీ రేట్ల తగ్గింపుతో రియల్ ఎస్టేట్ రంగానికి ప్రయోజనం దక్కుతుందని, రుణాల ధరలు దిగొస్తాయని, దిగువ, మధ్యాదాయ వర్గాల్లో సానుకూల సెంటిమెంట్ ఏర్పడుతుందని నైట్‌ఫ్రాంక్ సీఎండీ శిశిర్ బైజాల్ సైతం అభిప్రాయం వ్యక్తం చేశారు. ''రేట్ల తగ్గింపుతో బ్యాంకింగ్ వ్యవస్థలో లిక్విడిటీ మెరుగుపడుతుంది. దీంతో డెవలపర్లు తమ ప్రాజెక్టుల కోసం రుణాలు సులభంగా పొందగలరు''అని ఆయన చెప్పారు. వినియోగ వృద్ధికి బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి చేపట్టిన చర్యలకు మద్దతుగా, ఆర్‌బీఐ వడ్డీ రేట్లు తగ్గించాలని బీసీడీ గ్రూప్ సీఎండీ అంగద్ బేడి కోరారు.

హెక్సావేర్ టెక్నాలజీస్ ఐపీవో 12న

- ధర శ్రేణి రూ. 674–708
- రూ. 8,750 కోట్ల ఇష్యూ



న్యూఢిల్లీ: డిజిటల్, టెక్నాలజీ సర్వీసుల సంస్థ హెక్సావేర్ టెక్నాలజీస్ ప్రతిపాదిత పబ్లిక్ ఆఫర్ (ఐపీవో) ఫిబ్రవరి 12న ప్రారంభమై 14న ముగియనుంది. షేరు ధర శ్రేణి రూ. 674–708గా ఉంటుంది. పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) విధానంలో ఉండే ఈ ఇష్యూ కింద ప్రమోటరు సీఏ మాగ్నమ్ హోల్డింగ్స్ రూ. 8,750 కోట్ల విలువ చేసే షేర్లను విక్రయించనుంది. ప్రైవేట్ ఈక్విటీ దిగ్గజం కార్లైల్ గ్రూప్‌లో భాగమైన మ్యాగ్నంకు ప్రస్తుతం కంపెనీలో 95.03 శాతం వాటాలు ఉన్నాయి. అప్పర్ ప్రైస్ బ్యాండ్ ప్రకారం చూస్తే హెక్సావేర్ విలువ రూ. 43,000 కోట్లుగా ఉంటుంది. ఐటీ సర్వీసుల రంగంలో దాదాపు రెండు దశాబ్దాల తర్వాత ఇది భారీ ఐపీవో కానుంది. అప్పట్లో టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ రూ. 4,700 కోట్లు సమీకరించింది. హెక్సావేర్ ప్రధానంగా డేటా..ఏఐ, క్లౌడ్ సర్వీసులు తదితర అయిదు రకాల సేవలు అందిస్తోంది. కంపెనీని గత ప్రమోటరు బేరింగ్ ప్రైవేట్ ఈక్విటీ ఏషియా 2020లో డీలిస్ట్ చేసింది. దాదాపు సంవత్సరం తర్వాత 2021లో హెక్సావేర్‌లో బేరింగ్ వాటాలను కార్లైల్ గ్రూప్ కొనుగోలు చేసింది. 2024 సెప్టెంబర్‌తో ముగిసిన తొమ్మిది నెలల వ్యవధిలో కంపెనీ నికర లాభం రూ. 853 కోట్లు.

ల్యాండ్‌లైన్ యూజర్లకు కొత్త నంబరింగ్ సిస్టం: ట్రాయ్



న్యూఢిల్లీ: వినియోగంలో లేని ఫోన్ నంబర్లను కూడా అందుబాటులోకి తెచ్చే దిశగా టెలికం రంగ నియంత్రణ సంస్థ ట్రాయ్.. కేంద్రానికి సిఫార్సులు చేసింది. వీటి ప్రకారం కొత్త నంబర్ సిస్టం కోడ్ ఇకపై టెలికం సర్కిల్ లేదా రాష్ట్ర స్థాయిలో ఉంటుంది. ల్యాండ్‌లైన్ యూజర్లు మరో ల్యాండ్‌లైన్ యూజరుకు కాల్ చేయాలంటే మొత్తం పది అంకెలు డయల్ చేయాల్సి వస్తుంది. ముందుగా సున్నాను, తర్వాత ఎస్‌టీడీ కోడ్, ఆ తర్వాత ఫోన్ నంబరును డయల్ చేయాల్సి ఉంటుంది. ఒకే ఎస్‌డీసీఏలో (షార్ట్ డిస్టెన్స్ చార్జింగ్ ఏరియా) లోకల్ కాల్ చేయాలన్నా ముందుగా సున్నాను జోడించి, ఎస్‌డీసీఏ కోడ్, ఆతర్వాత యూజరు నంబరును డయల్ చేయాలి. కొత్త నంబరింగ్ విధానం వల్ల ప్రస్తుత యూజర్ల నంబర్లలో ఎలాంటి మార్పు ఉండదని ట్రాయ్ తెలిపింది. నూతన విధానాన్ని అమల్లోకి తెచ్చేందుకు టెలికం ఆపరేటర్లకు 6 నెలల వ్యవధినివ్వాలని టెలికం శాఖకు సూచించింది.

ఈపీఎఫ్‌వో రూ.2 లక్షల కోట్ల క్లెయిమ్‌లు

- 2024–25లో 5 కోట్ల దరఖాస్తులకు ఆమోదం
- కార్మిక శాఖ ప్రకటన



న్యూఢిల్లీ: ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ (ఈపీఎఫ్‌వో) సభ్యుల క్లెయిమ్‌ల పరిష్కారంలో కొత్త రికార్డులకు చేరుకుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సభ్యులకు సంబంధించి రూ.2,05,932 కోట్ల విలువైన క్లెయిమ్‌లను ఈపీఎఫ్‌వో ఆమోదించినట్టు కేంద్ర కార్మిక శాఖ ప్రకటించింది. మొత్తం పరిష్కరించిన క్లెయిమ్‌ల సంఖ్య 5.08 కోట్లను చేరుకున్నట్టు తెలిపింది. ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు మరో రెండు నెలలు మిగిలి ఉండగా, అప్పుడే గతేడాది క్లెయిమ్ గణాంకాలను ఈ ఏడాది అధిగమించడం గమనార్హం. 2023–24 ఆర్థిక సంవత్సరం మొత్తం మీద 4.45 కోట్ల క్లెయిమ్‌లకు గాను చేసిన చెల్లింపులు రూ.1,82,838 కోట్లుగా ఉన్నాయి. క్లెయిమ్ పరిష్కారాల ప్రక్రియ పురోగతికి, ఫిర్యాదుల పరిష్కారం దిశగా ఈపీఎఫ్‌వో చేపట్టిన సంస్కరణల వల్లే ఈ ఘనత సాధించినట్టు కేంద్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి మనుసుఖ్ మాండవీయ తెలిపారు. క్లెయిమ్‌లను ఆటోమేటిగ్గా పరిష్కరించడం, సభ్యుల ప్రొఫైల్ మార్పులను సులభతరం చేయడం, పీఎఫ్ సొమ్ము బదిలీకి వీలు కల్పించడం వంటి చర్యలను మంత్రి ప్రస్తావించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆటో క్లెయిమ్ పరిష్కారాలు రెట్టింపై 1.87 కోట్లుగా ఉన్నట్టు చెప్పారు. గత ఆర్థిక సంవత్సరంలో ఆటో క్లెయిమ్ పరిష్కారాలు 89.52 లక్షలుగా ఉన్నాయి.

లాజిస్టిక్స్‌లో టాప్-25లో భారత్

- 2030 నాటికి చేరుకుంటుంది
- ఫలితమిస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలు
- పీఎం గతిశక్తి, నేషనల్ లాజిస్టిక్స్ పాలసీ దన్ను
- అధ్యయన నివేదిక వెల్లడి



న్యూఢిల్లీ: వేగవంతమైన వస్తు రవాణా, వ్యయాల తగ్గింపునకు వీలుగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన పీఎం గతిశక్తి, నేషనల్ లాజిస్టిక్స్ పాలసీల మద్దతుతో రవాణా రంగ విషయంలో ప్రపంచవ్యాప్తంగా భారత్ స్థానం మెరుగుపడనుంది. 'ప్రపంచ బ్యాంక్ లాజిస్టిక్స్ పనితీరు సూచిక'లో 2030 నాటికి భారత్ టాప్–25 దేశాల్లో ఒకటిగా ఉంటుందని ఒక అధ్యయనం అంచనా వేసింది. ఈవైసీ ఇంటర్నేషనల్ కన్సల్టింగ్ సాయంతో మెస్సే స్టట్‌గార్ట్ ఇండియా (అంతర్జాతీయ ప్రదర్శన సంస్థ) అధ్యయనం నిర్వహించి, ఒక నివేదిక విడుదల చేసింది. ఈ నెల 13–15 మధ్య ముంబైలో అంతర్జాతీయ లాజిస్టిక్స్ ఎగ్జిబిషన్ 'లాగిమ్యాట్ ఇండియా 2025' సదస్సుకు ముందు దీన్ని విడుదల చేయడం గమనార్హం. ప్రపంచ బ్యాంక్ లాజిస్టిక్స్ పనితీరు సూచీలో (ఎల్‌పీఐ) 139 దేశాలకు గాను భారత్ ప్రస్తుతం 38వ స్థానంలో ఉండగా, 2030 నాటికి టాప్–25లో చేరాలన్న లక్ష్యాన్ని కేంద్ర ప్రభుత్వం విధించుకుంది. పీఎం గతిశక్తి, నేషనల్ లాజిస్టిక్స్ పాలసీ కార్యక్రమాలతో పెద్ద ఎత్తున రవాణా వసతుల అభివృద్ధిని చేపట్టడం ఈ లక్ష్యం సాధనకు ఉపకరిస్తుందని ఈ నివేదిక అంచనా వేసింది.

నివేదికలోని అంశాలు..

- భారత ఫ్రైట్, లాజిస్టిక్స్ మార్కెట్ ఏటా 8.8 శాతం చొప్పున వృద్ధి చెందుతూ 2029 నాటికి 484.43 బిలియన్ డాలర్లకు చేరుకోనుంది. 2024 నాటికి ఇది 317.26 బిలియన్ డాలర్లుగా ఉంది.
- అంతర్జాతీయ లాజిస్టిక్స్ కేంద్రంగా మారే విషయంలో భారత్ చాలా వేగంగా అడుగులు వేస్తోంది.
- ప్రస్తుతం భారత్‌లో లాజిస్టిక్స్ వ్యయాలు జీడీపీలో 13–14 శాతంగా ఉండగా, 2030 నాటికి ఒక అంకెకు తగ్గించాలన్నది ప్రభుత్వం లక్ష్యం. మౌలిక వసతులను ఇతోధికం చేయడం, సరఫరా వ్యవస్థను బలోపేతం చేయడం ద్వారా దీన్ని సాధించాలనుకుంటోంది.
- హైస్పీడ్ రహదారులు, హైపర్‌లూప్‌లు, కొత్త విమానాశ్రయాలు.. ఇలా బహుళ నమూనాల ద్వారా రవాణా సమయాన్ని 66 శాతం తగ్గించి, లాజిస్టిక్స్ పోటీతత్వాన్ని పెంచాలన్న లక్ష్యంతో ఉంది.
- జపాన్‌ను అధిగమించి 2026 నాటికి నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ చేరనున్నట్టు అంచనాలున్నాయి. ఇందుకు పీఎం గతిశక్తి, నేషనల్ లాజిస్టిక్స్ పాలసీ తదితర బలమైన విధానాల మద్దతు అవసరం ఎంతో ఉంది.
- పీఎం గతిశక్తి కింద కేంద్రం రూ.11.17 లక్షల కోట్లతో 434 ప్రాజెక్టులను చేపట్టింది. తద్వారా లాజిస్టిక్స్ సామర్థ్యాలను పెంచే లక్ష్యంతో ఉంది.

ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యం అవసరం..

''వినూత్నమైన పరిష్కారాలు, అత్యాధునిక టెక్నాలజీతో మౌలిక సదుపాయాల పరంగా అంతరం తొలగించడం ద్వారా అంతర్జాతీయ లాజిస్టిక్స్ దిగ్గజంగా భారత్ అవతరించొచ్చు. ఇందుకు ప్రభుత్వం, ప్రైవేటు రంగం సమన్వయంతో కలసి పనిచేయడం ఎంతో అవసరం''అని ఈ నివేదిక సూచించింది.

క్యూ3 ఫలితాలు

ఐటీసీ లాభం డీలా రూ. 5,013 కోట్లు



న్యూఢిల్లీ: డైవర్సిఫైడ్ దిగ్గజం ఐటీసీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024–25) మూడో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 7 శాతం క్షీణించి రూ. 5,103 కోట్లకు పరిమితమైంది. గతేడాది(2023–24) ఇదే కాలంలో కేవలం రూ. 5,407 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం 8 శాతంపైగా బలపడి రూ. 20,946 కోట్లను తాకింది. గత క్యూ3లో రూ. 19,309 కోట్ల టర్నోవర్ అందుకుంది. అయితే మొత్తం వ్యయాలు సైతం 12 శాతం పెరిగి రూ. 14,414 కోట్లకు చేరాయి. కాగా.. రెడీ టు కుక్ ఫుడ్స్ విభాగంలోని ప్రసూమాలో 100 శాతం వాటా కొనుగోలు చేయనున్నట్లు ఐటీసీ పేర్కొంది. ఇందుకు తప్పనిసరి ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు తెలియజేసింది. తొలుత 62.5 శాతం వాటాకుగాను రూ. 187 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నట్లు వెల్లడించింది. తదుపరి మూడేళ్లలో దశలవారీగా మిగిలిన 37.5 శాతం వాటాను సొంతం చేసుకోనున్నట్లు వివరించింది. తొలుత ప్రసూమా మాతృ సంస్థ యాంపిల్ ఫుడ్స్ నుంచి 43.8 శాతం వాటాకు రూ. 131 కోట్లు వెచ్చించనుంది. ఈ బాటలో మరో రూ. 56 కోట్లతో వాటాను 62.5 శాతానికి పెంచుకోనున్నట్లు తెలియజేసింది.

ఫలితాల నేపథ్యంలో ఐటీసీ షేరు బీఎస్ఈలో 1.5 శాతం క్షీణించి రూ. 441 వద్ద ముగిసింది.

హీరో మోటో డివిడెండ్ రూ. 100



న్యూఢిల్లీ: ద్విచక్ర వాహన దిగ్గజం హీరో మోటోకార్ప్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024–25) మూడో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం స్వల్పంగా 2 శాతం పుంజుకుని రూ. 1,108 కోట్లకు చేరింది. గతేడాది ఇదే కాలంలో రూ. 1,091 కోట్లు ఆర్జించింది. కంపెనీ బోర్డు వాటాదారులకు షేరుకి రూ. 100(5,000 శాతం) చొప్పున మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. కాగా.. మొత్తం ఆదాయం సైతం రూ. 9,788 కోట్ల నుంచి రూ. 10,,260 కోట్లకు ఎగసింది. వాహన విక్రయాలు 14.6 లక్షల నుంచి 14.64 లక్షల యూనిట్లకు బలపడ్డాయి. ఈవీ విడా అమ్మకాలు పుంజుకుంటున్నట్లు కంపెనీ పేర్కొంది. స్ప్లెండర్, ఎక్స్‌ట్రీమ్ 125 ఆర్, సూపర్ స్ప్లెండర్ మోడళ్ల ద్వారా 100 సీసీ, 125 సీసీ విభాగాల్లో మార్కెట్ వాటా బలపడినట్లు తెలియజేసింది.

బీఎస్ఈలో ఈ షేరు 1 శాతం నీరసించి రూ. 4,231 వద్ద ముగిసింది.

ఎన్‌ఎండీసీ పటిష్ట పనితీరు

లాభం, ఆదాయాల్లో మెరుగైన వృద్ధి



న్యూఢిల్లీ: ప్రభుత్వరంగ సంస్థ ఎన్‌ఎండీసీ డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో పటిష్ట పనితీరు చూపించింది. కన్సాలిడేటెడ్ లాభం క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూసినప్పుడు 29 శాతం వృద్ధితో రూ.1,897 కోట్లకు చేరుకుంది. ఆదాయం సైతం 21 శాతం వృద్ధితో రూ.6,943 కోట్లుగా నమోదైంది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో లాభం రూ.1,493 కోట్లు, ఆదాయం రూ.5,747 కోట్ల చొప్పున ఉన్నాయి. ఐరన్ ఓర్ ఉత్పత్తి 9 శాతం పెరిగి 13.29 మిలియన్ టన్నులకు చేరుకోగా, విక్రయాలు 5 శాతం పెరిగి 11.94 మిలియన్ టన్నులుగా ఉన్నట్టు ఎన్‌ఎండీసీ వెల్లడించింది. ''బలమైన వృద్ధి ధోరణితో నాలుగో త్రైమాసికంలోకి అడుగుపెట్టాం. ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నప్పటికీ సానుకూల పనితీరు చూపించాం''అని ఎన్‌ఎండీసీ సీఎండీ అమితవ ముఖర్జీ తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు మొదటి తొమ్మిది నెలల్లో కంపెనీ లా భం 22 శాతం వృద్ధితో రూ.5,056 కోట్లకు చేరుకోగా, ఆదాయం రూ.15,770 కోట్ల నుంచి రూ.18,001 కోట్లకు పెరిగింది. ఉత్పత్తి 3 శాతం పెరిగి 30.77 మిలియన్ టన్నులకు చేరుకుంది.

తగ్గిన ఎన్‌సీసీ లాభం



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: నిర్మాణ రంగ కంపెనీ ఎన్‌సీసీ లిమిటెడ్ డిసెంబర్ త్రైమాసికం కన్సాలిడేటెడ్ ఫలితాల్లో నికరలాభం 12 శాతం తగ్గి రూ.193 కోట్లకు వచ్చి చేరింది. ఎబిటా 12.6 శాతం క్షీణించి రూ.441 కోట్లు నమోదైంది. ఈపీఎస్ రూ.3.51 నుంచి రూ.3.08 నమోదైంది. టర్నోవర్ 1.8 శాతం అధికమై రూ.5,383 కోట్లు సాధించామని కంపెనీ ఎండీ ఏ.ఏ.వి.రంగ రాజు తెలిపారు.

క్రితం ముగింపుతో పోలిస్తే ఎన్‌సీసీ షేరు ధర బీఎస్ఈలో గురువారం 1 శాతం క్షీణించి రూ.237.60 వద్ద స్థిరపడింది.

అరబిందో ఫార్మా లాభం రూ. 846 కోట్లు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో ఔషధ రంగ దిగ్గజం అరబిందో ఫార్మా నికర లాభం రూ. 846 కోట్లుగా నమోదైంది. గత క్యూ3లో ఇది రూ. 940కోట్లు. మరోవైపు తాజాగా ఆదాయం రూ. 7,352 కోట్ల నుంచి రూ. 7,979 కోట్లకు చేరింది. త్రైమాసికాలవారీగా చూస్తే అత్యధిక ఆదాయాన్ని నమోదు చేసినట్లు కంపెనీ ఎండీ కె. నిత్యానంద రెడ్డి తెలిపారు. కొత్త ఉత్పత్తులను ప్రవేశపెట్టడం ఇందుకు దోహదపడినట్లు ఆయన పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో తయారీ సామర్థ్యాలను మరింతగా మెరుగుపర్చుకోనున్నామని, స్పెషాలిటీ.. ఇంజెక్టబుల్స్ వ్యాపారాన్ని విస్తరించనున్నామని నిత్యానంద రెడ్డి వివరించారు. దీనితో లాభదాయకత చెప్పుకోతగ్గ స్థాయిలో మెరుగుపడుతుందని చెప్పారు. సమీక్షాకాలంలో అమెరికా ఫార్ములేషన్ విభాగం సుమారు రెండు శాతం క్షీణించి రూ. 3,671 కోట్లుగా, యూరప్ ఫార్ములేషన్స్ 23 శాతం పెరిగి ఆదాయం రూ. 2,121 కోట్లుగా, గ్రోత్ మార్కెట్స్ విభాగం 39 శాతం వృద్ధితో రూ. 873 కోట్లుగా నమోదైంది. పరిశోధన, అభివృద్ధి కార్యకలాపాలపై కంపెనీ రూ. 450 కోట్లు వెచ్చించింది.

బీఎస్ఈలో కంపెనీ షేరు స్వల్పంగా క్షీణించి రూ. 1,184.50 వద్ద క్లోజయ్యింది.

ఆర్ఈసీ లాభం అప్

- షేరుకి రూ. 4.3 డివిడెండ్



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ ఫైనాన్షియల్ దిగ్గజం ఆర్ఈసీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024–25) మూడో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 23 శాతం జంప్‌చేసి రూ. 4,076 కోట్లను అధిగమించింది. అధిక ఆదాయం ఇందుకు దోహదపడింది. గతేడాది(2023–24) ఇదే కాలంలో కేవలం రూ. 3,308 కోట్లు ఆర్జించింది. వాటాదారులకు షేరుకి రూ. 4.3 చొప్పున డివిడెండ్ ప్రకటించింది. ఇందుకు ఈ నెల 14 రికార్డ్ డేట్‌గా బోర్డు నిర్ణయించింది. కాగా.. విద్యుత్ రంగ ఎన్‌బీఎఫ్‌సీ మొత్తం ఆదాయం సైతం రూ. 12,072 కోట్ల నుంచి రూ. 14,287 కోట్లకు ఎగసింది. మొత్తం వ్యయాలు రూ. 7,900 కోట్ల నుంచి రూ. 9,106 కోట్లకు పెరిగాయి.

ఫలితాల నేపథ్యంలో ఆర్ఈసీ షేరు బీఎస్ఈలో 1.3 శాతం నీరసించి రూ. 435 వద్ద ముగిసింది.

వన్డేలకు స్టొయినిస్ గుడ్‌బై

చాంపియన్స్ ట్రోఫీకి ముందు అనూహ్య ప్రకటన

ఆస్ట్రేలియా జట్టులో పలు మార్పులు!



స్టొయినిస్

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా పేస్ ఆల్‌రౌండర్ మార్కస్ స్టొయినిస్ అకస్మాత్తుగా వన్డే ఫార్మాట్‌కు వీడ్కోలు పలికాడు. అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) చాంపియన్స్ ట్రోఫీలో పాల్గొనే ఆస్ట్రేలియా జట్టులో చోటు దక్కించుకున్న అనంతరం స్టొయినిస్ వన్డేల నుంచి తప్పుకుంటున్నట్లు వెల్లడించడం విశేషం. కెరీర్‌లో తర్వాతి దశపై మరింత దృష్టి సారించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్టొయినిస్ పేర్కొన్నాడు. దీంతో ఇప్పటికే గాయాల కారణంగా రెగ్యులర్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్, ప్రధాన పేసర్ జోష్ హాజల్‌వుడ్, పేస్ ఆల్‌రౌండర్ మిషెల్ మార్ష్ సేవలు కోల్పోయి ఆస్ట్రేలియా జట్టుకు ఇప్పుడు మరో ఆటగాడు అందుబాటులో లేకుండా పోయాడు. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో విధ్వంసక బ్యాటర్‌గా గుర్తింపు తెచ్చుకున్న స్టొయినిస్ పదేళ్లుగా ఆస్ట్రేలియా వన్డే జట్టులో కొనసాగుతున్నాడు. 35 ఏళ్ల స్టొయినిస్ 71 వన్డేల్లో 26.69 సగటుతో 1495 పరుగులు చేశాడు. ఇందులో ఒక సెంచరీ, 6 అర్ధ శతకాలు ఉన్నాయి. బంతితోనూ రాణించిన స్టొయినిస్ వన్డేల్లో 48 వికెట్లు పడగొట్టాడు. వన్డేల నుంచి తప్పుకున్న స్టొయినిస్ అంతర్జాతీయ టి20లకు మాత్రం అందుబాటులో ఉంటానని ప్రకటించాడు. ప్రస్తుతం దక్షిణాఫ్రికా (ఎస్‌ఏ) 20 లీగ్‌లో డర్బన్ సూపర్ జెయింట్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న స్టొయినిస్... కండరాల నొప్పితో ఇబ్బంది పడుతున్నాడు. 'ఆస్ట్రేలియా వన్డే జట్టుకు ప్రాతినిధ్యం వహించడాన్ని ఎంతగానో ఆస్వాదించా. ఈ ఫార్మాట్‌లో జట్టుతో ఎన్నో మధుర అనుభవాలు ఉన్నాయి. ఈ నిర్ణయం అంత తేలికగా తీసుకున్నది కాదు. జీవితంలో తదుపరి ఘట్టంపై దృష్టి పెట్టేందుకే వన్డే క్రికెట్ నుంచి తప్పుకుంటున్నా. దానికి ఇదే సరైన సమయం అని భావించా. ఆస్ట్రేలియాలో నైపుణ్యానికి కొదవ లేదు. చాంపియన్స్ ట్రోఫీలో ఆసీస్ మెరుగైన ప్రదర్శన చేస్తుందనే నమ్మకముంది. జట్టును ఉత్సాహ పరిచేందుకు సిద్ధంగా ఉంటా' అని స్టొయినిస్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నాడు.

కంగారూలకు సెలక్షన్ కష్టాలు

గాయాలతో కమిన్స్, హాజల్‌వుడ్, మార్ష్ జట్టుకు దూరం

మెల్‌బోర్న్: ప్రధాన ఆటగాళ్ల గాయాలకు తోడు... ఆల్‌రౌండర్ స్టొయినిస్ వన్డే ఫార్మాట్‌కు వీడ్కోలు పలకడంతో... అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) చాంపియన్స్ ట్రోఫీ ప్రారంభానికి ముందు ఆస్ట్రేలియా జట్టు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఈ నెల 19 నుంచి పాకిస్తాన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) వేదికగా చాంపియన్స్ ట్రోఫీ ప్రారంభం కానుండగా... క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) ఈ టోర్నీ కోసం ఇప్పటికే జట్టును ప్రకటించింది. కాగా... ఇందులో రెగ్యులర్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్‌తో పాటు మరో పేసర్ జోష్ హాజల్‌వుడ్ గాయాల కారణంగా అధికారికంగా టోర్నీ దూరం కాగా... పేస్ ఆల్‌రౌండర్ మిషెల్ మార్ష్ వెన్నునొప్పి కారణంగా టోర్నీకి దూరమయ్యాడు. ఇక మరో పేస్ ఆల్‌రౌండర్ స్టొయినిస్ అనూహ్యంగా వన్డే ఫార్మాట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. ఈ నెల 12 వరకు జట్లలో మార్పులు చేసుకునేందుకు ఐసీసీ గడువు ఇవ్వగా... ఆస్ట్రేలియా జట్టు దాదాపు కొత్త జట్టును ఎంపిక చేయాల్సిన పరిస్థితి నెలకొంది. కమిన్స్ అందుబాటులో లేకపోవడంతో అతడి స్థానంలో స్టీవ్ స్మిత్, ట్రావిస్ హెడ్‌లో ఒకరు ఆసీస్ జట్టుకు సారథ్యం వహిస్తారని సీఏ వెల్లడించింది. 'కమిన్స్, హాజల్‌వుడ్, మార్ష్ అనుకోకుండా.. టోర్నీకి దూరమయ్యారు. ఐసీసీ నిర్వహిస్తున్న ప్రతిష్ఠాత్మక టోర్నీల్లో ఆస్ట్రేలియా జట్టుకు ప్రాతినిధ్యం వహించాలని ప్రతి ఒక్కరికీ ఉంటుంది' అని ఆస్ట్రేలియా జాతీయ సెలెక్షన్ కమిటీ చైర్మన్ జార్జ్ బెయిలీ అన్నాడు.

పదేళ్ల తర్వాత... వెస్టిండీస్‌లో ఆస్ట్రేలియా టెస్టు సిరీస్

సుదీర్ఘ విరామం అనంతరం ఆస్ట్రేలియా జట్టు... వెస్టిండీస్‌లో టెస్టు సిరీస్ ఆడనుంది. 2015లో చివరిసారిగా కరీబియన్ దీవుల్లో టెస్టు సిరీస్ ఆడిన ఆస్ట్రేలియా... పదేళ్ల తర్వాత తిరిగి మూడు మ్యాచ్‌ల సిరీస్ కోసం వెస్టిండీస్‌లో పర్యటించనుంది. అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ అనంతరం ఆస్ట్రేలియా జట్టు వెస్టిండీస్‌లో పర్యటించనుంది. ఈ టూర్‌లో భాగంగా మూడు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌తో పాటు 5 మ్యాచ్‌ల టి20 సిరీస్ నిర్వహించనున్నారు.

'ప్లేయర్ ఆఫ్ ద మంత్' రేసులో వరుణ్ చక్రవర్తి, త్రిష



దుబాయ్: భారత మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి... అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) 'ప్లేయర్ ఆఫ్ ద మంత్' అవార్డుకు నామినేట్ అయ్యాడు. ఇంగ్లండ్‌తో ఐదు మ్యాచ్‌ల టి20 సిరీస్‌లో 14 వికెట్లు పడగొట్టి 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్'గా నిలిచిన వరుణ్ చక్రవర్తి ఐసీసీ టి20 బౌలింగ్ ర్యాంకింగ్స్‌లోనూ రెండో స్థానానికి చేరుకున్నాడు. 2025 జనవరి నెలకు గానూ అత్యుత్తమ ప్రదర్శన చేసిన వారిని ఐసీసీ ఈ అవార్డుకు నామినేట్ చేసింది. ఈ జాబితాలో వెస్టిండీస్ స్పిన్నర్ వారికన్ కూడా ఉన్నాడు. పాకిస్తాన్‌తో రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో 19 వికెట్లు పడగొట్టిన వారికన్ ప్లేయర్ ఆఫ్ ద సిరీస్ అవార్డు కూడా గెలుచుకున్నాడు. ఇదే సిరీస్‌లో 16 వికెట్లు తీసిన పాకిస్తాన్ స్పిన్నర్ నోమాన్ అలీ కూడా అవార్డుల నామినేషన్ జాబితాలో ఉన్నాడు. మహిళల కేటగిరీలో తెలంగాణ రైజింగ్ స్టార్ గొంగడి త్రిష ఈ పురస్కారం రేసులో ఉంది. ఇటీవల మలేసియా వేదికగా జరిగిన మహిళల అండర్–19 టి20 ప్రపంచకప్‌లో త్రిష అద్వితీయమైన ప్రదర్శన కనబర్చడంతో... భారత జట్టు వరుసగా రెండోసారి ట్రోఫీ చేజిక్కించుకుంది. ఈ క్రమంలో అండర్–19 వరల్డ్‌కప్‌లో తొలి సెంచరీ చేసిన ప్లేయర్‌గా చరిత్ర సృష్టించిన త్రిష... టోర్నీ మొత్తంలో 309 పరుగులు చేసి 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డు కైవసం చేసుకుంది.

ఒడిశాపై గోవా గెలుపు



గోవా: ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్) ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో గోవా ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) 2–1 స్కోరుతో ఒడిశా జట్టుపై విజయం సాధించింది. జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో గురువారం జరిగిన మ్యాచ్‌లో గోవా తరఫున బ్రిసన్ డ్యూబెన్ ఫెర్నాండెజ్ 29వ నిమిషంలో గోల్ సాధించి గోవాకు తొలి ఆధిక్యం ఇచ్చాడు. ఒడిశా ఆటగాడు లాల్తతంగ ఖవిహరింగ్ (47వ నిమిషంలో) చేసిన సెల్ఫ్ గోల్ గోవా ఆధిక్యాన్ని రెట్టింపు చేసింది. 54వ నిమిషంలో ఒడిశా స్ట్రయికర్ కేపీ రాహుల్ గోల్ చేసినప్పటికీ గోవా విజయాన్ని మాత్రం అడ్డుకోలేకపోయాడు. నిజానికి ఈ మ్యాచ్‌లో ఒడిశా తమ దాడులకు పదును పెట్టలేకపోయింది. అవతలివైపు నుంచి గోవా ఎఫ్‌సీ ఆటగాళ్లు మాత్రం పదేపదే ప్రత్యర్థి గోల్‌పోస్ట్‌వైపు దూసుకొచ్చి ఏకంగా 20 షాట్లు కొట్టారు. లక్ష్యంపై ఆరుసార్లు గురిపెట్టగా ఒకసారి గోల్‌తో విజయవంతమైంది. ఒడిశా 15 షాట్లు ఆడినా... కేవలం ప్రత్యర్థి గోల్‌పోస్ట్‌పై రెండే సార్లు దాడి చేసింది. ఇందులో ఒకసారి మాత్రం ఫలితాన్ని సాధించింది. గోవా ఆటగాళ్లు మైదానంలో పాదరసంలా కదిలారు. బంతిని ప్రత్యర్థులకంటే తమ ఆధీనంలో ఉంచుకునేందుకు అదేపనిగా చకచకా పాస్‌లు చేశారు. శుక్రవారం షిల్లాంగ్‌లో జరిగే పోరులో నార్త్‌ఈస్ట్ యునైటెడ్ ఎఫ్‌సీ జట్టుతో ముంబై సిటీ ఎఫ్‌సీ తలపడుతుంది.

శ్రీలంక 229/9

ఆస్ట్రేలియాతో రెండో టెస్టు



గాలె: సొంతగడ్డపై ఆస్ట్రేలియాతో తొలి టెస్టులో ఘోర పరాజయం చవిచూసిన శ్రీలంక జట్టు... రెండో టెస్టులోనూ భారీ స్కోరు చేయలేకపోయింది. గురువారం ప్రారంభమైన పోరులో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న శ్రీలంక... తొలి రోజు ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో 90 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 229 పరుగులు చేసింది. దినేశ్ చండిమాల్ (163 బంతుల్లో 74; 6 ఫోర్లు, 1 సిక్స్), వికెట్ కీపర్ కుశాల్ మెండిస్ (107 బంతుల్లో 59 బ్యాటింగ్; 6 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ శతకాలతో ఆకట్టుకున్నారు. కెరీర్‌లో చివరి టెస్టు ఆడుతున్న సీనియర్ బ్యాటర్ దిముత్ కరుణరత్నే (83 బంతుల్లో 36; 3 ఫోర్లు) కాసేపు పోరాడినా... భారీ స్కోరు చేయలేకపోయడాడు. కరుణరత్నేకు ఇది వందో టెస్టు కాగా... ఈ మ్యాచ్ అనంతరం అతడు అంతర్జాతీయ క్రికెట్ నుంచి వీడ్కోలు పలకనున్నట్లు ఇప్పటికే ప్రకటించాడు. పతుమ్ నిశాంక (11), ఏంజెలో మాథ్యూస్ (1), కమిందు మెండిస్ (13), కెప్టెన్ ధనంజయ డిసిల్వ (0) విఫలమయ్యారు. చండిమాల్, కుశాల్ మెండిస్ కాస్త పోరాడటంతో లంక జట్టు ఆమాత్రం స్కోరు చేయగలిగింది. ఆస్ట్రేలియా బౌలర్లలో మిషెల్ స్టార్క్, నాథన్ లయన్ చెరో 3 వికెట్లు పడగొట్టగా... మాథ్యూ కూనెమన్ రెండు వికెట్లు ఖాతాలో వేసుకున్నాడు. గత మ్యాచ్‌లో తమ టెస్టు క్రికెట్ చరిత్రలో అత్యంత భారీ పరాజయం ఎదుర్కొన్న శ్రీలంక జట్టు... చేతిలో మిగిలి ఉన్న ఒక్క వికెట్‌తో తొలి ఇన్నింగ్స్‌లో మరెన్ని పరుగులు చేస్తుందో చూడాలి. కుశాల్ మెండిస్‌తో పాటు లహిరు కుమార (0 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు.



15 పాయింట్లతో మూడు గేమ్‌లు!

స్కోరింగ్‌లో మార్పులపై బీడబ్ల్యూఎఫ్ యోచన





న్యూఢిల్లీ: గత కొంతకాలంగా మెరుపు వేగంలో ముగిసే ఆటలపై పెరుగుతున్న ఆదరణ దృష్ట్యా బ్యాడ్మింటన్ కూడా అటువైపే పయనించేందుకు సిద్ధమవుతోంది. ప్రస్తుతం ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (బీడబ్ల్యూఎఫ్) 21 పాయింట్లతో మూడు గేముల (బెస్టాఫ్ త్రీ) స్కోరింగ్ విధానాన్ని అమలు చేస్తోంది. ఆయా దేశాల్లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లోనూ ఇదే స్కోరింగ్‌తో టోర్నీలు నిర్వహిస్తున్నారు. అయితే ఈ ఆట మరింత రసవత్తరంగా జరిగేందుకు, మ్యాచ్ చకచకా ముగిసిపోయేందుకు కొత్త స్కోరింగ్ విధానం అమలు చేసేందుకు బీడబ్ల్యూఎఫ్ సిద్ధమైంది. ఇప్పుడున్న మూడు గేమ్‌లను 15 పాయింట్లతో ముగించి ఆటలో వేగం పెంచనుంది. తద్వారా కొత్తతరం ప్రేక్షకుల్ని ఆకర్షించాలని, సుదీర్ఘంగా సాగదీయకుండా, నిమిషాల్లో మ్యాచ్ ఫలితం వచ్చేలా కొత్త స్కోరింగ్ విధానాన్ని ఈ ఏప్రిల్ నుంచే అమలు చేయాలని బీడబ్ల్యూఎఫ్ కౌన్సిల్ నిర్ణయించింది. నవంబర్లో కౌలాలంపూర్‌లో జరిగే బీడబ్ల్యూఎఫ్ అత్యున్నత సమావేశానికి ముందు ఆరు నెలల పాటు ఈ స్కోరింగ్ విధానాన్ని ప్రయోగాత్మకంగా అమలు చేశాక... ఆ సమావేశంలో సమీక్షించి తుది నిర్ణయాన్ని తీసుకుంటారు. 'కాంటినెంటల్ చాంపియన్‌షిప్‌లు, గ్రేడ్–3 టోర్నమెంట్‌లు, జాతీయ, అంతర్జాతీయ లీగ్‌లు, జాతీయ టోర్నీల్లో ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు ఈ కొత్త స్కోరింగ్ పద్ధతిని అవలంబిస్తారు' అని బీడబ్ల్యూఎఫ్ ఒక ప్రకటనలో తెలిపింది. కొత్త విధానం వల్ల మ్యాచ్‌ల్లో పోటీ మరింత పెరుగుతుందని, ప్రతీ పాయింట్ కోసం ప్రత్యర్థులు దీటుగా సన్నద్ధమై బరిలోకి దిగుతారని, మ్యాచ్ త్వరగా ముగియడం కాదు... పోటాపోటీగా జరగడం ఖాయమని బీడబ్ల్యూఎఫ్ వివరణ ఇచ్చింది. నిజానికి 15 పాయింట్ల 'బెస్టాఫ్ త్రీ' గేమ్‌లు కొత్తేం కాదు. అంతర్జాతీయ బ్యాడ్మింటన్‌లో గతంలో ఏళ్ల తరబడి ఈ స్కోరింగ్ పద్ధతిలో మ్యాచ్‌లు జరిగాయి. తర్వాత 7 పాయింట్లతో 'బెస్టాఫ్ ఫైవ్' పద్ధతిలోనూ కొన్నాళ్లు జరిగాయి. క్రమానుగతంగా మారుతుండగా 2014లో తొలిసారి 11 పాయింట్లతో 'బెస్టాఫ్ ఫైవ్' స్కోరింగ్ పద్ధతి తెరపైకి వచ్చింది. కానీ బీడబ్ల్యూఎఫ్‌లోని సభ్యదేశాలు సమ్మతించకపోవడంతో ఆ ఏడాది, తర్వాత 2021లో బీడబ్ల్యూఎఫ్ కౌన్సిల్‌లో కనీస మద్దతు లభించక మరోసారి ఇలా రెండుసార్లూ ప్రతిపాదన దశలోనే ఆ స్కోరింగ్ (11 పాయింట్ల బెస్టాఫ్ ఫైవ్) పద్ధతిని ఉపసంహరించుకున్నారు. దీంతో 2006 నుంచి స్థిరంగా ప్రస్తుత 21 పాయింట్ల స్కోరింగే కొనసాగుతోంది.

'కామన్వెల్త్'లో స్విమ్మింగ్, సైక్లింగ్‌లకు పెద్దపీట

పతకాల సంఖ్య పెంపు



గ్లాస్గో: వచ్చే ఏడాది జరిగే కామన్వెల్త్ గేమ్స్‌లో క్రీడల్ని కుదించినప్పటికీ కొన్ని క్రీడలకు పెద్దపీట వేశారు. ముఖ్యంగా సైక్లింగ్, స్విమ్మింగ్, పారా పోటీల్లో గణనీయంగా పతకాల ఈవెంట్లు పెంచారు. దీంతో వచ్చే ఏడాది గ్లాస్గో ఆతిథ్యమివ్వబోయే ఈ కామన్వెల్త్ మెగా ఈవెంట్‌లో 200కు పైగా బంగారు పతకాలు అథ్లెట్ల పరం కానున్నాయి. దాదాపు 60 ఏళ్ల తర్వాత మిక్స్‌డ్ 4–400 మీటర్ల రిలే విభాగాన్ని తిరిగి ఈ కామన్వెల్త్‌లో చేర్చారు. చివరిసారిగా 1966లో మిక్స్‌డ్ రిలే విభాగం పోటీలు నిర్వహించాక తదనంతరం క్రీడల్లో ఆ ఈవెంట్‌కు మంగళం పాడారు. దీనిపై ప్రపంచ అథ్లెటిక్స్ అధ్యక్షుడు సెబాస్టియన్ కో హర్షం వ్యక్తం చేశారు. 1930 నుంచి 1966 వరకు కామన్వెల్త్‌లో అలరించిన మిక్స్‌డ్ రిలే ఈవెంట్ మళ్లీ ఆరు దశాబ్దాల తర్వాత గ్లాస్గోలో పతకాల కోసం పరుగుపెట్టబోతోంది' అని అన్నారు. పారా అథ్లెటిక్స్‌లోని 10 ఈవెంట్లలో ఏకంగా ఆరు క్రీడాంశాలకు గేమ్స్ ఆర్గనైజింగ్ కమిటీ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో రికార్డుస్థాయిలో 47 పతకాలు పారా అథ్లెట్లు అందుకోనున్నారు. సైక్లింగ్‌లో 26 పతకాల ఈవెంట్లు (పారా సైక్లింగ్ కలిపి), స్విమ్మింగ్, పారా స్విమ్మింగ్‌లలో 56 పతకాలు ఈతకొలనులో కొల్లగొట్టనున్నారు. ఈ సారి కొత్తంగా 800 మీటర్ల ఫ్రీస్టయిల్, 1500 మీటర్ల మహిళల ఫ్రీస్టయిల్ రేసుల్ని చేర్చారు. 2026లో జులై 23 నుంచి ఆగస్టు 2 వరకు 11 రోజుల పాటు గ్లాస్గో కామన్వెల్త్ గేమ్స్ జరుగనున్నాయి. పది క్రీడాంశాలు జిమ్నాస్టిక్స్, అథ్లెటిక్స్, పారా అథ్లెటిక్స్, బాస్కెట్‌బాల్, వీల్‌చైర్ బాస్కెట్‌బాల్, బాక్సింగ్, స్విమ్మింగ్, పారా స్విమ్మింగ్ , బౌల్స్, పారా బౌల్స్ (ఇండోర్), జూడో, నెట్‌బాల్, ట్రాక్ సైక్లింగ్, పారా సైక్లింగ్, వెయిట్‌లిఫ్టింగ్, పారా పవర్‌లిఫ్టింగ్‌లో పోటీలుంటాయి. కామన్వెల్త్ ఎరెనా, సర్ క్రిస్ హో వెలొడ్రోమ్, స్కాటిష్ ఎగ్జిబిషన్ సెంటర్ (ఎస్ఈసీ), స్కాట్స్‌టౌన్ స్టేడియం, టోల్‌క్రాస్ ఇంటర్నేషనల్ స్విమ్మింగ్ సెంటర్ వేదికల్లో పది రోజుల పాటు పోటీలు జరుగుతాయి. తొలి రోజు కేవలం ఆరంభ వేడుకలు నిర్వహిస్తారు.



క్వార్టర్స్‌లో శ్రీవల్లి రష్మిక

ముంబై: తెలుగమ్మాయి భమిడిపాటి శ్రీవల్లి రష్మిక ముంబై ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్‌లో క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. సోమవారం ఇక్కడ జరిగిన ప్రిక్వార్టర్స్‌లో ఆమె 6–4, 6–0తో అలెక్సాండ్రా క్రున్సిచ్ (సెర్బియా)పై అలవోక విజయం సాధించింది. అంకిత రైనాకు ప్రిక్వార్టర్స్‌లోనే చుక్కెదురైంది. అంకిత 5–7, 6–2, 6–7 (5/7)తో రెండో సీడ్ రెబెక్కా మరినో (కెనడా) చేతిలో పోరాడి ఓడింది. 15 ఏళ్ల మాయ రాజేశ్వరన్ తన ప్రత్యర్థి రెండో సెట్ మధ్యలోనే వైదొలగడంతో ముందంజ వేసింది. జరీనా దియాస్ (కజకిస్తాన్)తో జరిగిన మ్యాచ్‌లో మాయ 6–3తో తొలిసెట్ నెగ్గింది. రెండో సెట్‌లో జరీనా 3–2తో ఆధిక్యంలో ఉన్నప్పటికీ గాయంతో వైదొలిగింది. దీంతో మాయ క్వార్టర్స్ చేరింది.

శ్రీనిధి ఎఫ్‌సీ, రియల్ కశ్మీర్ మ్యాచ్ 'డ్రా'




సాక్షి, హైదరాబాద్: ఐ లీగ్‌లో భాగంగా శ్రీనిధి డెక్కన్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ), రియల్ కశ్మీర్ ఫుట్‌బాల్ క్లబ్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ 1–1 గోల్స్‌తో 'డ్రా'గా ముగిసింది. గురువారం జరిగిన పోరులో హైదరాబాద్‌కు చెందిన శ్రీనిధి డెక్కన్ జట్టు తరఫున డేవిడ్ మునోజ్ (42వ నిమిషంలో) ఒక గోల్ చేయగా... రియల్ కశ్మీర్ జట్టు తరఫున పాలో సీజర్ (25వ నిమిషంలో) ఏకైక గోల్ సాధించాడు. తొలుత రియల్ కశ్మీర్ జట్టు ఆధిక్యంలోకి వెళ్లగా... ఆ తర్వాత తీవ్రంగా ప్రయత్నించిన డెక్కన్ ఫుట్‌బాల్‌క్లబ్ స్కోరు సమం చేయగలిగింది. ద్వితీయార్ధంలో ఇరు జట్లు ఎంత ప్రయత్నించినా మరో గోల్ చేయలేకపోవడంతో మ్యాచ్ చివరకు 'డ్రా'గా ముగిసింది. ఈసీజన్‌లో 13 మ్యాచ్‌లాడిన శ్రీనిధి డెక్కన్ ఫుట్‌బాల్ క్లబ్ 4 విజయాలు, 5 పరాజయాలు, 4 'డ్రా'లతో 16 పాయింట్లు ఖాతాలో వేసుకొని పట్టికలో 8వ స్థానంలో ఉంది. ఈ నెల 14న జరగనున్న తమ తదుపరి మ్యాచ్‌లో షిల్లాంగ్ ఫుట్‌బాల్ క్లబ్‌తో శ్రీనిధి డెక్కన్ జట్టు తలపడనుంది.

సెమీస్‌లో సాకేత్-రామ్‌కుమార్ జోడీ



చెన్నై: చెన్నై ఓపెన్ ఏటీపీ చాలెంజర్–100 టెన్నిస్ టోర్నీ పురుషుల డబుల్స్ విభాగంలో ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ సాకేత్ మైనేని సెమీఫైనల్‌కు దూసుకెళ్లాడు. పురుషుల డబుల్స్‌లో రామ్‌కుమార్ రామనాథన్ (భారత్)తో కలిసి డిఫెండింగ్ చాంపియన్స్‌గా బరిలోకి దిగిన ఈ జోడి చక్కటి ఆటతీరు కనబర్చింది. గురువారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో సాకేత్–రామ్‌కుమార్ జంట 6–3, 6–4తో ఇగోర్ అగాఫొనోవ్–ఇవ్‌గెనీ టిర్నెవ్ (రష్యా) జోడీపై విజయం సాధించింది. ఏకపక్షంగా సాగిన ఈ పోరులో భారత జంట 4 ఏస్‌లు కొట్టి, మూడు డబుల్ ఫాల్ట్స్ చేసింది. రెండు బ్రేక్ పాయింట్లు కాచుకున్న రామ్‌కుమార్–సాకేత్ జోడీ... ఓవరాల్‌గా మ్యాచ్‌లో 57 పాయింట్లు ఖాతాలో వేసుకుంది. నేడు జరగనున్న సెమీఫైనల్లో రే హో (చైనీస్ తైపీ)–మాథ్యూ క్రిస్టోఫర్ రొమియోస్ (ఆస్ట్రేలియా) ద్వయంతో భారత జంట తలపడనుంది. మరో క్వార్టర్ ఫైనల్లో భారత్‌కే చెందిన రెండో సీడ్ విజయ్ సుందర్ ప్రశాంత్–జీవన్ నెడుంజెళియన్ ద్వయం 6–2, 6–2తో కోర్ట్ జాన్ లాక్ (జింబాబ్వే)–రియో నొగుచి (జపాన్) జంటపై గెలిచి సెమీఫైనల్లో అడుగుపెట్టింది.

సాక్షి ప్లస్
శుక్రవారం । 7-2-2025



గురువారం మధ్యాహ్నం వేళ శ్రీనగర్‌లోని దాల్ సరస్సులో షికారాలో షికారు చేస్తున్న పర్యాటకులు



నాగాలాండ్ నుంచి ఢిల్లీకి వచ్చిన విద్యార్థులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ

తాత్కాలికంగా ఖాళీ చేయిస్తామన్నారంతే..

గాజాపై ట్రంప్ మాటలకు అధికారుల మరో భాష్యం

గ్వాటిమాలా సిటీ: గాజా ప్రాంతాన్ని నియంత్రణలోకి తెచ్చుకుంటామంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై మిత్ర దేశాలతోపాటు, సొంత రిపబ్లికన్ పార్టీ నేతల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైన విషయం తెలిసిందే. దీంతో, ట్రంప్ యంత్రాంగం కాస్త వెనక్కి తగ్గినట్లు కనిపిస్తోంది. విదేశాంగ మంత్రి మార్కో రుబియో, వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ గురువారం ట్రంప్ మాటలకు మరో అర్థం చెప్పారు. గాజా పునర్నిర్మాణం చేపట్టేందుకు వీలుగా అక్కడున్న 18 లక్షల మంది పాలస్తీనియన్లకు మరో చోట తాత్కాలిక నివాసాలు ఏర్పాటు చేయాలన్నదే ట్రంప్ మాటల వెనుక అర్థమంటూ వివరించారు. విదేశాంగ మంత్రిగా బాధ్యతలు చేపట్టాక మార్కో రుబియో గురువారం మొట్టమొదటి విదేశీ పర్యటన కోసం గ్వాటిమాలా వెళ్లారు. అక్కడ ఆయన మీడియాతో మాట్లాడుతూ..'ఇజ్రాయెల్, హమాస్ మధ్య కొనసాగిన 15 నెలల యుద్ధం ఫలితంగా గాజా ప్రాంతం శిథిలాలతో నిండిపోయింది. వాటిని తొలగించి పునర్నిర్మాణం చేపట్టాలనే సదుద్దేశంతో ట్రంప్ చాలా జాలితో పాలస్తీనియన్లకు సాయం చేయాలనే ఉద్దేశంతోనే ఆ ప్రతిపాదన చేశారు. పునర్నిర్మాణ పనులు జరిపేటప్పుడు అర్థంతరంగా వెళ్లాలన్నా వారు ఎక్కడికీ వెళ్లలేరు, అక్కడే ఉండిపోనూ లేరు'అని చెప్పుకొచ్చారు. లీవిట్ వాషింగ్టన్‌లో మీడియాతో సమావేశంలో.. గాజాను ధ్వంసమైన ప్రాంతంగా పేర్కొంటూ శిథిల భవనాలతో కూడిన ఫొటోను ప్రదర్శించారు. అధ్యక్షుడు అక్కడి వారిని గాజా నుంచి తాత్కాలికంగా తరలించాలని స్పష్టంగా చెప్పారు. గాజా ప్రస్తుతం మనుషులకు ఏమాత్రం నివాస యోగ్యంగా లేదు. ఇటువంటి పరిస్థితుల్లో వారిని అక్కడే ఉండిపోవాలనడం కూడా దుర్మార్గమైన సూచన అనిపించుకుంటుంది' అంటూ వివరించే ప్రయత్నం చేశారు. అయితే, గాజాకు అమెరికా బలగాలను పంపే యోచనను ఆయన కొట్టిపారేయలేదు. చర్చలు సవ్యంగా సాగాలంటే అమెరికా బలగాలు అక్కడుండాల్సిన అవసరముందని చెప్పారు. గాజా పునర్నిర్మాణానికి ఉన్న అన్ని రకాల ప్రత్యామ్నాయాలతో మిలటరీ సిద్ధంగా ఉందని రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ బుధవారం ప్రకటించారు.

జాతి నిర్మూలన ఆలోచన వద్దు: గ్యుటెరస్

ఇజ్రాయెల్–పాలస్తీనా రెండు దేశాల పరిష్కారానికి ఐక్యరాజ్యసమితి కట్టుబడి ఉంటుందని ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనియో గ్యుటెరస్ పునరుద్ఘాటించారు. జాతి నిర్మూలన యోచనను నివారించడం అత్యవసరమన్నారు. పాలస్తీనియన్లను వేరే ప్రాంతానికి పంపించి, గాజా నుంచి ను స్వాధీనం చేసుకుంటామన్న ట్రంప్ వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. 'సమస్య పరిష్కారాన్ని వెదికే ప్రయత్రంలో పరిస్థితిని మరింత దిగజార్చరాదు. అంతర్జాతీయ చట్టాలకు కట్టుబడి ఉండటం అత్యావశ్యకం. ఏ రూపంలో అయినా జాతి నిర్మూలన నివారించాలి'అని పేర్కొన్నారు. ఆక్రమణలకు ముగింపు పలకాలన్నారు. గాజా అంతర్భాగంగా స్వతంత్ర పాలస్తీనా రాజ్య స్థాపనతో ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు అన్ని వర్గాలు ప్రయత్నించాలని పిలుపునిచ్చారు. పశ్చిమాసియా శాంతి సుస్థిరతలకు ఇదే అసలైన పరిష్కారమని నొక్కిచెప్పారు.

ట్రంప్ ఏమన్నారంటే..

గాజాలో పాలస్తీనియన్లందరినీ వేరే ప్రాంతానికి తరలించి, అక్కడే శాశ్వత నివాసాలు ఏర్పాటు చేస్తామంటూ ట్రంప్ మంగళవారం ప్రకటించారు. అనంతరం అక్కడ అమెరికా బలగాలను దించి, భారీగా పునర్నిర్మాణ కార్యక్రమాలు చేపడతామన్నారు. శాశ్వతమైన మంచి ఇళ్లు నిర్మించి ఇస్తామన్నారు. ప్రస్తుతమున్నట్లుగా కాకుండా అప్పుడు గాజాలో సంతోషంగా ఉండొచ్చు. తుపాకీ కాల్పులు, ఎవరైనా పొడుస్తారని, చంపేస్తారని భయాలుండవు. అమెరికా దీర్ఘకాల యాజమాన్యంలో మధ్యధర సముద్ర తీరంలోని ఆ ప్రాంతంలో పునర్నిర్మాణం పూర్తవుతుందని చెప్పారు. ఈ మాటలపై, పాలస్తీనియన్ల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. తమ సొంత భూభాగాన్ని ఒకసారి వదిలేసి వెళితే, తిరిగి రానివ్వరంటూ వారు భయాందోళనలకు గురయ్యారు. అరబ్ దేశాలు సైతం ట్రంప్ ప్రతిపాదనను తప్పుబట్టాయి. ఈజిప్టు, జోర్డాన్ వంటి మిత్ర దేశాలు సైతం పాలస్తీనియన్ల తరలింపును వ్యతిరేకించాయి. ఇటువంటి చర్యవల్ల పశ్చిమాసియా సుస్థిరత ప్రమాదంలో పడుతుందని, సంక్షోభం మరింత ముదురుతుందని హెచ్చరించాయి. సౌదీ అరేబియా కూడా ట్రంప్ ప్రకటనను తప్పుబట్టింది. ట్రంప్ ప్రకటన సమస్యాత్మకంగా ఉందని రిపబ్లికన్ సెనేటర్ లిండ్సే గ్రాహం పేర్కొన్నారు.

ఎవరైనా చార్జీలు చెల్లించాల్సిందే

- అమెరికా నౌకలకు వెసులుబాటు ఇవ్వలేదు
- పనామా అధ్యక్షుడు జోస్ రౌల్ ములినో వెల్లడి

పనామా సిటీ: పనామా కాలువ నుంచి అమెరికా యుద్ధనౌకలు ఉచితంగా రాకపోకలు సాగించేలా ఒప్పందం ఏదీ కుదరలేదని పనామా అధ్యక్షుడు జోస్‌రాల్ ములినో గురువారం స్పష్టంచేశారు. తమ యుద్ధ నౌకల నుంచి ఎలాంటి రుసుము వసూలు చేయకుండా పనామాతో ఒప్పందం కుదిరిందంటూ అమెరికా ప్రభుత్వం చేసిన ప్రకటనను ఆయన ఖండించారు. పనామా కాలువ గుండా రాకపోకలు సాగించే నౌకలకు రుసుము ఖరారు చేయడం గానీ, మినహాయింపు ఇవ్వడం గానీ తాను చేయలేనని పేర్కొన్నారు. అమెరికా నౌకలకు ప్రత్యేక వెసులుబాటు లేదని వివరించారు. ఇప్పుడున్న నిబంధనల ప్రకారం అన్ని దేశాల నౌకలు రుసుము చెల్లించాల్సిందేనని స్పష్టంచేశారు. ఇదే విషయాన్ని అమెరికా రక్షణ శాఖ మంత్రి హెగ్సెత్‌కు తెలియజేశానని చెప్పారు. అయితే, పనామా అధ్యక్షుడు జోస్‌రాల్ ములినో అమెరికా సర్కారు ఇంకా స్పందించలేదు. ''అమెరికా ప్రభుత్వ నౌకలు ఇకపై పనామా కాలువలో ఉచితంగా రాకపోకలు సాగించవచ్చు. దీనివల్ల మనకు మిలియన్ డాలర్ల ఆదా అవుతుంది''అని అమెరికా బుధవారం 'ఎక్స్'లో పోస్టు చేసింది.

జీ20 మంత్రుల భేటీకి అమెరికా దూరం

దక్షిణాఫ్రికా విధానాలే దీనికి కారణమన్న అమెరికా

వాషింగ్టన్: దక్షిణాఫ్రికాలో ఈనెలలో జరిగే జీ-20 దేశాల విదేశాంగ మంత్రుల సమావేశానికి అమెరికా తరఫున ఎవరూ హాజరుకాబోరని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో బుధవారం ప్రకటించారు. ఈ నెల 20, 21 తేదీల్లో జొహన్నెస్‌బర్గ్‌లో జరిగే విదేశాంగ మంత్రుల జీ20 చర్చలను బహిష్కరిస్తున్నట్లు రూబియో చెప్పారు. దక్షిణాఫ్రికా ప్రభుత్వం అమెరికా వ్యతిరేక ఎజెండాతో వ్యవహరిస్తున్నందువల్లే సమావేశానికి దూరంగా ఉంటున్నట్లు వెల్లడించారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న అమెరికా గైర్హాజరు జీ20 కూటమికి పెద్ద దెబ్బే. ఉక్రెయిన్ యుద్ధంపై దౌత్యానికి ట్రంప్ మొగ్గుచూపుతున్న విదేశాంగ మంత్రుల భేటీలో రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్‌తో రూబియో తొలిసారిగా భేటీ అవుతారని అంతా అనుకుంటున్న వేళ అసలు అమెరికా ఈ సమావేశాలను బహిష్కరించాలని నిర్ణయించిందని రూబియో ప్రకటించి అందర్నీ ఆశ్చర్యపరిచారు.

అంగ్ సాన్ సూకీ ఇంటి కథ

ఎంతగా ప్రయత్నించినా వేలంపాటలో ఎవరూ ముందుకురాని వైనం

యాంగూన్: తమ దేశంలో ప్రజాస్వామ్యం, పౌర ప్రభుత్వం సాధన కోసం పోరాడి ఏళ్లకు ఏళ్ల గృహనిర్బంధంలో గడిపిన మయన్మార్ నాయకురాలు అంగ్ సాన్ సూకీకి చెందిన నివాసం మూడోసారి వేలంలో వెళ్లింది. అయినా కొనేందుకు ఎవరూ ముందుకు రాలేదు. గత వేలం పాటతో పోలిస్తే ఆసారి కాస్తంత తక్కువగా రూ.1,231 కోట్లకు ఎవరైనా దీనిని కొనుగోలు చేయొచ్చని కామాయుత్ జిల్లా కోర్టు అధికారిణి వేలంపాటను మొదలెట్టినా ఎవ్వరూ ముందుకు రాలేదు. మూడేళ్లుగా సైనిక ప్రభుత్వం దిగ్బంధంలో దేశం కల్లోలితంగా మారిన కారణంగా అనిశ్చితిలో ఇంతటి డబ్బు కుమ్మరించేందుకు ఎవరూ సాహసించట్లేరని మీడియాలో వార్తలొచ్చాయి.

ఘన చరిత్రకు నిలువెత్తు నిదర్శనం

యాంగూన్ సిటీలోని బహాన్ టౌన్‌షిప్‌లో ఇన్యా సరస్సు ఒడ్డున చుట్టూ పచ్చికతో తెలుపు వర్ణంలో హుందాగా కనిపించే ఈ '54 యూనివర్సిటీ అవెన్యూ'భవనానికి ఘన చరిత్రే ఉంది. 1953లో ఆంగ్ సాంగ్ సూకీ తన సోదరులు, తల్లితో కలిసి ఈ విల్లాలోకి మకాం మార్చారు. అప్పట్నుంచీ ఈ ఇంట్లోనే ఉంటున్నారు. ప్రస్తుతం మాత్రం ఈ ఇంట్లో ఎవరూ లేరు. సైనిక పాలన అంతానికి పోరాటం ఇక్కడే మొదలెట్టారు. అహింసా ఉద్యమానికి ఇక్కడి నుంచే ఎన్నో వ్యూహరచనలు చేశారు. తదనంతర కాలంలో సైనిక ప్రభుత్వం సూకీని ఈ ఇంట్లోనే గృహనిర్బంధంలో ఉంచింది. ఏకంగా 15 సంవత్సరాలకుపైగా ఆమె ఈ ఇంట్లోనే గృహనిర్బంధంలో ఉండిపోయారు. తర్వాత సైనిక ప్రభుత్వం అంతర్జాతీయ ఒత్తిళ్లకు తలొగ్గి సాధారణ ఎన్నికలు నిర్వహించాక అంగ్ సాన్ ఘన విజయం సాధించి ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని కొలువుతీర్చారు. సూకీ ప్రభుత్వంలో కీలక పదవిలో కొనసాగినప్పుడూ ఈ ఇంట్లోనే ఉన్నారు. బరాక్ ఒబామా, హిల్లరీ క్లింటన్‌సహా ఎందరో ప్రపంచ నేతలు అంగ్‌సాన్‌ను ఈ ఇంట్లోనే భేటీ అయ్యారు. నోబెల్ శాంతి బహుమతి ప్రకటించినప్పుడూ ఆమె ఈ ఇంట్లోనే ఉన్నారు. ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన అంగ్ ప్రభుత్వాన్ని జుంటా సైన్యం 2021 ఫిబ్రవరిలో కూలదోసింది. అంగ్ ప్రభుత్వ పాలనలో పలు రకాల అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని ఈమెపై ఎన్నో రకాల కేసులు నమోదుచేసి ఏకంగా 27 సంవత్సరాల కారాగార శిక్ష విధించడం తెల్సిందే.



2011లో యాంగూన్‌లో తన ఇంటిముందు హిల్లరీ క్లింటన్‌తో అంగ్ సాన్ సూకీ

కోర్టులో వారసత్వ పోరు

రెండెకరాల స్థలంలో నిర్మించిన ఈ విల్లాపై వారసత్వంగా తనకూ హక్కు ఉంటుందని అంగ్‌సాన్ సూకీ అన్నయ్య అంగ్ సాన్ హో 2000 సంవత్సరంలో కోర్టుకెక్కారు. తన వాటా దక్కేలా చేయాలని యాంగూన్ హైకోర్టులో దావా వేశారు. అయితే ఈ దావా వెనుక జుంటా సైనికపాలకుల కుట్ర దాగుందని మీడియాలో వార్తలొచ్చాయి. హో ద్వారా సగం వాటా కొనేసి తర్వాత పూర్తి హక్కును దక్కించుకుని చిట్టచివరకు సూకీ జ్ఞాపకాలు జనం మదిలో లేకుండా దీనిని కూల్చేయాలని సైన్యం కుట్ర పన్నిందని అమెరికా మీడియాలో అప్పట్లో కథనాలు వెలువడ్డాయి. ఈ భవనాన్ని జాతీయ స్మారకంగా మార్చాలని విపక్ష 'నేషనల్ యూనిటీ గవర్నమెంట్ ఆఫ్ మయన్మార్' డిమాండ్ చేసింది. చివరకు ఈ కేసు సుప్రీంకోర్టుకు చేరింది. చట్టప్రకారం అన్నా చెల్లెళ్లకు సమాన వాటా ఉంటుందని ఇంటిని వేలంవేయాలని తీర్పు ఇచ్చింది. దీంతో గత ఏడాది మార్చి 20న తొలిసారి, ఆగస్టు 15న రెండోసారి వేలంవేసినా కొనేందుకు ఎవరూ ముందుకు రాలేదు.



ప్రపంచంలో తొలి జన్యుమార్పిడి అశ్వం

అర్జెంటీనాలో సృష్టి

బ్యూనస్ ఎయిర్స్: ప్రపంచంలోనే తొలిసారిగా జన్యుమార్పిడి చేసిన గుర్రాన్ని అర్జెంటీనాలో సృష్టించారు. అర్జెంటీనాలో ఎన్నో అవార్డులు గెల్చుకున్న ఆడ పోలో ప్యూరేఝా అనే గుర్రం నుంచి తీసుకున్న జన్యువులకు కొద్దిపాటి మార్పులు చేసి ఈ కొత్త అశ్వాలను సృష్టించారు. శాస్త్రవేత్తలు క్రిస్పర్-క్యాస్9 విధానాన్ని అవలంభించి పుట్టబోయే గుర్రం మరింత వేగంగా పరిగెత్తేందుకు ఉపకరించేలా ప్యూరేఝా జన్యువుల్లో మార్పులు చేశారు. గత ఏడాది అక్టోబర్, నవంబర్‌లో ఇలా ఐదు అశ్వాలు జన్మించినా తాజాగా ఈ విషయం వెలుగులోకి వచ్చింది. గుర్రాలపై పరుగెత్తుతూ ఆడే పోలో ఆటలో వినియోగించే అశ్వాల జాతికి చెందిన ఈ పోలో ప్యూరేఝా ఇప్పటికే ''అర్జెంటీనా అసోసియేషన్ ఆఫ్ పోలో హార్స్ బ్రీడర్స్ హాల్ ఆఫ్ ఫేమ్''లో చోటు దక్కించుకుంది. ఇది 1998 అర్జెంటీనా ఓపెన్‌లో ఉత్తమ గుర్రంగా అవార్డ్ గెలుపొందింది. మరింత మేలైన జాతి గుర్రాల సృష్టే లక్ష్యంగా అర్జెంటీనాకు చెందిన దిగ్గజ ''కెయిరాన్ ఎస్‌ఏ''బయోటెక్నాలజీ సంస్థ ఈ కొత్త గుర్రాలను సృష్టించింది. కెయిరాన్ సంస్థ గతంలోనూ క్లోనింగ్ చేసిన ఘనత సాధించింది. మూల కణాలనూ వినియోగించింది. ప్రపంచంలోనే తొలిసారిగా జన్యుమార్పిడి పిండాలనూ సృష్టించింది.

ఎక్స్ బయో మళ్లీ మార్చిన మస్క్

వాషింగ్టన్: అమెరికాలో ట్రంప్ ప్రభుత్వంలో కీలకమైన డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫీషియన్సీ(డోజ్) శాఖకు అధిపతిగా ఉన్న ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ మళ్లీ తన సామాజిక మాధ్యమ ఖాతా 'ఎక్స్'లో వివరాలను మార్చారు. ఆయన అకౌంట్ తెరవగానే పేరు కింద కొత్తగా ''వైట్‌హౌస్ టెక్ సపోర్ట్''అనే పదాన్ని చేర్చారు. ప్రపంచ ప్రఖ్యాత సామాజిక మాధ్యమ సంస్థ ట్విట్టర్‌ను కొనుగోలుచేసి దానికి 'ఎక్స్'అని పేరు మార్చినప్పటికీ నుంచీ మస్క్ 'ఎక్స్'లో క్రియాశీలకంగా పోస్టులు పెడుతూనే ఉన్నారు. వైవిధ్యభరితంగా, వివాదాస్పదంగా, నవ్వు తెప్పించేలా పోస్టులు పెడుతూ సోషల్‌మీడియా వేదికపై ఎప్పుడూ ఫేవరెట్‌గా నిలుస్తున్నారు. అందర్నీ ఎగతాళి చేస్తానని చెప్పుకుంటూ గతంలో తన బయోలో చీఫ్ ట్రోల్ ఆఫీసర్(సీటీఓ) అని రాసుకొచ్చారు. బరాక్ ఒబామా కాలంలో యునైటెడ్ స్టేట్స్ డిజిటల్ సర్వీస్(యూఎస్‌డీఎస్)గా మొదలైన అమెరికా ప్రభుత్వ శాఖకు ట్రంప్ తాను అధ్యక్షుడిగా రెండోసారి పగ్గాలు చేపట్టాక డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫీషియన్సీ(డోజ్)గా పేరు మార్చారు. ప్రభుత్వ ఖర్చులను భారీగా తగ్గిస్తూ, కొన్ని శాఖలకు నిధుల అనవసర, అధిక కేటాయింపులను తగ్గిస్తూ, ప్రాధాన్యతగల శాఖలకు కేటాయింపులు పెంచుతూ ఈ డోజ్ నిర్ణయాలు తీసుకుని అధ్యక్షుడికి సలహాలు, సూచనలు, సిఫార్సులు చేస్తుంది. డోజ్‌కు ప్రస్తుతం మస్క్ చీఫ్‌గా కొనసాగుతున్నారు. ''యూఎస్‌డీఎస్ ఇప్పుడు డోజ్‌గా మారాల్సిన తరుణం ఆసన్నమైంది. అందుకే మార్చాశాం. అమెరికా ప్రభుత్వ కంప్యూటర్ వ్యవస్థలన్నింటినీ ఆధునీకరిస్తాం''అని మస్క్ అన్నారు.

వైట్‌హౌస్‌పై మస్క్ కన్ను !

''డోజ్ విభాగం తెగ పనిచేస్తోంది. వారానికి మేం 120 గంటలు పనిచేస్తున్నాం''అని గత వారం మస్క్ చేసిన వ్యాఖ్యలపై నెటిజన్లు వ్యంగ్య వ్యాఖ్యలు చేస్తున్నారు. అమెరికా మేగజైన్ 'వైర్డ్'సైతం ఇలాగే స్పందించింది. ''వాస్తవానికి మస్క్ అక్కడేం చేయట్లేదు. వాషింగ్టన్ డీసీలోని డోజ్ ప్రధాన కార్యాలయంలో నిద్రపోతున్నాడు''అని ఒక కథనంలో పేర్కొంది. అసలు పనిపై దృష్టి తగ్గించేసి అమెరికా అధ్యక్ష భవనంలో పాగా వేసేందుకు మస్క్ ప్రయత్నిస్తున్నాడని వార్తలొచ్చాయి. వైట్‌హౌస్‌లోని వెస్ట్ వింగ్ అయిన ఓవెల్ ఆఫీస్‌లో తన పరపతి పెంచుకునేందుకు ప్రయత్నిస్తున్నాడని తెలిసింది. అయితే దీనిపై ట్రంప్ స్పందించారు. ''మస్క్, ఆయన బృందానికి వేరే చోట వేరే ఆఫీస్ సిద్ధంచేస్తాం. ఆ ఆఫీస్ ఓవెల్ ఆఫీస్‌లో భాగంగా ఉండబోదు. ఓవెల్ ఆఫీస్ కేవలం అధ్యక్షుడిగా కార్యనిర్వాహణ ఉత్తర్వులు ఇవ్వడానికే వినియోగిస్తా''అని ట్రంప్ స్పష్టంచేశారు.

ఆర్‌ఎస్‌ఎస్ అజెండా అమలుకు కేంద్రం ప్రయత్నం

యూజీసీ ముసాయిదాపై రాహుల్ మండిపాటు

న్యూఢిల్లీ: విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో ఉపాధ్యాయులు, విద్యా సిబ్బంది నియామకాలకు సంబంధించి యూజీసీ ముసాయిదా నిబంధనలపై కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. దేశంలో 'ఒకే చరిత్ర, ఒక సంప్రదాయం, ఒకే భాష' అనే ఆర్‌ఎస్‌ఎస్(రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్) సిద్ధాంతాన్ని అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నమని ఆయన ఆరోపించారు. యూజీసీ ముసాయిదాకు వ్యతిరేకంగా గురువారం డీఎంకే చేపట్టిన నిరసన కార్యక్రమంలో రాహుల్ ప్రసంగించారు. దేశంలో ఇతర చరిత్రలు, సంస్కృతీసంప్రదాయాలను నిర్మూలించడమే ఆర్‌ఎస్‌ఎస్ లక్ష్యమన్నారు. ఇదే ఉద్దేశంతో రాజ్యాంగంపైనా దాడి చేస్తోందని విమర్శించారు. యూజీసీ ముసాయిదా ఇందులో భాగమని చెప్పారు. వివిధ రాష్ట్రాల విద్యా విధానంతో ఈ అజెండాను ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం చేస్తోందన్నారు. 'ప్రతి రాష్ట్రానికీ దానికంటూ సంప్రదాయాలు, చరిత్ర, భాష ఉన్నాయి. అందుకే మన దేశాన్ని రాజ్యాంగం యూనియన్ ఆఫ్ స్టేట్స్‌గా పేర్కొంది. అన్ని చరిత్రలు, సంప్రదాయాలు, భాషలు అన్నీ కలిస్తేనే భారత్, యూనియన్ ఆఫ్ స్టేట్స్ అయ్యింది. మనం అన్ని భాషలను, సంస్కృతీసంప్రదాయాలను, చరిత్రలను గౌరవించాలి. అర్థం చేసుకోవాలి'అని రాహుల్ చెప్పారు. 'తమిళులకంటూ ఒక చరిత్ర, భాష, సంప్రదాయాలు, వారికంటూ సొంత పోరాటాలు ఉన్నాయి. కానీ, యూజీసీ ప్రతిపాదించిన నిబంధనలు తమిళ ప్రజలకే కాదు, అన్ని రాష్ట్రాల ప్రజలకూ అవమానకరమే. ఆర్‌ఎస్‌ఎస్ వీటి ద్వారా పెత్తనం చెలాయించాలని చూస్తోంది'అని ఆరోపించారు.

'డిస్కవరీ' సిబ్బందికి భద్రత కల్పించండి

ఆసారాం బాపు డాక్యుమెంటరీపై సుప్రీం ఆదేశాలు

న్యూఢిల్లీ: వివాదాస్పద ఆధ్యాత్మిక గురువు ఆసారాం బాపు అనుచరుల నుంచి బెదిరింపులు వస్తున్న నేపథ్యంలో 'డిస్కవరీ కమ్యూనికేషన్స్ ఇండియా' అధికారులకు భద్రత కల్పించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. 'కల్ట్ ఆఫ్ ఫియర్: ఆసారాం బాపు'పేరుతో ప్రసారమవుతున్న డాక్యుమెంటరీపై బెదిరింపులు వస్తున్నాయని శశాంక్ వాలియా తదితరులు జనవరి 30వ తేదీన పిటిషన్ వేశారు. ఈ నేపథ్యంలో తాము బయటకు వెళ్లలేకపోతున్నామన్నారు. ముంబైలోని డిస్కవరీ కార్యాలయం వద్ద ఆసారాం బాపు అనుచరులు పెద్ద సంఖ్యలో గుమికూడి, లోపలికి ప్రవేశించేందుకు యత్నించారన్నారు. దీంతో ఉద్యోగుల భద్రతను దృష్టిలో ఉంచుకుని వర్క్ ఫ్రం హోంను అమలు చేయాల్సి వచ్చిందన్నారు. ఈ పిటిషన్‌పై గురువారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్‌ల ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్లు శశాంక్ వాలియా తదితరులతోపాటు వారి కార్యాలయాలకు రక్షణ కల్పించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. పిటిషనర్లకు బెదిరింపులు రాకుండా చూడాలని, భౌతిక దాడులు జరక్కుండా కోరుతూ తదుపరి విచారణను మార్చి 3వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు కేంద్రంతోపాటు మహారాష్ట్ర, కర్ణాటక, హరియాణా, తమిళనాడు, తెలంగాణ, పశ్చిమబెంగాల్, ఢిల్లీ ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది.

నైజీరియా స్కూల్‌లో అగ్ని ప్రమాదం

17 మంది బాలలు మృత్యువాత

అబూజా: నైజీరియాలోని ఓ ఇస్లామిక్ పాఠశాలలో చోటుచేసుకున్న ఘోర అగ్ని ప్రమాదంలో కనీసం 17 మంది బాలలు మృత్యువాతపడ్డారు. మరో 17 మంది తీవ్ర గాయాలతో ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. జంఫారా రాష్ట్రం కౌరా నమోడా జిల్లాలో బుధవారం ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ప్రమాదం జరిగిన సమయంలో స్కూల్‌లో 100 మంది వరకు విద్యార్థులున్నట్లు అధికారులు తెలిపారు. ప్రమాదానికి కారణం కచ్చితంగా తెలియలేదు. అయితే, స్కూలు ఆవరణలో పెద్ద ఎత్తున నిల్వ చేసిన నోటిని శుభ్రం చేసుకోవడానికి వాడే పుల్లలే కారణమై ఉంటాయని భావిస్తున్నారు.

ఛత్తీస్‌గఢ్‌లో నలుగురు మావోయిస్టులు మృతి

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణపూర్ జిల్లాలో గురువారం జరిగిన ఎదురుకాల్పుల్లో నలుగురు మావోయిస్టులు మృతి చెందారు. నారాయణపూర్ జిల్లా అబూజ్‌బడ్ అడవుల్లోని మాడ్ ప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నారనే సమాచారంతో పోలీసులు కూంబింగ్ చేపట్టారు. ఈ క్రమంలో ఇరువర్గాలు తారసపడటంతో ఎదురుకాల్పులకు దారితీసింది. ఘటనలో నలుగురు మావోయిస్టులు మృతి చెందారు. పలువురు మావోయిస్టులు తప్పించుకుపోయారని భావిస్తున్న అధికారులు, అదనంగా బలగాలను రప్పించి కూంబింగ్ ముమ్మరం చేసినట్లు సమాచారం.

కూలిన మిరాజ్ విమానం.. పైలట్లు సురక్షితం



గాయపడిన పైలట్

గ్వాలియర్: మధ్యప్రదేశ్ రాష్ట్రం శివపురి జిల్లాలో గురువారం భారత వాయుసేన(ఐఏఎఫ్)కు చెందిన మిరాజ్-2000 యుద్ధ విమానం కూలింది. రోజువారీ శిక్షణ సమయంలో సాంకేతిక లోపం తలెత్తడంతో ప్రమాదం జరిగిందని ఐఏఎఫ్ తెలిపింది. ఈ ఘటనలో పైలట్లు ఇద్దరూ సురక్షితంగా బయటపడ్డారంది. స్వల్పగాయాలైన ఇద్దరినీ హెలికాప్టర్‌లో గ్వాలియర్‌కు తరలించారు. బర్హెటా సాని గ్రామ సమీపంలో ఉండగా మధ్యాహ్నం 2.40 గంటల సమయంలో రెండు సీట్లుండే ఈ విమానంలో మంటలు చెలరేగాయని వివరించింది. విమానం పొలాల్లో కూలిపోయిందని తెలిపింది. ఘటనపై కోర్ట్ ఆఫ్ ఎంక్వైరీకి ఆదేశించారని వెల్లడించింది.

ఈసారి కొత్తగా 'పరీక్షా పే చర్చ'

- 10న పాల్గొనున్న ప్రధాని మోదీ
- దీపికా పదుకొణే, మేరీ కోమ్, సద్గురు తదితరులు కూడా

న్యూఢిల్లీ: విద్యార్థుల్లో పరీక్షలంటే జంకు పోగొట్టే ఉద్దేశంతో ప్రధాని మోదీ ఏటా నిర్వహించే పరీక్షా పే చర్చ(పీపీసీ) 8వ ఎడిషన్ ఈసారి కొత్త ఫార్మాట్‌లో రానుంది. నటి దీపికా పదుకొణే, బాక్సర్ మేరీ కోమ్, ఆధ్యాత్మికవేత్త సద్గురు వంటి ప్రముఖ వ్యక్తులు జీవితం, అధ్యయనానికి సంబంధించిన తమ అనుభవాలను విద్యార్థులతో పంచుకోనున్నారు. టౌన్ హాల్‌లో బదులు ఈ దఫా ప్రధాని మోదీ ఈ నెల 10న 35 మంది విద్యార్థులను చారిత్రక సుందర్ నర్సరీ పార్కుకు తీసుకెళ్లనున్నారు. వీరిని దేశంలోని వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన స్కూళ్ల నుంచి ఎంపిక చేశారు. సుందర్ నర్సరీ పార్కులో పరీక్షలు, ఒత్తిడిని జయించడం వంటి అంశాలపై వీరితో ప్రధాని మోదీ ముచ్చటించనున్నారని అధికారులు వివరించారు. ఈ కార్యక్రమం దూరదర్శన్, స్వయం ప్రభ, స్వయం, పీఎంఓ యూట్యూబ్ చానెల్‌తోపాటు విద్యాశాఖ సోషల్ మీడియా చానెళ్లలో ఉదయం 11 గంటలకు ప్రసారం కానుంది. మరో 100 మంది విద్యార్థుల బృందం పారాలింపిక్ బంగారు పతక విజేత అవనీ లేఖరా, బాడ్మింటన్ ప్లేయర్ సుహాస్ యతిరాజ్ నటి భూమి పడ్నేకర్ వంటి వారితో జరిగే ముఖాముఖిలో పాల్గొంటుంది. గతేడాది పీపీసీ ఏడో ఎడిషన్ ప్రగతి మైదాన్‌లోని భారత్ మండపంలో జరిగింది.

మహిళల క్రీడల్లో పాల్గొనకుండా ట్రాన్స్‌జెండర్ మహిళలపై నిషేధం

ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై అధ్యక్షుడు ట్రంప్ సంతకం

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో వివాదాస్పద నిర్ణయం తీసుకున్నారు. ట్రాన్స్‌జెండర్ మహిళలు ఇకపై మహిళల క్రీడల్లో పాల్గొనడానికి వీల్లేకుండా నిషేధం విధించారు. ఈ మేరకు బుధవారం కార్యనిర్వాహక ఉత్తర్వుపై ట్రంప్ సంతకం చేశారు. మహిళల క్రీడల నుంచి పురుషులను బహిష్కరిస్తున్నట్లు ప్రభుత్వం స్పష్టంచేసింది. ఈ ఉత్తర్వుతో మహిళల క్రీడలకు స్వేచ్ఛ లభించినట్లేనని ట్రంప్ ప్రకటించారు. ఇకపై మహిళలు పాల్గొనే క్రీడల్లో ట్రాన్స్‌జెండర్లు భాగస్వాములైతే సదరు క్రీడల నిర్వాహకులపై జరిమానా విధించే అవకాశం ఉంది. నిబంధనలు అతిక్రమిస్తే ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందదు. తమ దేశంలో పురుషులు, మహిళలు అనే రెండు వర్గాలకే గుర్తింపు ఉంటుందని, ట్రాన్స్‌జెండర్ అనే వర్గాన్ని గుర్తించడం లేదని ట్రంప్ గతంలోనే ప్రకటించారు. రెండోసారి అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ట్రాన్స్‌జెండర్ల విషయంలో ఆయన కఠినంగా వ్యవహరిస్తున్నారు.

భారతదేశంలో మొదటిసారి అడుగుపెట్టిన ఆంగ్లేయుడు ఎవరు?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ హిస్టరీ

పోర్చుగీసు నావికుడైన వాస్కోడిగామా అట్లాంటిక్ సముద్రం ద్వారా ప్రయాణించి ఆఫ్రికా దక్షిణాన ఉన్న గుడ్‌హోప్ అగ్రాన్ని చేరుకున్నాడు. ఆ తర్వాత హిందూ మహాసముద్రం ద్వారా 1498లో భారతదేశ పశ్చిమ తీరాన ఉన్న కాలికట్‌ను చేరుకున్నాడు. ఈ సంఘటన భారతదేశ చరిత్రలో కీలక మలుపునకు నాంది పలికింది. వాస్కోడిగామా చూపిన మార్గంలో అనేక మంది యురోపియన్లు భారత్ బాటపట్టారు. మొదట వీరంతా వర్తకం కోసం భారత్‌లోకి ప్రవేశించారు. ఆ తర్వాత మనదేశంపై పూర్తి గుత్తాధిపత్యం సాధించారు.

ఆధునిక భారతదేశ చరిత్ర

వాస్కోడిగామా చూపిన మార్గంలో అనేక మంది పోర్చుగీసు వర్తకులు భారతదేశానికి వచ్చారు. 1503లో ఫ్రాన్సిస్-డి-అల్మీడా భారతదేశంలోని పోర్చుగీస్ స్థావరాలకు మొదటి గవర్నర్‌గా నియామకమయ్యాడు. ఇతడు నీలి నీటి విధానం (Blue Water Policy)ను విస్తరింపజేశాడు. అల్‌ఫెన్సో-డి-అల్బ్‌కర్క్ 1509 నుంచి 1515 వరకు భారత్‌లో రెండో పోర్చుగీసు గవర్నరుగా పని చేశాడు. ఇతడు పోర్చుగీస్ సామ్రాజ్యానికి పునాదులు వేశాడు. గోవాను, పర్షియా సింధుశాఖలోని హార్మోజ్‌ను 1510లో ఆక్రమించాడు.

ఆంగ్లేయుల రాక..

భారతదేశంలో మొదటిసారి అడుగుపెట్టిన ఆంగ్లేయుడు ఫాదర్ థామస్ స్టీవెన్స్. ఇతడు 1579లో గోవా చేరాడు. 1600లో ఎలిజబెత్ రాణి (లండన్) అనుమతితో భారతదేశంలో వాణిజ్యం చేయడానికి 'ఈస్టిండియా కంపెనీ'ని స్థాపించాడు. 1611లో కెప్టెన్ జేమ్స్ హాకిన్స్ భారతదేశం వచ్చి మొదటి జేమ్స్ ఉత్తరంతో మొగలు పాదుషా జహంగీర్‌ను కలుసుకున్నాడు. జహంగీర్ అనుమతితో ఇతడు 1612లో సూరత్‌లో మొదటి కర్మాగారం స్థాపించాడు. తర్వాత అహ్మదాబాద్, ఆగ్రా, హుబ్లీ, కాశింబజార్, ఢాకాలో కర్మాగారాలు ఏర్పాటు చేశాడు. ఆంగ్లేయులు భారతదేశంలో ప్రధానంగా దుస్తులు, నల్లమందు వ్యాపారం చేసేవారు. పోర్చుగీసువారితో బ్రిటిషర్లకు ఆధిపత్య పోరు మొదలైంది. 1614లో ఈస్టిండియా కంపెనీవారు పోర్చుగీసువారిని 'సూరత్' సమీపంలో ఓడించారు. 1618లో మొదటి జేమ్స్ రాయబారిగా సర్ థామస్ (1615–19) జహంగీర్ ఆస్థానానికి వచ్చి రెండు 'ఫర్మానా'లు పొందాడు. వీటిలో మొదటిది భారతదేశంలో వాణిజ్యం చేసుకోవడానికి అనుమతించడం. రెండోది స్వదేశీ వాణిజ్యంపై సుంకాలు తగ్గించడం. దక్షిణ భారతదేశంలో మొదటి కర్మాగారాన్ని మచిలీపట్నంలో స్థాపించారు. 1641లో సెయింట్-జార్జికోట (మద్రాసు) ను నిర్మించారు.

1654లో ఇంగ్లిష్ కంపెనీ వాణిజ్య ఆధిపత్యాన్ని పోర్చుగీస్ గుర్తించింది. 1661లో పోర్చుగీస్ వారు బ్రిటిష్ రాజైన రెండో చార్లెస్‌కు బొంబాయిని కట్నంగా ఇచ్చారు. 1698లో ఈస్టిండియా కంపెనీ సత్నాటి, కాలికట, గోవిందపూర్ ప్రెసిడెన్సీల్లో జమీందారీ హక్కులు పొందింది. ఆ తర్వాత ఈ మూడు ప్రెసిడెన్సీలను కలిపి 'కలకత్తా' నగరాన్ని ఏర్పాటు చేశారు. 1690లో జాబ్ చార్నాక్ కలకత్తాకు శంకుస్థాపన చేశాడు. 1696లో ఇక్కడ జార్జి విలియం కోట నిర్మాణం మొదలైంది. 1746 నుంచి 1763 వరకు బ్రిటిషర్లు, ఫ్రెంచివారి మధ్య ఆధిపత్యం కోసం మూడు కర్ణాటక యుద్ధాలు జరిగాయి. ఇందులో మూడో కర్ణాటక యుద్ధం (1758–63) ముఖ్యమైంది. 1760లో వాండివాష్ యుద్ధంలో ఇంగ్లిషువారు, ఫ్రెంచివారిని ఓడించి పూర్తి ఆధిపత్యం సాధించారు. 1756లో బెంగాల్ నవాబైన సిరాజుద్దౌలా కలకత్తా పోర్టును ఆక్రమించి చీకటి గది ఉదంతానికి కారకుడయ్యాడు. 1757లో ప్లాసీ యుద్ధంలో సిరాజుద్దౌలాను ఓడించి ఇంగ్లిషువారు కలకత్తాను తిరిగి ఆక్రమించుకున్నారు. 1759లో ఇంగ్లిష్ కంపెనీవారు డచ్‌వారిని బెదరా యుద్ధంలో ఓడించారు. 1764 బక్సార్ యుద్ధం విజయంతో ఉత్తర భారతంలో బ్రిటిషర్ల ఆధిపత్యానికి తిరుగులేకుండా పోయింది. ఈ విజయం కారణంగా 1767లో బెంగాల్‌లో ద్వంద్వ ప్రభుత్వం ఏర్పాటైంది.



1664లో ఫ్రెంచ్ ఈస్టిండియా


కంపెనీని 14వలూయీ మంత్రి కోల్బర్ట్ స్థాపించాడు. 1667లో ఫ్రాంకోయిస్ కరన్ 'సూరత్'లో ఫ్యాక్టరీని స్థాపించాడు. ఫ్రాన్సిస్కో మార్టిన్ 1673లో ముస్లిం గవర్నర్ నుంచి అనుమతి పొంది పాండిచ్చేరికి పునాదులు వేశాడు. ఇతడు 1764లో గవర్నర్‌గా నియమితుడయ్యాడు. ఫ్రెంచ్‌వారు 1674లో షాయిస్థాఖాన్ నుంచి అనుమతి పొంది బాలాసోర్, కాశిం బజార్, చంద్రనాగూర్ వద్ద ఫ్యాక్టరీలు నిర్మించుకున్నారు. 1674లో డూప్లే పాండిచ్చేరి గవర్నర్‌గా నియమితుడయ్యాడు. ఇతడు రెండు ఆస్ట్రియా వారసత్వ యుద్ధాలు చేశాడు.

డచ్ కంపెనీ

డచ్చివారు యూరప్‌లోని హాలెండ్ (నెదర్లాండ్స్) దేశానికి చెందినవారు. వీరు 1602లో డచ్ ఈస్టిండియా కంపెనీ స్థాపించారు. వీరు తూర్పు ఇండియా సుగంధ దీవులపై దృష్టి కేంద్రీకరించారు. 1604లో గోల్కొండ నవాబు అనుమతితో మచిలీపట్నంలో మొదటి డచ్చి వర్తక స్థావరం ఏర్పాటు చేశారు. 1610లో పులికాట్ వద్ద స్థావరాన్ని నిర్మించుకున్నారు.

గవర్నర్ జనరల్స్

వారన్ హేస్టింగ్స్ (1772-85)



వారన్ హేస్టింగ్స్ 1772లో బెంగాల్ గవర్నర్‌గా నియమితులయ్యాడు. ఇతడు 1773 నుంచి 1785 వరకు గవర్నర్ జనరల్‌గా పనిచేశాడు. 1773లో ద్వంద్వ ప్రభుత్వాన్ని రద్దు చేశాడు. 1773లో రెగ్యులేటింగ్ చట్టం చేశారు. దీంతో కంపెనీకి తూర్పుదేశ వర్తకంపై గుత్తాధిపత్యం లభించింది. వారన్ హేస్టింగ్స్ రాజధానిని ముర్షిదాబాద్ నుంచి కలకత్తాకు మార్చాడు. సివిల్ న్యాయస్థానానికి కలెక్టరును, క్రిమినల్ న్యాయస్థానానికి భారతీయుడిని న్యాయాధిపతిగా నియమించాడు. న్యాయ సంస్కరణలలో భాగంగా ముఖ్యంగా జిల్లాల్లో 'దివానీ', 'ఫౌజ్‌దారీ' అదాలత్‌లను ప్రవేశపెట్టాడు. ప్రెసిడెన్సీ (కలకత్తా)లలో సాదర్, దివానీ సాదర్, నిజామత్ అదాలత్‌లను ఏర్పాటు చేసి హిందూ, ముస్లిం చట్టాలు అమలు చేశాడు. 1784లో బ్రిటిషర్లు పిట్స్ ఇండియా చట్టం చేశారు.

కారన్ వాలిస్ (1786-93)




ఇతడు సివిల్ సర్వీసులను ప్రవేశపెట్టాడు. ప్రభుత్వ యంత్రాంగంలో సంస్కరణలు ప్రవేశపెట్టాడు. వివిధ స్థాయిల్లో కోర్టులను ఏర్పాటు చేశాడు. న్యాయశాఖ నుంచి పరిపాలన శాఖను వేరుపరిచాడు. 1793లో శాశ్వత శిస్తు విధానం ప్రవేశపెట్టాడు. న్యాయ విచారణ పద్ధతిని రాయించాడు. న్యాయ పద్ధతిపై కారన్ వాలీస్ కోడ్‌ను పొందుపరిచాడు. మూడో మైసూర్ యుద్ధంలో టిప్పుసుల్తాన్‌ను ఓడించి రాజ్యంలో సగభాగాన్ని తీసుకున్నాడు.

సర్ జాన్‌షోర్ (1793-98)

శాశ్వత శిస్తు విధానంలో ఇతడి పాత్ర ప్రధానమైంది. జాన్‌షోర్ కాలంలో బ్రిటిష్ పార్లమెంట్ 1793లో చార్టర్ చట్టం చేసింది.

లార్డ్ వెల్లస్లీ (1798-1805)



ఇతడు ఉద్యోగుల శిక్షణ కోసం 1800లో పోర్ట్ విలియం కళాశాల స్థాపించాడు. సంస్థానాధీశులను సామంతులుగా చేసుకున్నాడు. నాలుగో మైసూర్ యుద్ధంలో టిప్పుసుల్తాన్‌ను ఓడించాడు. 1798లో సైన్య సహకార పద్ధతిని ప్రవేశపెట్టాడు. దీనికి మొదటగా హైదరాబాద్ నిజాం అంగీకరించి ఒప్పందం చేసుకున్నాడు. వెల్లస్లీ రెండో మరాఠా యుద్ధం చేశాడు. ఇతడి కాలంలో మద్రాస్ ప్రెసిడెన్సీ ఏర్పడింది.

- 1805 నుంచి 1807 వరకు జార్జ్‌బార్లో గవర్నర్ జనరల్‌గా పని చేశాడు. ఇతడి కాలంలో వెల్లూరు తిరుగుబాటు జరిగింది.

మొదటి లార్డ్ మింటో (1807-1813)

ఇతడి కాలంలో 1813లో చార్టర్ చట్టం చేశారు. రంజిత్ సింగ్‌తో అమృత్‌సర్ ఒప్పందం చేసుకున్నాడు.


లార్డ్ హేస్టింగ్స్ (1813-1823)

ఇతడు నేపాల్ యుద్ధం, మూడో మరాఠా యుద్ధం చేశాడు. పీష్వా పదవి రద్దు చేశాడు. బొంబాయి ప్రెసిడెన్సీ ఏర్పాటు చేశాడు. పిండారులు అనే దారి దోపిడీదారులను అదుపులోకి తెచ్చాడు. బొంబాయి, మద్రాసులో రైత్వారీ పద్ధతి అమలు పరిచాడు. దీనికి సర్ థామస్ మన్రో, ఎల్ఫిన్‌స్టోన్ సహకరించారు. 1817లో కలకత్తాలో ఆంగ్ల మాధ్యమంలో బోధించే హిందూ కళాశాలను స్థాపించాడు. 1813 చట్టంతో ఇంగ్లిష్ ఈస్టిండియా కంపెనీకి చైనాతో పూర్తి స్వేచ్ఛా వాణిజ్యం చేసుకునే వెసులుబాటు కలిగింది. హేస్టింగ్స్ 1799లో పత్రికలపై ఆంక్షలు రద్దు చేశాడు.

లార్డ్ అమ్హెర్స్ట్ (1823-1828)

ఇతడి కాలంలో మొదటి బర్మా యుద్ధం జరిగింది. భరత్‌పూర్‌ను ఆక్రమించాడు.

విలియం బెంటింక్ (1828-1835)



ఇతడు గవర్నర్ జనరళ్లలో గుర్తింపు పొందినవాడు. విలియం బెంటింక్ 'థగ్గులు' అనే దారి దోపిడీ దొంగలను అణచివేశాడు. మైసూర్ రాజును పదవి నుంచి తొలగించాడు. కాచర్, జైంషియా, కూర్గ్‌ను ఆక్రమించాడు. 1828లో బెంగాల్ రాష్ట్రానికే కాకుండా భారతదేశమంతటికీ గవర్నర్ జనరల్‌గా నియమితుడయ్యాడు. 1829లో సతీసహగమనాన్ని నిషేధించాడు. పురిటిలో ఆడ పిల్లలను చంపడం లాంటి దురాచారాలను అదుపు చేశాడు. భారతీయులు ఉన్నత ఉద్యోగాలకు అర్హులని ప్రకటించాడు. బెంటింక్ కలకత్తాలో వైద్య కళాశాలను స్థాపించాడు. 1835లో మెకాలే అధ్యక్షతన న్యాయ సంఘాన్ని నియమించాడు. దీనికి సంబంధించి ఇంగ్లిష్ భాషలో విద్యా బోధన ప్రవేశపెట్టాడు. 1833లో చార్టర్ చట్టంతో స్వేచ్ఛా వాణిజ్యాన్ని ఎత్తేశారు.

- 1835 నుంచి 1836 వరకు సర్ చార్లెస్ మెట్‌కాఫ్ గవర్నర్ జనరల్‌గా పని చేశాడు.
- 1836–42 మధ్య లార్డ్ ఆక్లాండ్ గవర్నర్ జనరల్‌గా ఉన్నాడు. ఇతడు అఫ్గానిస్తాన్‌లో బ్రిటిషర్ల పరాజయం ఫలితంగా పదవి కోల్పోయాడు.

లార్డ్ ఎలెన్‌బరో (1842-44)

ఇతడు సింధ్‌ను బ్రిటిష్ ఇండియాలో విలీనం చేశాడు. ఇతడి కాలంలో మొదటి అఫ్గాన్ యుద్ధం ముగిసింది. ఇతడు గ్వాలియర్ యుద్ధం చేశాడు.

మొదటి లార్డ్ హార్డింజ్ (1844-48)

ఇతడి కాలంలో మొదటి సిక్కు యుద్ధం జరిగింది. ఆంగ్ల మాధ్యమంలో చదివిన భారతీయులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాడు.

లార్డ్ డల్హౌసి (1848-56)

ఇతడు రెండో సిక్కు యుద్ధం తర్వాత పంజాబ్‌ను ఆక్రమించాడు. రెండో బర్మా యుద్ధం తర్వాత బర్మా దిగువ ప్రాంతాన్ని ఆక్రమించాడు. రాజ్య సంక్రమణ సిద్ధాంతాన్ని ప్రవేశపెట్టి సతారా, సంబల్‌పూర్, ఝాన్సీ, నాగ్‌పూర్‌ను ఆక్రమించాడు. అయోధ్యను ఆక్రమించాడు. ఇతడి హయాంలో వితంతు పునర్వివాహ చట్టాన్ని ప్రవేశపెట్టారు. ఇతడి కాలంలో సంతాలులు తిరుగుబాటు చేశారు. ప్రతి రాష్ట్రంలో పబ్లిక్ వర్క్స్ శాఖను ప్రవేశపెట్టారు. 1854లో చార్లెస్ ఉడ్స్ అధ్యక్షుడిగా విద్యకు సంబంధించిన అంశాలపై కమిటీ ఏర్పాటు చేశాడు.

ఈ కమిటీ సూచనలతో విద్యాలయం నుంచి విశ్వవిద్యాలయాల వరకు కీలక సంస్కరణలు ప్రవేశపెట్టాడు. 1853లో రైళ్లు, తంతితపాలా, రోడ్డు రవాణా సౌకర్యాలు ప్రవేశపెట్టాడు. బొంబాయి నుంచి థానే వరకు మొదటి రైల్వే లైన్ వేశారు. కలకత్తా నుంచి పెషావర్ వరకు మొదటి తంతి నిర్మించాడు. 1854లో మొదటిసారిగా తపాలా బిళ్లలను ప్రవేశపెట్టాడు. పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్‌ను ఏర్పాటు చేశాడు. 1853లో చార్టర్ చట్టంతో పోటీ పరీక్షలను ప్రవేశపెట్టారు. ఈ చట్టం వ్యాపార సంస్థలకు.. వ్యాపారంలో తప్ప మిగతా విషయాలతో సంబంధం లేకుండా చేసింది. 1854లో బొంబాయిలో మొదటి నూలు మిల్లు, కలకత్తాలో జనపనార మిల్లును స్థాపించారు.

లార్డ్ కానింగ్ (1856-62)

1857 సిపాయిల తిరుగుబాటు తర్వాత బ్రిటిష్ పార్లమెంట్ 1858లో ఒక చట్టం చేసింది. దీని ప్రకారం బ్రిటిష్ ఇండియాలో 'వైస్రాయ్' పదవిని ఏర్పాటు చేశారు. లార్డ్ కానింగ్ 1858 చట్టం ప్రకారం తొలి రాజప్రతినిధిగా నియమితులయ్యాడు. 1861లో ఇండియా కౌన్సిళ్ల చట్టం ప్రవేశపెట్టారు. 1859లో రాజ్య సంక్రమణ సిద్ధాంతాన్ని రద్దు చేశారు. 1858లో భారత శిక్షాస్మృతి, 1861లో హైకోర్టు చట్టాన్ని ప్రవేశపెట్టారు. 1865లో లారెన్స్ మూడు హైకోర్టులను స్థాపించాడు. 1857లో కానింగ్ కలకత్తా, బొంబాయి, మద్రాసులో విశ్వవిద్యాలయాలు స్థాపించాడు. ఇతడి కాలంలో 1859లో శ్వేత సైనికుల విప్లవం, 1860లో నీలి మందు రైతుల తిరుగుబాటు, 1863లో పాబ్నా రైతుల తిరుగుబాటు చెలరేగాయి.

సముద్ర అడుగు భాగంలో ఉండే జీవులను ఏమంటారు?

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

బయాలజీ

బయాలజీ - నమూనా ప్రశ్నలు (ఎస్‌ఏ)

1. హారిక బ్రెడ్‌ను ఆహారంగా తీసుకోవాలను కుంది. ప్యాకెట్ తెరిచి చూస్తే అది చెడిపోయినట్లు వాసన వచ్చింది. భూతద్దంతో పరిశీలిస్తే తంతువుల లాంటి పోగులు కనిపించాయి. ఆమె గుర్తించిన సూక్ష్మజీవులు ఏ రకానికి చెందుతాయి?
   1) శైవలాలు 2) శిలీంధ్రాలు
   3) బ్యాక్టీరియా 4) వైరస్
2. ఎల్లోస్పాట్‌లో ఎక్కువ సంఖ్యలో ఉండే కణాలు?
   1) దండాలు 2) రోమాలు
   3) కోనులు 4) ఉపకళా కణాలు
3. క్షయకరణ విభజనకు సంబంధించి కింది వాటిలో సరైంది ఏది?
   1) ప్రత్యుత్పత్తి కణాల్లో జరుగుతుంది
   2) క్రోమోజోముల సంఖ్య సగానికి తగ్గించడానికి ఉపకరిస్తుంది
   3) జీవుల్లో క్రోమోజోముల సంఖ్య స్థిరంగా ఉండటానికి దోహదపడుతుంది
   4) ఇది శారీరక కణాల్లోనే జరుగుతుంది
4. సంక్లిష్ట కణజాలాలకు ఉదాహరణ ఇవ్వండి అని ఉపాధ్యాయుడు అడిగినప్పుడు నలుగురు విద్యార్థులు కిందివిధంగా సమాధానం చెప్పారు. వీటిలో సరైనవి ఏవి?
   శేఖర్ – దృఢ కణజాలం
   శ్వేత – మృదు కణజాలం
   శ్రియ – దారు కణజాలం
   శంకర్ – పోషక కణజాలం
   1) శేఖర్, శంకర్
   2) శ్వేత, శ్రియ
   3) శ్రియ, శంకర్
   4) శ్వేత, శేఖర్
5. క్లోమరసంలో కీమోట్రిప్సిన్ అనే ఎంజైమ్ ఏ పదార్థాన్ని వేటిగా మారుస్తుంది?
   1) కొవ్వులు – కొవ్వు ఆమ్లాలు
   2) ప్రోటీన్లు– పెప్టైడులు
   3) పిండి పదార్థాలు – మాల్టోజ్
   4) పిండి పదార్థాలు – పెప్టోనులు
6. మొక్కల్లో లెగుమినేసి – రైజోబియం మాదిరిగా జంతువుల్లో...?
   1) పీతలు – సముద్ర జంతువులు
   2) పీతలు – సీ ఎనిమోన్లు
   3) ఆల్చిప్పలు – జలగలు
   4) సముద్ర నక్షత్రం – షార్క్ చేప
7. రాడ్యులా కలిగి ఉన్న జీవికి ఉదాహరణ?
   1) దోమ 2) వానపాము
   3) నత్త 4) కప్ప
8. మానవ శరీరంలో అతి చిన్న ఎముకను కలిగి ఉండే అవయవం ఏది?
   1) కన్ను 2) చెవి
   3) ముక్కు 4) కపాలం
9. వినాళ గ్రంథులకు సంబంధించి కిందివాటిలో సరికాని ప్రవచనం?
   1) జీర్ణ రసాలను స్రవించవు
   2) అంతఃస్రావ గ్రంథులు అని కూడా అంటారు
   3) వీటి స్రావాలు నాళాల ద్వారా అవసరమైన చోటుకు ప్రవహిస్తాయి
   4) వీటి స్రావాలను హార్మోన్లు అంటారు
10. కిందివాటిలో వేటిలో పుపుస శ్వాసక్రియ జరగదు?
    ఎ. కప్ప బి. పావురం
    సి. చేపలు డి. టాడ్‌పోల్ లార్వా
    1) ఎ,బి
    2) ఎ, డి
    3) బి, సి
    4) సి, డి
11. ఎర్రరక్తకణాల శ్మశాన వాటిక అని ఏ అవయవాన్ని పేర్కొంటారు?
    1) ప్లీహం 2) కాలేయం
    3) ఊపిరితిత్తులు 4) ఎముక మజ్జ
12. విత్తనాలు లేని ఫలాలు ఏర్పడటానికి ఉపయోగపడే రసాయన పదార్థం?
    1) ఆక్సిన్లు 2) ఆబ్‌సిసిక్ ఆమ్లం
    3) ఇథిలీన్ వాయువు 4) జిబ్బరెల్లిన్లు
13. పన్నెండు జతల కపాల నాడుల్లో హృదయ స్పందన నియంత్రించే వేగస్ నాడీ ఎన్నోది?
    1) 9 2) 12 3) 10 4) 8
14. రవి కోపం, బాధ, ఆనందం లాంటి భావావేశాలను నియంత్రించుకోలేకపోతున్నాడు. అతడి మెదడులోని ఏ భాగంలో లోపం ఉండవచ్చు?
    1) అనుమస్తిష్కం
    2) ద్వారగోర్ధం
    3) మజ్జాముఖం
    4) ఘ్రాణలంబికలు
15. సినర్జిడ్లు అనేవి మొక్కల్లోని ఏ భాగానికి సంబంధించినవి?
    1) పరాగకోశం 2) పిండకోశం
    3) వేరు పోషక కణాలు
    4) శిఖరాగ్ర మొగ్గలు
16. సయాన్, స్టాక్ అనేవి వేటిలో కనిపిస్తాయి?
    1) కోరకీభవనం 2) కణజాలవర్ధనం
    3) అంటుకట్టడం 4) ఫలదీకరణం
17. కిందివాటిలో ఏ రెండు జీవుల్లో బాహ్య ఫలదీకరణం జరుగుతుంది?
    ఎ. బొద్దింక బి. వానపాము
    సి. కప్ప డి. పాము
    1) ఎ, బి
    2) బి, సి
    3) సి, డి
    4) ఎ, డి
18. రాజేష్ వైద్యుడిని సంప్రదించినప్పుడు అతడు ప్రోటీన్లతో కూడిన ఆహార పదార్థాలు ఎక్కువగా తీసుకోకపోవడం వల్ల వ్యాధిగ్రస్తుడయ్యాడని తెలిపాడు. రాజేష్‌కు ఏ వ్యాధి వచ్చి ఉండవచ్చు?
    1) క్వాషియోర్కర్ 2) రికెట్స్
    3) అనీమియా 4) జీరాఫ్తాల్మియా
19. జ్యోతి అనే గృహిణి ఆహార పదార్థాలను అతిగా ఉడకబెడుతుంది. వారి కుటుంబ సభ్యుల్లో ఏ విటమిన్ లోపం ఉండవచ్చు?
    1) రెటినాల్
    2) కాల్సిఫెరాల్
    3) ఫోలిక్ ఆమ్లం
    4) నియాసిన్
20. మలేరియా పరాన్నజీవి జీవితచక్రంలో షైజాంట్ దశ ఎక్కడ అభివృద్ధి చెందుతుంది?
    1) కాలేయ కణాలు
    2) లాలాజల గ్రంథులు
    3) ఎర్రరక్తకణాలు 4) జీర్ణాశయ గోడలు
21. ఎముకల సామాన్య విరుపునకు మరో పేరు?
    1) జటిల ఎముకల విరుపు
    2) మూసివేసిన ఎముకల విరుపు
    3) లేత ఎముక విరుపు
    4) బహిర్గత ఎముక విరుపు
22. కండరాలు ఉత్తేజం చెంది సంకోచస్థితిలోనే ఉండిపోవడాన్ని టిటాని అంటారు. ఈ స్థితికి కారణం?
    1) సమతుల ఆహార లోపం
    2) వాసోప్రెస్సిన్ తగినంత ఉత్పత్తి కాకపోవడం
    3) ఆహార పదార్థాల్లో తగినంత అయోడిన్ లేకపోవడం
    4) పారాథార్మోన్ అధికంగా ఉత్పత్తవడం
23. మెదడులోని ఏ భాగం అతి ముఖ్యమైన శ్వాసక్రియ, హృదయ స్పందన, రక్త పీడనం, శరీర ఉష్ణోగ్రత, లాలాజలం స్రవించడం లాంటి క్రియలను నియంత్రిస్తుంది?
    1) ద్వారగోర్ధం 2) మజ్జాముఖం
    3) పిట్యూటరీ గ్రంథి
    4) మస్తిష్క గోళార్ధాలు
24. ఒక మొక్క కణం పూర్తి మొక్కను ఇవ్వగలిగే శక్తిని ఏమంటారు?
    1) టోటిపొటెన్సీ 2) కాలస్
    3) ఎక్స్‌ప్లాంట్ 4) సయాన్
25. కిందివాటిలో ఏ రెండు ఆవశ్యక అమైనో ఆమ్లాలు కావు?
    ఎ. ఐసోటాసిన్ బి. గ్లిసరాల్
    సి. లైజీన్ డి. లిపిడ్లు
    1) ఎ, బి
    2) బి, డి
    3) ఎ, సి
    4) బి, సి
26. కిందివాటిలో నీటిలో, కొవ్వులో కరిగే విటమిన్లకు సంబంధించి సరైన క్రమం?
    1) BDE - ACK
    2) AEKC - BD
    3) BC - ADEK
    4) CD - ABEK
27. కిందివారిలో ఏ ఇద్దరు శాస్త్రవేత్తలు హెచ్ఐవీని కనుగొన్నారు?
    ఎ. ల్యూక్ మ్యాంట్ గ్నాయర్
    బి. ఇస్మార్క్
    సి. రాబర్ట్ గాలో
    డి. కార్ల్ లాండ్ స్టీనర్
    1) ఎ, బి
    2) ఎ, సి
    3) బి, డి
    4) బి, సి
28. సముద్ర అడుగు భాగంలో ఉండే జీవులను ఏమంటారు?
    1) నెక్టాన్ 2) ప్లవకాలు
    3) బెంథాస్ 4) నిమ్నటిక్
29. సముద్ర మొక్కలు దేన్ని నిక్షిప్తం చేసుకుంటాయి?
    1) క్లోరిన్
    2) బ్రోమిన్
    3) అయోడిన్
    4) సోడియం
30. పప్పుధాన్యాల్లో ఎక్కువగా ఉండే పోషకాలు?
    1) మాంసకృత్తులు
    2) పిండి పదార్థాలు
    3) కొవ్వులు
    4) విటమిన్లు
31. జుట్టు రాలకుండా ఉండటానికి ఉపయోగించే కొంథారిడియస్ తైలాన్ని స్రవించేది?
    1) సిల్వర్ ఫిష్ 2) లక్కమాత్
    3) పట్టుమాత్ 4) బ్లిస్టర్ బీటిల్
32. కిందివాటిలో ఎలక్ట్రాన్ గ్రహీత కానిది?
    1) పైరిడాక్సిన్
    2) అడినోసిన్ ట్రై ఫాస్ఫేట్
    3) సైటోక్రోం 4) ప్లాస్టో క్వినోన్
33. మైటోకాండ్రియా మాత్రికలో జరిగే శ్వాస క్రియ చర్యల వలయాలను విశదీకరించిన వారు?
    1) మెల్విన్ కాల్విన్ 2) ఆండ్రూ బెన్సన్
    3) సర్‌హాన్స్ క్రెబ్స్ 4) లిన్నియస్
34. కిరణజన్య సంయోగక్రియకు సంబంధించి కిందివాటిలో సరైంది ఏది?
    1) ఉష్ణశక్తి వినియోగితమవుతుంది
    2) ఉష్ణశక్తి విడుదలవుతుంది
    3) వికిరణ శక్తి వినియోగమవుతుంది
    4) రసాయన శక్తి విడుదలవుతుంది
35. నికర ప్రాథమిక ఉత్పాదకతను ప్రదర్శించేవి?
    1) మొక్కలు 2) సూక్ష్మజీవులు
    3) జంతువులు 4) నిర్జీవ కారకాలు
36. వాణిజ్యపరంగా విలువైన నారను ఇచ్చే మొక్క శాస్త్రీయనామం?
    1) టెక్టోనా గ్రాండ్
    2) క్రొటలేరియా జన్షియా
    3) షోరియారాబస్టా
    4) ఇల్యూసిస్ కొరకాన
37. కిందివాటిలో వరి వంగడం కానిది?
    1) బాసుమతి 2) పూసామోతి
    3) హంస 4) రవి
38. శక్తివనరు మొక్కకు సంబంధించిన కింది ఏ మొక్కలో ప్రత్యేక వేర్లు కనిపిస్తాయి?
    1) యూకలిప్టస్ 2) కాజురైనా
    3) అవిసీనియా 4) లూసినా
39. పెట్రో పంటగా దేన్ని పిలుస్తారు?
    1) డాల్బర్జియా లాటిపోలియా
    2) డిజిటాలిస్
    3) రిసినస్ కామ్యునిస్
    4) టోడ్రియో కైకస్ బ్రానై
40. ఏకదళ బీజ వర్గానికి చెందిన కార్బోహైడ్రేట్లను కలిగిన మొక్కల్లో పుష్పవిన్యాస రకం?
    1) స్పాడిక్స్ 2) సమశిఖి
    3) కంకి 4) గుచ్ఛం
41. చిన్న పిల్లల్లో ఎక్కువ సంఖ్యలో ఉండే రక్త కణాలు?
    1) ఎర్ర రక్తకణాలు
    2) తెల్ల రక్తకణాలు
    3) లింఫోసైట్లు
    4) త్రాంబోసైట్లు



సమాధానాలు

1) 2	2) 3	3) 4	4) 3	5) 2
6) 2	7) 3	8) 2	9) 3	10) 4
11) 1	12) 4	13) 3	14) 2	15) 2
16) 3	17) 2	18) 1	19) 3	20) 3
21) 2	22) 4	23) 2	24) 1	25) 2
26) 3	27) 2	28) 3	29) 3	30) 1
31) 4	32) 2	33) 1	34) 3	35) 1
36) 2	37) 2	38) 3	39) 4	40) 3
41) 1				

ఆసామీ షక్మీ చట్టం ఎప్పుడు అమలులోకి వచ్చింది?

భారతదేశంలోని రైతాంగ పోరాటాల్లో తెలంగాణ, పశ్చిమ బెంగాల్‌లో జరిగిన ఉద్యమాలే విప్లవాత్మకమైనవని కొందరు చరిత్రకారుల భావన. తెలంగాణలో జరిగిన పోరాటం ఒక్కటే విప్లవాత్మకమైందని మరికొందరు పేర్కొన్నారు. నిజాం కాలంలో అనేక రకాల భూస్వామ్య విధానాలు అమలులో ఉండేవి. వీటిలో సంస్థానాలు, జాగీర్లు, ఇనామ్‌లు, సర్ఫేఖాస్, దివానీ లేదా ఖలసా లేదా రైత్వారీ పద్ధతులు ముఖ్యమైనవి. నిజాం నవాబుకు ప్రత్యేకంగా సేవ చేసినవారికి దానంగా ఇచ్చిన భూములను జాగీర్లు అనే వారు.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ ఎకానమీ

భూసంస్కరణల ఆవశ్యకత - కారణాలు

స్వాతంత్ర్యానంతరం భారతదేశం, రాష్ట్రంలోనూ వ్యవసాయ రంగంలో భూ సంస్కరణల పేరుతో భూ సంబంధాలు, వ్యవసాయక నిర్మాణంలో విప్లవాత్మకమైన మార్పులు రావడానికి అనేక కారణాలున్నాయి.

రాష్ట్రంలో భూ సంస్కరణలను ప్రధానంగా రెండు దశలుగా వర్గీకరించవచ్చు. మొదటి దశ 1947 నుంచి 1970 వరకు, రెండోదశ 1970 తర్వాత వచ్చిన భూ సంస్కరణలుగా పేర్కొనవచ్చు.

మొదటిదశ (1947-1970): భూ సంస్కరణలు రావడానికి మూడు అంశాలు ప్రధాన పాత్ర వహించాయని చెప్పొచ్చు.

1. **వ్యవస్థాపూర్వక అంశాలు:** ఇందులో భూస్వామ్య పద్ధతులు, కౌలు విధానాలు, భూ కేంద్రీకరణ మొదలైనవి ఉన్నాయి.
2. **రాజకీయ అంశాలు:** జాతీయస్థాయిలో అఖిల భారత కాంగ్రెస్, రాష్ట్ర కాంగ్రెస్ తీర్మానాలు, విధానాలు.
3. **రైతాంగ ఉద్యమాలు:** ఫ్యూడల్ దోపిడీకి వ్యతిరేకంగా తెలంగాణ రైతాంగం పోరా టం చేసింది. ఉదా: 1920లో విస్నూరు దేశ్ ముఖ్‌కు వ్యతిరేకంగా జరిగిన రైతు పోరాటం.

భారతదేశ రైతాంగ పోరాటాల్లో తెలంగాణ, పశ్చిమ బెంగాల్‌లో జరిగిన రైతాంగ పోరాటాలే విప్లవాత్మకమైనవని కొందరు భావి స్తే, మరికొందరు తెలంగాణ పోరాటం ఒక్కటే విప్లవాత్మకమైందిగా పేర్కొంటారు.

I. వ్యవస్థాపూర్వక అంశాలు

రాష్ట్రంలో వ్యవస్థాపూర్వకమైన అంశాల్లో భూస్వామ్య వ్యవస్థలు, కౌలు విధానాలు, భూమి కేంద్రీకరణ మొదలైనవన్నీ వ్యవసాయ రంగం అభివృద్ధికి నిరోధంగా ఉన్నాయి. అయితే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ (1956) కు ముందు తెలంగాణ ప్రాంతం హైదరాబాద్ రాష్ట్రంలో, ఆంధ్రా ప్రాంతం 1953 అక్టోబర్ 1 వరకు మద్రాసు రాష్ట్రంలో భాగంగా ఉన్నాయి. ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాల్లోని భూస్వామ్య పద్ధతుల్లో కొంత సారూప్యం ఉన్నప్పటికీ వీటిని సమగ్రంగా అర్థం చేసుకోవడానికి వేర్వేరుగా అధ్యయనం చేయడం ఉత్తమం.

- భారతదేశంలో బ్రిటిష్, నైజాం ప్రాంతాల్లో ప్రవేశపెట్టిన భూస్వామ్య పద్ధతులు రెండూ అభివృద్ధి నిరోధకాలే.
- తెలంగాణ, ఆంధ్రా ప్రాంతాల్లో ప్రవేశపెట్టిన జాగీర్దారీ లేదా జమీందారీ, రైత్వారీ మొదలైన పద్ధతులు వ్యవసాయాభివృద్ధికి ఉపయోగపడకపోగా స్తబ్ధతకు దారితీశాయి.
- జమీందారీ, రైత్వారీ పద్ధతులు రెండూ బ్రిటిష్ అధికారులు ప్రవేశపెట్టిన వ్యవసాయక విప్లవ రూపాలు. ఇవి ఒకదానికొకటి విరుద్ధమైనవిగా కార్ల్ మార్క్స్ గుర్తించారు. జమీందారీ విధానం పెత్తందారీ వ్యవస్థ కాగా, రైత్వారీ విధానాన్ని ప్రజాతంత్ర వ్యవస్థగా పేర్కొన్నారు.
- జమీందారీ విధానం బ్రిటిష్ భూస్వామ్య వ్యవస్థకు, రైత్వారీ విధానం ఫ్రెంచి రైతుస్వామ్య వ్యవస్థకు ప్రతిబింబాలు. కానీ ఈ రెండు పద్ధతులు హానికరమైనవేనని గుర్తించాలి. ఇవి రెండూ పరస్పర విరుద్ధ అంశాల మేళవింపుతో రూపొందాయి.
- ఈ పద్ధతులు భూమిని దున్నే రైతు, భూయజమానుల ప్రయోజనాలకు ఉద్దేశించినవి కావు. భూములపై పన్ను వేసి, ప్రభుత్వానికి ఉపయోగపడే సాధనాలుగా గుర్తించారు.

హైదరాబాద్ రాష్ట్రంలో భూస్వామ్య విధానాలు

- హైదరాబాద్ రాష్ట్రం నిజాం పరిపాలనలో ఉండేది. వీరి కాలంలో అనేక రకాల భూస్వామ్య విధానాలుండేవి. అవి సంస్థానాలు, జాగీర్లు, ఇనాంలు, సర్ఫేఖాస్, దివానీ లేదా ఖలసా లేదా రైత్వారీ విధానాలు ముఖ్యమైనవి.

1. జాగీర్లు

నిజాం నవాబుకు ప్రత్యేకంగా సేవ చేసినవారికి లేదా ఆ వ్యక్తి గౌరవాన్ని నిలబెట్టడానికి దానపూర్వకంగా ఇచ్చిన భూములను జాగీర్లు అనే వారు. వీటిలో అనేక రకాలైన జాగీర్లుండేవి. కొన్ని నిజాంకు కొంత బాటకం చెల్లించాల్సినవి. కొన్ని భాటకం చెల్లించనవసరం లేని జాగీర్లు.

2. ఇనాందారులు

- హైదరాబాద్ ప్రాంతంలో కొన్ని విధులను నిర్వహించినందుకు పారితోషికంగా ప్రభుత్వం ఇచ్చిన భూములను ఇనాం భూములంటారు.
- ఈ భూముల నుంచి వచ్చే భూమి శిస్తును పొందే హక్కు పూర్తిగానో, పాక్షికంగానో ఇనాందారుడికి సంక్రమిస్తుంది.
- ఉద్యోగులు, సమాజానికి సేవలు అందించిన వారికి కూడా ఇనాం భూములు ఇచ్చేవారు.
- దేవాలయాలు, ధర్మాలయాల నిర్వహణ కూ ఇనాంలు ఇచ్చేవారు.
- హైదరాబాద్ సంస్థానంలో మొత్తం ఇనాందారుల సంఖ్య 82,000 కాగా వీరిలో 57,000 మంది దివానీప్రాంతంలో ఉండగా 26000 మంది జాగీరు ప్రాంతంలో ఉండేవారు. వీరి ఆధీనంలో సుమారు 8 లక్షల ఎకరాల భూమి ఉండేది. వీటిలో కూడా అనేక రకాలైన ఇనాంలు ఉండేవి.

ఉదా: అరాజమక్తా, అరాజ అగ్రహార్, మజరాను బేసరి ఇనాం, బలవతా ఇనాం, నీరడి ఇనాం, చిధుమతి ఇనాం మొదలైనవి.

3. సర్ఫేఖాస్

- సర్ఫేఖాస్ భూములు నిజాం సొంత ఖర్చుల కోసం నిర్దేశించిన భూమి లేదా గ్రామాలు. వీటి నుంచి వచ్చే ఆదాయం లేదా భాటకం నిజాం ఖజానాకు వెళ్లేది. ఈ భూములు 5,682 చదరపు మైళ్ల విస్తీర్ణంలో 1,374 గ్రామాల్లో వ్యాపించి ఉండేవి.

4. ఖల్సా/దివానీ/రైత్వారీ పద్ధతి

- ఈ పద్ధతి హైదరాబాద్ ప్రాంతంలోని 60 శాతం విస్తీర్ణంలో ప్రభుత్వ ప్రత్యక్ష పాలన కింద ఉండేది. ప్రభుత్వ యంత్రాంగమే శిస్తు వసూలు చేసేది.
- ప్రభుత్వ యంత్రాంగమే శిస్తును వసూలు చేసే ప్రభుత్వ ప్రత్యక్ష పాలనలో ఉండే భూమిని ఖలీసా భూమి అంటారు.
- దివానీ భూములు సర్ఫేఖాస్ భూముల్లో భాగాలే.
- క్రమబద్ధమైన సర్వే సెటిల్‌మెంట్ పద్ధతిని మొదటి సాలార్‌జంగ్ 1875లో ప్రవేశపెట్టారు.
- క్రమబద్ధమైన సర్వే సెటిల్‌మెంట్ విధానాన్ని ప్రవేశపెట్టడానికి (1875) ముందు ఖల్సా/దివానీ భూముల్లో దళారీలు ఉండేవారు.

పామిగా జమీయత్

- పామిగా అంటే గుర్రాలను కట్టేసే స్థలం
- సైన్యానికి అవసరమైన గుర్రాలను పోషించడానికి ప్రతిఫలంగా ఇచ్చే జాగీర్లు.



జాత్

- విస్తృతమైన ప్రాంతాల్లో సేవ చేసినందుకు ఎలాంటి షరతులు లేకుండా ఇచ్చిన జాగీర్లు

అవతమామ్

- శిస్తు చెల్లించకుండానే వంశ పారంపర్యం గా వచ్చే హక్కులు ఉన్న జాగీర్లు

తనఖా

- జీతానికి బదులుగా ఇచ్చే జాగీర్లు

మాదద్ మాష్

- ఉద్యోగుల పోషణకు జీతానికి తోడుగా ఇచ్చే జాగీర్లు

మసురూదీ

- మత, సైనిక, పౌర సంబంధమైన సేవ చేసే షరతులపై ఇచ్చే జాగీర్లు
- పై విధంగా అనేక రకాలైన జాగీర్లు ఉండేవి. ఈ జాగీర్లు హైదరాబాద్‌లో 6535 గ్రామాల్లో 40,000 చదరపు మైళ్ల విస్తీర్ణంలో వ్యాపించి ఉండేవి. 1922లో జాగీర్ల సంఖ్య 1,167 కాగా, 1949 నాటికి 1500 వరకు పెరిగింది.

5. సంస్థానాలు

- హైదరాబాద్ ప్రాంతంలో మొదటి నుంచి అనేక చిన్న చిన్న ప్రాంతాలకు హిందూ రాజులు అధిపతులుగా ఉండేవారు. నిజాం వీరి హక్కులను అంగీకరించడానికి వీరు ఏటా నిజాంకు 'పేష్కష్' పేరుతో నిర్ణీతమైన డబ్బు చెల్లించాలి. వీరికి ఆయా ప్రాంతాల్లో విస్తృతమైన పరిపాలనా అధికారాలుండేవి.
- హైదరాబాద్ రాష్ట్రంలో మొత్తం 14 సంస్థానాలు ఉన్నప్పటికీ, వీటిలో ఐదు ప్రధానమైనవి. అవి

1) గద్వాల్ (అతి పెద్దది)
2) వనపర్తి
3) జటప్రోలు
4) అమరచింత
5) పాల్వంచ.

- ఈ ఐదు సంస్థానాల్లో పరిపాలన అంతా సంస్థానాధీశులదే. వీరి ఆధీనంలో 497 గ్రామాలు, 5,030 చదరపు మైళ్ల విస్తీర్ణంలో వ్యాపించి ఉండేవి. వీరికి సర్‌బస్తా, పాన్‌మక్తా, ఇజారా అనే మధ్యవర్తులుండేవారు.

సర్‌బస్తా: వేలంపాట ద్వారా శిస్తు వసూలు చేసుకునే హక్కును పొందినవారు.

పాన్‌మక్తా: స్థిరమైన కౌలును చెల్లించేవారు.

ఇజారా భూములు: నిర్మానుష్యమైన గ్రామాల్లోని భూములు. ఇక్కడ పునరావాసం ఉండే వారికి తక్కువ కౌలు చెల్లించే వెసులుబాటు ఉండేది.

- ప్రాంతీయంగా ఉండే వీరినే దేశ్‌ముఖ్, సర్‌దేశ్‌ముఖ్, దేశాయ్, సర్‌దేశాయ్, దేశ్‌పాండేలుగా పిలిచేవారు. వీరికి శిస్తు వసూలు చేసే అధికారం ఉండటం వల్ల అనేక మార్గాల ద్వారా వేల ఎకరాలు తమ పేరున రాసుకొని 1875 తర్వాత ఖల్సా / దివానీ ప్రాంతాల్లో అతిపెద్ద భూస్వామ్యులుగా చెలామణి అయ్యారు.
- పై భూస్వామ్య విధానాలన్నింటిలోనూ జాగీర్దార్లు, ఇనాందార్లు, సంస్థానాధీశులు చివరకు భాటకాన్ని పొందే ఖల్సా ప్రాంతంలోని పెద్ద భూస్వాములందరూ భాటకాన్ని పొందే అనుపస్థితి (అబ్సెంటీ ల్యాండ్‌లార్డ్స్) భూస్వాములుగా మారారు. వీరి సంఖ్య 1891లో లక్ష ఉండగా 1921 నాటికి 7.6 లక్షలకు పెరిగింది.
- ఈ ప్రాంతంలో భాటకం వసూలు చేసేవారు వ్యవసాయాభివృద్ధి కంటే కౌలును పెంచుకునే మార్గాలను అన్వేషించేవారు.
- భూమి శిస్తును ఉత్పత్తితో సంబంధం లేకుండా పెంచడం, కౌలు గడువు పెంచుకోవాలన్నా కొత్తగా సేద్యం చేసుకోవడానికి భూమిని తీసుకోవాలన్నా వీరికి 'నజరానాలు' (బహుమతులు) చెల్లించాల్సి వచ్చేది.
- భూమిశిస్తుతోపాటు ఇంటి పన్ను, వృత్తిపన్ను, మగ్గపు పన్ను..ఇలా అనేక అక్రమ పన్నులు నిర్బంధంగా వసూలు చేసేవారు.
- వీరి ఇళ్లలో ఏ శుభకార్యం జరిగినా రైతులు, కౌలుదారులు విధిగా చేసే వెట్టి చాకిరీ తోపాటు కట్నాలు, కానుకలు చెల్లించేవారు.
- ఫలవృక్షాలు, చింతచెట్లు మొదలైనవి జాగీర్దార్ల ఆస్తిగా భావించేవారు.
- వీరి దోపిడీ హైదరాబాద్ ప్రాంతంలో చాలా ఎక్కువగా ఉండేది. హైదరాబాద్ సంస్థాన రెవెన్యూ ఆదాయం రూ. 8 కోట్లు కాగా హైదరాబాద్ ప్రాంతంలోని 110 మంది జమీందార్ల ఆదాయం రూ. 10 కోట్లు ఉండేది.
- నిజాం జారీ చేసిన ఫర్మానాలో 82 రకాలైన అక్రమ నిర్బంధ వసూళ్లు ఉండేవని తెలుస్తుంది.
- కులమతాలు, వయసు, లింగ భేదాలతో సంబంధం లేకుండా అందరూ వెట్టి చాకిరీ చేయడం ఈ ప్రాంతం అంతటా ఉండేది.
- అత్యధికమైన భూ కేంద్రీకరణ, అధికార బలం, ఆర్థికబలం, అంగబలం వల్ల ఫ్యూడల్ దోపిడీ నిరాటంకంగా కొనసాగింది. దీంతోపాటు వడ్డీ వ్యాపారం, నిర్బంధ లేవీ పద్ధతి, ఆర్థికమాంద్యం మొదలైనవాటితో రైతాంగం పూర్తిగా కుంగిపోయింది. రైతాంగం కౌలుదారులు, వ్యవసాయ కూలీలు మారడమో, వలస వెళ్లడమో జరిగింది.

కౌలుదారీ విధానాలు

- హైదరాబాద్, ఆంధ్రా ప్రాంతంలోనూ భూస్వామ్య పద్ధతుల్లో ఉండే లోపాల వల్ల భాటకం వసూలు చేసేవారి సంఖ్య విపరీతంగా పెరగడం వల్ల కౌలుదారీ సంబంధాలు ఉండడం సర్వ సాధారణ విషయంగా మారింది.

హైదరాబాద్ రాష్ట్రంలో కౌలు విధానాలు

- హైదరాబాద్ సంస్థానంలో 1354 ఫసలీ (1944)లో ఆసామీ షక్మీ చట్టం అమలులోకి వచ్చే నాటికి రెండు రకాలైన కౌలుదార్లు ఉండేవారు.

షక్మీదారులు..


వీరే శాశ్వత కౌలుదారులు.

కౌలుదారునికి రక్షణ, భూమిని సాగు చేసుకునే హక్కులు ఉన్న వారే షక్మీదారులు.

ఆసామీ షక్మీదారులు:

వీరు ఏ హక్కులు లేని కౌలుదారులు. ఆసామీ షక్మీదారులు కౌలుభూమిని 12 ఏళ్లు తన స్వాధీనంలో ఉంచుకోగలిగినప్పుడు షక్మీదారులుగా గుర్తింపు లభించేది. కానీ హైదరాబాద్ సంస్థానం వంటి ఫ్యూడల్ వ్యవస్థలో ఏ హక్కులు లేని కౌలుదారుడు పన్నెండేళ్లు కౌలుభూమిని తన స్వాధీనంలో ఉంచుకోవడం జరగదు. ఒక వేళ పన్నెండేళ్లు ఒకే భూమిని కౌలు పద్ధతిలో సాగు చేస్తున్నప్పటికీ దాన్ని రుజువు చేసుకోవడం అంత సులభం కాదు. దీంతో కౌలుదారులందరూ ఆసామి షక్మీదారులు (రక్షణలేని కౌలుదారులు)గానే ఉండేవారు.

How is 'never' written in a code language?



BANK EXAMS

REASONING

Model Questions

1. In a certain code, PLANT is written as "$@2H©" and YIELD is written as "β64@%". How is "DELAY" written in that code?
   1) β4H2% 2) β4@2%
   3) %42@β 4) %4@2β
   5) None of these
2. How many meaningful English words can be formed with the letters ARILT using each letter only once in that word?
   1) None 2) One 3) Two
   4) Three 5) More than three
3. D said, "A's father is the only brother of my sister's son." How is A's father related to D?
   1) Cousin 2) Nephew 3) Aunt
   4) Data inadequate
   5) None of these

Directions (Q. No. 4-6): The following questions are based on the 5 three-digit numbers given below:

394 632 783 576 895

4. If the positions of the first and the second digit within each number are interchanged, then which of the following will be the second highest number?
   1) 632 2) 783 3) 576
   4) 895 5) 394
5. If the first and second digits of each of the numbers are added, the resulting sum of which of the following numbers will not be exactly divisible by 3?
   1) 895 2) 394 3) 576
   4) 632 5) 783
6. If 2 is added to the last digit of each number and then the positions of the first and the third digits are interchanged, which of the following will be the highest number?
   1) 576 2) 895 3) 783
   4) 394 5) 632
7. If A is coded as 1, B as 3, C as 5 and so on, which of the following is the numerical value of the word "FAZED"?
   1) 81 2) 79 3) 77
   4) 80 5) None of these
8. Which of the following pairs of words have the same relationship as FAN : HEAT?
   1) Water : Drink
   2) Light : Night
   3) Teach : Student
   4) Air : Breathe 5) Food : Hunger
9. Q types faster than R but not as fast as V. T types faster than R. S types faster than V. Who amongst the five types the fastest?
   1) V 2) T 3) S
   4) Data Inadequate
   5) None of these
10. If "B × C" means "B is the daughter of C", "B + C" means "B is the husband of C" and "B – C" means "B is the sister of C", then what does "M + N – P × Q" mean?
    1) M is the brother-in-law of Q
    2) M is the uncle of Q
    3) M is the son-in-law of Q
    4) Q is the mother-in-law of M
    5) None of these

Directions (Q. No. 11-15): Study the following arrangement carefully and answer the questions given below:

R D A K 5 B I 2 M J E N 9 7 U
Z V 1 W 3 H 4 F Y 8 P 6 T G

11. How many such numbers are there in the above arrangement, each of which is immediately preceded by a consonant and immediately followed by a vowel?
    1) None 2) One 3) Two
    4) Three 5) More than three
12. Which of the following is the eighth to the left of the seventeenth from the left end?
    1) M 2) J 3) 8
    4) 5 5) None of these
13. Four of the following five are alike in a certain way based on their positions in the above arrangement and so form a group. Which is the one that does not belong to that group?
    1) E 9 J 2) Z 1 U 3) H W 4
    4) Y 4 8 5) B 2 K
14. Which of the following is the sixth to the right of the nineteenth from the right end?
    1) 5 2) Z 3) V
    4) 1 5) None of these
15. How many such consonants are there in the above arrangement, each of which is immediately preceded by a number and immediately followed by another consonant?
    1) None 2) One 3) Two
    4) Three 5) More than three

Directions (Q. No. 16-19): Each of the questions below consists of a question and two statements numbered I and II given below it. You have to decide whether the data provided in the statements are sufficient to answer the question. Read both the statements and

Give answer:

1) If the data in statement I alone are sufficient to answer the question, while the data in statement II alone are not sufficient to answer the question.
2) If the data in statement II alone are sufficient to answer the question, while the data in statement I alone are not sufficient to answer the question.
3) If the data either in statement I alone or in statement II alone are sufficient to answer the question.
4) If the data given in both the statements I & II together are not sufficient to answer the question.
5) If the data in both the statements I & II together are necessary to answer the question.

16. How is 'never' written in a code language?
    I) "never ever go there" is written as "na ja ni ho" in that code language.
    II) "go there and come back" is written as "ma ho sa ni da" in that code language.
17. Among M, P, K, J, T and W, who is lighter than only the heaviest?
    I) P is heavier than M and T.
    II) W is heavier than P but lighter than J who is not the heaviest.
18. What does "$" mean in a code language?
    I) "5 $ # 3" means "flowers are really good".
    II) "7 # 3 5" means "good flowers are available".
19. How many students are there between Suresh and Mohan in a row of fifty students?
    I) Suresh is twelfth from the left end and Mohan is seventeenth from the right end.
    II) Suresh is six places away from Jayesh, who is twentieth from the left end.

Key And Explanations

1. Ans: 4

P	L	A	N	T	Y	I	E	D
$	@	2	✳	©	β	6	4	%

∴ DELAY ⇒ %4@2β

2. Ans: 3. TRAIL, TRIAL,
3. Ans: 2. A's father
   = the only brother of D's sister's son
   = D's sister's son
   = D's nephew
4. Ans: 5. Interchanging the first two digits, we get 934, 362, 873, 756 and 985. Of these, 934 is the second highest.
5. Ans: 1. 895 ⇒ 8 + 9 = 17 is not divisible by 3.
6. Ans: 1. Look for the highest third digit.
7. Ans: 2. In general, n^{th} letter of the alphabet =2n–1 Here, FAZED = 11 + 1 + 51 + 9 + 7 = 79
8. Ans: 5. The first dispels the second.
9. Ans: 4. V > Q > R; T > R; S > V Combining, we get S > V > Q > R and T > R. Hence, either S or T is the fastest.
10. Ans: 3.
    Q
    |
    M(+) ⇔ N(–)<—>P(–)
11. Ans: 1.
12. Ans: 1. 8^{th} to the left of 17^{th} from left = 17 – 8 = 9^{th} from the left = M
13. Ans: 5. In all others, the first and third elements are consecutive ones.
14. Ans: 3. 6^{th} to the right of 19^{th} from the right = 19 – 6 = 13^{th} from the right = V
15. Ans: 4. M, F and T
16. Ans: 4. Only two words are common between I and II.
17. Ans: 5. From I: P > M, T
    From II: J > W > P
    Combining, we get K > J > W > P > M, T Hence, K is the heaviest and J lighter than only the heaviest.
18. Ans: 5.
    From I: 5$#3 = flowers are really good ... (i)
    From II: 7#35 = good flowers are available ... (ii)
    From I and II: 5#3 = flowers are good ... (iii)
    Putting (iii) in (i), we get: $ = really.
19. Ans: 1. **From I:** Suresh = 12^{th} from left
    Mohan = 17^{th} from right
    ∴ No. of students between them = 50 – 29 (12+17) = 21
    From II: No data about Mohan.